# ఆధునిక సాహిత్యం

## (నిర్ణయించిన పాఠ్యాంశాలు)

ఎం.ఏ. తెలుగు, రెండవ సంవత్సరం

సెమిస్టర్-III, పేపరు-I

### పాఠ్య రచయితలు


**ఆచార్య ఇరపని మాధవి,**
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.
ప్రొఫెసర్
తెలుగు & ప్రాచ్యభాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్.

**డా॥ బలరామ్ కచ్చళ్ళ**
ఎం.ఏ., ఎం.ఫిల్, పిహెచ్.డి., ఎం.యిడి.
అతిథి అధ్యాపకులు
తెలుగు & ప్రాచ్యభాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్.

**డా॥ దొప్పలపాటి సుజాత,**
ఎం.ఏ., టి.పి.టి., ఎం.ఫిల్., పిహెచ్.డి.
తెలుగు అధ్యాపకులు
ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల, యర్రగొండపాలెం,
ప్రకాశం జిల్లా.

**డా॥ టి. ఓగేశ్వరరావు,**
ఎం.ఏ., బి.యిడి., పిహెచ్.డి.
తెలుగు అధ్యాపకులు
వి.వి. గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
దుంపలగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా.


### *సంపాదకులు & సమన్వయకర్త*


**ఆచార్య ఇరపని మాధవి,**
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.
ప్రొఫెసర్
తెలుగు & ప్రాచ్యభాషా విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్.


### *డైరక్టర్*


**డా॥ నాగరాజు బట్టు,**
**ఎం.హెచ్.ఆర్.ఎం., ఎం.బి.ఏ., ఎల్.ఎల్.ఎం., ఎం.ఏ. (సై.), ఎం.ఏ (సో.), ఎం.ఇడి., ఎం.ఫిల్., పిహెచ్.డి.**

**దూర విద్యా కేంద్రము**

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్-522 510.

ఫోన్ నెం.: 0863-2346208, 0863-2346222, 0863-2346259 (స్టడీ మెటీరియల్)

వెబ్‌సైట్: www.anucde.info ఇ-మెయిల్: anucdedirector@gmail.com

# ఎం.ఏ. తెలుగు - ఆధునిక సాహిత్యం

First Edition: 2023

No. of Copies:

© Acharya Nagarjuna University

This book is exclusively prepared for the use of students of **M.A. TELUGU - AADHUNIKA SAHITYAM**, Semester III, Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is mean for limited circulation only.

**Published by:**

**Dr. NAGARAJU BATTU**

Director

Centre for Distance Education

Acharya Nagarjuna University

**Printed at:**

## ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ 2016 నాటికి NAAC చే గ్రేడ్ 'A'ను సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, ప్రకాశం జిల్లాలోని 447 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిప్లమో, డిగ్రీ, పీజి స్థాయి విద్యాబోధనను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అందిస్తోంది.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నత విద్యను అందరికీ అందించాలన్న లక్ష్యంతో 2003-04లో దూరవిద్యా కేంద్రాన్ని స్థాపించింది. పూర్తిస్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్యనభ్యసించలేని వారికి, వ్యయభరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరిక ఉన్న గృహిణులకు ఈ దూర విద్యాకేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే డిగ్రీ స్థాయిలో బి.ఏ., బి.కాం., బి.ఎస్సి., పీజీ స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్సి., ఎం.సి.ఏ., ఎల్.ఎల్.ఎం., ఎం.బి.ఏ., కోర్సులను ప్రారంభించిన విశ్వవిద్యాలయం గత సంవత్సరం కొత్తగా జీవన నైపుణ్యాలు అనే సర్టిఫికేట్ కోర్సును కూడా ప్రారంభించింది.

ఈ దూర విద్యా విధానం ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు సులభంగాను, సరళంగాను విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసుకునేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి రచనా వ్యాసంగంలో అనుభవం గల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించడం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు నిష్ణాతులైనవారు ఇచ్చే సలహాలు, సూచనలు, సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలు గ్రహించి ముమ్ముందు మరింత నిర్దిష్టంగా అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, అభివృద్ధి కోసం సంశయాల నివృత్తి కోసం వారాంతపు తరగతులు, కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయడం జరిగింది.

దూరవిద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేస్తున్న విద్యార్థులు, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమే కాక చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని, తద్వార దేశ పురోగతికి దోహదపడాలని కోరుకుంటున్నాను. రాబోయే సంవత్సరాలలో దూరవిద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని అకాంక్షిస్తున్నాను. ఈ ఆశయ సాధనకు సహకరిస్తున్న, సహకరించిన దూరవిద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు, అకడమిక్ కోఆర్డినేటర్లకు, అకడమిక్ కౌన్సిలర్లకు మరియు అధ్యాపకేతర సిబ్బందికి నా అభినందనలు.

**ప్రొఫెసర్. పి. రాజశేఖర్**
**ఉపకులపతి**
**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.**

# సిలబస్

## ఎం.ఏ. తెలుగు, రెండవ సంవత్సరం

## సెమిస్టర్-III, పేపరు-I

## 301TL21- ఆధునిక సాహిత్యం

## (నిర్ణయించిన పాఠ్యాంశాలు)

1. విశ్వనాథ సత్యనారాయణ - ఆంధ్ర ప్రశస్తి
2. దేవులపల్లి కృష్ణ శాస్త్రి - కృష్ణ పక్షం
3. రాయప్రోలు సుబ్బారావు - తృణ కంకణం
4. జాషువా - ముంటాజ్ మహలు
5. సి.నా.రె. - కర్పూర వసంతరాయలు

**ఆధార గ్రంథాలు:**

| | |
|---|---|
| 1. ఆంధ్ర ప్రశస్తి | - విశ్వనాథ సత్యనారాయణ |
| 2. కృష్ణ పక్షం | - దేవులపల్లి కృష్ణ శాస్త్రి |
| 3. తృణ కంకణం | - రాయప్రోలు సుబ్బారావు |
| 4. ముంటాజ్ మహలు | - జాషువా |
| 5. కర్పూర వసంతరాయలు | - సి.నా.రె. |

# విషయ సూచిక

## ఆధునిక సాహిత్యం

### (నిర్ణయించిన పాఠ్యాంశాలు)


| సంఖ్య | పాఠం | పుట |
|---|---|---|
| 1. | ఆంధ్ర ప్రశస్తి - విశ్వనాథ సత్యనారాయణ | 1.1 - 1.16 |
| 2. | ఆంధ్ర ప్రశస్తి - విశ్వనాథ సత్యనారాయణ | 2.1 - 2.20 |
| 3. | ఆంధ్ర ప్రశస్తి - విశ్వనాథ సత్యనారాయణ | 3.1 - 3.9 |
| 4. | కృష్ణ పక్షం - దేవులపల్లి కృష్ణ శాస్త్రి | 4.1 - 4.14 |
| 5. | కృష్ణ పక్షం - దేవులపల్లి కృష్ణ శాస్త్రి | 5.1 - 5.7 |
| 6. | కృష్ణ పక్షం - దేవులపల్లి కృష్ణ శాస్త్రి | 6.1 - 6.19 |
| 7. | తృణ కంకణం - రాయప్రోలు సుబ్బారావు | 7.1 - 7.8 |
| 8. | తృణ కంకణం - రాయప్రోలు సుబ్బారావు | 8.1 - 8.9 |
| 9. | తృణ కంకణం - రాయప్రోలు సుబ్బారావు | 9.1 - 9.5 |
| 10. | ముంటాజ్ మహలు - జాషువా | 10.1 - 10.10 |
| 11. | ముంటాజ్ మహలు - జాషువా | 11.1 - 11.7 |
| 12. | ముంటాజ్ మహలు - జాషువా | 12.1 - 12.10 |
| 13. | కర్పూర వసంతరాయలు - సి.నా.రె. | 13.1 - 13.7 |
| 14. | కర్పూర వసంతరాయలు - సి.నా.రె. | 14.1 - 14.6 |
| 15. | కర్పూర వసంతరాయలు - సి.నా.రె. | 15.1 - 15.7 |

## పాఠం - 1

# ఆంధ్ర ప్రశస్తి

**- విశ్వనాథ సత్యనారాయణ**

విషయసూచిక:


1.1. కవి పరిచయం

1.2. ఆంధ్ర ప్రశస్తి

1.3. పాఠ్యభాగ సారాంశం

1.3.1. ఆంధ్ర మహా విష్ణువు

1.3.2. శాతవాహనుడు

1.3.3. గోతమిపుత్ర శాతకర్ణి

1.3.4. మాధవ వర్మ

1.3.5. వేగి క్షేత్రము

1.3.6. ముఖ లింగము

1.3.7. నన్నయ భట్టు

1.3.8. ప్రోలరాజు

1.3.9. ప్రోలరాజు వధ

1.3.10. కొండవీటి పొగమబ్బులు

1.3.11. చంద్రవంక యుద్ధము

1.3.12. యమదంష్ట్రిక


### 1.1. కవి పరిచయం:

తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియలలో రచనలు చేసి ఆధునిక సాహిత్యంలో ప్రాచీన సాహిత్యానికి ప్రతినిధిగా నిలిచిన కవి విశ్వనాథ సత్యనారాయణ. వీరు తన జీవితాన్ని, సాహిత్యాన్ని భారతీయ సంప్రదాయ పరిరక్షణకు అంకితం చేసిన కవి సమ్రాట్. విశ్వనాథ సత్యనారాయణ కృష్ణా జిల్లా గన్నవరం తాలుకా నందమూరులో పార్వతీదేవి, శోభనాద్రి దంపతులకు 10 సెప్టెంబర్ 1895వ సంవత్సరంలో జన్మించారు. ప్రాథమిక విద్యను నందమూరు, పెదపాడు, ఇందుపల్లి, వెలినూతలలో పూర్తి చేశారు. తండ్రి శోభనాద్రియే వీరి మొదటి గురువు. ఆ తరువాత తిరుపతి వెంకట కవులలో ఒకరైన చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి గారి దగ్గర శిష్యరికం చేశారు. గురువు గారి పట్ల విశ్వనాథ వారికున్న భక్తి, గౌరవాలకు "ఆంధ్ర ప్రశస్తి" లో చెప్పిన పద్యం సాక్ష్యం.

"పుడమిని బెక్కు సత్కవులు పుట్టిరి ముట్టిరి సత్కవిత్వపుం
దొడిమలు చెళ్ళపిళ్ళ కవితో తులతూగెడువారె వానలో
తడియనివారు మద్గురువధాన మృదూక్తి మరందధారలో
కడుగనివారు మాకెచట కానగరారిల తెల్గునాడునన్"

ఎఫ్.ఎ. చదివే రోజుల్లో సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. తర్వాత బందరు ఆంధ్ర జాతీయ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేశారు. బి.ఎ. పూర్తి చేసి బందరు హిందూ కళాశాలలో ఉపన్యాసకులయ్యారు. 1929వ సంవత్సరంలో ఎం.ఏ. చదివారు. కొంతకాలం గుంటూరు ఎ.సి. కాలేజిలో అధ్యాపకులుగా చేశారు. 1938వ సంవత్సరంలో విజయవాడ ఎస్.ఆర్.ఆర్. కళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగా చేరి ఇరవై ఒక్క సంవత్సరాలు పనిచేశారు. 1958వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి సభ్యత్వం లభించింది. 1959-61వ సంవత్సరాలలో కరీంనగర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా చేశారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ఉపాధ్యక్షుడిగా ఉన్న తర్వాత 'ఆస్థాన కవి' అయ్యారు.

1935వ సంవత్సరంలో బందరులో జరిగిన సత్కార సభలో విశ్వనాథ వారిని "కవి సమ్రాట్" బిరుదు వరించింది. 1942వ సంవత్సరంలో గుడివాడలో గజారోహణ జరిగింది. విశ్వనాథ మధ్యాక్కఱలకు కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు లభించింది. కళాప్రపూర్ణ, పద్మభూషణ మొదలైనవన్నీ ఒక ఎత్తు. ఉన్నతమైన జ్ఞానపీఠ్ పురస్కారాన్ని పొందటం మరొక ఎత్తు. తెలుగువారిలో తొలిసారిగా ఆ కీర్తి, గౌరవం విశ్వనాథ వారికే దక్కింది.

**విశ్వనాథ సత్యనారాయణ రచనలు:**

**కావ్యాలు** : ఆంధ్ర పౌరుషం, ఆంధ్ర ప్రశస్తి, గిరికుమారుని ప్రేమ గీతాలు, శృంగార వీధి, శశిదూతం, ఋతు సంహారం, కిన్నెరసాని, కోకిలమ్మ పెళ్ళి, మా స్వామి, వరలక్ష్మీ త్రిశతి, ఝాన్సీరాణి, శివార్పణం, భ్రమర గీతాలు మొదలైనవి.

**కావ్యేతిహాసం** : శ్రీమద్రామాయణ కల్పవృక్షం.

**నవలలు** : వేయి పడగలు, ఏకవీర, మా బాబు, చెలియలి కట్ట, తెరచిరాజు, హా హా హూ హూ, స్వర్గానికి నిచ్చెనలు, విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు, బద్దన్న సేనాని, సముద్రపు దెబ్బ, వీరవల్లడు, కడిమి చెట్టు, పులిమ్రుగ్గు, నందోరాజా భవిష్యతి, దిండు క్రింద పోకచెక్క, వీరపూజ, ధర్మచక్రము, బాణావతి మొదలైనవి 60కి పైగా రచించారు. 'పురాణ గ్రంథ వైరమాల' గా కొన్ని నవలలు రచించారు.

**శతకాలు** : మా స్వామి.

**నాటకాలు** : అవతార పరివర్తనం (కొడాలి వారితో కలిసి), సౌప్తిక ప్రళయం, నర్తనశాల, అనార్కలి, వేనరాజు, తల్లి లేని పిల్ల, త్రిశూలం.

**సంస్కృత నాటకాలు**: గుప్తపాశుపతం, అమృత శర్మిష్ఠ

**చిన్న కథలు** : య్యోర్ఫిషీఛెయ్, మాక్లీ దుర్గంలో కుక్క, పరిపూర్తి, కపర్ది మొదలైన 22 కథలు.

**ఇంగ్లీషు రచన** : What is Ramayana to me.

**లక్షణ గ్రంథం** : కావ్యానందం

**విమర్శ గ్రంథాలు :** నన్నయ గారి ప్రసన్న కథా కవితార్థయుక్తి
అల్లసాని వారి అల్లిక జిగిబిగి,
కాళిదాసుని యొక్క అభిజ్ఞత,
ఒకడు నాచన సోమన్న,
నా రాముడు మొదలైనవి.

ఇంకా అనేక సాహిత్యోపన్యాసాలు, రేడియో రూపకాలు, పీఠికలు ప్రచురించబడ్డాయి. సుమారు 150 గ్రంథాలకు పైగా రచన చేసిన ఏకైక తెలుగు కవి విమర్శకుడు విశ్వనాథ సత్యనారాయణ. అసమాన ప్రతిభావంతుడు, తెలుగు పద్యానికి చిత్ర విచిత్ర గతులు నేర్పిన ఆ ఆధునిక శ్రీనాథుడు 18 అక్టోబర్, 1975 న స్వర్గస్థులైనా తెలుగు సాహితీ జగత్తులో మాత్రం చిరంజీవులుగా నిలిచుంటారు.

## 1.2. ఆంధ్ర ప్రశస్తి:

విశ్వనాథ సత్యనారాయణ గారి తొలి రచన "ఆంధ్ర పౌరుషము" క్రీ.శ. 1914వ సంవత్సరంలో రచించబడింది. ఆ తరువాత 1919-1924 మధ్య కాలంలో రచించబడిన రచన ఆంధ్ర ప్రశస్తి. స్వాతంత్రోద్యమ కాలంలో రచనలు చేసిన కవులందరి రచనలతో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ దేశ భక్తి కనిపిస్తుంది. ఆంధ్ర జాతి గొప్పతనాన్ని తెలియజేయడానికి, తెలుగు వారిలో దేశ భక్తి రగుల్కొల్పి ఉద్యమ స్ఫూర్తి నందించటానికి చేసిన రచనే ఆంధ్ర ప్రశస్తి. ఈ కావ్య రచనా లక్ష్యాన్ని విశ్వనాథ వారు -

"మా పూర్వాంధ్ర ధరాధినాయక కథా మంజూషికా రత్నగా
థా పద్యావలి పేరి హారి సుమనో దామంబు మాధ్వీక భా
షా పృక్తంబు మహా ప్రబంధ రచనా సౌందర్యపున్ వాసనల్
తీపై క్రమ్మగ నాంధ్ర సోదరుల కందిత్తున్ గళాంకమ్ముగన్" అని చెప్పారు.

ఈ రచనను మల్లంపల్లి సోమశేఖర శర్మకు అంకితమిచ్చారు.

"నీవనుకోలేదు మఱి నేనిది చెప్పనులేదు కాని అ
న్నా! వినవయ్య నేటికిది నా చిఱుపొత్తము నీకు నంకితం
బై వెలయింపజేతు హృదయంబులు నీకును నాకు మాతృదే
శావిల దుఃఖ దారితములై శ్రుతిగల్పె విషాదగీతికల్".

మల్లంపల్లి సోమశేఖర శర్మ గొప్ప చరిత్రకారులు. విశ్వనాథ, మల్లంపల్లి ఒకరినొకరు అన్నా, అన్నా అని పిలుచుకొనేవారు. ఈ కావ్య ఆవిష్కరణ సభలో మల్లంపల్లి వారికి అంకితమిస్తూ ఈ పద్యం చెప్పారు విశ్వనాథ.

ఆంధ్ర ప్రశస్తిలో కావ్య ఖండికలు మొత్తం 12 ఉన్నాయి. అవి:

1) ఆంధ్ర మహా విష్ణువు 2) శాతవాహనుడు 3) గోతమిపుత్ర శాతకర్ణి
4) మాధవ వర్మ 5) వేగి క్షేత్రము 6) ముఖ లింగము

7) నన్నయ భట్టు 8) ప్రోలరాజు 9) ప్రోలరాజు వధ
10) కొండవీటి పొగమబ్బులు 11) చంద్రవంక యుద్ధము 12) యమదంష్ట్రిక.

## 1.3. పాఠ్యభాగ సారాంశం:

మొత్తం 12 ఖండికలు కలిగిన కావ్యమిది.

### 1.3.1. ఆంధ్ర మహావిష్ణువు:

మగధను జయించి భారతదేశ చక్రవర్తులైన పూర్వాంధ్ర రాజవంశాలతో తెలిసినంత వరకు ఇతడే పూర్వుడు. ఇతని పేరు మీదుగానే తెలుగు ప్రాంతానికి ఆంధ్రదేశమనే పేరు వచ్చింది. ఇతడు శ్రీకాకాళము రాజధానిగా ఆంధ్ర ప్రాంతాన్ని పాలించాడు, నిశుంభుడనే రాక్షసుడిని సంహరించాడు. భీమేశ్వరం, కాళేశ్వరం, శ్రీశైలం-ఈ మూడు క్షేత్రాల చుట్టూ పెద్ద గోడ కట్టించి ఆంధ్ర ప్రాంతానికి త్రిలింగం అనే పేరు కల్పించాడు. తరువాత ఇతడే దేవుడిగా పరిగణింపబడ్డాడు. ఇతడి పేరు మీదనే శ్రీకాకుళంలో ఆంధ్ర విష్ణువు ఆలయం వెలసింది, కాసుల పురుషోత్తమ కవి 'ఆంధ్రనాయక శతకం' రచించారు. అలాగే శ్రీ కృష్ణదేవరాయలు ఇతడి ఆనతి మీదనే 'ఆముక్త మాల్యద' రచన చేశాడు. శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువు నిశుంభుడనే రాక్షసుని సంహరించటమే ఈ కావ్య ఖండిక సారాంశం.

ఆంధ్ర మహావిష్ణువు రాజ్యంలో శ్రీశైల కొండల దగ్గరలో నివశించే ఆటవిక ప్రజలు రాజు సన్నిధికి వచ్చి తాము తెచ్చిన బహుమతులర్పించి, వినయంతో తలలు వంచి నిలబడి తమ బాధను విన్నవించారు. ఈశ్వరారాధనతో లభించిన వరంతో భుజ బల గర్వితుడైన నిశుంభుడనే రాక్షసుడి దురాగతాలతో తమ బ్రతుకులు దుర్భరమయ్యాయని తమ కష్టాలను తెలియజేశారు. అప్పుడు రాజు మేము అతడి గురించి విన్నాము, ఇంతవరకూ వాడు బ్రతికున్నాడంటే అది శివుడి దయవల్లనే. గురువుల సలహా సంప్రదింపులతో అతడిని వధించడానికి నిర్ణయించుకున్నానని చెప్పడంతో ఇంక వాడు చచ్చినట్లేనని వారు జయజయ ధ్వానాలు చేశారు. ఒక విజయలగ్నంలో ఆంధ్ర విష్ణువు తన నౌకాదళాన్ని ఇంద్రకీలాద్రి వరకు కృష్ణవేణి ప్రవాహానికి ఎదురునడిపి, అక్కడి నుండి చతురంగబలాలు శ్రీశైల సమీప భూములను ఛేదించాయి. శ్రీశైలేశ్వరుడిని దర్శించి సేవించాడు. తర్వాత అడవులను దాటి గొప్ప ధ్వని చేస్తూ నిశుంభుడి గుహద్వారాన్ని చేరారు. అనుకోని కాలంలో వస్తున్న ఆ ధ్వనులకు నిశుంభుడి సైనికుల చెవులు పగిలినట్లయ్యేను, ఆ సమయంలో ఆంధ్రసైన్యం నిశుంభుడి సైన్యంపై పెద్ద పిడుగువలె పడింది.

శత్రువు కొండ మార్గాలన్నీ తెలిసిన ఆంధ్రవిష్ణువు నిశుంభుడి ఆటలు సాగకుండా అన్ని దారులను మూయించాడు. గుహలను, కొండ భాగాలను తన సైన్యంచే ఆక్రమింపచేసి నిశుంభుడు నివసించే ప్రదేశం చుట్టూ పెద్ద ఏనుగుల గుంపును కాపలా ఉంచాడు, ఆంధ్ర సైన్యాన్ని చూసి ఏమాత్రం లెక్కచేయకుండా నిశుంభుడు బయటకు వచ్చాడు. తీవ్రమైన కోపంతో నిశుంభుడు శూలంతో ఆంధ్ర విష్ణువు కంఠాన్ని గురిచూసి కొట్టబోగా అతడి కంటే ముందుగా ఆంధ్రవిష్ణువే చిరునవ్వులతో గొప్ప పిడుగుల వంటి బాణాలతో చాలా తేలికగా రాక్షసుడి గుండెలు చీల్చివేశాడు.

ఆ రాక్షసుడి వక్షం రక్త నదీ ప్రవాహమైంది. అతడికి అతడి కుటుంబం గుర్తుకొచ్చింది, కానీ వెంటనే వైరాగ్యం కలిగింది. తన ఆరాధ్య దైవమైన పరమేశ్వరుడే ఆంధ్ర మహావిష్ణువు రూపంలో ఎదుట నిలిచెనని భావించాడు. ఆంధ్ర నాయకుడు ఆగ్నేయాస్త్రాన్ని వేశాడో ఏమో, నిశుంభుడి శరీరాన్ని దహించిన అగ్నిజ్వాలలు అడవులనన్నిటిని తగులబెట్టాయి.

ప్రజాహితం కోసం ఆంధ్ర విష్ణువు విశాలమైన పల్లెలను, పట్టణాలను నిర్మించాడు. విజయోత్సాహంతో ఆంధ్ర విష్ణువు తిరిగి రాగా శ్రీకాకుళాంధ్ర రాజ్యలక్ష్మి విజయకేతనంతో సర్వాభరణ భూషితయై బ్రహ్మానంద మందహాసంతో వయ్యారంగా ఎదురు వచ్చి స్వాగత మంగళహారతులిచ్చింది.

కొన్ని రోజులకు శ్రీ ఆంధ్ర విష్ణువు శ్రీశైలం, కాళేశ్వరం, భీమేశ్వరంలను కలపుతూ ప్రాకారం నిర్మించి తన దేశాన్ని త్రిలింగ దేశంగా ప్రసిద్ధం చేశాడు. ఆ ప్రాకార మార్గంలో ఆకాశ మార్గంలో సిద్ధ ఖేచర యక్షకాంతలు కూడా ప్రతి రోజు ప్రశాంత సంధ్యాసమయంలో త్రిలింగాలకు భక్తితో పూజ చేస్తున్నారు. ఆంధ్ర విష్ణువు బ్రాహ్మణులకు మంచి చేస్తూ వారి ఆశ్వీరచనాలు పొందుతూ వేదాలననుసరించి యోగనిష్టానియమాలతో ప్రతిరోజు మూడు కాలాలలో త్రిలింగాలను సేవించాడు. ఆ పరమేశ్వరుడి అనుగ్రహాన్ని పొందాడు.

అప్పటి శ్రీకాకుళ నగరం శ్రీ కృష్ణవేణీ తరంగాల దెబ్బలు తగిలే ప్రాకారాలు కలిగి, రాక్షసుల నెత్తురు త్రాగే నాలుకల వంటి బురుజులపై నున్న పతాకాలతో ఆంధ్ర వీరభటుల ఆత్మ శక్తికి సానరాయి వంటిదై, ఘంటసాలలోని పూర్వ శిల్పాచార్యులకు తల్లి వంటిదై, పాపాలకు పిడుగువంటిదై, శ్రీ ఆంధ్ర మహా విష్ణువుకు రాజధానియై వేద కాలంనాటి పెద్ద ముత్తైదువు కన్నులకు కట్టినట్లు ఎదురుగా నిండుగా ఉండేది.

**1.3.2. శాతవాహనుడు:**

ఆంధ్ర చక్రవర్తుల వంశానికి శాతవాహన వంశమని పేరు. దీపకర్ణి అనే రాజు భార్య శుక్తిమతి పాము కాటుచే చనిపోయింది. ఆమె మీద ప్రేమున్న ఆ రాజు మళ్ళీ వివాహం చేసుకోలేదు. ఒకరోజు దీపకర్ణి మహారాజు దుఃఖిస్తుండగా కలలో కులదేవత కనిపించి తర్వాతి రోజు వేటకెళ్ళమని, వేటకు వెళితే అక్కడ సింహం మీద ఒక బాలుడు కనిపిస్తాడని, వానిని తెచ్చి పెంచుకోమని చెపుతుంది. ఆ దేవత చెప్పిన విధంగానే సింహం మీద స్వారిచేసే బాలుడు కనిపించాడు. సింహం బాలుడిని దింపి, నీరు త్రాగడానికి పోగా రాజు దానిపై బాణం వేయగా ఆ సింహం గంధర్వుడై తన కథను చెప్పెను. ఆ గంధర్వుడు ఒకరోజు కృష్ణానది ఇసుక తీరంలో కాషాయ వస్త్రాలు ధరించిన అందమైన యవ్వనవతిని కలిశాడు. సిగ్గులతో కూడిన ఆ ఇరువురి అమృతమైన కంటిచూపులు మధురంగా కలవగా ఆ చూపుల ఫలితంగా వారికి కుమారుడు కలిగాడు. కొడుకు పుట్టిన వెంటనే ఆమె చనిపోయింది. ఋషులు ఆ యక్షకుడిని సింహమవ్వమని శాపమిచ్చారు. నేను ఇన్నాళ్ళు సింహారూపంలో ఉండి, ఈ పసివాడిని దీపకర్ణి కోసమే పెంచానని, ఆ పిల్లవాడు ఆంధ్ర భూధరుడవుతాడని ఋషులు చెప్పారని ఆ బిడ్డను తీసుకొని రాజ్యానికి అభిషిక్తుడిని చేయమని చెప్పి ఆ యక్షుడు అదృశ్యమవుతాడు.

అప్పుడు ఆ దీపకర్ణి మహారాజు సంతానవాంఛ ఆ కుర్రవాడి కనులను చూడగానే తీరింది. ఆ బిడ్డను దగ్గరకు తీసుకొని ముద్దు చేస్తాడు. తన భార్య మరణం చేత శూన్యమైన తన జీవితం, వారసుడు లేని తన రాజ్యం అన్నీ ధన్య మయ్యాయని భావించిన దీపకర్ణి మహారాజు జరగబోయె భవిష్యత్తును చెబుతూ బిడ్డను ముద్దుచేశాడు. ఆ పసివాడిని చంకనెత్తుకొని శ్రీకాకుళం నగర మార్గాన్ని అనుసరించాడు. ఆ బాలుడే శాతవాహనుడు.

**1.3.3. గోతమిపుత్ర శాతకర్ణి:**

నాసిక పట్టణంలో కొండ చివరియందు ఒక శాసనంలో గౌతమిపుత్ర శాతకర్ణి గురించి రాయబడి ఉంది. "ఇతడి తల్లి గోతమి – ఇతడు రాజాధిరాజు. ధాన్య కటకం రాజధాని. ఇతడు విద్యానిధి, ప్రజ్ఞావంతుడు, ధనుర్విద్యా విశారదుడు. ఇతడు

పరాక్రమంలో నహుషుడు, జనమేజయుడు, సగరుడు, యయాతి, రాముడు, అంబరీషుడు మొదలైనవారిని మించినవాడు". శక యవన హూణులు అనే విదేశీయులు భారతదేశాన్ని ఆక్రమించుకోగా వారిని గౌతమిపుత్ర శాతకర్ణి నిలిపాడు. సౌరాష్ట్రాన్ని జయించి వారి వంశమే నిర్మూలించి, ఆంధ్ర చక్రవర్తిత్వం మళ్ళీ నిలిపినవాడు.

ఈ కావ్యఖండం మహాక్షాత్రవుడైన నహపాణునిపైకి గౌతమి పుత్రశాతకర్ణి యుద్ధానికి ప్రయాణమవటంతో మొదలవుతుంది. యుద్ధానికవసరమైన దుంధుబులు, భేరీలు, శంఖాలు మొదలైన సకలవాయిద్యాలను ముందు ఒంటెల సమూహం మోస్తుంది. ఆ వెనుక వారకాంతల గుంపు మధురంగా పాటలు పాడుతూ, నాట్యం చేస్తూ ఉన్నారు. ఆ తరువాత ఉన్నతాధికారులు గుర్రాలతో బారులు తీర్చారు. ఆ తరువాత ధనువులు పట్టిన వీరులు, అశ్వపదాతి సమూహం, వారి వెనుకగా మదించిన ఏనుగుల సమూహం, ఆ వెనుకగా ఉక్కుముక్కల వంటి తెలుగు భటులు వరుసగా తెలుగు రాజ్యపు నడిబొడ్డుల నుండి భూమి అదురుతున్నట్లుగా పోనారంభించారు.

శ్రీ గౌతమీ పుత్ర శాతకర్ణి భుజబల సంపన్నులు వెంటరాగా భూవలయం భయకంపితమయ్యేటట్లు యుద్ధ ప్రయాణ సన్నద్ధుడయ్యాడు. భట్రాజులు గౌతమీ పుత్ర శాతకర్ణికి 'జయం, జయం, ఆంధ్ర నాయకా జయం జయం' అని పలికారు. ఆంధ్ర సైన్యం నడుస్తుండగా రాచవీధులలోని కొందరు స్త్రీలు, తమ ముఖం కొంగుల చాటు నుండి సగం సగం కనిపించేటట్లు చేసికొని, శృంగారామృతపుటోరచూపులతో ఊరిస్తూ, అందమైన పూమాలలతో ఆంధ్రనాయకుడిని అలంకరించారు. పద్మం వంటి కన్నులు కల కొందరు పడతులు మేడల నెక్కి పైనుండి పూలు, కుంకుమలు, అక్షింతలు ఆంధ్రనాయకుడు గౌతమీ పుత్రుడి మీద చల్లుచున్నారు. కొందరు పెద్ద ముత్తైదువులు త్రిపురాసురుల సంహారాన్ని గురించి పాటలు పాడుతూ ఆంధ్ర భూపాలకుడి సైన్యం మొత్తానికి విజయలక్ష్మి అనుగ్రహం కలిగినరీతిగా ఎదురు వచ్చారు. ఆ రాజు రథం దిగి ఆ ముత్తైదువులకు వంగి నమస్కరించి వారి ఆశీర్వాదాలు స్వీకరించాడు. ధాన్యకటక రాజ మార్గాలు దాటి సైన్యం నగర బయటి ద్వారాన్ని దాటింది.

చెలియలికట్టలేని సముద్ర వేగంవలే పరుగులు పెడుతున్న ఆంధ్ర రాజ సైన్యం ఆంధ్ర విశ్వవిద్యాలయం చెంత విశ్వవిద్యాలయం వారు ఇచ్చే స్వాగతాలు అందుకోవటానికి మరియు అమరావతీపురంలోని బాలకవులు పఠించే విజయ సూచకాలైన పద్యాలు విని మెచ్చుకోవటానికి ఒక నిముషమాగారు అని కవి కల్పించారిక్కడ. తెలుగు మాగాణి భూములను దాటుతుండగా ప్రతిష్ఠానపురం నుండి యువరాజు శ్రీ పులమావి తన సైన్యంతో ఎదురువచ్చి తండ్రితో కలిశాడు. ఆ తండ్రి కొడుకులను మెచ్చుకొంటూ సైనికులు గౌతమీపుత్ర శాతకర్ణి దావాగ్నిజ్వాలైతే యువరాజైన వాసిష్ఠీపుత్ర శ్రీపులమావి ప్రచండ వాయువు. క్షాత్రవుడైన నహపాణుడు ఇంక ఏమగునో కదా! అని అనుకున్నారు. తెలుగు వీరులు సౌరాష్ట్ర దేశంలో ప్రవేశించగానే సైన్యం కాళ్ళ దుమ్ము నహపాణుని రాజ్యాన్ని అంధకారం చేసింది. ఉగ్రమైన ఆంధ్రసైన్యమనే అగ్నిజ్వాలచే రాజులు దగ్ధమైపోయారు. నహపానుని వంశజ్యోతి ఆరిపోయింది.

### 1.3.4. మాధవ వర్మ:

'ఇతడు పల్లవరాజు. నేటి బెజవాడ రాజధాని. ఇతడ బృహత్పలాయనులకు పూర్వుడు. శివస్కంధ వర్మాదుల కాలంవాడు కావచ్చు. ఈ కథ ఒక శాసనంలోది. అతడి ధర్మానికి మెచ్చి దేవతలు రెండు ఘడియల కాలం విజయవాటికా పట్టణంలో కనకవర్షం కురిపించారు.

విజయవాటికా నగరపాలకుడైన మాధవ వర్మ ఏకైక కుమారుడు యువరాజు బంగారు నాణాలను ఇచ్చి మదించిన

తెల్లటిగుర్రాలను కొన్నాడు. అనేక మంగళప్రదమైన గుర్తులతో, ముక్కురంధ్రాల నుండి మంటలను వెదజల్లుతూ, నోటి నుంచి నురుగులు కక్కుతూ, కాలి గిట్టలచే భూతలాన్ని తొక్కుతున్న ఆ గుర్రాలను రథానికి పూన్చి స్వారీచేయటానికి తలచాడు యువరాజు. అందుకే ఆనాడు రాజభటులు వేగిరపాటును పొందుతూ, రాచవీధిలోని ప్రజలను ప్రక్క ప్రక్కలకు తోస్తున్నారు.

రాచ వీధులలో స్వారీ చేస్తూ ఉరుములు మెరుపులు వలె పరుగులు పెడుతున్న రాజకుమారుని రథం కనుమూసి తెరచునంత కాలంలో రాచవీధులను దాటి వెడలిపోతుంది. ఒక రాజవీధిలో ఆ రథచక్రాల క్రిందపడి ప్రాణాలు పోయిన ఒకని శరీరం నెత్తుటి ప్రవాహంలో నేలపై పడివుంది. పరుగులు పెడుతున్న ఆ రథం వెంట ప్రజలు కూడా పరుగులు పెట్టారు. ప్రజాసమూహాలు మూగిన దగ్గరంతా రాజభటులు వెళ్ళి సర్దుబాటు చేస్తున్నారు. రథాన్ని అనుసరించలేని ముసలివారు, దుమ్ముతో కప్పుకుపోయి నేల మీద పడివున్న ఆ శవాన్ని చూచి జాలిపడుతున్నారు. అంతలో సూర్యాస్తమయమయ్యింది. పడమటి కొండగుహలలో ఎప్పుడూ చీకటి అనే నల్లటిపాము యొక్క కదలికలచేత అన్నిదిక్కులలో అంధకారములుముకుంది.

విజయవాటికా పాలకుడు పల్లవ వంశ శ్రేష్ఠుడైన మాధవవర్మ మహారాజు రాజసభలో వేదధర్మాన న్యాయనిర్ణయం చేయవలసిన ధర్మాసనంలో కూర్చునివున్నాడు. ఆ రాజుముఖంలో 'ధర్మం' అధికంగా అందరికీ కనిపిస్తుంది. వృద్ధురాలు, పేదరాలు, మూర్తీభవించిన శోకదేవత రాజసభకు వచ్చింది. దుఃఖంతో ఆమె కళ్ళు నీరు నిండి ఉన్నాయి. నిరాశతో కనురెప్పలు మూతపడున్నాయి. ఆమె తన ఒక్కగానొక్క కొడుకును పోగొట్టుకొని విధిచే తిరస్కరింపబడినదై వుంది. న్యాయం కోరుతూ రాజసభకు వచ్చింది. నెత్తురు అట్టలు కట్టిన తన కన్న కొడుకు శవాన్ని క్రిందికి జార్చి, చేతులతో ఆ శవాన్ని చూపిస్తూ, తన చూపును రాజు వైపుకు తిప్పి అతడు తన ఒక్కగానొక్క బిడ్డ అని, రథాలతో ప్రజలను తొక్కిస్తారా, ఇలా అకారణంగా ప్రజలను చంపుతారా? అని ప్రశ్నించింది.

'నీవు ధర్మం వైపే మొగ్గుచూపే ధర్మరాజువి. ధర్మమూర్తివైన నీ పాలనలో ఈ పసివాడి ప్రాణాలు పోయాయి. ఇంతకుమించి కష్టమేముంది. నేను ఇప్పుడే వీని వెంటబడిపోతాను, మరి నా కోడలి గతి ఏంటి' అని పలికింది. నీ చిత్తం న్యాయం మీదా, అన్యాయం మీదా, దేనిపైనున్న అది నీ చేతి మీదుగా కానివ్వు అంటూ ఆమె కొడుకు శవంపై పడి ప్రాణాలు విడిచింది. ఆ సమయంలో ధర్మమూర్తి అయిన ఆ రాజు అధికారులను, న్యాయాధికారులను, ప్రధానమంత్రులను చూచి ఉన్నతమైన ధర్మాన్ని అనుసరించి న్యాయ నిర్ణయం చేయమనెను.

న్యాయాధికారులు యువరాజుదే దోషమని నిర్ణయించి ప్రాణానికి ప్రాణమే దోష పరిహారమని తమ నిర్ణయ పత్రాన్ని అధికారులకు సమర్పించారు. ధర్మాసనంపై ఎంతో గంభీరంగా కూర్చున్న ఆ మహారాజు గద్దె దిగిరాగానే అంత దుఃఖితుడయ్యాడు. రాజు బాధ చూచిన మంత్రులు ఎప్పుడూ సర్వోత్తమ న్యాయనిర్ణేత మహారాజే. న్యాయాధికారులు నిర్ణయించిన తీర్పును సవరించగల సర్వాధికారం మీకుంది అని చెప్పారు. ఆ రాజు వారి మాట ఆలకించక న్యాయం పక్షానే ఉండటం కారణంగా యువరాజు శరీరం నుండి వచ్చిన రక్త ప్రవాహ వలయాలతో ఆనాటి సాయంసంధ్య వాలిపోయింది. ఒక్కగానొక్క కుమారుడి వియోగ దుఃఖంతో ప్రాణాలు పోతున్నాయా అనే అంతగా ఆ రాజు దుఃఖించాడు. రాజు తన శరీరం, రాజ్య ప్రజల రక్షణ కోసమేనని తెలిసినవాడై తన ప్రాణాలను నిలుపుకొన్నాడు.

ఆ రాజు ధర్మనిరతికి ఆ సాయంకాలమందు నాట్యం చేస్తున్న శివుడి కాలి అందెలకున్న మణుల నుండి పుట్టిన కాంతి సమూహాలను ఛేదిస్తూ చిటపట అనే శబ్దంతో విజయవాటికలో కాంతులు వెదజల్లుతూ రెండు ఘడియల కాలం కనకవర్షం కురిసింది. ఆ పల్లవ రాజు, విజయవాటికా రాజు, మూర్తీభవించిన ధర్మదేవత అయిన ఆ మాధవవర్మ మహారాజును

దేవతలందరూ అనుగ్రహించి, ఆశీర్వదించి, కనకవర్షం కురిపించారు. ఆ శివుడి భార్య అయిన పార్వతీదేవి కనకదుర్గమ్మగా విజయవాటికా నగరంలో ఇంద్రకీలాద్రిపై వరప్రదాయినిగా వెలసింది.

**1.3.5. వేఁగి క్షేత్రము:**

ఆనాటి రాజుల వైభవం, ప్రజల జీవనం, వారి ఆచారాల గురించి వేగి రాజ్య వైభవం గురించి తెలియజేయటమే కాకుండా ఆంగ్లేయుల పాలనలో వెతలను చూసిన కవి భావనలను తెలియజేయటం ఈ కావ్య ఖండిక ఉద్దేశ్యం.

వేంగి పల్లవ రాజకాంతలు తమ కాళ్ళకు పెట్టిన పారాణులు ఉదయ సంధ్యలలో ప్రకాశిస్తుండగా నాగులచవితి పూజలు చేసేవారు. ఆ సమయంలో అప్పటి తెలుగు పిల్లలు కత్తిసాములు చేసేవారు. రాజ ప్రసాదితమైన శౌర్యం అనే పాయసం తినే ఆ పిల్లలు సూర్యదేవుడి రథోత్సవం రోజున కూడా కత్తిసాములనే చేసేవారు. ఆ పిల్లలకు యుక్తవయస్సు వచ్చేసరికి, మధ్యాహ్న కాల సూర్య వేడిమిలాగా పరాక్రమ తేజులు అయ్యేవారు. ఆనాటి త్రిలింగరాజులు ఈ జగానికి వీరశౌర్య శుభప్రదాతలై ప్రకాశించారు. అలాంటి పూర్వ వేంగిరాజుల పవిత్ర పాదచిహ్నాలతో వెలుగొందిన ఈ తెలుగు నేలపై ఈనాటి ఆంధ్రులు కన్నీరు కారుస్తూ జీవచ్ఛవముల లాగా ఉన్నారు. ఆ పల్లె ఉన్న చోటు నాడు అద్భుతంగా భోగభాగ్యాలతో తులతూగితే నేడు ఆ వేంగిరాజుల పాదగుర్తులే కాదు కనీసం ఆలోచనలలో కూడా వారి శౌర్య రూపం స్పష్టంగా లేదు. తెలుగు తేజాన్ని ఏదో చెడు కాలం తన కడుపులో దాచిందేమో!

సాటిలేని కీర్తనీయమైన వేంగిరాజ్యమా! ఆంధ్ర పల్లవరాజులు శత్రు లోకానికి భయంకరులై, వైదిక ధర్మరక్షకులై ఉండేవారు. కవి నిలిచిన ఆ భూమిపై నాడు ఏ రాజు ధర్మ శాస్త్రంను అనుసరించి పాలించాడో, ఏ పరాక్రమశాలురు యుద్ధ విద్యలను నేర్చుకొన్నారో, ఆకాశంనిండా ఏ యజ్ఞమంత్ర ధ్వనులు మారు మ్రోగాయో కదా కానీ నేడు తెలుగువారి బానిసత్వం తనను ఎంతగానో కలవరపెడుతుందని కవి ఆనేదన చెందుతున్నాడు.

ఆనాటి పిల్లలు వారు ఆడే ఆటలైన చెడుగుడు, గోడీ బిళ్ళ, ఉప్పు తేవటం, కోతి కొమ్మచ్చి వంటి వాటి ద్వారానే శత్రువులను కవ్వించి, వారి తలలతో బంతులాడి వారి ఎత్తుగడలను చిత్తుచేసి, వారి కోట గోడల కెగబ్రాకి దూకడం వంటి వాటిని నేర్చుకున్నారు. ఇవన్నీ చూస్తే బొద్దుకోయని పసివారికే తెలుగు తల్లులు శౌర్యరసం నూరి ఉగ్గుపాలతో కలిపి పోసేవారు. పూర్వపు వేంగి సామ్రాజ్య చరిత్రను తలుస్తూ కవి, అవన్నీ గ్రహించగల అంత అతీంద్రియశక్తి తనకెలా కలిగిందో కదా అనుకుంటున్నాడు.

ఆనాడు ఆ పంటపొలాలు సూర్యకిరణాలతో సారవంతమయ్యాయో కదా, ఆ నేల శౌర్యపరాక్రమాలతో నిండిన కారణంగానే సముద్రగుప్తుడి గుండె హడలి పగిలి పారిపోయింది కదా, ఆ పల్లవ రాజకాంతలు ఏ పూజలు చేశారో కదా లక్ష్మీ దేవి అక్కడే స్థిరంగా నివాసం ఉంది. వేంగీ రాజ్య కాశ్యపి వెన్నెలలో పులకించి, తెల్లటి కీర్తులతో ప్రకాశించింది. ఈ నేలలో ఎక్కడ తవ్వినా బంగారమే పండుతూ కాలిగోటితో మీటినంతనే నిధి బయటపడిన ఈ ప్రదేశం ఈ రోజు నిరుపయోగం చేసుకున్నామని తాను ఆ పవిత్ర భూభాగంలో కదలలేని రాయిలా వ్యర్థంగా నిలిచానని కవి ఆవేదన చెందుతున్నాడు.

నేటి రాజుల పాలనలో తానూ స్వతంత్రుడైన ఆంధ్రుడనై ఉంటానని మళ్ళీ ఆ కాలం తిరిగిరావాలని కవి ఆకాంక్షిస్తున్నాడు. ఆ వేంగి రాజ్య వైభవాన్ని తన ఆలోచనానుభవాలను స్నేహితులకు చెప్పాలనుకున్నా కవి కంఠం దుఃఖంతో వణికిందని, కళ్ళ నుండి నదీ ప్రవాహం లాగా నీరు కారిందని, అదంతా తనకు ఏ పూర్వజన్మ సంస్కారం వల్లనో కలిగిందని కవి భావిస్తున్నాడు.

**1.3.6. ముఖ లింగము:**

ఇది గంజాం మండలంలోని ఒక మహాక్షేత్రం. పూర్వం ఇది కళింగ గాంగులకు రాజధాని. ఇక్కడి శివాలయ ప్రతిష్ఠాపకులు ఆ రాజులే. అనంతవర్మ చోడగంగ దేవుడు పరాక్రమశాలి. అతడి రాజ్యం గోదావరి మొదలు గంగ వరకు విస్తరించింది. వేములవాడ భీమకవి చోడగంగు కాలంవాడే. చోళ చక్రవర్తి గంగైకొండని ఇద్దరు కూతుర్లలో ఒకామెను రాజరాజ నరేంద్రుడికి, రెండవ ఆమెను చోడగంగదేవు తండ్రికి ఇచ్చి వివాహం చేసెను. ముఖలింగానికి వంశధారానది మూడువైపుల అగడ్తవలె చుట్టివుంది. నాటి ముఖలింగ క్షేత్ర వైభవాన్ని, నేటి దాని దురవస్థను గురించిన కవి భావనల సమాహారమీ ఖండకావ్యం.

వర్షాధారాలైన ఈ పంటభూములతో ఆనాడు బంగారు పంటలు పండెనేమో! తెలుగు కళింగరాజుల శౌర్య దీక్షయే దీనికి రక్షాకవచమయ్యెనేమో! ఇక్కడి నుంచే శ్రీ గంధ కస్తూరి అగురు సువాసనలు అన్ని దిక్కులకు వ్యాపించాయేమో! పరాక్రమశాలి అయిన గంగైకొండనితో వియ్యమంది ఈ తెలుగు నేల ఇంకా పటిష్టమయ్యెనేమో! దక్షవాటీ పురంలో వ్యాపించిన ప్రళయాగ్ని పొగలు కవి రాక్షసుడైన వేములవాడ భీమకవి అమృతమయమయిన వాక్కుల చేత ఉపశమించెనేమో!

కళింగులు తొలిరోజుల్లో తూర్పుకాంత నుదుటిన ఎర్రని కుంకుమ తిలకాన్ని దిద్దింది ఈ ముఖలింగ ప్రదేశంలోనే. ఇది కళింగుల రాజధాని అని కవి భావన. ఈ ముఖలింగ పవిత్ర భూమిని త్రిలింగ రాజ్యలక్ష్మి తన నివాసం చేసుకొని అమృత వర్షం కురిపించింది కాబోలు. ఇక్కడి మట్టిగడ్డలు కూడా కొత్తకొత్త కస్తూరి సువాసనలను వెదజల్లుచున్నాయి. వేంగిరాజులతో, చాళుక్య రాజులతో సోదర భావంతో మెలిగేవారు. పగటివేషాల విద్యల నుండి మహా శిల్పకళ విద్యల వరకు తోటిరాజులతో పరస్పర ప్రేమానురాగాలతో ఉండేవారు.

కళింగ గాంగులనాడు తెలుగుదనాన్ని తనదిగా చేసుకొన్న ప్రదేశమీ ముఖలింగము. ఈ ముఖలింగం గొప్పతనాన్ని వర్ణించటానికి అద్భుతమనే పదం కూడా చాలదు. ఇది నిజమని చెబుతున్న తెలుగు పౌరుషజ్వాలలు నేడు నివురు కప్పుకొని దాగి ఉన్నాయి. ముఖలింగ నాథుడి (శివుడి) నేత్రాగ్నిజ్వాలల వంటి కళింగ గాంగుల శౌర్య ప్రతాపాలు శత్రుభయంకరాలై ఉండేవి. తెలుగు కళింగ రాజులు జైత్రయాత్రలకు వెళ్ళునపుడు వారి కులదేవత అన్యంక భీమేశ్వరస్వామి తన కంటి జ్వాలలతో శత్రువులను ముందుగానే తుదముట్టించేవాడని చెప్పుకుంటారు. అలాంటి ఆ దేవాలయంలో ఈరోజు గబ్బిలాలు తిరుగుతున్నాయి.

అలాంటి కళింగ గాంగరాజుల ప్రాణాలను, శత్రువులు హరించారు. వంశధారా నది చల్లదనంతో స్నేహం చేస్తున్న ముక్కంటికి తన నూతన అగ్నిజ్వాలలు చల్లబడినట్లుగా, ముఖలింగ రాజులు కూడా తను ప్రేమాస్పదులైన స్త్రీలతో పరస్పర స్పర్శ చేయుట వల్ల వారి తీవ్ర శౌర్య దీక్ష కుదించుకొనిపోయి ఉండవచ్చు. ఏ జన్మలోనో నేనీ గడ్డ మీద పుట్టి ఉందును అని కవి భావిస్తున్నాడు. ఈ కళింగ సీమగాథ కవి హృదయాన్ని కదిలిస్తుంది. వేదనచే కవి గుండె గాయమై కృశించిపోయింది. తెలుగుల తొలినాటి కీర్తి గానంతో రాపాడిన కవి మాట కొత్తదారులకు వెళ్ళదు.

ఆరిపోయిన కళింగ జ్యోతి కార్చిన నూనెబొట్లు వలన తెలుగు కళింగుల రక్తంలో శౌర్యజ్యోతులు మళ్ళీ వెలుగగలవు. ఆ తెలుగు వైభవాన్ని మళ్ళీ చూచే వరకు కవి తనను బ్రతకనివ్వమని వేడుకొంటున్నాడు. తెలుగు జాతి పూర్వ వైభవం కోల్పోయి బ్రహ్మజ్ఞానాన్ని, క్షత్రియ పరాక్రమాన్ని మంటకలుపుకొని మాతృభూమి తేజోరహితమైనదని, మాతృభాష నానా దుష్టభాషల ఉద్ధరింపు తలకెత్తుకుందని, నేలతల్లి పై పై మెరుగులకు లొంగిపోయి, సదాచారాలను మరిచి మోసపోయినదని కవి ఆవేదన

చెందుతున్నాడు. తెలుగు నేల మీద నదులన్నీ పొంగిపోయి స్వతంత్రత లేని జీవితం గడుపుతున్న తెలుగు నేలను ముంచి వేయటం మంచిదేనని కవి భావిస్తున్నాడు.

**1.3.7. నన్నయ భట్టు (ఆంధ్ర మహాభారతావతార ఘట్టము):**

ఆంధ్ర గోదావరీ తీరంలో ఉదయ సూర్యకాంతుల స్పర్శతో పద్మాలు, తమ వైభవాన్ని చూపుతుండగా పద్మపత్రాలలో బందీ అయిన తుమ్మెదరాజు స్వతంత్రుడై ఆలపిస్తున్న తెలుగుగీతం గాలి తెమ్మెరలలో తేలియాడి అన్ని దిక్కులకు వ్యాపించింది. విశాలమైన రాచవీధుల వెంట రాజసభకు వెళుతున్న త్రివేదులు, తార్కిక చూడామణులు, నిత్య శిరస్స్నాతులు, కర్ణాభరణ వస్త్రాలంకార భూషితులు, ఉదయ సూర్య కాంతుల వంటి తేజోమయమూర్తులు, పరమేశ్వరునికి ప్రతిరూపులు, దైవాంశ సంభూతులైన బ్రాహ్మణులున్నారు. అనేక మంది రాజులు, మంత్రులు, సైన్యాధిపతులు, షట్శాస్త్ర పరిజ్ఞాతులు, నారాయణభట్టు, పావులూరి మల్లన అంతకముందే రాజసభ చేరి తమ తమ ఉన్నత ఆసనాలపై కూర్చొని ఉన్నారు.

అలాంటి రాజసభకు ఒక బ్రాహ్మీమయమూర్తి, ఆజానుబాహు, నిత్య గోదావరీ నదీస్నాన పునీతుడు, త్రిపుండ్రధారి, నుదుటిన సరస్వతీ తేజం కలవాడు, ఆదికవి శ్రీ నన్నయ భట్టు వస్తున్నాడు. ఆ శబ్దశాసనుడైన నన్నయ రాక తెలిసిన మంత్రులు ఆయనకెదురేగి, నమస్కరించి, ఘన స్వాగతమిచ్చి సభా భవనానికి తీసుకు వచ్చి ఉచితాసనంపై కూర్చుండ పెట్టారు. వందిమాగధుల కైవారాల వల్ల మహారాజు రాజరాజనరేంద్రుడు వస్తున్నట్లు తెలిసిన సభాసదులందరు నమస్కరిస్తూ లేచి నిలబడ్డారు. చింతామణి సింహాసనాన్ని ఆసీనుడైన మహారాజు భట్రాజ కవుల పొగడ్తను వింటూ చిరునవ్వులతో నన్నయవైపు చూశాడు. అభినందనలతో కూడిన నన్నయ చిరునవ్వులు చూసి మహారాజు సంతోషించాడు. నిత్యాగ్నిహోత్రులు ఆశీపూర్వక వేదమంత్రాలను పలుకుతూ చేతిలోనున్న మంత్రాక్షలతో మహారాజును ఆశీర్వదించగా గాయకులు విమలదేశాక్షి సావేరివి వంటి సౌమ్యమైన రాగాలను పాడారు. విద్యాంసులు శాస్త్ర భావసారాన్ని వీనుల విందుగా వినిపించారు. పండితులు వేద సంహితలోని యెన్నో రహస్యాలను పంచమవేదమైన మహాభారతంలో గోచరనీయమని చూపించారు.

మహాభారతంలోని వేదరహస్యాలను విన్న చంద్రవంశజుడైన రాజరాజనరేంద్రుడి హృదయపద్మం ఆ పంచమ వేదానికి నమస్కరించగా నన్నయ వైపు చూస్తూ బ్రాహ్మణులను పూజించటం, మహాభారతాన్ని వినటం, శివుడిని సేవించటం, ఎప్పుడు దానాలు చేయటం, సాధువులతో స్నేహం చేయటం తనకు ఇష్టమని అవి ఎప్పుడూ తనను వదిలి వుండవని చెప్పాడు. తన వంశానికి మూలపురుషుడైన చంద్రుడి నుండి పురూరవుడు, భరత మహారాజు, కురు మహారాజు, పాండు మహారాజులు వరుసగా వంశకర్తలై ఈ భూమిని ప్రకాశింపచేశారని, పాండవోత్తముల చరిత్ర అయిన మహభారతాన్ని ఎప్పుడూ వినటం పట్ల తనకు కోరికుందని చెప్పాడు. ఈ భూమిపై నన్నయను మించి కవితా రచన చేసే దీక్ష పూనిన వారు లేరని మహారాజు ఆదికవికి నమస్కరించాడు. అపుడు నన్నయ "శ్రీ వాణీ గిరిజాశ్చిరాయ" అని మహాభారత రచన ప్రారంభించాడు. ఆ వాగ్వైభవం వీణాతంత్రుల వలె మ్రోగింది. ఎగిసిపడుతున్న అలల సుడులతో గోదావరీ నది సంగీతోత్సాహంతో పాడింది. శ్రీ మోక్షలక్ష్మీ దేవి తనకుతానే తెలుగు నేలను చొచ్చుకొని ప్రవేశించింది. సర్వదేవతలు, తమ చేతనున్న పువ్వులతో ఆశీవర్షం కురిపించగా తెలుగువారు త్రిమాతల అనుగ్రహపాత్రులయ్యారు.

**1.3.8. ప్రోలరాజు:**

కాకతి బేతరాజుకు ప్రోలరాజు కుమారుడు. ఇతడు రాజ్యతంత్రజ్ఞుడైన మహా యోధుడు. శక యవన హూణుల దాడులెక్కువైన ఆ రోజులలో ఆంధ్రదేశం చిన్న చిన్న రాజ్యాలుగా ఉండటం కారణంగా ఇతరులు దాడి చేస్తున్నారని, అలా

పరాయివారు వచ్చినప్పుడు తెలుగు రాజులందరు కలిసి యుద్ధం చేస్తే బాగుంటుందని ప్రోలరాజు సభ నిర్వహించగా దానిని మంత్రకూట రాజైన గుండరాజు భగ్నం చేశాడు. తర్వాత అతడి తలతెచ్చి ప్రోలరాజు తన కోట గుమ్మానికి కట్టాడు. ప్రోలరాజు కాలంలో చిన్నదైన కాకతీయ సామ్రాజ్యం విశాలమైంది. మంత్రకూటాధిపతి గుండరాజుపై యుద్ధానికి ముందు ప్రోలరాజు ఆలోచనలే ఈ కావ్యం.

ఒక సాయంకాలంవేళ ప్రోలరాజు తన మూపున పొడుగైన బల్లెంపెట్టుకొని కోపంతో కూడిన ఆలోచనలతో భూమి కంపించేటట్లుగా హనుమకొండల ప్రక్కన అటుఇటూ తిరుగుతున్నాడు. తన తండ్రి బేతరాజు శత్రురాజ్యాలను నాశనం చేసిన వాడు, కానీ ఎందుకో ఈ గుండరాజును ఆదరించాడు కనుక సరిపోయింది. లేకపోతే ఆయన చేతి గొడ్డలి దెబ్బలకు ఏనాడో వీని తల తెగిపోయేది. ఈ గుండరాజు ఎన్ని నాటకాలాడుతున్నాడు. తైలప దేవుడిచే యుద్ధ సన్నాహం చేయిస్తున్నాడు. ప్రసిద్ధి చెందిన చాళుక్య వంశపు చెట్టు నీడలో పక్షులవలె ఆశ్రయం పొంది, వారి మీదనే యుద్ధానికి సిద్ధమా? ఈ విషయం కొంచెంకూడా తైలపదేవుడు ఆలోచించడా ఏంటి? గుండరాజు దుర్నీతికి లొంగిపోతున్నాడు. ఈ తైలపదేవుడు సరైన దారికి రాకపోతే అతడి బలగర్వాన్ని నాశనం చేస్తాను. ఐకమత్యం కోరుకొని వీరందరూ ఏదో ఒకరోజు నా శౌర్యాగ్నికి ఆహుతి అయ్యే సమిధలే. చేయవలసిన కార్యం ఆలశ్యమైతే ఏరోజు ఏమి జరుగుతుందో, కాబట్టి యుద్ధమే అనివార్యం. ఈ తైలపదేవుడి సైన్యాధక్షుడు గోవిందుడు ఎందుకో పొగపెడుతున్నాడు. ఈ పొగ రాజలోకాన్ని నాశనం చేస్తుంది. తైలప దేవుడిని బంధించి వారి వంశం పట్ల నాకు ఉన్న కృతజ్ఞత వలన వెంటనే విడిచిపెడతాను. ఆ తర్వాత గుండరాజు పైకి యుద్ధానికి వెళ్ళిన తనకు తైలపదేవుడు అడ్డం రాడు, అప్పుడు కాకతి ప్రోలరాజు అంటే ఏమిటో గుండరాజుకు తెలిసివస్తుంది.

తెలుగు రాజ్యాలను పాలించిన చాళుక్యరాజుల భుజ బలాలు తగ్గటం వలన నాటి వైభవాన్ని వారింక నిలుపుకోలేరు. తెలుగుభూమిని ముక్కలు ముక్కలుగా పంచుకొని హుణులకు వంగి నమస్కరిస్తారా ఏంటి? ఉత్తర భారతదేశంలో యవన హుణుల గుంపులు విజృంభిస్తున్నాయి. దక్షిణ దేశానికి వారు విజృంభిస్తే ఇక్కడ కత్తులతో అడ్డుగోడలు కట్టగల రాజు ఎవరున్నారు? ఆ దాడులను ఎదిరించకపోతే సూర్యవంశ రాజులైన తమకు అప్రదిష్ట కలుగదా? ఆ పరాయిరాజు దండెత్తి వస్తే ఇక్కడనున్న నలుగురు కలిసి పోరాడవచ్చు కదా! ఈ గుండరాజుకు ఎంత కండకావరం? రాజసభను జరుగకుండా ఈ గుండరాజు ఆలోచించి ఉంటాడు. వాడి గుండెలు పగులకొట్టకపోతే ఆ కాకతీదేవి పాదాల మీద మా శిరస్సును ఉంచం. రేపే శుభలగ్నం అనుకున్నాడు ప్రోలరాజు.

కాకతి వీరుల పరాక్రమ జ్వాలలతో శత్రు బలగర్వాలు హోమ ద్రవ్యాలుగా దహనమవుతాయి. శ్రీ కాకతీయ నవరాజ్య నిర్మాణాన్ని ప్రారంభిస్తాను, ఆంధ్ర రాజ్య ప్రభువు ఎవ్వరో తేలుస్తాను అంటూ తీవ్రమైన ఆలోచనలతో ప్రోలరాజు శరీరం వేడెక్కింది. అప్పుడు చంద్రోదయ కాంతులతో రాజు శరీరం చల్లదనపు సుఖం పొందింది. ఆ రోజు రాత్రి రాజు భక్తి శ్రద్ధలతో కాకతీదేవిని దానిని పూజించాడు. తెల్లవారుతుండగా జైత్రయాత్రా చిహ్నమైన భేరీనాదాలు శత్రుభయంకరంగా హనుమకొండ నుండి వినబడ్డాయి.

**1.3.9. ప్రోలరాజు వధ:**

మొదటి ప్రతాపరుద్రుడు ప్రోలరాజు కొడుకు. ఆ రోజులలో మత వైషమ్యం ఎక్కువగా ఉంది. జైనమతం నశిస్తున్నది. కొన్ని రోజుల క్రిందటే బసవేశ్వరుడి మతం పుట్టింది. దాని తరువాత కొన్ని రోజులలోనే పాల్కురికి సోమనాథుడు బసవపురాణం రాశాడు. ప్రోలరాజు మొదట జైనుడు. జీవితాంతంలో శైవుడైనాడు. మొదటి ప్రతాపరుద్రుడు వీరశైవంలో మిక్కిలి తీక్షణ

స్వభావం కలిగి ఉన్నాడు. మొదటి ప్రతాపరుద్రుడి కాలంలో కాకతీయ రాజ్యం మహోన్నతమైన స్థానం పొందింది. మొదటి ప్రతాపరుద్రుడు శివసన్నిధిలో ధ్యానమగ్నుడై ఆత్మఘోషను స్వామికి నివేదించు సందర్భమే కథా ప్రారంభం.

ఓ సాంబశివా! మానవులు పనికిరాని ఆలోచనలలో చిక్కుకొని నీ గురించిన ఊహలనే మానివేశారు. నువ్వు కంటిమంటల చేత చంపేవాడవే అంటారు గాని, నీ దయాదృష్టులను చూడలేరు. జీవాత్మయే పరమాత్మ అనే నీ భక్తి మార్గం అనుసరించరు. ఈ విధమైన నాస్తికతను సహించుటెలా స్వామి, మా అజ్ఞానాన్ని క్షమించు తండ్రి.

ఓ సాంబశివ! వేదాలన్నీ అబద్ధాలనే దుర్మార్గపుటాలోచనలు ఫలిస్తున్నాయి. ఓ త్రినేత్రా! సర్వవేదాంత స్వరూపుడవు నీవు ఒకడవుండగా ఈ మత ప్రవర్తలు ఎంతమందో బయలు దేరుతున్నారు. ఒక్కడూ సత్యమార్గాన్ని అవలంభించాడు కదా! ఓ శివా! ఈ అకాలపు మౌనం నీకెందుకయ్య, నీవు అలా ఉంటే ఇంక ఈ లోకమేమి కావాలి, ఓ శివా! దుర్మార్గమైన మతాలు నీటి ప్రవాహవేగాన్ని మించి ఉన్నాయి. సన్మతాలనే పద్మాలకు సూర్యకాంతి సోకక తేజోహీనమయ్యాయి. నీ మౌనం చాలు, నీ ఆజ్ఞ కొరకు ఈ సేవకుడు నీ ముందే నిల్చి ఉన్నాడు అని ప్రతాపరుద్ర మహారాజు మనసులో వీరశైవమనే మంటలు క్రమ్ముకోగా శివసన్నిధిలో ధ్యానమగ్నుడయ్యాడు.

అదే సమయంలో శివసన్నిధికి వచ్చిన ప్రతాపరుద్రుడి తండ్రి ప్రోలరాజును ఎవరో వైదిక మతం పట్ల పగగలవాడు తన ధ్యానాన్ని భంగ పరచటానికి వచ్చాడేమోనని అనుకొని పరమ సాహసి అయిన ప్రతాపరుద్రుడు కత్తిని విసిరాడు. అది అతడి తండ్రి వక్షంలోనే దిగబడింది. మరు నిముషంలోనే తన కోపాగ్ని జ్వాలలు తనను పితృహంతకుడిని చేశాయని తెలిసికొన్నాడు. నింగినేల కలిసి పోయినట్లుగా తల తిరుగగా తండ్రి పాదాల వద్ద మూర్ఛపోయాడు. అంతలోనే స్పృహ కలిగి, అంతులేని దుఃఖంతో కూడిన మాటలను ఈ విధంగా పలికాడు, "తండ్రీ! నీ భుజపరాక్రమంతో ఈ తెలుగు వారు దిక్కుల చివరలవరకు తమదిగా చేసుకొన్నారు. ఆ సమయంలో నీతోనే వైరం పూనినవారు తమ ఉనికికే ఉపద్రవాన్ని తెచ్చిపెట్టుకొన్నారు. అంత శౌర్యధనుడవైన తండ్రి! నా కత్తి నీ గుండెలో భయంకరమైన లోతుగా ఏలదిగెనో.

ఓ రాజలోక చూడామణి ! ఊహించటానికి వీలులేని ఈ భయంకరమైన పాపకర్మానికి నేనెలా ఒడికట్టాను తండ్రీ! ఇంక శత్రువులు బంధింపబడరు కదా! అంత శక్తిమంతుడివే, తేజోహీనమైన నా కత్తికి నీవెలా బలయ్యావు? ఈ ఉపద్రవాన్ని నేనెట్లు చేశాను, అంతులేని దుఃఖం, పాపం నాకెట్లు చేరాయి? తండ్రీ! ఆ తల్లి కాకతి రాజ్యలక్ష్మి నీకు చల్లని నీడైంది. నీ అంతటి వాడి ఎదురు రొమ్ములో నా చేత కత్తిని దింపిన నీచుడిని, హీనుడిని, సిగ్గులేని వాడిని. తండ్రీ అని పిలిచిన నన్ను క్షమిస్తావా, ఈ క్షణంలోనే యమపురికి వెళ్ళటానికి తగినవాడిని సుమా! కడుపుతీపి చేత నన్ను వేయి కళ్ళతో కాచి రక్షించావు, కాని ఈ నిర్భాగ్యుడు నిన్ను కాటువేశాడు తండ్రీ! న్యాయమెక్కడున్నదయ్యా? ఓ త్రయీ మార్గరక్షకుడా! దేహానికి నాశనం, ప్రాణాలకు ప్రయాణం తప్పదు కదా, కానీ నా దురదృష్టానికి అవధిలేదు కదా, నన్ను మించిన పితృహంతకుడు ఈ లోకంలో ఉండదు. ఓ శివా! వధ్యస్థానానికి యోగ్యుడనైన నన్ను పెద్ద అగ్నిజ్వాలవై యింకా దహించివేయవెందుకు? ఈశా! ఈ పితృహంతకుడా ఇక మీదట కాకతి రాజ్యానికి రాజా? దానికి నేను అర్హుడను కాను. పాపపు ప్రళయాగ్ని జ్వాలలు ఇంకా నన్ను మింగవేమి?

"శత్రువులాగా ఈ ఘోరాన్ని చేసిన నేను కల్యాణవతి అయిన నా తల్లిని ఎలా దర్శించను? నా వలన వైధవ్యాన్ని పొంది దుఃఖంతో నిండిన మాతృమూర్తిని ఏ విధంగా చూడాలో చెప్పు పరమేశా" అని దుఃఖిస్తూ మూర్ఛపోయిన ప్రతాప రుద్రుడి నుండి ప్రోలరాజు దేహాన్ని అతని మంత్రులు దూరంగా తీసుకెళ్ళారు. తండ్రి శరీరానికి దహన సంస్కారాలు చేసిన ప్రతాపరుద్రుడి ముఖంలో మళ్ళీ చిరునవ్వే కనిపించలేదని చెబుతారు.

**1.3.10. కొండవీటి పొగమబ్బులు:**

కొండవీటి ప్రాంతాలనావరించిన పొగమబ్బులతో ఆనాటి కొండవీటి రాజుల వైభవాన్ని పోల్చుకొంటూ కవి తన భావాలను తెలియజేయటమే ఈ కొండవీటి పొగమబ్బుల కావ్యం.

ఈ కొండవీటి కొండల చివరల నేడు కొత్తకొత్త పొగమబ్బులు వ్యాపించాయి. అవి బహుశా దహనమైన ఆంధ్ర రాజ్యం నుండి లేచిన పొగలు కావచ్చు. కొండబురుజుల ప్రక్కన నిల్చిన ఆ పొగమబ్బులు కోటబురుజు శిఖరాలను వదలలేని రెడ్డిరాజుల యశోకీర్తుల వలె పెద్ద పెద్ద కొండశిలలను అంటుకొని ఉన్నట్లు వ్యాపించాయి. రెడ్డి రాజుల వంటశాలల నుండి రేగిన పొగలు మబ్బులుగా ముందుకు నడిచి, కరిగి ప్రవహించిన స్వతంత్ర లక్ష్మి వలె కొండలను తాకితాకనట్లుగా ఉన్నాయి. అందులో కొన్ని పొగమబ్బులు కొండశిఖరాలలో నల్లని గడ్డి తినటానికి వచ్చిన తెల్లావుల మందలు నిలిచినట్లుగా ఉన్నాయి.

ఒక పొగమబ్బు రెడ్డి రాజు సభ తీర్చినట్లుగా ఉన్న వాలిన ఒక కొండకు కొసలలో ముత్యాల గొడుగు పట్టినట్లుగా ఉంది. ఒక పొగమబ్బు, అంతఃపుర స్త్రీల సౌధానికి మేలిముసుగు తొడిగినట్లుగా ఉంది. ఠీవిగా నిలబడిన తెలుగు సైనికుడి చేతిలోని కత్తి వలె, ఒక కొండబురుజు ప్రక్కన వ్రేలాడుచున్న దొక పొగమబ్బు. నీటి ప్రవాహాలను దాచుకొని, పవిత్రమైన ఆకారాలు కలిగిన ఈ పొగమబ్బులు కొండవీటి రాజులను మరువలేక కొండవీటిని వదిలి రెడ్డి రాజులు వెళ్ళిపోయి ఎన్ని రోజులు గడిచాయో కదా అని వందల ఏళ్ళు వారిని తలుచుకొంటూ ఈవిధంగా సేవిస్తున్నాయి. కొండవీటి మబ్బుల పుట్టుకకు సగం కారణం అతిథి మర్యాదల నెరిగిన రెడ్డిరాజుల వంటశాలల నుండి వచ్చే పొగలేయని లోకంలో అనుకుంటారు.

శ్రీనాథ కవి సార్వభౌముడి కావ్య శ్రోతలైన కొండవీటి కొండలు మాకు పరిచిన పరువులు ఈ పొగమబ్బులంటున్నాయి. బారులు తీర్చిన తెలుగు సైనికుల వలెనున్న కొండ కొమ్ములకు వీర గంధాలవలె ఈ పొగమబ్బులలముకున్నాయి. ఈ పొగమబ్బులు ఒకసారి సన్నని చీర అంచులను ముత్యాలతో అందంగా అలంకరించినట్టుగా, మరొకసారి మొలవరకు జార్చిన వస్త్రం వలె, వేరొకసారి ఆ గిరిలక్ష్మిపై మొగలి పుప్పొడులను చల్లుచున్నట్లుగా, మరోసారి రతి క్రీడానంతరం యవ్వనవతికి పట్టిన చెమట బిందువులవలె కదులును, జారును. విజృంభించును. ఇంకా ఈ పొగమబ్బులు ఈ కొండవీటి శిథిల దుర్గలక్ష్మికి పరచుకొన్నవిగా, నశించి పోయినవిగా, ఎగుర గొట్టబడినవిగా, తడిసినవిగా అనేక విధాలైన వెర్రి అలంకారాలను కలుగ జేస్తున్నాయి.

ఈ కొండవీడు ఒకరోజు గరుడధ్వజ రథాన్ని అధిరోహించిన కుండిన నగరాధీశునితో ప్రకాశించింది. మరో రోజు ఏనుగుల తొండాలతో ఎగురగొట్టబడిన నీటిసమూహం వంటి గజపతుల కోపం చేత కలత చెందింది. వేరొకరోజు గజపతుల ప్రతినిధి కసవా పాత్రుని అంటుకొన్న శ్రీకృష్ణదేవరాయలుని భుజాల యందలి మహాగ్నిచేత మండిపోయింది. ఇంకొక రోజు శ్రీనాథ విరచిత కావ్య రాయబారి హంసలరాజు రెక్కలవంటి రెడ్ల కీర్తి పతాకం ఆకాశవీధులలో ఎగిరింది. నిప్పులను కూడా తగులబెట్టగలిగిన కళింగ గజపతులు నేడీ బురుజులపై లేరు. ఎంతో పరాక్రమసిరి కలిగిన రెడ్డి రాజ పురుషులు ఈ రోజు ఈ కోటలపైన లేరు. కత్తులతో గుండెలు చీల్చగలిగిన శ్రీకృష్ణదేవరాయల రాజవంశంవారు, అడుగడుగున ప్రాణాలను విసిగించే ద్వారరక్షకులు నేడు ఇక్కడ లేరు. ఓ పొగమబ్బులారా! మీకు అడ్డు లేదు, యిష్టమేయిష్టం, రాజసభలకు, రాచకన్నెలున్న అంతఃపురాలకి వెళ్ళవచ్చు.

ఈ పొగమబ్బులు అసలు భయమనేది లేకుండ యోధులు తిరిగే బురుజులపై తమలోని నీటిని విరజిమ్ముతున్నాయి, పొగరుబోతులపై మిరియాల నిల్వలపై పరుగెత్తుతున్నాయి, అడ్డు అదుపు లేకుండా అంతఃపురంలోని చిన్నిచిన్ని గదులలోకి

దూసుకు పోతున్నాయి! ఏ ఆటంకం లేకుండా నక్షత్రాలను తాకే బురుజుల మీద యెగిరి దూకుతున్నాయి, పిచ్చి పొగమబ్బులారా! అద్దంకి రెడ్లకు కోపం వస్తే చాలా చెడ్డవారు సుమా, పాము పడగల వంటి అద్దంకి రెడ్లు సునాయసంగా మీ రొమ్ములను తంతూ బంతులాడి మిమ్మల్ని ముక్కలుగా చేస్తారు జాగ్రత్తసుమా! అని కవి పొగమబ్బులను హెచ్చరిస్తున్నాడు. రెడ్డి రాజుల గుండెలలో తీర్చుకోలేని కోరికలు, శ్రీనాథ, ఎర్రన కవిత్వానికి రాని భావాలు, అవచి తిప్పయ్యశెట్టి ప్రాణాలు తిరిగివచ్చి మబ్బులైనట్లున్నాయి. తాను కూడా ఆ మబ్బుల్లో ఒక మబ్బునైపోతే బాగుండునని కవి భావిస్తున్నాడు.

### 1.3.11. చంద్రవంక యుద్ధం:

ఇది పల్నాటి చరిత్రలోది. అనుగురాజు పల్నాటికి రాజు. అతని మంత్రి దొడ్డ నాయనికి బాదన్న, బ్రహ్మనాయడు కొడుకులు. బాదన్నకు పెద్దన్న అని కూడా పేరు. బాదన్నను అనుగురాజు పెంచుకున్నాడు. కనుక నలగామ రాజును బాదన్నయు అనదమ్ములు. నలగామ రాజు అనుగురాజు నౌరసపుత్రుడు. అలరాజు నలగామ రాజుకు అల్లుడు. అందుచేత బ్రహ్మనాయడు బాదన్నలకు, అలరాజునకు మామ అల్లుళ్ళ వరుస. అలరాజుకు రాచమల్లు, అలరాచమల్లు అని కూడా పేరు. అలరాజు గుర్రం పేరు సవరాలు గోడిగ. బాదన్న గుర్రం కాఋబొల్లడు, బాదన్న, బ్రహ్మనాయడు వెలమలు. అల రాజాదులు క్షత్రియులు.

అలరాజు, బాదన్నల చిలిపి కయ్యాలు, సర్దుబాటు చేయలేని బ్రహ్మనాయడులను గూర్చినదే ఈ కావ్య ఖండిక. ఇదియే పల్నాటి యుద్ధానికి ప్రధమ బీజం.

చంద్రభాగానది నీటి అలలపై పడుతున్న గోధుమ రంగు త్రాచుపాము పిల్లలవలెనున్న బాల సూర్యకాంతులు పిల్ల గాలులకు కదలుచు జఙ్ఝున జారుతున్నాయి.

చంద్రభాగానదిలో బ్రహ్మనాయడు ప్రభాత స్నానం చేసి ఇల్లు చేరాడు. నిలువుటద్దంలో చూచుకుంటూ తిరునామాన్ని పెట్టుకొన్నాడు. ఆ సమయంలో తెల్లటి ఆకాశంలో రెండు కొత్త మెరుపులు కదిలి పోట్లాడుకున్నట్లుగా ఒక నిమిష కాలం నిలువుటద్దంలో కనిపించింది. నిలువుటద్దం చేతితో పట్టుకొని నిలుచున్న బ్రహ్మనాయడు, తన కుమారుడు కన్నమదాసును పిలిచి చంద్రభాగానదీతీరంలో ఎవరో ఇద్దరు యుద్ధమాడుచున్నట్లున్నారు చూచిరమ్మని చెప్పాడు. ఇక్కడ ఉన్నవాడు ఉన్నట్లుగా పరుగునపోయి వచ్చాడు కన్నమదాసు. వచ్చి బాదన్న నాయన, అలరాజును నురుగులు గ్రక్కుచున్న గుర్రాలను ఎదురెదురుగా తోలుతూ పోరుచున్నారని పరుగున వచ్చిన రొప్పుతో చెప్పాడు.

అది విన్నంతనే బ్రహ్మనాయడు తడబడుతూ అదే పరుగుపెట్టాడు. అక్కడకు చేరగానే బ్రహ్మనాయడు, బంగారం కంకణం కల తన కుడిచేతిని కారు బొల్లని ముఖంపైన, ఎడమ చేతిని క్రొత్త గంటలతో నిండిన సవరాలగోడిగ మెడమీద వేసి యుద్ధం ఆపండి అని పలికాడు. అప్పుడు కారుబొల్లడు తనంతట తానే వెనుకకు తగ్గింది. సవరాల గోడిగ మాత్రం బ్రహ్మనాయడిని ప్రక్కకు నెట్టింది. కలత నెరుగని నిశ్చలంగా ఉన్న సరస్సులోని పద్మాల వంటి చూపులతో ప్రకాశించే బ్రహ్మనాయని హృదయాంతరాలలో అప్పుడూ తెలిసితెలియనట్లుగా కలత కలిగింది. అల్లుడా, చాలు ఆగుమయ్యా అని అలరాజుతో బ్రహ్మనాయడు పలికాడు. "మామా! ఒఱనుండి వచ్చిన నా కత్తి బలి తీసుకొనక మరలదు" అని అలరాజు పలికాడు. 'అల్లుడా, అంతకసి యెందులకయ్యా' అని నాయడు ప్రశ్నించాడు.

అప్పుడు అలరాజు సవరాలగోడిగ నదిలించి దాని జీనును అదిమి రికాబులలోనున్న కాళ్ళతో తొక్కిపట్టి కళ్ళాన్ని

బిగించిపట్టుకొని నిల్చి బ్రహ్మనాయనితో ఇలా చెప్పాడు. మామా! ఇది నెలరోజుల నాటి మాట. అలరాజు, బాదన్నల అశ్వసేవకులు అయిన లింగధానకుడు, గంగధానకుడు చంద్రవంక రేవులో గుర్రాలను నీరు త్రాగించటానికి వెళ్ళి, నీవు నీవని పంతాలకు పోయారు. ఎంతకు ఆగక కొరడాలు విసిరికొట్టుకొనుట వరకు వచ్చింది. సవరాలగోడిగ కంటిగ్రుడ్డుకు కొరడా దెబ్బ తగిలి నీరుకారుతుంది. అది నీరు కూడా ముట్టలేదు. లేతగడ్డిని తినటంలేదు. పౌరుషవంతురాలైన అది తీవ్రమైన ప్రతీకారాన్ని కలిగి ఉంది. దాని కాలిగిట్టలకు బాదన్న బొమ్మను కట్టగా అప్పుడు దానికి కసితీరి నీరు తాగింది.

ఆ తరువాత మూడు రోజులకు గోడిగను అలంకరించి రాజసభకు తీసికొని రాగా బాదన్నను చూచి దాని కాలిగిట్టలకున్న బొమ్మ అతనిదేనని గుర్తించింది. ఆ బొమ్మను తీసివేయమని లేకపోతే యుద్ధం తప్పదని అలరాజు కబురు పంపారు. పొగరుతో కూడిన ఆ మాటలు సహించలేనన్నాడు, యుద్ధమా సరేనన్నాడు. అలరాజు ఇంక మామ! నా కత్తి బలితీసుకొనక బతిలోకి చేరదు అన్నాడు. బ్రహ్మనాయుడు ఆలోచించి కొంతసేపటి తర్వాత కొడుకును కన్నమను వెళ్ళి అరటి దుంపలతో సహా చెట్లను పీకి తీసుకురమ్మన్నాడు. కన్నమదాసు వేగంగా వెళ్ళి అరటి చెట్లు తెచ్చాడు. బ్రహ్మనాయుడు వాటిని నేలలో చేనులాగా పాతిపెట్టించాడు. మధ్యలో ఒక అరటి చెట్టును పాతి దానిపై తన పేరు రాసి అలరాజుతో అల్లుడా! అదిగో బలి తీసుకో అన్నాడు. పెద్దవారు మీరుండగా ముందుగా నేను వేయనని పట్టుదలతో కూడా గౌరవం చూపాడు అలరాజు. బ్రహ్మనాయుడు బాదన్నను ముందుగా వేయమనగా బాదన్న పదునైన కత్తితో అరటి చెట్లనన్నిటిని నరికాడు. బ్రహ్మనాయడి పేరున్న చెట్టుకాక మరి ఒక చెట్టు మాత్రమే మిగిలిపోయింది. అది చూచి సహించలేక అలరాజు ఇంకో చెట్టును వేయి చీలికలయ్యేటట్లు తన కత్తిని విసిరాడు. అలరాజు కత్తి భూమిలో నుండి తీసి ఇవ్వమని బ్రహ్మనాయడని అడుగగా అతడు రాజు కత్తులు తనకు అలివికావన్నాడు కత్తిని వేగంగా లాగగా ఎగిరిన మట్టి బ్రహ్మనాయడి నుదుటిని తాకింది. ఎవరి దారిని వారు వెళ్ళిపోయారు. ఆ చంద్రభాగానది పై భాగాన ఒక నల్లని మేఘం నల్లటి ఆడపామువలె పైకి లేచి, పోయి అలరాజు ప్రాణాలను అనుసరించింది. పల్నాటి పౌరుష వీరులైన వీరు పల్నాటి యుద్ధానికి నాంది పలికారు.

### 1.3.12. యమదంష్ట్రిక:

ఆళీయ రామరాయలు రాజనీతి కోవిదుడు. కళ్యాణి దుర్గం ఒకసారి ఆయన ముట్టడించినపుడు జరిగిన సంగతులు ఈ కావ్యంలో రాయబడ్డాయి. సదాశివ నాయకుడిది కేళాదిపురం. ఆ వంశంవారు విజయనగర సామ్రాజ్యానికి కుడి భుజం వంటి వారు. ఇందులో రామరాయల ఉత్సాహ శక్తి ప్రభువు మంత్ర శక్తుల కెలా మీరిపోయిందో తెలియగలదు. అన్నిటికంటే చిత్రమిట్టి మహావీరుడి కాలంలో తల్లి కోటలో తెలుగు లోడిపోవటం. యమదంష్ట్రిక అనగా యముడి కోరపల్లు. ఆళియ రామరాయలు కళ్యాణి దుర్గాన్ని ముట్టడించినపుడు రాయల చేతిలోని ఖడ్గం యమదంష్ట్రికై శత్రు కోటలో ప్రవేశించి విజయఖడ్గమై తిరిగివచ్చి రాజును చేరింది. ఇదే ఈ కావ్యసారాంశం.

విజయనగర రాజు అళియ రామరాయలు కల్యాణికోటను ముట్టడించి నెలరోజులైనా ఇంకా ఆ కోట స్వాధీనం కాని కారణంగా అతడి మనసు సిగ్గుతో సంకోచంగా ఉంది. రాయలు మంత్రి, సేనానాయకులతో సభ తీర్చాడు. అందరూ ఎలాంటి కదలికలు లేకుండా ఆలోచనామగ్నులై ఉన్నారు., వెన్నెలరాయుడైన చంద్రుడిని చూసి చల్లబడిన రాజు లేచి నడవటం మొదలుపెట్టగా తమ అధికారాలననుసరించి ప్రక్క ప్రక్కనే ఆయనను అనుసరించారు.

అర్ధరాత్రి అయినా తెలుగు సైనికులు ముట్టడి ఆపలేదు. మూకుమ్మడిగా ఏ బురుజుల మూలకో నిచ్చెనలు ఎత్తి ఎక్కుచుండగా, లోనివారు రాళ్ళతో కొడుతుండగా అక్కడికి వచ్చిన మహారాజు దుర్గం యొక్క సర్వదిక్కులను పరిశీలించి

చూశాడు. మృత్యుదేవత చాచిన నాలుకలాంటి శత్రుకోట తలుపులను, తనకు శత్రువుకి మధ్య నిల్చిన శత్రురక్షణ కవచం వంటి కోట గోడను, తెలుగుసేనల ప్రాణాల కొరకు ఎత్తిన పడగల వరుసలలాగా ఉన్న కోటకొమ్ములను చూశాడు. దేవుడే దీనిని భేదించటానికి వీలులేని నిర్మాణ వ్యూహాన్ని చేశాడేమో అన్నట్లున్న కోటను పరీక్షించి చూచి ఏ ఆలోచన తోచక, పరమసాహసియు, రాజశ్రేష్ఠుడు అయిన అళియ రామరాయలు పార్శ్వాన వ్రేలాడుతున్న కత్తిని ఒరనుండి పైకిలాగి కోట లోపలికి విసిరి పారవేశాడు. కోటలోపలనున్న శత్రుసైన్యాలు మెరుపులాగా త్రాచుపాము లాంటిది వచ్చి కోటలో పడటం, తెలుగు సైనికులు ముట్టడి నాపి నిలిచి వుండటం తెలిసినవారై దానికి కారణం తెలియక వారిలో వారు కలత చెందారు. కోట లోపల నున్న రాజఖడ్గం శత్రువులకి ధూమకేతువే అయ్యింది.

వివిధ తెలుగు సైన్యాలు నివ్వెరపోగా దండనాథులు బొమ్మలలాగా నిలబడగా సేనాధిపతులు రాజు పదునైన చూపులను చూస్తూ నిలబడ్డారు. అరనిమిషం తర్వాత రామరాయలు వారితో "అదే యమ దంష్ట్రిక (యముని కోరపల్లు), శత్రురాజు కోటలో పడివుంది. ఆ రాజఖడ్గం శత్రురాజుల కోటలో పడి వున్నప్పుడు ఆ రాజు రాజ్యమేమి రాజ్యం? అతడి సైన్యమేమి సైన్యం ? మీలో ఉన్న సాహసులు ఎవరో కదలండి. మీ సాహసాగ్నిని ధరించి శత్రువుల శుభాలను మీమీ ఖడ్గాలతో నరికివేయండి, వెళ్ళండి. తెలుగుముని విద్యారణ్య మహాస్వామి ప్రసాదించిన బుక్కరాయల రాజు ఖడ్గమది. వెళ్ళి దానిని తీసుకురండి" అని అనగానే విన్న శూరులు, ధైర్యవంతులు అయిన దళాధిపతులు కూడా ఆశ్చర్యపోయారు. ఉత్సాహపూరితుడు, త్యాగశీలి అయిన ఒక నాయకుడు ఆసక్తితో ముందుకు వచ్చి మహారాజుకు వంగి నమస్కరించి "మహా రాజేంద్రా! మీ ఆజ్ఞ అయితే ఈ కల్యాణీ కోట ఎంత ? మూడు లోకాలను గెలిచి మీ పాదాభరణాలకున్న మణుల వరసలలో గ్రుచ్చుతాను" అని సవినయంగా చెప్పాడు. మహారాజు ఆ వీరుని మెచ్చుకుంటూ "సదాశివ నాయకులుగారు, ఈ విద్యానగరం సాక్షిగా మా అనుజ్ఞ ఇచ్చాము. మీ భుజ బల పరాక్రమాలతో ఈ రాజ్యపుటెల్లలు విశాలం చేయండి" అనగానే సదాశివరాయలు, అతడిని అనుసరిస్తూ సైన్యాధికారులు మెల్లమెల్లగా రాజ సన్నిధి నుండి దూరంగా వెళ్ళారు.

ఆ సమయంలో చీకటిలో కలిసిపోయిన ఏనుగుల గుంపు ఒకదాని తర్వాత ఒకటి వ్యవధి లేకుండా కోట తలుపులను ఢీకొట్టాయి. ఫెళఫెళ అని కోట తలుపులు చీలి పటపటమని పగిలిపోయాయి. సదాశివ నాయకుల వారి తెలుగుసేన కోటను స్వాధీనం చేసుకొంది. మహారాజు అళియ రామరాయలు సంతోషంతో సభ తీర్చి ఉండగా సదాశివ నాయకుడు 'యమదంష్ట్రిక' ను చేతపట్టుకొని వచ్చి సగౌరవంగా మహారాజుకి ఇచ్చాడు. మహారాజుకు సశరీరంగా స్వర్గలోకానికి వెళ్ళి వచ్చినట్లుగా ఉంది. సంతోషంతో సదాశివనాయకుని కౌగిలించుకొని "కోట కోలాహల రాయల నాయక బలా" అని కొత్త బిరుదులిచ్చి మేలైన గుర్రాలను, ఏనుగులను, కొన్ని పురాలను ఇచ్చి సత్కరించాడు. ఆరోజు సదాశివనాయకుని గురించిన జయజయ ధ్వానాలు మారుమ్రోగాయి.

**– ఆచార్య ఇరపని మాధవి.**

## పాఠం - 2

# ఆంధ్ర ప్రశస్తి

**- విశ్వనాథ సత్యనారాయణ**

**విషయసూచిక:**

2.1. కఠిన పదాలకు అర్థాలు

2.2. సందర్భ సహిత వ్యాఖ్యాలు

## 2.1. కఠిన పదాలకు అర్థాలు:

**1. ఆంధ్ర మహావిష్ణువు:**

| | |
|---|---|
| లబ్దదోః + బలుదు | = భుజబలం పొందినవాడు |
| బుభుక్ష | = ఆకలి |
| కక్కా | = తండ్రి |
| దుశ్చేష్టలు | = దుర్మార్గపు పనులు |
| మృగీమదము | = కస్తూరి |
| కప్రపు పొడి | = కర్పూరపు చూర్ణం |
| మేలు + సరదార్లు | = అధికారులలో మేటివారు |
| సన్న + వల్వలు | = పలుచని వస్త్రాలు |
| క్లప్తము | = నిర్మితము |
| ఖండేందు చూడామణి | = శివుడు |
| ఛవి | = కాంతి, కిరణం |
| సాంద్రమై | = దట్టమై |
| ప్రతిధ్వనితము | = మారు మ్రోగినది |
| మేఖలా | = వడ్డాణము |
| రోచన | = ప్రకాశం |
| చలిత | = కదల్చబడిన |
| అంశుక | = సన్నని వస్త్రం |
| అంతలు | = అంచులు |
| త్రైపురసతీ సౌభాగ్య నిర్ణేత | = త్రిపురాసురుల భార్యల ముత్తైదుతనాన్ని నిర్ణయించువాడు (శివుడు) |

| | |
|---|---|
| సవిధ | = సమీపంలోని |
| కాంతారము | = అడవి |
| గహ్వరము | = గుహ |
| రవము | = ధ్వని |
| హిమక్షితిధర కన్యక | = పార్వతీదేవి |
| బధిరితము | = చెవుడు పొందిన |
| అరి | = శత్రువు |
| అఖిల | = సమస్తమైన |
| అద్రి | = కొండ |
| గజ యూధము | = ఏనుగుల సమూహం |
| పేరెములు వారుట | = పరుగెత్తుట |
| దష్ట + అధరము | = కొరకబడిన పెదవి |
| పజ్జి | = ప్రక్కన |
| తామ్రాక్షుడు | = ఎర్రని కన్నులు కలవాడు |
| శిరోధి | = మెడ |
| న్యస్తము | = ఉంచబడినది |
| గాడ | = చొలిచికొనిపోవు |
| మహా + అశని | = పెద్ద పిడుగు |
| కల్పము | = ప్రళయ సమానము |
| మార్తాండుడు | = సూర్యుడు |
| నీల + ఉత్పలము | = నల్లని పద్మం |
| లోచనములు | = కన్నులు |
| వహనము | = మోయుట |
| అంతః స్థితము | = లోపల ఉన్న |
| వైరాగ్యము | = విరక్తి |
| విస్ఫూర్తి | = ప్రకాశం |
| పృషత్కము | = బాణం |
| అంచించంగల | = ఫల పరిమితినూహించగల |
| అగ్రము | = కొస |

| | |
|---|---|
| సంధించే | = ప్రయోగించె |
| ఉద్గత | = పైకి వచ్చు |
| ప్రాంచత్ | = ప్రకాశించు |
| పావక కీల | = అగ్నిజ్వాల |
| పంచారించిన | = విశాలమైన |
| త్రాసిత | = భయపెట్టబడిన |
| సమ్ + ఉదీర్ణ | = బాగుగా పెద్దదైన |
| గళిత | = జారిన |
| ఉర్వుగా | = విరివిగా |
| కుహరము | = గుహ |
| స్రుత | = జాలువారిన |
| నిర్ఘరము | = ప్రవాహం |
| ఆననము | = ముఖము |
| పృషత్ | = బిందువులతో కూడిన |
| అంకురములు | = చివుళ్ళు |
| నిగారము | = శ్రేష్ఠత |
| ప్రాపిత | = పొందిన |
| గరిష్ఠ + పాథస్సు | = ఉత్తుంగములై క్రిందికి పడే జలం |
| అళి | = వరుస |
| శాణ + ఉపలము | = సానఱాయి |

**2. శాతవాహనుడు:**

| | |
|---|---|
| రమ్యవల్కలము | = అందమైన వస్త్రం |
| హుత + అశనుడు | = అగ్నిహోత్రుడు |
| సంపిహితము | = బాగా కప్పబడింది |
| రోచిః | = ప్రకాశం |
| కుపితము | = కోపము |
| చరత్ + సిత | = కదలుచున్న తెల్లని |
| పులిన సీమ | = ఇసుక ప్రదేశం |
| విధ్వస్తము | = నాశనం |

| | |
|---|---|
| అహితుడు | = శత్రువు |
| గ్రీవము | = కంఠం |
| అంసము | = భుజం |
| ప్రసరము | = వ్యాపనం |
| రాగిల్లిన | = ప్రకాశించిన |
| రుద్ధము | = అడ్డగించుట |
| లసత్ + మంద | = ప్రకాశిస్తున్న |
| వినాకృత | = లేని |
| విషము | = విషాదం |
| స్ఫీతము | = అధికం |
| స్తోమము | = సమూహం |
| జ్యోత్స్న | = వెన్నెల |
| మహాంబుధి | = మహాసముద్రం |
| నిర్గతము | = వెడలబడింది |
| ఆశుగము | = బాణం |
| పృషత్తు | = నీటిబొట్టు |
| కేదారము | = వరిమడి |
| కేశబంధము | = ముడిచిన వెంట్రుకలు |
| వంగసము | = వంశం |
| వాఃకణములు | = నీటి బిందువులు |
| వ్యాధూత | = ఎగురగొట్టబడిన |
| పాథోలవము | = పాద ధూళి |
| ప్లవ | = గంధ తృణం |
| వాసనాలహరి | = పరిమళ తెమ్మెరలు |
| పికమ్ములు | = కోయిలలు |

**3. గోతమిపుత్ర శాతకర్ణి:**

| | |
|---|---|
| నిస్సహణము | = నిస్సహణం అనే చర్మవాద్యం |
| భేరికా | = దుందుభి |
| ఉష్ట్ర సమితి | = ఒంటెల సమూహం |

| | |
|---|---|
| జవ + అశ్వములు | = వేగంగా వెళ్ళే గుర్రాలు |
| ఖదను | = యుద్ధ భూమి |
| ధానుష్కులు | = విలుకాండ్రు |
| అద్రువ | = అదిరిపోవ |
| తురగము | = గుర్రం |
| సమద గజములు | = మదించిన ఏనుగులు |
| యూధికా | = గుంపులు |
| ద్విపేంద్రము | = ఏనుగు |
| దోః కలిత | = భుజాలతో కూడిన |
| దుర్భేద్యుడు | = భేదించటానికి వేలులేని వాడు |
| ముక్తాఫలము | = ముత్యం |
| ధిక్కృత రిపు | = శత్రువు నెదిరించువాడు |
| ప్రసూనము | = పూవు |
| క్రొంజీర | = క్రొత్త చీర |
| చెలువొప్పు | = అందంగా ప్రకాశించు |
| మంజీరము | = కాలి అందె |
| పుంజీభవము | = మూర్తీభవించిన |
| అసృక్కు | = రక్తం |
| డిగ్గి | = దిగి |
| ప్రసవములు | = పూవులు |
| ఆరవము | = నినాదం |
| కాటియ | = కష్టం |
| రథ్య | = రాజమార్గం |
| క్రోలుట | = త్రాగుట |
| రభసము | = వేగము |
| వేల | = చెలియలికట్ట |
| జంఘాలత | = కాలి పరుగు |
| పథము | = మార్గం |
| లంబినియై | = వ్రేలాడుచున్నదై |

| | |
|---|---|
| దొరగె | = అంటుకొనెను |
| కుద్దాలించు | = త్రవ్వ |
| యూధము | = సమూహం |
| అనలము | = అగ్ని |
| అంచత్ | = ప్రకాశించుచున్న |
| స్ఫారో దంచిత లోహితచ్ఛటల | = అమిత సుందరతరమైన ఎర్రని కాంతులచే |
| వీచికా | = గాలితరగలు |

**4. మాధవవర్మ:**

| | |
|---|---|
| వాహ్యాళి | = స్వారి |
| శుంభము | = త్రాడు |
| ఫేనములు | = నురుగులు |
| ఖుర ఘట్టితములు | = కాలిగిట్టల తాడనాలు |
| ఉర్వీతలము | = భూతలం |
| ఘూర్ణితము | = తిరుగుడుపడింది |
| నిర్ఘరిణి | = ఏరు |
| హేషాస్వనములు | = సకిలింపుల శబ్దాలు |
| కుద్దాలము | = త్రవ్వ సాధనం |
| ఖుర విఘట్టితము | = గిట్టలచే త్రవ్వబడుట |
| సం + రావము | = బుస వంటి శబ్దం |
| కశ + అగ్రము | = కొరడా చివర |
| నిస్వానములు | = శబ్దాలు |
| స్యందనము | = రథం |
| ఒడికలు | = సెలయేర్లు |
| ధూసరితము | = కప్పబడి |
| అహి | = పాము |
| కకుప్పులు | = దిక్కులు |
| దీధితులు | = కాంతులు |
| మోసులు | = చివుళ్ళు |
| రుక్ + వదనము | = చంద్రుడి వంటి ముఖం |

| | |
|---|---|
| పతితము | = వాలిపోయిన |
| ఊర్ధ్వ పక్ష్మలము | = పై కనురెప్ప |
| భగ్నము | = వంగిన |
| తేప | = తెప్ప |
| ఘటనము | = చేష్ట |
| పుత్రాయల్లకము | = పుత్రవిరహం |
| భాసురము | = ప్రకాశించు |
| వక్త్రులు | = ముఖాలు |
| ప్రాడ్వివాకులు | = న్యాయాధికారులు |
| వాకృతి నిభుడు | = బృహస్పతితో సమానమైన వాడు |
| బ్రధ్నాంశువులు | = సూర్య కిరణాలు |
| తప్త | = క్రాగిన |
| వాః పధి | = నీరు కలిగిన |
| మొరసెను | = ధ్వనించెను |
| మొగసాల | = కోయబడినది |
| అసృక్ + ఉదిత | = రక్తం నుండి పుట్టింది |
| స్ఫుటనము | = భేదించుట |

**5. వేఁగిక్షేత్రము:**

| | |
|---|---|
| గర్భితము | = దాగియున్నది |
| స్ఫుటము | = స్పష్టం |
| అతులము | = సాటిలేనిది |
| ఆయతము | = దీర్ఘం |
| గోపాయిత | = రక్షకుడు |
| వ్యాఘ్రము | = పెద్దపులి |
| క్షోణి | = భూమి |
| భృశము | = అధికం |
| చంక్రమణము | = దాటుట |
| స్నిగ్ధ + ఆర్ద్రము | = మెత్తనిది, తడిసినది |
| శాద్వలము | = పచ్చికపట్టు |

వీచికలు = తరగలు

పొనర్చు = ప్రకాశించు

చిత్రరథ స్వామి = సూర్యుడు

పదానత నఖాగ్రహిత

నిర్యన్నిధానము = కాలిగోటితో మీటినంతనే బయటపడు నిధి

అనుపభోగ్యము = ఎవరు ఉపయోగించుటకు వీలులేనిది

ఉన్మత్త = మదించిన

తమ్మితూడులు = తామరకాడలు

అగ్రియత = గొప్పతనం

**6. ముఖలింగము:**

దేవమాతృకము = వాన నీటి చేత పండే పైరు

వర్షితము = పెంచబడింది

కేదారము = వరి మడి

బిట్టు = శీఘ్రం

పటలము = సమూహం

నైల్యము = నల్లదనం

ముఖరము = మ్రోగేది

వియత్పథము = ఆకాశమార్గం

పయః = నీరు

శైతల్యము = చల్లదనం

ఖర + అంశులు = తీవ్ర కిరణాలు

ప్లుతము = చివరి వరకు ఒకే వేగంతో పోవుట

సంవర్తము = ప్రళయము

చ్యుతి = జారినది

సుపాథస్సులు = నీరు

కెరలి పడి = చెలరేగి

నియతము = నియమం కలది

**7. నన్నయభట్టు :**

శైవలిని = తటిని

| | |
|---|---|
| గీః + సమ్రాట్టు | = సంగీత చక్రవర్తి |
| భృంగము | = తుమ్మెద |
| వివస్వంతుడు | = సూర్యుడు |
| త్ర్యంబకుడు | = శివుడు |
| ఓలి | = వరుస |
| రథ్యలు | = రాజ మార్గాలు |
| నిష్ఠితము | = చక్కగా ఉంచబడింది |
| జానువు | = మోకాలు |
| నాళము | = తూడు |
| భసితము | = పూయబడి |
| ఆస్యము | = నోరు |
| విభ్రాజము | = ప్రకాశం |
| కంచుకి | = అంతఃపుర కావలివాడు |
| ఆస్తరణము | = వాహనము |
| డిగ్గు | = దిగు |
| దంతావళము | = ఏనుగు |
| నిగుంఫనము | = మాటలకూర్పు |
| హజారము | = ఆస్థాన మంటపం |
| ఘోణి | = పంది |
| ఆరు శాస్త్రములు | = తర్కం, వ్యాకరణం, ధర్మం, మీమాంస, వైద్యం, జ్యోతిషం |
| పొన్ను | = బంగారం |
| గీష్పతి | = బృహస్పతి |
| ప్రణుత | = ప్రశంసింపబడి |
| వైదగ్ధ్యము | = నేర్పు |

**8. ప్రోలరాజు:**

| | |
|---|---|
| ఉత్తంసము | = సిగబంతి |
| కుంచితము | = ముడుత |
| పాడి | = న్యాయం |

| | |
|---|---|
| హుణులకు | = అదేశస్థులు |
| కయికోలు | = నమస్కారం |
| రాహుత్తు | = రౌతు |
| ఒసవరి | = ఉత్కృష్టం |
| హవిస్సు | = హోమ ద్రవ్యం |
| శ్రీ కీత | = వైభవము |
| కకుదంబు | = చిహ్నం |

**9. ప్రోలరాజు వధ:**

| | |
|---|---|
| బేలువోక | = మోసపోవుట |
| వృష్టి | = సమృద్ధి |
| ఋతమార్గము | = సత్యమైన దారి |
| చక్షుః శ్రవో భూషణ | = కన్నులతో వినే స్వభావం కల పామును అలంకారంగా కలవాడా (శివా!) |
| క్షోణీలీలారథ | = భూమినే రథంగా కలవాడా |
| కంతేకాల | = నల్లని గొంతుక కలవాడా |
| అర్కతేజము | = సూర్యకాంతి |
| లుంటాకము | = లోపింపచేయునది |
| స్రస్త | = జారిపడినది |
| మంజీరము | = కాలియందియ |
| పశ్యత్ + ఫాలుడు | = శివుడు |
| అభి +ఉత్థిత | = పైకి లేచిన |
| సంరూఢ | = ప్రసిద్ధము |
| కరాసి | = చేతనున్న కత్తి |
| త్రప | = సిగ్గు |
| స్మిత + అంకూరములు | = చిరునవ్వులు |

**10. కొండవీటి పొగమబ్బులు:**

| | |
|---|---|
| విభూతము | = విడువబడింది |
| కెలన | = దిక్కున |
| ద్రాక్ + దావత్ | = కరగి ప్రవహించు |

| | |
|---|---|
| కదంబములు | = మందలు |
| వలిపము | = సన్నని వస్త్రం |
| ఉపత్యక | = పర్వత ప్రాంత భూమి |
| విశీర్ణము | = నశించింది |
| బిందు + ఉత్కరము | = నీటి సమూహం |
| కసవాపాత్రుడు | = గజపతుల ప్రతినిధి |
| ద్వాః స్థానము | = వాకిలి |
| లేలిహానములు | = పాము |
| కేళ్ళకుళి | = జలయంత్రం |
| ధావళ్యము | = తెల్లదనం |
| గుములు కట్టి | = గుబరుగా సమకూడి |
| మగిడి వచ్చి | = తిరిగివచ్చి |
| సొరిది | = వరుసగా |
| వెలార్చు | = బహిర్గతం చేయు |

**11. చంద్రవంక యుద్ధము:**

| | |
|---|---|
| పరికల్పిత + ఉత్ + దీప్తి | = సృజింపబడిన గొప్ప ప్రకాశం |
| చట్టలు | = తొడ వెలుపలి భాగం |
| మై | = శరీరం |
| కసటు + ఏల | = కసి ఎందుకు |
| రికాబులు | = జీనునకు రెండువైపుల పాదాల నుంచే చట్రాలు |
| చబుకులు | = కొరడాలు |
| గాటమౌ | = తీవ్రమైన |
| కొణిగె | = కుప్ప |
| ఔద్ధత్యము | = ఏపు, గర్వం |
| పొలసులు | = రక్తపు చారికలు |
| ద్రుతోక్తి | = వడిగల మాట |
| కాళము | = అరటి కాడ |
| క్షోణి | = భూమి |

**12. యమ దంష్ట్రిక:**

| | |
|---|---|
| కృత్స్నము | = అంతయు |
| అనిర్భేద్యమౌ | = ఛేదించుటకు వీలులేని |
| ధూమకేతువు | = ఉత్పాతం |
| ప్రదరంబు | = బాణం |
| పెలుచన | = అతిశయం |
| ధరిత్రీభృత్ | = రాజు |
| కుంభము | = మూపురం |
| గంధ సింధురము | = మదించిన ఏనుగు |
| కవోష్ణము | = నులివెచ్చని |
| యమ దంష్ట్రిక | = యముని కోరపల్లు వంటి ఖడ్గం |
| దళనము | = కత్తిరించుట |
| నాకము | = స్వర్గ లోకం |
| రాజ్య సప్తాంగములు | = స్వామి, అమాత్యుడు, సుహృతుడు, కోశం, రాష్ట్రం, దుర్గం అనే ఏడు. |

## 2.2. సందర్భ సహిత వ్యాఖ్యలు:

**1. విరిగిపడియె నిశుంభుపైఁ బిట్ట పిడుగు**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన “ఆంధ్ర ప్రశస్తి” కావ్యం లోని ‘ఆంధ్ర మహావిష్ణువు’ ఖండ కావ్యం నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** నిశుంభుడిపై ఆంధ్ర మహావిష్ణువు సైన్యం దండయాత్ర చేసిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ఆంధ్ర విష్ణువు నౌకాదళాన్ని కృష్ణవేణి ప్రవాహానికి ఎదురునడిపి, చతురంగ బలాలు శ్రీశైల సమీప భూములను ఛేదించి, తర్వాత అడవులను దాటి గొప్ప ధ్వని చేస్తూ నిశుంభుడి గుహద్వారాన్ని చేరారు. అనుకోని ఆ ధ్వనులకు నిశుంభుడి సైనికుల చెవులు పగిలినట్లయ్యాయి. ఆంధ్ర సైన్యం ఆ సమయంలో నిశంభుడి సైన్యంపై పెద్ద పిడుగులాగా పడింది.

**2. శనికల్పంబగు బాణ మాంధ్రపతి పెల్చన్ మందహాసంబునన్**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన “ఆంధ్ర ప్రశస్తి” కావ్యం లోని ‘ఆంధ్ర మహావిష్ణువు’ ఖండ కావ్యం నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** ఆంధ్ర మహావిష్ణువు రాక్షసుడిని సంహరించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** తీవ్రమైన కోపంతో నిశుంభుడు శూలంతో ఆంధ్ర విష్ణువు కంఠాన్ని గురిచూసి కొట్టబోగా అతడికంటే ముందుగా

ఆంధ్ర విష్ణువే చిరునవ్వులతో గొప్ప పిడుగువంటి బాణాలతో చాలా తేలికగా రాక్షసుడి గుండెలు చీల్చివేశాడు.

**3. వేదకాలము నాటి ముత్తైదువట్లు**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన "ఆంధ్ర ప్రశస్తి" కావ్యం లోని 'ఆంధ్ర మహావిష్ణువు' ఖండ కావ్యం నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** ఆనాటి శ్రీకాకుళ నగర వైభవాన్ని వర్ణించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** అప్పటి శ్రీకాకుళ నగరం శ్రీకృష్ణవేణి తరంగాల దెబ్బలు తగిలే ప్రాకారాలు కలిగి, రాక్షసుల రక్తం తాగే నాలుకల వంటి బురుజులపై ఉన్న పతాకాలతో, ఆంధ్ర వీరభటుల ఆత్మ శక్తికి సానరాయి వంటిదై, ఘంటసాలలోని పూర్వ శిల్పాచార్యులకు తల్లి వంటిదై, పాపాలకు పిడుగువంటిదై శ్రీ ఆంధ్ర మహా విష్ణువుకు రాజధానియై వేదకాలం నాటి పెద్ద ముత్తైదువు కళ్ళకు కట్టినట్లు ఎదురుగా నిండుగా ఉండేది.

**4. పో మృగరాజ రూపమును బొందు మటంచును శాపమిచ్చినన్**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన "ఆంధ్ర ప్రశస్తి" కావ్యం లోని 'శాతవాహనుడు' ఖండ కావ్యం నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** దీపకర్ణి మహారాజుకు గంధర్వుడు తన కథ చెప్పిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** కృష్ణానదీ తీరంలో అందమైన ఋషికన్యను కలిశాను. మా చూపుల మధురమైన కలయికలో ఈ కుమారుడు కలిగాడు. కొడుకు పుట్టిన వెంటనే నా భార్య మరణించగా ఋషులు నాకు సింహమవ్వమని శాపమిచ్చారు.

**5. నవజ్యోత్స్నలు చూడ శక్తిమతి నోచన్ లేదురా పుత్రకా**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన "ఆంధ్ర ప్రశస్తి" కావ్యం లోని 'శాతవాహనుడు' ఖండ కావ్యం నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** దీపకర్ణి మహారాజు కుమారుడిని పొందిన సంతోషంతో పరిపరి విధాల శాతవాహనుడిని దగ్గరకు తీసుకొని తన వంశాన్ని వృద్ధి చేయమని చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ఆంధ్ర మహావిష్ణువు తెలుగు రాజులందరికీ మూలపురుషుడు. ఆయన కూడా నీవు ఇచ్చే తర్పణాలు అందుకోవటానికి మహాలక్ష్మీ దేవి కుంకుమ అంటిన తన చేతులను చాచునురా! రారా! చిన్నవాడా! నీ చిరునవ్వుల వెన్నెలలు చూడడానికి శక్తిమతి నోచుకోలేదురా! ఈ సమస్త ఆంధ్ర రాజ్యలక్ష్మికి రాజువవుతావు.

**6. శ్రీకేదారములై తగున్ విజయలక్ష్మీ కేశబంధంబులై**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన "ఆంధ్ర ప్రశస్తి" కావ్యం లోని 'శాతవాహనుడు' ఖండ కావ్యం నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** దీపకర్ణి మహారాజు కుమారుడు రాజైతే పాలన ఎలా ఉంటుందో తాను భవిష్యత్తు చూస్తూ తనకు లభించిన కుమారుడితో ఎంతో ఆనందంగా చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** నీ బాణాల నుంచి వచ్చిన మహాగ్నులు తీవ్రమై కొండకోనలను దహిస్తాయి తండ్రీ. ఆ దహించబడిన భూములను కృష్ణానది శుభప్రదమైన నీటి జల్లులతో తడిపి సస్యవంతాలుగా చేయి. అవి విజయలక్ష్మి సిగ కొప్పులాగా సంపదను ప్రసాదించ గలిగిన పుణ్యభూములు కాగలవు.

**7. జయమంత సిద్ధమయనన్ దన సైన్యములెల్ల నార్వగన్**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన "ఆంధ్ర ప్రశస్తి" కావ్యం లోని 'గౌతమి పుత్ర శాతకర్ణి' ఖండ కావ్యం నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** గౌతమిపుత్ర శాతకర్ణి నహపాణుడి మీదకు యుద్ధానికి వెళ్ళే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** పెద్ద ముత్తైదువలు గౌతమి పుత్ర శాతకర్ణిని దీవించగా అతడు తన రథం నుండి కిందకు దిగి ఆ పెద్ద ముత్తైదువులకు వంగి నమస్కరించి వారిచ్చే ఆశీర్వాదాలతో కూడిన కుంకుమను, పూలను తీసికొని తిరిగి రథం నెక్కగా జయం సిద్ధించునట్లుగా రాజసైన్యమంతా ముందుకు సాగింది.

**8. పగిలిపోవగ సౌరాష్ట్రపథము నడిచె**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన "ఆంధ్ర ప్రశస్తి" కావ్యం లోని 'గౌతమి పుత్ర శాతకర్ణి' ఖండ కావ్యం నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** గౌతమీ పుత్ర శాతకర్ణి, శ్రీపులోమావిల పరాక్రమం గురించి సైనికులు చెప్పుకుంటూ దండయాత్ర చేసే సందర్భం లోనిదీ వాక్యం.

**వివరణ:** ఆ తండ్రీ కొడుకులను మెచ్చుకొంటూ ఆంధ్ర సైన్యం 'శాతవాహనుడైన ఈ గౌతమీ పుత్ర శాతకర్ణి దావాగ్నిజ్వాల, యువరాజు వాసిష్ఠీపుత శ్రీపులమావి ప్రచండవాయువు క్షాత్రవుడైన నహపాణుడు ఇంక ఏమగునో కదా. ఈ గౌతమీ పుత్రుడితో శత్రుత్వం ఎందుకు సంపాదించుకున్నాడో కాని, సౌరాష్ట్రం ఇక భూస్థాపితమే అవుతుంది' అని అనుకుంటున్న రాజభటుల మాటలు జయజయారావాలతో కలిసిపోయాయి. రెండు సైన్యాలు భూమి పగిలిపోవుతున్నట్లు సౌరాష్ట్ర మార్గంలో నడిచాయి.

**9. నెత్తురోడికలు కట్ట నటఁ బడియుండె నొకఁడు.**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన "ఆంధ్ర ప్రశస్తి" కావ్యం లోని 'మాధవ వర్మ' ఖండ కావ్యం నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** వేగంగా పరుగెడుతున్న యువరాజు రథం క్రింద ఒకడు ప్రాణాలు కోల్పోయిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ఆ రథ చక్ర శీలల నుండి వచ్చే శబ్దాలు వేసవికాలంలో నిరాకృత మేఘ ఘూర్ణితలుగా ఉన్నాయి. ఆ గుర్రాల సకిలింతలు పర్వత శిఖరాల నుండి ప్రవహించే జలపాత ధ్వనులలాగా ఉన్నాయి. వాని పరుగులతో నేలత్రవ్వబడి ధూళి ఆవరింపబడుతుంది. యువరాజు చేతిలోని కొరడా శబ్దాలు మహాసర్పం యొక్క కోసలబుసలవలె ఉన్నాయి. ఉరుములు మెరుపువలె పరుగులు పెడుతున్న రాజకుమారుడిని రథం కనుమూసి తెరిచే కాలంలోనే రాచవీధులను దాటి వెళ్ళిపోయింది. ఒక రాజ వీధిలో ఆ రథ చక్రాల క్రింద పడి ప్రాణాలు పోయిన ఒకడి శరీరం నెత్తుటి ప్రవాహంలో నేలపై పడివుంది.

**10. చంపుట సరే ప్రజ నిట్టుల కారణంబుగన్**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన "ఆంధ్ర ప్రశస్తి" కావ్యం లోని 'మాధవ వర్మ' ఖండ కావ్యం నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** రాజు మాధవవర్మను యువరాజు రథం క్రింద ప్రాణాలు కోల్పోయిన పిల్లవాడి తల్లి ఆవేదనతో ప్రశ్నించే సందర్భం లోనిదీ వాక్యం.

**వివరణ:** ఓ రాజా! ఈ చిన్నవాడొక్కడే నా వంశాన్ని అభివృద్ధి చేసేవాడు. రథంతో ప్రజలను తొక్కిస్తారా, ఎంత ధన సంపదలున్నా తినవచ్చు, పాలించవచ్చు. తప్పులు చేస్తే విచారణ చేసి మందలిస్తారుకాని, ఎంత రాజులైనా అకారణంగా ఇలా ప్రజలను చంపుతారా?

**11. కనుతుదలనైనఁ గదలిక కాంచలేదు.**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన "ఆంధ్ర ప్రశస్తి" కావ్యం లోని 'మాధవ వర్మ' ఖండ కావ్యం నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** న్యాయాధికారులు, అధికారులు తమ నిర్ణయాన్ని చెప్పిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ధర్మనీతికి దయ అన్నది లేదు. ప్రాణానికి ప్రాణమే దోష పరిహారమని న్యాయాధికారులు తమ నిర్ణయ పత్రాన్ని అధికారులకు సమర్పించారు. అధికారులు కూడా న్యాయాధికారుల న్యాయ నిర్ణయం సరైనదేనని నిర్ణయించి రాజుకు తీర్పు వినిపించారు. ఈ తీర్పు వినుచున్నంత సేపు రాజుముఖంలో కంటికొసలలో కాని ఆందోళన పూర్వకమైన ఏ కదలికల కనిపించలేదు.

**12. కనకము విజయవాటి వర్షము కురిసెన్**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన "ఆంధ్ర ప్రశస్తి" కావ్యం లోని 'మాధవవర్మ' కావ్యఖండిక నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** మూర్తీభవించిన ధర్మదేవత అయిన మాధవవర్మ మహారాజును అప్పుడు దేవతలు ఆశీర్వదించిన సందర్భంలోనిది వాక్యం.

**వివరణ:** పల్లవ వంశ శ్రేష్టుడు, విజయవాటికా భూపాలుడు, మూర్తీభవించిన ధర్మదేవతైన మాధవవర్మ మహారాజును అప్పుడు సర్వదేవతలు సర్వవిధాలా అనుగ్రహించి ఆశీర్వదించారు. రెండు ఘడియల కాలం కనకవర్షాన్ని కురిపించారు. పార్వతీదేవి కనకదుర్మమ్మగా విజయవాటికా నగరాన్ని ఇంద్రకీలాద్రిపై వరప్రదాయనిగా వెలసింది.

**13. అశ్రువులు జార్రు జీవచ్ఛవాంధ్రజనులు**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన "ఆంధ్ర ప్రశస్తి" కావ్యం లోని 'వేఁగి క్షేత్రము' కావ్యఖండిక నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** నాటి వేగి క్షేత్ర వైభవాన్ని గుర్తుచేసుకొని కవి బాధపడే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** రాజ ప్రసాదితమైన శౌర్యాన్ని పాయసాన్ని తినే ఆ తెలుగు పిల్లలు సూర్యభగవానుడి రథోత్సవం నాడు కూడా కత్తిసాములనే చేసేవారు. ఆ పిల్లలకు యుక్తవయసు వచ్చేసరికి మధ్యాహ్న కాల సూర్యవేడిలాగా పరాక్రమ తేజులయ్యేవారు. ఆనాటి త్రిలింగరాజులు ఈ జగాన్ని వీరశౌర్య శుభప్రదాతలై ప్రకాశించారు. అలాంటి పూర్వ వేంగిరాజులు పవిత్ర పాద

చిహ్నాలతో వెలుగొందిన ఈ తెలుగుభూమిలో నేటి ఆంధ్రులు కన్నీరు కారుస్తూ జీవచ్ఛవాల వలె ఉన్నారు.

**14. నన్నుఁ గంపింపఁ జేయుచున్నది భృశమ్ము**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన "ఆంధ్ర ప్రశస్తి" కావ్యం లోని 'వేఁగి క్షేత్రము' కావ్యఖండిక నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** నాటి రాజుల శౌర్యాన్ని, నేటి ప్రజల దైన్యాన్ని చూసి కవి కలతపడుతున్నానని చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** నేను నిల్చిన ఈ భూమిపై ఏ రాజు ధర్మాసనాన కూర్చుండి ధర్మశాస్త్రాన్ని అనుసరించి పాలించారో కదా. నేను చూస్తున్న ఈ భూమిపై ఏ పరాక్రమ శాలురు యుద్ధ విద్యలను నేర్చుకున్నారో కదా. ఈ శరీరాన్నంతటినీ ఆదరించిన ఈ చల్లటి గాలి ఎంత పురాతనమైన వేద సంప్రదాయాన్ని పోగుచేసి కొన్నది కదా. నేనున్న ఈ చోట ఆకాశంనిండా ఏ యజ్ఞమంత్ర ధ్వనులు మారు మ్రోగినవో కదా. వివరించలేని అంతటి పురాతనత్వం, దైవత్వం కలిగిన ఈ పవిత్ర భూభాగాన నిలిచిన ఆ ఆంధ్ర శక్తి నేడు స్వతంత్రం లేక ప్రవర్తిస్తుంది. నేటి తెలుగు వారి బానిసత్వం నాకు ఎక్కువ కలవరం కలిగిస్తుంది.

**15. ఈ అతీంద్రియ శక్తి నాకెట్టులబ్బె?**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన "ఆంధ్ర ప్రశస్తి" కావ్యం లోని 'వేఁగి క్షేత్రము' కావ్యఖండిక నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** పల్లవరాజుల చరిత్రలను, కవి తల్చుకునే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** వేంగిరాజ్యంలోని ఈ పచ్చిక బయళ్ళ చివుర్ల గొప్పదనాన్ని ఏ దేవతలు రాశారో, ఈ గాలి తరంగాలలో సంగీతపు గీతాలను ఏ అప్సరసలు నింపారో, ఈ దివ్యశిల్పాలను ఏ దేవశిల్పులు చెక్కారో, ఈ దారులలో ఎల్లప్పుడు ఏ మునీంద్రుల పొగడ్తలను ఎందరు పొందారో. ఎటు చూసినా పల్లవ రాజుల చరిత్రలు రాయబడి, పాడబడి, గేయబడి, చెప్పబడినవన్నీ వినటానికి ఇంపుగా ఉన్నాయి. ఇవి అన్నీ గ్రహించగలిగిన ఈ అతీంద్రియ శక్తి నాకెలా కల్గిందో కదా!

**16. లీల మించిన యీ ముఖలింగ ప్రతిభ**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన "ఆంధ్ర ప్రశస్తి" కావ్యం లోని 'ముఖలింగము' కావ్యఖండిక నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** నాటి ముఖలింగ క్షేత్ర వైభవాన్ని తల్చుకునే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** కళింగులు తొలిరోజుల్లో తూర్పుకొంత నుదుటిన ఎర్రని కుంకమ తిలకాన్ని దిద్దింది ఈ ముఖలింగ ప్రదేశంలోనే. ఈ ముఖలింగ పవిత్ర భూమిని త్రిలింగ రాజ్యలక్ష్మి తన నివాసం చేసుకొని అమృత వర్షాలు కురిపించెనేమో. ఇక్కడి మట్టి గడ్డలు కూడా కొత్తకొత్త కస్తూరి సువాసనలను వెదజల్లుతున్నాయి. ఆ రోజులలో కళింగరాజులు వేంగి రాజులతో, చాళుక్య రాజులతో సోదర భావంతో మెలిగేవారు. తోటి రాజులతో పరస్పర ప్రేమానురాగాలలో ఉండేవారు. ముందు ఇదే తెలుగు రాణించిన చోటు కావటం వలన ముఖలింగ ప్రతిభ మించిపోయింది.

**17. యీ పయనమ్ము నన్నుఁ జననీయక నిల్పుకొనెన్ దనంతటన్**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన "ఆంధ్ర ప్రశస్తి" కావ్యం లోని 'ముఖలింగము' కావ్యఖండిక నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** తనకు ముఖలింగక్షేత్రంపై ప్రేమ ఎందుకో ఆ అనుబంధం ఎప్పటిదో అని కవి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ఏ జన్మలోనో నేనీ గడ్డమీద పుట్టివుంటాను. అందుకేనేమో నాకు ఈ ముఖలింగ క్షేత్రం మీద చెప్పలేనంత ప్రేమ ఉంది. అవును మాది తల్లి బిడ్డల ప్రేమే. అందుకే వంశధారానది వరదలు కట్టుచు అడ్డుపడుతూ నన్ను ఇక్కడి నుండి కదలి వెళ్ళనీయటం లేదు.

**18. యీ బ్రతుకు తెన్గువారు భరించలేరు.**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన “ఆంధ్ర ప్రశస్తి” కావ్యం లోని ‘ముఖలింగము’ కావ్యఖండిక నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** పరతంత్రత తెలుగువారు భరించలేరని కవి ఆవేదన చెందే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ప్రచండమైన వానా కాలంలో ముఖలింగ దేశం లోని నాగావళీ నది తరంగాలు వంశధారా నీటితో కలిసి తరగలెత్తి పోనిమ్ము. కృష్ణా గోదావరీ తరంగాలు నక్షత్ర మార్గాలలో కలిసిపోనిమ్ము. గుండ్లకమ్మ జలాలు గుబురు గుబురుగా లేచి పోనిమ్ము. పెన్నానదీ అలలు పెరిగిపోనిమ్ము, తెలుగు నదులన్నీ పొంగి ప్రళయకాలపు నీటిలా తెలుగు భూమిని ముంచెత్తి పోనిమ్ము. అదే మంచిది. ఈ స్వతంత్రత లేని జీవితాన్ని తెలుగువారు ఇంక భరించలేరు.

**19. మృదు స్వాదు వచో నిగుంభనల నందం బొప్పఁగా మాగధుల్.**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన “ఆంధ్ర ప్రశస్తి” కావ్యం లోని ‘నన్నయ్య భట్టు’ ఖండ కావ్యం నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** రాజరాజనరేంద్రుడు సభాస్థలికి ఏతెంచుచున్న సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ఉత్తమ చాళుక్య రాజైన రాజరాజనరేంద్రుడు వస్తున్నట్లుగా వంది మాగధుల కైవారాలు వినవచ్చే. ఏనుగు వాహనం దిగి రాజరాజనరేంద్రుడు వచ్చాడు.

**20. వర్షించెను సర్వదైవత కరోత్సృష్టంబులై పుష్పముల్.**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన “ఆంధ్ర ప్రశస్తి” కావ్యం లోని ‘నన్నయ్య భట్టు’ ఖండ కావ్యం నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** తమ చంద్ర వంశ రాజుల చరిత్రైన మహాభారతాన్ని రచించమని రాజరాజ నరేంద్రుడు నన్నయను కోరగా నన్నయ్య అంగీకరించిన శుభ సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** తెలుగులో నన్నయ్య శ్రీమహాభారత కావ్యరచన ప్రారంభించగా ఆ వాగ్వైభవం వీణాతంత్రుల వలె మోగింది. ఎగిసిపడుతున్న అలల సుడులతో శ్రీ గోదావరీ నది సంగీతోత్సాహంతో పాడింది. శ్రీ మోక్షలక్ష్మి దేవి తనకు తానై తెలుగు నేలను చొచ్చుకుని ప్రవేశించింది. సర్వదేవతలు తమ చేతిలో నున్న పువ్వులతో ఆశీర్వాద వర్షాన్ని కురిపించారు

**21. కోయతలంపు గుండపతి గుండియఁ గ్రుచ్చక యీటె నిల్చునే**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన “ఆంధ్ర ప్రశస్తి” కావ్యం లోని ‘ప్రోలరాజు’ ఖండ కావ్యం నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** మంత్రకూటాధిపతి అయిన గుండరాజులో యుద్ధానికి ముందు కాకతి ప్రోలరాజు గుండరాజు దుష్ట ఆలోచనల గురించి యోచించే సందర్భంలోనిది వాక్యం.

**వివరణ:** తెలుగుదేశ రక్షణను మరిచి స్వలాభం ఆశించిన గుండపతి గుండెలో నా చేతి ఈటె గుచ్చుకొనక మానదు. గుండరాజు తలమీన నా పాదం పెట్టకపోతే ఈ భూమి మీద పరాక్రమమున్నదని అనగలమా?

**22. యోగంబునఁ చేసి చల్లఁబడి సౌఖ్యం బయ్యె నొక్కింతలోన్**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన "ఆంధ్ర ప్రశస్తి" కావ్యంలోని 'ప్రోలరాజు' ఖండ కావ్యం నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** కాకతీయ నవరాజ్య నిర్మాణాన్ని ప్రారంభించాలనే ఆలోచనలలో నిమగ్నుడైన ప్రోలరాజుని అభివర్ణించే సందర్భం లోనిదీ వాక్యం.

**వివరణ:** తీవ్రమైన ఆలోచనలతో ప్రోలరాజు యొక్క అవయవాలు వేడెక్కాయి. అప్పుడు సంధ్యా సమయం అంతరించి చంద్రోదయమైంది. చంద్రకిరణ కాంతుల చేత రాజు శరీరం చల్లదనపు సుఖాన్ని అనుభవించింది.

**23. జనకుడు ప్రోలరాజు శివసన్నిధికిన్ జనుదెంచె నత్తఱిన్.**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన "ఆంధ్ర ప్రశస్తి" కావ్యంలోని 'ప్రోలరాజు వధ' ఖండ కావ్యం నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** వీరశైవంలో మిక్కిలి తీక్షణంగా ఉన్న ప్రతాపరుద్రుడు శివధ్యానంలో ఉండగా ప్రోలరాజు వచ్చిన సందర్భం లోనిదీ వాక్యం.

**వివరణ:** ప్రతాపరుద్ర మహారాజు మనసులో వీర శైవమనే మంటలు క్రమ్ముకోగా శివసన్నిధిలో కనులు ముసుకొని, చేతులు జోడించి ధ్యానమగ్నుడై నంది వద్ద నిలుచుండగా ప్రతాపరుద్రుడి తండ్రి ప్రోలరాజు ఆ శివ సన్నిధికి యేతెంచాడు.

**24. యమ పట్టణంబునకు నిప్పుడ పంపగ యోగ్యుఁడన్ జుమీ.**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన "ఆంధ్ర ప్రశస్తి" కావ్యంలోని 'ప్రోలరాజు వధ' ఖండ కావ్యం నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** ప్రమాదవశాన తండ్రిని వధించిన ప్రతాపరుద్రుడు తాను చేసిన ఘోరకృత్యానికి ఆవేదన చెందుతున్న సందర్భం లోనిదీ వాక్యం.

**వివరణ:** తండ్రీ, ఆ తల్లి కాకతి రాజ్యలక్ష్మీ నీకు చల్లని నీడ అయింది. నీ అంతటి వాని యెదురు రొమ్ములో నా చేతనున్న కత్తిని దింపిన నీచుడను, హీనుడను, సిగ్గులేని వాడను. తండ్రీయని పిలుస్తున్న నన్ను క్షమిస్తావా, ఈ క్షణంలోనే యమపురికి వెళ్ళటానికి తగినవాడిని సుమా.

**25. నరుగవచ్చు రాకన్నెలున్నట్టి చోట**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన "ఆంధ్ర ప్రశస్తి" కావ్యం లోని 'కొండవీటి పొగమబ్బులు' ఖండ కావ్యం నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** నేటి కొండవీటి ప్రాంతాలనావరించిన పొగమబ్బులతో ఆనాటి కొండవీటి రాజుల వైభవాన్ని పోలుస్తూ కవి తన భావాలను వ్యక్తీకరించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** నిప్పులను కూడా కాల్చగల కళింగరాజులు నేడీ బురుజుల పైనలేరు. బల్లాలతో పొడువగలిగిన, పరాక్రమ సిరి కలిగిన రెడ్డి రాజులు నేడీ కోటలపై లేరు. కత్తులతో గుండెలు చీల్చగలిగిన పిల్ల ఏనుగుల వంటి శ్రీకృష్ణదేవరాయల రాజవంశం వారు నేడిక్కడ లేరు. అడుగడుగునా ప్రాణాలను విసిగించే ద్వారా రక్షకులైనా నేడిక్కడలేరు. అడుగడుగునా ప్రాణాలను విసిగించే ద్వారా రక్షకులైనా నేడిక్కడలేరు. ఓసి పొగమబ్బులారా! రండి రండి. ఇంక మనకు ఏవిధమైన అడ్డు అదుపు లేదు. మీకూ మాకూ ఇష్టమే ఇష్టం. మనం రాజ సభలకు వెళ్ళవచ్చు. రాచకన్నెలున్న అంతఃపురాలకు వెళ్ళవచ్చు.

**26. లలితము మదీయ గీతి నేలా వెలార్చు**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన "ఆంధ్ర ప్రశస్తి" కావ్యం లోని 'కొండవీటి పొగమబ్బులు' ఖండ కావ్యం నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** తనకూ, పొగమబ్బులకు ఉన్న సంబంధం గురించి కవి ఊహించి చెప్పే సందర్భం లోనిదీ వాక్యం.

**వివరణ:** నా ప్రాణాలకి ఈ పొగమబ్బులకి ఏం సంబంధముందే, తూర్పు గాలిలో పుట్టిన ఈ పొగమబ్బుల గురించి మొదటి నుంచి తెలిసిన వాడినే, నేను కూడా ఒక కొత్త పొగమబ్బునై, కొండ మైదానంలో వాలినట్లుగా, బురుజులపై ముక్కలైనట్లు, నేలను రాలిపోయినట్లుగా, కొండకొమ్మలు తిరుగుతున్నట్లు ఉండును. ఈ నా హృదయంలోని ఈ సున్నితమైన భావాలను ఇంకెలా వివరించగలను?

**27. మామ నా కత్తి బలి లేక మరలిపోదు**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన "ఆంధ్ర ప్రశస్తి" కావ్యం లోని 'చంద్రవంక యుద్ధము' ఖండ కావ్యం నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** బాదన్న, అలరాజులు యుద్ధం చేస్తున్నారని తెలిసి బ్రహ్మ నాయుడు వారి దగ్గరకొచ్చి యుద్ధం ఆపమన్న సందర్భం లోనిదీ వాక్యం.

**వివరణ:** వారిని యుద్ధమాపమని బ్రహ్మనాయడు అలరాజుతో అల్లుడా, చాలు ఆగుమయ్యా అనగా మామా, ఒర నుండి వచ్చిన నా కత్తి బలి తీసుకోక మరలదు అని అలరాజు చెప్పాడు.

**28. ఒక్క చిఱుపెళ్ళ తాఁకె నాయనికి నొసఁట**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన "ఆంధ్ర ప్రశస్తి" కావ్యం లోని 'చంద్రవంక యుద్ధము' ఖండ కావ్యం నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** సూర్యబేతాళమనే ఖడ్గం భూమిలో దిగబడిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** రాచల్లు అలరాజు భూమిలో దిగబడిన కత్తి పిడిని, ఎడమ కాలితో వేగంగా పైకి లాగాడు. జర్రుమని వేగంగా కత్తిని పైకి లాగడంతోనే చంద్రవంక పచ్చిక బయళ్ళ పెళ్ళలు అచ్చులుగా ఆ నేలంతా పెగిలి పైకి వచ్చాయి. ఒక చిన్న మట్టిగడ్డ బ్రహ్మనాయడి నుదుటిన తగిలింది.

**29. మెల్లన వచించె నిట్లు గంభీరమూర్తి**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన "ఆంధ్ర ప్రశస్తి" కావ్యం లోని 'యమ దంష్ట్రిక' ఖండ కావ్యం నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** ఆశీయ రామరాయలు కల్యాణి దుర్గాన్ని ముట్టడించిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** తెలుగు సైనికులు నివ్వెరపోయారు. దండనాధులు బొమ్మలలాగా అయ్యారు. సైన్యాధిపతులు రాజు పదునైన చూపులను చూస్తూ నిల్చున్నారు. అరనిముషం తరువాత గంభీరమూర్తి రామరాయల మహారాజు వారితో మెల్లగా ఇలా చెప్పాడు.

**30. ధగధగని ప్రజ్వరిల్లె మార్తాండ రోచి**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన "ఆంధ్ర ప్రశస్తి" కావ్యం లోని 'యమ దంష్ట్రిక' ఖండ కావ్యం నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** కోట తలుపులను ఏనుగులతో చీల్చిన కోటలోపలికి తెలుగు సైన్యం ప్రవేశించు సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** నిద్రనిండిన కన్నులు కల కోటలో పరివారు ఇది తెలుసుకొని ఆయుధాలను వెదకి తీసుకోకముందే సదాశివ నాయకుల వారి తెలుగుసేన కోటతలుపులు త్రోసి అడ్డుగా ఉన్న భటుల తలలు, చేతులు తెగనరికి బురుజుల మీదికి యెగబాకి కోటను స్వాధీనం చేసుకున్నారు. కోటను స్వాధీనం చేసుకున్న కొద్ది సమయానికే జగమంతా ఉదయ సూర్యకిరణాలతో ధగధగమని ప్రకాశించింది.

**31. హరులున్ గజంబులు పురావలి యిచ్చెను రాజు వానికిన్.**

**పరిచయం:** ఈ వాక్యం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన "ఆంధ్ర ప్రశస్తి" కావ్యం లోని 'యమ దంష్ట్రిక' ఖండ కావ్యం నుంచి గ్రహించబడింది.

**సందర్భం:** యమ దంష్ట్రికను ఎంతో వీరోచితంగా తెచ్చి రామరాయలకిచ్చిన సదాశివ నాయకుడిని రాయలు సన్మానించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** మహారాజుకు సశరీరంగా స్వర్గానికి వెళ్ళి వచ్చినట్లనిపించింది. ఉప్పొంగిన సంతోషంతో స్వహస్తాలతో సదాశివనాయకుడిని కౌగిలించుకొని, తన ప్రక్కన కూర్చోబెట్టుకొని "కోటి కోలాహల రాయల నాయక బలా" అని కొత్త బిరుదిచ్చి మేలైన గుర్రాలను, ఏనుగులను, కొన్ని పురాలను ఇచ్చి సత్కరించాడు.

**– ఆచార్య ఇరపని మాధవి.**

## పాఠం - 3

# ఆంధ్ర ప్రశస్తి

## - విశ్వనాథ సత్యనారాయణ

**విషయసూచిక:**

**3.1. ప్రశ్నలు-సమాధానాలు**

### 3.1. ప్రశ్నలు-సమాధానాలు:

### 1) విశ్వనాథ సత్యనారాయణ దర్శించిన నాటి ఆంధ్ర ప్రశస్తిని వివరించండి?

జ) క్రీ.శ. 1914 - క్రీ.శ. 1924 మధ్యకాలంలో విశ్వనాథ సత్యనారాయణ గారు రచించిన రచన ఆంధ్ర ప్రశస్తి. అంటే స్వాతంత్రోద్యమం ముమ్మరంగా సాగుతున్న కాలమది. దేశంలోని యావత్ ప్రజానీకం స్వాతంత్ర్యం కోసం ఉద్యమంలో పాల్గొంటున్న కాలమిది. ఏ ఉద్యమానికైనా ఊపిరులూదేది సాహిత్యమే. కవులు ఏ రచన చేసినా ప్రత్యక్షం గానో, పరోక్షం గానో స్వేచ్ఛాప్రియత్వమే నినదించారు. ఆ ఒరవడిలో తెలుగు సాహిత్యం దేశభక్తి కవిత్వంతో సుసంపన్నమైంది. విశ్వనాథ సత్యనారాయణగారు క్రీ.శ. 1914వ సంవత్సరంలోనే "ఆంధ్ర పౌరుషం" రచించారు. ఆ తరువాత ఆంధ్రులలో నివురుగప్పిన నిప్పులా ఉన్న చైతన్యాన్ని రగుల్కొపటానికి, స్వాతంత్ర్య కాంక్షను పెంచటానికి ఆంధ్రుల గత వైభవాన్ని, నేటి దుస్థితిని తెలిపే విధంగా ఆంధ్ర ప్రశస్తి రచించారు. కవిగా తాను దర్శించిన తెలుగు వైభవాన్ని అక్షరీకరించారు. ఆంధ్ర మహా విష్ణువు మొదలు అళియ రామరాయల వరకు తెలుగు జాతి ఎంత వీరత్వాన్ని ప్రదర్శించింది తెలిపారు.

ఆంధ్ర మహావిష్ణువు సైన్యంతో నిశుంబుడిపై దాడి చేసి అతడిని అంతమొందించి శ్రీశైలం, కాళేశ్వరం, భీమేశ్వరాలను కలుపుతూ ప్రాకారం నిర్మించి తన దేశాన్ని త్రిలింగ దేశంగా ప్రసిద్ధం చేశాడు. ఎంతో వైభవంతో విలసిల్లే అతడి రాజ్యంలో రాజధాని అయిన శ్రీకాకుళ నగరం కృష్ణానది అలలు తాకే విధంగా ప్రాకారాలు కలిగి, రాక్షసుల నెత్తురు తాగే నాలుకల వంటి పతాకాలు బురుజులపై కలిగి ఉండేది. ఆంధ్ర వీర భటుల ఆత్మశక్తికి సానరాయి వలె, ఘంటసాలలోని పూర్వ శిల్పాచార్యులకు తల్లిలాగా, వేదకాలంనాటి పెద్దముత్తెదువు కళ్ళకు కట్టిన విధంగా నిండుగా ఉండేది. సిద్ధులు, ఖేదర యక్షకాంతలు ప్రతిరోజు ప్రశాంత సంధ్యా సమయంలో త్రిలింగాలను పూజించేందుకు వచ్చేటంత పవిత్రమై ఉండేది.

> "తెనుగుల్ రాజుల వంగసంచిఁక భవద్వ్యాంకమై శాతవా
> హన వంశం బని బిల్వఁ గా బడెడుగా కౌ రాఘవుండున్ గడిం
> పనిదీ కీరితి వంశకర్తగుట సామాన్యంబె లేరెంద ఱ
> య్యిన వంశ్యుల్ రఘువంశమైన యదికాదాయా మహారాజుపై"

అని దీపకర్ణి మహారాజు చూసి మురిసిన శ్రీరామచంద్రుడికి లభించని వంశకర్త అనే కీర్తిని పొందిన శాతావాహనుడు ఎంతో వైభవంతో పాలించిన తెలుగు గడ్డ నాడు కృష్ణవేణీ దేవి మందవాయువులతో, పద్మాల పరిమళాలతో కూడిన పిల్ల గాలులతో, వసంత కాలంలో అన్ని దిక్కులలో వినిపించే కోకిల పాటలతో విలసిల్లేది.

శక యవన హూణులు అనే విదేశీయులను ఓడించిన విద్యానిధి, ప్రజ్ఞావంతుడు, ధనుర్విద్యా విశారదుడు అయిన గౌతమీ పుత్ర శాతకర్ణి పరిపాలించిన ఆంధ్రరాజ్యం పదాతి అశ్వ, గజ దళాలతో కూడిన సైన్యం కలిగి ఉండేది. ఎంతో భుజబలం, పరాక్రమం కలిగిన సైనికులుండేవారు. ఉగ్రమైన ఆంధ్ర సైన్యమనే అగ్నిజ్వాలకి శత్రు రాజులు దగ్ధమైపోయారు. మూడు సముద్రాల మధ్యగల సమస్త భూభాగాన్ని ధాన్యకటకం రాజధానిగా పరిపాలించిన గౌతమీపుత్ర శాతకర్ణి వంటి వాడు ఆంధ్రుడని తలచటమే తెలుగు వారికి గర్వకారణం.

వీరత్వానికే కాదు ధర్మనిరతికి ఆంధ్రులు అగ్రస్థానంలో నిలుస్తారనటానికి విజయవాటిని రాజధానిగా చేసుకొని ప్రజారంజకమైన పాలననందించిన పల్లవ వంశ శ్రేష్ఠుడైన మాధవ వర్మ మహారాజు

"సచివులు పుత్రశోక భర సంజ్వరు భూపతిఁ జూచి వారు తీ
రిచినది తీర్పు రాజు సవరించను వచ్చు నటంచు జెప్ప న
య్యుచిత వివేకి పుత్ర విరహోగ్రభాత్ముఁ డఁ గాని న్యాయ కా
ర్య చరణ భార దుఃఖ వివశాత్ముఁ డఁ గానని పల్కె వెండియున్" అనిన మాటలే నిదర్శనం,

న్యాయం కోసం తన ఒక్కగానొక్క కుమారుడిని మృత్యుదేవత కర్పించి ప్రజల రక్షణ కోసమే ప్రాణం నిలుపుకున్న ధర్మాత్ముడు పాలించిన తెలుగునేల. మూర్తీభవించిన ధర్మదేవత అయిన మాధవవర్మను ఆశీర్వదించి కనకదుర్గమ్మగా పార్వతీదేవే స్వయంగా వెలసింది, దేవతలే ఆశీర్వదించి కనకవర్షం కురిపించిన ప్రాశస్త్యం తెలుగునాటికే చెల్లింది.

వీరశౌర్య శుభ ప్రదాతలై ఎంతో పరాక్రమంతో పాలన చేసిన త్రిలింగ రాజులు పాదస్పర్శతో పవిత్రమైన నేల వేంగి. చిన్ననాటి నుండి అప్పటి పిల్లలు వారు ఆడే ఆటల ద్వారానే శత్రువులను కవ్వించి, వారి తలలతో బంతులాడి, వారి ఎత్తుగడలను చిత్తు చేసి, వారి కోట గోడల కెగబ్రాకి దూకడం వంటి వాటిని నేర్చుకునేవారు. బొడ్డు కోయని పసిపిల్లలకే తెలుగు తల్లులు శౌర్య రసం ఉగ్గుపాలతో కలిపి పోసేవారు. ఆనాటి పంటపొలాలు సూర్యకిరణాలతో సారవంతమయ్యాయి. పల్లవరాజ కాంతల పూజలకి మెచ్చి లక్ష్మీదేవి అక్కడే స్థిరంగా నివాసముంది. ఆ నేలలో ఎక్కడ తవ్వినా బంగారమే పండేది. కాలిగోటితో మీటితేనే నిధులు బయట పడేటంత సంపదతో విలసిల్లేది వేంగి రాజ్యం.

వర్షాధారాలైన పంట భూములలో ఆనాడు బంగారు పంటలు పండేవేమో! పూర్వ కళింగ గాంగులకు రాజధాని అయిన ముఖలింగ క్షేత్రం నుంచే శ్రీ గంధ కస్తూరి అగురు సువాసనలకు అన్ని దిక్కులకు వ్యాపించాయేమో అనిపిస్తుంది. పరాక్రమశాలి అయిన గంగైకొండనితో వియ్యమంది ఈ తెలుగు నేల ఇంకా పటిష్టమైందేమో, దక్షవాటి పురంలో వ్యాపించిన ప్రళయాగ్ని పొగలు వేములవాడ భీమకవి అమృతమయమైన వాక్కులతో ఉపశమించెనేమో! ఈ ముఖలింగ పవిత్రభూమిని త్రిలింగ రాజ్యలక్ష్మి తన నివాసం చేసుకొని అమృత వర్షం కురిపించిందేమో నాడు. ఇక్కడ మట్టి గడ్డలు కూడా కస్తూరి సువాసనలను వెదజల్లుచున్నాయి. పగటి వేషాల నుండి మహా శిల్పకళ విద్యవరకు విలసిల్లాయి. తెలుగుదనాన్ని తనదిగా చెప్పుకున్న ప్రదేశమీ ముఖలింగం. ముఖలింగం గొప్పతనాన్ని వర్ణించటానికి అద్భుతమనే పదం కూడా సరిపోదు.

అంత గొప్పదైన ముఖలింగ వైభవాన్ని తలుస్తూ విశ్వనాథ
"ఏ పరజన్మలోఁ గలసి యేమొక తల్లియు బిడ్డయైతిమో
నా పయి నీ ధరాస్థలికి నాటిన ప్రేమ మదెంతయో కదా

తేపకు వంశధార పఱతెంచి దిశాఖిల మార్గరోధియై
యీ పయనమ్ము నన్నుఁ జననీయక నిల్పుకొనెన్ దనంతటన్"

అని తన్మయత్వాన్ని పొందారు.

నాడు నన్నయ "శ్రీ వాణీ గిరిజాశ్చిరాయ" అని మహాభారత రచన ప్రారంభించటంతో వాగ్వైభవం వీణాతంత్రులలా మ్రోగింది. ఎగిసిపడుతున్న అలల సుడులతో గోదావరి నది సంగీతోత్సాహంతో పాడింది. శ్రీ మోక్షలక్ష్మి తానే స్వయంగా తెలుగు నేలను చొచ్చుకొని ప్రవేశించింది. సర్వదేవతలు ఆశీవర్షంతో తెలుగు వారు త్రిమాతల అనుగ్రహపాత్రులయ్యారు. కొండవీడు ప్రాంతం నాడు రెడ్డి రాజుల కీర్తితో నిండిపోయుండేది. నాటి కొండవీటి కొండలు శ్రీనాథుడి కావ్యాలకు శ్రోతలయ్యాయి. ఈ కొండవీడు నాడు గరుడ ధ్వజ రథాన్ని అధిరోహించిన కుండిన నగరాధీశుడితో ప్రకాశించింది. నాటి బురుజులు నక్షత్రాలను తాకేవి. అద్దంకి రెడ్లు కోపం వస్తే శత్రువుల రొమ్ములను సునాయసంగా బంతులాడి ముక్కలుగా చేసేవారు

పల్నాటి వీరుల కాలంలో గుర్రాలు కూడా చాలా పౌరుషంతో ఉండేవి. వీరులు ఒకసారి ఒర నుండి కత్తి దూస్తే ఆ కత్తి శత్రువులను బలితీసుకోక వెనుతిరగదు. ఆళియ రామరాయలు రాజఖడ్గమైతే ఏకంగా యమదంష్ట్రికే. ఆ రాజు ఒక మాట కోసం, అతడి రాజ ఖడ్గం కోసం సైన్యాధ్యక్షులు, భటులుఎంత సాహసం చేయటానికైనా వెనుదీయరు.

"మీలో నెవ్వరు సాహసుల్ కదలుఁ డీ మీ మీ ప్రతాపాగ్నితే
జో అలంకారముగాగ శత్రుజన కళ్యాణంబు ఖడ్గానకు
ద్దాలించం జనుఁ డీ తెలుంగుముని విద్యారణ్య సన్యాసి ద
త్తాలంకారము బుక్కరాజు నసి తెండా పోయి సైన్యాధిపుల్"

అంటూ సైనికులను ఉత్సాహపరుస్తూ పౌరషాగ్నిని రగుల్కొలిపే ఆళియ రామరాయల వంటి రాజులు నాడు ఉండేవారు.

ఆనాటి నాయకులు ఎంత పరాక్రమం కలిగిన వారో తమ కోసం ప్రాణాలను లెక్కచేయక పోరాడే వారి పట్ల అంత దయ కలిగిన వారు, వారిని సగౌరవంగా సత్కరించే పెద్ద మనసు కలిగినవారు.

ఆనాటి తెలుగు నేల పసిడి పంటలనే కాదు వీరత్వంతో కూడిన శూరులను పండించింది. బంగారపు సిరులనే కాదు కావ్య సంపదలను వెలయించింది. ఆనాటి వైభవాన్నంతా కవి దర్శించారు. తమ ఆంధ్ర ప్రశస్తిలో మరల ఒకసారి తెలుగు వారి తేజాన్ని గుర్తు చేస్తూ పరోక్షంగా స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని మేల్కొల్పారు.

## 2. పరతంత్రతతో మగ్గుతున్న ఆంధ్ర దేశాన్ని చూసిన కవి ఆవేదనను ఆవిష్కరించండి?

జ. ఆత్మాభిమానం గల వారికి ఇతరుల ముందు తలవంచటం అసాధ్యం. అలా తలవంచవలసివస్తే అది మరణం కన్నా భయంకరంగా భావిస్తారు. అతులిత భుజ పరాక్రమానికి, ధైర్య సాహసాలకు, బుద్ధి కుశలతకు, దయార్ద్ర హృదయానికి, భక్తి తత్పరతకు, అచంచల దీక్షకు మారుపేరైన తెలుగు జాతి బ్రిటీష్ పాలనలో మ్రగ్గవలసిన దుస్థితికి పరితపించని హృదయం స్వాతంత్రోద్యమ కాలంలో లేదంటే అతిశయోక్తి కాదు. పూర్వుల వైభవాన్ని చరిత్ర ద్వారా అధ్యయనం చేసినవారు హీనమైన పరిస్థితులు కలిగినప్పుడు ఇంకెంత పరితపిస్తారు.

అందునా సహజంగానే సున్నిత భావజాలలకు నిలయమైన కవి హృదయాలు ఆక్రోశించక మానవు. కత్తుల కంటే పదునైన, కలాల కరవాలాలు ఝళిపించారు ఆనాటి కవులు. ఆత్మాభిమానానికి మారుపేరైన కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు "ఆంధ్ర ప్రశస్తి" కావ్యంలో పూర్వ వైభవాన్ని స్మరిస్తూనే అస్వతంత్రులైన ఆంధ్రుల దుస్థితికి వగచారు.

ఆనాటి వేంగి వైభవాన్ని తల్చుకుంటూ కవి "రాజప్రసాదితమైన శౌర్యమనే పాయసాన్ని తినే ఆ తెలుగు పిల్లలు సూర్య భగవానుడి రథోత్సవం రోజు కూడా కత్తిసాములనే చేసేవారు. ఆ పిల్లలకు యుక్త వయస్సు వచ్చే నాటికి మధ్యాహ్న కాల సూర్య వేడిమి లాగా పరాక్రమ తేజులయ్యేవారు. అలాంటి పూర్వ వేంగిరాజుల పవిత్ర పాదముద్రలతో వెలుగొందిన ఈ తెలుగు నేలలో నేడు ఆంధ్రుల కన్నీరు కారుస్తూ జీవచ్ఛవములాగా ఉన్నారు. నేడు ఇక్కడ ఆ వేంగిరాజుల పాదాల గుర్తులు లేవు కదా. లేకపోతే పోని, కనీసం ఆలోచనలలో కూడా వారి శౌర్య రూపం స్పష్టంగా లేదు. తెలుగు తేజాన్ని ఏదో చెడుకాలం తన కడుపులో దాచిందేమో" అని పూర్వ వైభవాన్ని స్మరించలేని, తెలుసుకోలేని యువత పరిస్థితికి ఆవేదన చెందారు. తెలుగు జాతికి మరల ఒకసారి తెలుగు పౌరుషాన్ని గుర్తుచేయ తలపెట్టారు.

"ఈ నా పదార్పిత క్షోణి నే రాజు ధ
    ర్మాసనం బుండి స్మృత్యర్థమనెనొ
ఈ నా దృగావృతం బైన భూములలోన
    నే శౌర్యధనుల శిక్షింపబడిరొ
ఈ నా శరీర మందివ తళించిన గాలి
    యెంత పౌరాతన్య మేచుకొనెనొ
ఈ నా తనూపూర్ణమైన యాకాశమ్ము
    నే క్రతుధ్వనులు శబ్దించినవియొ
అస్మదజ్ఞాత పూర్వ దివ్యత్వమొప్పు
నీ పునీతావనీ ఖండ మిచట నిలచి
యస్వతంత్రత దొరలు నా యాంధ్రశక్తి
నన్నుఁ గంపింపఁ జేయుచున్నది భృశమ్ము".

తెలుగువారి బానిసత్వం తనను కలవరపెడుతున్నదని కవి అంటూ నేడు పరపాలనలో బ్రతుకుతున్న వాడినైనా వేంగి రాజుల కాలంలో తాను స్వతంత్రుడనైన ఆంధ్రుడనై ఉంటానని మళ్ళీ అలాంటి కాలం రావాలని, అది నిజం కావాలని ఆకాంక్షించారు.

ముఖలింగ క్షేత్ర వైభవాన్ని స్మరిసూ నాడు కళింగ రాజులకు ముందుగానే విజయాన్ని ఇచ్చిన అన్యంక భీమేశ్వరుడి దేవాలయం నేడు గబ్బిలాలకు ఆవాసమైందని చెబుతూ పదేపదే పాడిన గీతాన్నే పాడుతూ చెప్పిన భావాలే చెబుతున్నానంటారు కవి. వంశధారను పోలిన తన హృదయం ఎగసి పొంగి తనను ముంచుతుందేమో అని ఆరిపోయిన కళింగ జ్యోతి కార్చిన నూనె బొట్ల వలన తెలుగు కళింగుల రక్తంలో శౌర్య జ్యోతులు మరల వెలగగలవని కవి ఆకాంక్షించారు. మళ్ళీ ఆ తెలుగు వైభవపు వెలుగు చూచే వరకు తాను బ్రతికి ఉండాలని ప్రార్థించారు.

నా జాతి పూర్వ ప్రథా జీవరహితమై
　　శక్తి నాడులయందు చచ్చిపోయి
నా మాతృభూమి తేజోమహశ్శ్యుతిని బ్ర
　　హ్మ క్షత్ర తేజంబు మాట గలిపి
నా మాతృభాష నానా దుష్ట భాషల
　　యౌద్ధత్యమును దల నవధరించి
నా తల్లి నేల నేనాఁటి వాచారముల్
　　పైమెఱుంగులు చూచి బ్రమసిపోయి
ఏమి మిగిలిన దీనాఁటి కిట్లు పొంగు
లొలయు వర్షానదీ గభీరోదకముల
దైన్యగర్భ చారిత్రముల్ తక్క భిన్న
గిరిశిఖర దుర్గ పరిదీన గీతి దక్క

తెలుగు జాతి పైపై మెరుగులకు లొంగి సదాచారాలను మరచి మోసపోయిందని, మాతృభాష అయిన తెలుగు ఇతర భాషలను ఉద్ధరించడానికి పూనుకొన్నదని తెలుగు నేలపైనున్న నదులన్నీ పొంగి తెలుగు నేలను ముంచెత్తటమే నయం. స్వతంత్రత లేని జీవితాన్ని తెలుగు వారు ఇంక భరించలేరని కవి భావించారు.

**3) "ఆంధ్ర ప్రశస్తి" లో విశ్వనాథ స్పృశించిన పౌరాణిక, చారిత్రక వ్యక్తుల గురించి రాయండి?**

జ) తెలుగు సాహిత్యంలో చరిత్రలో జరిగిన అంశాలను యధాతథంగా తీసుకొని రచనలు చేసే కవులు కొందరు, కొంత కల్పనను జోడించి రాసేవారు కొందరు, పేర్లు, స్థలాలు మాత్రమే ఉపయోగిస్తూ పూర్తి కల్పనతో రాసేవారు కొందరు కనిపిస్తారు. విశ్వనాథ వారి రచనల్లో చారిత్రకాంశాల కంటే కల్పనకే అధిక ప్రాధాన్యమివ్వటం కనిపిస్తుంది. ఆంధ్ర ప్రశస్తిలో చారిత్రక ఘట్టాలను తీసుకొన్నా నాటి తెలుగుజాతి వైభవాన్ని తెలియజేయటమే ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తుంది. గౌతమి పుత్ర శాతకర్ణి, మాధవ వర్మ, రాజరాజ నరేంద్రుడు, ప్రోలరాజు, ప్రతాపరుద్రుడు, బ్రహ్మనాయుడు, అలరాజు, బాదన్న అళియ రామరాయలు ఈ రచనలో కనిపించే చారిత్రక పురుషులు. ఆంధ్ర మహావిష్ణువు పురాణ పురుషుడు కూడా. పురాణాలలోనూ కొందరు రాజుల ప్రస్తావన ఉంటుంది. రాజవంశాల గురించి పురాణాలలో చెప్పిన విషయాలకు, చరిత్రలో చెప్పిన విషయాలకు అనేక సందర్భాలలో సామ్యమే ఉంటుంది.

**ఆంధ్ర మహా విష్ణువు:**

మగధను జయించి భారతదేశ చక్రవర్తులైన పూర్వాంధ్ర రాజ వంశాలలో తెలిసినంత వరకు ఇతడే పూర్వుడు. ఇతడు నిశుంభుడనే రాజును చంపి శ్రీకాకుళం రాజధానిగా ఆంధ్రను పరిపాలించాడు. ఆంధ్ర దేశమనే పేరు తెలుగు నేలకు ఇతని పేరనే లభించింది.

కొలంది నాళులకు దిగ్వలయ సందరముగాc
బ్రాకారమును గట్టc బంచినాడు
సాగర మేఖలా చారు కుచద్వయీ
శాయి యంధ్రావని చక్రవర్తి
కాళేశ్వరంబు శ్రీశైలమ్ము భీమేశ్వ
రమ్మును గలిపి యాంధ్రము త్రిలింగ
చిహ్నితముగc జేసె, సిద్ధ ఖేచర యక్ష
కాంతలా సొగసు ప్రాకార మార్గ
మనుసరించెదరుభయ సంధ్యా ప్రశాంత
సమయ రోచుల స్వచ్ఛార్ధ చంద్ర మకుటు
మూcడు లింగమ్ములను భక్తిc బూజసేయc
బవన చలితాంశుకాంతలై ప్రతిదినమ్ము.

ఈవిధంగా కొన్ని రోజులకు త్రిలింగం అనేపేరు కూడా తెలుగు నేలకు కలగడానికి కారకుడు ఆంధ్ర మహావిష్ణువే. కొన్ని రోజులకు ఈయన దేవుడిగా పరిగణించబడి శ్రీకాకుళంలో ఇతడి పేరనే ఆంధ్ర విష్ణువు ఆలయం వెలసింది. శ్రీకృష్ణ దేవరాయలకు ఇతడు కలలో కనిపించి చెప్పిన కారణంగానే "ఆముక్త మాల్యద" రచించాడు. కాసుల పురుషోత్తమ కవి ఇతడి పేరనే "ఆంధ్ర నాయక శతకం" రచించాడు.

**శాతవాహనుడు:**

ఆంధ్రుల చరిత్ర శాతవాహన యుగంతోనే ప్రారంభమవుతుంది. దాదాపు ఆంధ్ర దేశాన్ని నాలుగున్నర శతాబ్దాలు ఎంతో వైభవంగా పరిపాలించిన వంశం ఇది. ఎందరో శౌర్యధనులైన రాజులకు జన్మనిచ్చిన ఈ శాతవాహన వంశానికి మూలపురుషుడు శాతవాహనుడు. ఆ శాతవాహనుడు దీపకర్ణి మహారాజుకు లభించడం ఆ పసివాడు ఆంధ్ర దేశాన్ని వైభవంగా పరిపాలించడం, అతడి పేరునే శాతవాహన వంశం ప్రారంభమవటం వంటి విషయాలు దీపకర్ణి మహారాజు భవిష్యత్తు నూహించి చెప్పినట్లుగా కవి రచించారు.

"ఈ నిఖిలాంధ్ర రాజ్యరమ కేళిక వౌదువు దీపకర్ణి సం
తానముగాcగ నిన్గొలుచు ధాత్రి జనావళి ప్రాక్సముద్ర మం
దావిన నీరు పశ్చి మహాంబుధిc ద్రావుము కృష్ణనీరు గం
గానదిc జేర్పు మాంధ్రసతి కంఠలసన్నవమారమో యనన్".

అని దీపకర్ణి మహారాజు మురుస్తూ పలికిన మాటలన్నీ అక్షర సత్యాలు చేసిన వీరుడు శాతవాహనుడు. చిన్న వయస్సులోనే సింహంపై స్వారీ చేసినవాడు.

**గౌతమి పుత్ర శాతకర్ణి:**

శాతవాహన వంశంలోనే గొప్పరాజు ఇతడు. మూడు సముద్రాల మధ్య గల ప్రాంతం మొత్తాన్ని పరిపాలించినవాడు. విదేశీయులను పారద్రోలినవాడు. ఇతడి గురించి నాసిక్‌లో ఒక శాసనంల "ఇతడి తల్లి గోతమి. ఇతడు రాజాధిరాజు, ధాన్యకటకము రాజధాని. మహేంద్ర వింధ్యావత పారియాత్ర సహ్య కృష్ణగిరి చకోరాది పర్వతము లితడి రాజ్యంలోనివి. విద్యానిధి. ఇతడొక్కడే ప్రజ్ఞావంతుడు, ధనుర్విద్యావిశారదుడు. ఇతడి పరాక్రమం నాభాగ నహుష జనమేజయ సగర యయాతి రామ అంబరీషాదులను మించి ఉంది" అని రాయబడి ఉంది. ఇతడు మాతృభక్తి పరాయణుడు. తల్లి పేరును తన నామధేయంతో కలుపుకున్నాడు. నహపాణుడనే మహాక్షాత్రవుడిని అణచినవాడు. సౌరాష్ట్రాన్ని జయించి నహపాణుడనే మహాక్షాత్రవుడిని అణచినవాడు. సౌరాష్ట్రాన్ని జయించి నహపాణుడి వంశాన్ని నిర్మూలించి ఆంధ్ర చక్రవర్తిత్వాన్ని నిలిపిన వాడు గౌతమి పుత్ర శాతకర్ణి. ఇతడి కుమారుడు వాసిష్ఠీపుత్రపులోమావి. తండ్రికి ధీటైన తనయుడు అన్ని యుద్ధాలలో తండ్రికి కుడి భుజమై నిలిచినవాడు.

**మాధవ వర్మ:** పల్లవరాజితడు. విజయవాడను రాజధానిగా చేసుకొని ప్రజారంజకమైన పాలనను అందించిన ధర్మజ్ఞుడు. ఒక శాసనంలో ఇతడికి సంబంధించిన కథ రాయబడి ఉంది. ఇతడి కొడుకు ఒకరోజు రథం వేగంగా నడుపుతూ ఒక పేదవాని మరణానికి కారకుడయ్యాడు. మరణించిన వాని తల్లి సభకెతెంచి రాజును న్యాయం కోరింది. రాజు ధర్మాధికారులు, న్యాయ నిర్ణేతలు ఇచ్చిన తీర్పుననుసరించి తన ఏకైక పుత్రుడికి మరణ శిక్ష విధించిన ధర్మ స్వరూపుడు. బిడ్డ మరణంతో దుఃఖించిన తండ్రి.

"అసువులు పోవునంత వరకాపతి యేగెను గాని పాపమే
కసుత వియోగ దుఃఖితుడు క్ష్మాపతి దేహము భూప్రజార్థమై
యసువుల నిల్పె నాటి దివసాంతమునన్ యువరాజు మేనిలో
నసృ గుదిత ప్రవాహ వలయంబులలో మలుసంజ వొల్చెఁబో"

విజయవాటిలో కనకవర్షం దేవతలు కురిపించే రీతిలో తన ధర్మవర్తనతో మెప్పించి ధన్యుడైనవాడు మాధవ వర్మ. మూర్తీభవించిన ధర్మదేవత అయిన అతడి రాజధాని విజయవాటికా నగరం ఆ పార్వతీదేవికే ఆవాసమై వెలుగొందింది.

**రాజరాజ నరేంద్రుడు:**

చాళుక్య వంశపు రాజు రాజరాజ నరేంద్రుడు తెలుగులో మొదటగా కావ్య రచన చేయించాలని సంకల్పించినవాడు.

"జయకుండ వాంబా ప్రజా! రాజమార్తాండ!
త్రిభువనాంకుశ! జయశ్రీ మనోజ్ఞ!
అమ్మంగదేవి హృదంభోజ మార్తాండ!
రాజమహేంద్ర విభ్రాజ బిరుద!
పరగండ భైరవ! బిరుదాంక భీమ! స
త్యాశ్రయ కులశేఖరా! సమస్త

భువనాశ్రయ! త్రిలింగ భూమీ మహాభార

వహన బాహాదండ! పార్థివేంద్ర!...."

అని విశ్వనాథ కీర్తించారు. నన్నయ చేత మహాభారతాంధ్రీకరణకు శ్రీకారం చుట్టించిన రాజరాజనరేంద్రుడిపై తెలుగు సాహిత్యాభిమానులకు సాహితీ స్రష్టలకు అభిమానం ఉండటం సముచితమే.

**ప్రోలరాజు:**

కాకతి బేతరాజుకు ప్రోలరాజు కుమారుడు. ఇతడు రాజ్యతంత్రజ్ఞుడైన మహా యోధుడు. చిన్నదైన కాకతీయ సామ్రాజ్యం ఇతడి కాలంలోనే విస్తరించింది. చాళుక్య రాజుల భుజబలాల తగ్గటంతో పూర్వ వైభవం లేదు. తెలుగు భూమిని ముక్కలుగా పంచుకొని హూణులకు వంగి నమస్కారాలు చేస్తారేమో! ఉత్తర భారతదేశంలో యవన హూణుల గుంపులు విజృంభిస్తున్నాయని అలా దక్షిణ భారతదేశంలో జరగకూడదంటే రాజులందరూ ఒకటవ్వాలని యోచించినవాడు ప్రోలరాజు. కాకతీయ నవరాజ్య నిర్మాణానికి శ్రీకారం చుట్టినవాడు.

**మొదటి ప్రతాపరుద్రుడు:**

ప్రోలరాజు కుమారుడు మొదట జైనుడైన ఇతడు తరువాత శైవుడయ్యాడు. వీరశైవమందు తీక్షణ స్వభావుడైనవాడు. ఇతడి కాలంలో కాకతీయ సామ్రాజ్యం మహోన్నత స్థానం పొందింది. ఇతడు శివధ్యానంలో ఉండగా గుడి లోపలి కొచ్చిన తండ్రి ప్రోలరాజును ఎవరో తన ఏకాగ్రతను భంగం చేయడానికి వచ్చారనే కోపంతో చేతిలోనున్న కత్తిని విసిరాడు. ఆవిధంగా తండ్రినే వధించినవాడయ్యాడు. అందుకు ఎంతో ఆవేదన చెందుతూ

"ఈ పితృహంతవీఁ డటవె యీ పయి కాకతి రాజ్య భోక్త యీ

పాపము పేరుగా ప్రళయ పావక కీలలు నన్ను మ్రింగవొ

రా! పరమేశ! తండ్రి రుధిరమ్మునఁ దోగిన చేతులన్ ధరి

త్రీ పరిపాలనమ్ము గడిదేరినదే! ఇక నేననర్హుడన్"

అని విలపించాడు. తండ్రి దహన సంస్కారాలు చేసిన అతడి ముఖంలో నవ్వనేదే ఇంక కనిపించలేదని కవి వర్ణించారు.

**పల్నాటి వీరులు:**

పల్నాటికి రాజు అనుగురాజు. అతడి మంత్రి దొడ్డనాయడు. దొడ్డనాయడి కొడుకులు బాదన్న, బ్రహ్మనాయడు. బాదన్నను అనుగురాజు పెంచుకున్నాడు. కాబట్టి నలగామరాజు బాదన్న అన్నదమ్ములయ్యారు. అలరాజు నలగామరాజుకు అల్లుడు. బ్రహ్మనాయుడు బాదన్న, అలరాజులకు మామఅల్లుళ్ళ వరుస, అలరాజుకి రాచమల్లు, అలరాచమల్లు అని కూడా పేర్కొన్నాయి.

పల్నాటి వీరుల పౌరుషాలను ఈ కావ్యంలో చిత్రించారు కవి. అలరాజు, బాదన్నల చిలిపికయ్యాలు, వాటిని సర్దుబాటు చేయలేని బ్రహ్మనాయడి గురించినదే ఈ కావ్యం.

**అళియ రామరాయలు:**

ఇతడు మహా వీరుడు. రాజనీతి కోవిదుడు, విజయనగర రాజితడు. ఎంతో వీరుడైన ఇతడి కాలంలోనే తల్లి కోట యుద్ధంలో తెలుగువారు ఓడిపోవటం చిత్రం. ఇతడి చేతి ఖడ్గమే యమ దంష్ట్రిక అని కవి వర్ణించారు. యమ దంష్ట్రిక అంటే యముడి కోరపల్లు. ఆ ఖడ్గం తాకితే శత్రువులు యమపురికి పోక తప్పదని అర్థం.

ఈ విధంగా కవి తమ ఆంధ్ర ప్రశస్తిలో ఆంధ్ర దేశాన్ని పాలించిన శాతవాహనులు, తూర్పు చాళుక్యులు, పల్లవులు, కాకతీయులు, విజయనగర రాజులు అందరి గురించి ప్రస్తావించారు.

**ఇంకా రాదగిన ప్రశ్నలు:**

1) ఆంధ్ర ప్రశస్తిలో కవి వర్ణించిన క్షేత్రాలను గురించి రాయండి?

2) ఆంధ్ర ప్రశస్తిలోని చారిత్రక ఘట్టాలను విశదీకరించండి?

3) విశ్వనాథ వారి తెలుగు జాత్యభిమానాన్ని మీ పాఠ్యభాగమాధారంగా నిరూపించండి?

**- ఆచార్య ఇరపని మాధవి.**

**పాఠం - 4**

# కృష్ణ పక్షం

## - దేవులపల్లి కృష్ణ శాస్త్రి

విషయసూచిక:


**4.0.** పరిచయం

**4.1.** ఉద్దేశ్యం

**4.2.** పాఠ్యభాగ సందర్భం

**4.3.** కృష్ణ శాస్త్రి జీవితం – సాహితీ ప్రస్తానం

**4.3.1.** వృత్తి రచనా వ్యాసంగం

**4.3.2.** కవిత్వం ప్రచురుణ – ప్రచారం

**4.3.3.** వివిధ ఉద్యోగాలు – సినీరంగ ప్రవేశం

**4.3.4.** మలిసంధ్య

**4.3.5.** మధుర కవిత్వం ఆయన సొంతం

**4.3.6.** ఆంధ్రా షెల్లీ దేవులపల్లి

**4.3.7.** నాటకాల ప్రత్యేకత

**4.3.8.** దేవులపల్లి కృష్ణ శాస్త్రి రచనలు

**4.4.** 'కృష్ణ పక్షం' కవితా సంపుటి – సారాంశం

**4.4.1.** పరిచయం

**4.4.2.** ఉద్దేశ్యం

**4.4.3.** పాఠ్యభాగ సందర్భం

**4.4.4.** 'కృష్ణ పక్షం' కవితా సంపుటి – సారాంశం


### 4.0. పరిచయం:

భావకవితా దివ్యా రామంలో రాగరంజితంగా ఆలపించిన కమనీయ కవితాకోకిల కృష్ణశాస్త్రి. వారి పలుకు వీణా స్వరం. వారి భావం సమ్మోహనాస్త్రం. వారి హృదయం మ్రోగితే పాటగా పరిణమిస్తుంది. ఆత్మ పరవశిస్తే రచనగా రాణిస్తుంది. ఆయన గీతం గిలికినా, పద్యం పలికినా ప్రకృతి మనకళ్ళెదుట లాస్యమాడుతుంది. ఆయన మోము మీద కృష్ణ పక్ష తపస్సులు ముసురుకొన్నా, హృదయంలో తేజో లోకాల తాత్విక జీవరేఖలు తరళిస్తూ వుంటాయి. ఆయనది మానవీయ దృక్పథం.

మహనీయ ప్రస్థానం. అభినవాంధ్ర సాహిత్యానికి వాడిపోని వసంతాన్ని అందిచ్చిన అమృత హృదయుడు కృష్ణశాస్త్రి. ఆయన కవితను అనుభవిస్తే అంతరంగం ప్రేమతరంగితమవుతుంది. కృష్ణ పక్షం తెలుగు భావకవితా యుగానికి పరిమళాల్ని ప్రసాదించిన పారిజాతం. ఆ పారిజాత పరిమళాలు ఏనాటికి తరగనివి, చెదరిపోనివి.

దేవులపల్లి కృష్ణ శాస్త్రి భావ కవిత్వానికి రూపు, రేఖాదిద్ది ప్రాణం పోసిన ఘనత దేవులపల్లి కృష్ణశాస్త్రికే దక్కుతుంది. రాయప్రోలు సుబ్బారావుతో భావకవిత్వం ఆవిష్కృతమైనా దానికి విశేష ప్రచారాన్ని కలిగించింది మాత్రం దేవులపల్లి వారే. శ్రీ శ్రీ మాటలలో చెప్పాలంటే 'ఇక్షు సముద్రం ఎక్కడుందో తెలియదు కానీ ఆపాత మధురమైన కృష్ణ శాస్త్రి సాహిత్యం సమస్తమూ ఇక్షు రసార్ణవమే'. కృష్ణ శాస్త్రి పలుకుల్లోని చెఱుకు తీపి సాహిత్య రస పిపాసులకు ఎక్కడో వుందనుకునే ఇక్షు సముద్రాన్ని ఎదుర్కోవలసిన అగత్యాన్ని తొలగిస్తుంది. భావ కవిత్వానికి ఆయన పేరు పర్యాయ పదంగా మారిపోయింది.

## 4.1. ఉద్దేశ్యం:

ఈ పాఠంలో కృష్ణ శాస్త్రి జీవితం, సాహిత్యాలని గురించి సంగ్రహంగా వివరించడం జరిగింది. దేవులపల్లి కవిత్వ ప్రస్థానం, లక్షణాలు, కవిత్వతత్వ విచారణలను, రచనలు గురించిన విశేషాలు తెలుసుకుంటారు. విద్యార్థులు ఆయా అంశాల్ని గూర్చి జాగ్రత్తగా అధ్యయనం చేయాలి.

## 4.2. పాఠ్యభాగ సందర్భం:

తెలుగు సాహిత్యంలో సంప్రదాయ కవిత్వపు శృంఖలాలతో విసిగిపోయి, విముక్తిని కోరుకుంటున్న యువ హృదయాలకు నూతనోత్తేజం కలిగించ వలసిన సమయంలో "కృష్ణ పక్షం" ఒక కొత్త భావవీచికగా సాహిత్య క్షేత్రంలోకి ప్రవేశించింది. దీనిపై అనుకూలంగానూ, ప్రతికూలంగానూ, ఎన్నో విమర్శలు చెలరేగినా గానీ ఈ కవితా భావనలు సాహిత్య రంగానికొక కొత్త చైతన్యాన్ని సమకూర్చాయి. "కృష్ణ పక్షం" కవితల్లో ప్రధానంగా ఉన్న ప్రణయ, ప్రకృతి, భక్తి, స్మృతి వంటి భావనలు గురించి చెప్పే సందర్భంలోనిది ఈ పాఠంలో. "కృష్ణ పక్షం" కవిత్వంపై అనుకూలంగానూ, ప్రతికూలంగానూ, ఎన్నో విమర్శలు చెలరేగాయి. ఈ విమర్శలు సాహిత్య రంగానికొక కొత్త చైతన్యాన్ని సమకూర్చాయి. కృష్ణ పక్షం వెలువడ్డాక తెలుగు సాహిత్యంలో సంప్రదాయ కవిత్వపు శృంఖలాలతో విసిగిపోయి, విముక్తిని కోరుకుంటున్న యువ హృదయాలకు నూతనోత్తేజం కలిగింది. ఒక కొత్త భావవీచిక సాహిత్య క్షేత్రాన్ని అర్థం చేసింది.

## 4.3. కృష్ణ శాస్త్రి జీవితం సాహితీ ప్రస్తానం:

కృష్ణ శాస్త్రి 1897వ సంవత్సరం నవంబర్ 1వ తేదీన పిఠాపురం దగ్గరున్న చంద్రపాలెంలో జన్మించారు. ఈయన తండ్రి దేవులపల్లి. సోదర కవులలోని తమ్మన శాస్త్రిగా పిలుపులందుకున్న వెంకట శాస్త్రి. తల్లి సీతమ్మ. ఈ దంపతులకు ఇద్దరు ఆడ పిల్లల తర్వాత కృష్ణ శాస్త్రి జన్మించారు. కృష్ణ శాస్త్రి పెద తండ్రి సుబ్బారాయ శాస్త్రికి అయిదుగురూ ఆడపిల్లలే కావటంతో ఆ ఇంట్లో ఏడుగురు అక్కల తర్వాత చిన్నవాడైన ఈయన ఎంతో అల్లారు ముద్దుగా పెరిగారు. తండ్రి, పెద తండ్రిల కవితా ప్రభావం ఈయన మీద ఎంతగానో ప్రసరించింది. కృష్ణ శాస్త్రి గారిల్లు కవిపండితులతో ఎప్పుడూ కలకలలాడుతుండేది. అందువల్ల 9వ సంవత్సరంలోనే ఆశుకవిత్వం చెప్పడం ప్రారంభించారు. కృష్ణ శాస్త్రి పిఠాపురం హైస్కూల్లో చదువుతున్న రోజుల్లో తండ్రితో మద్రాసు వెళ్ళే అవకాశం వచ్చింది. అక్కడ డాక్టర్ గోపాలాచార్యులు ఎదుట శాస్త్రిగారు ఆశువుగా కొన్ని పద్యాలు చదివి విన్పించారు. తర్వాత కొద్ది రోజులకు కృష్ణ శాస్త్రికివ్వడం కోసం "భాగవతం" గ్రంథాన్ని ప్రధానోపాధ్యాయుల

పేర పంపగా ఆయన విద్యార్థులందరి ముందు, కృష్ణ శాస్త్రిని అభినందించి గ్రంథాన్ని అతనికి అంద చేశారు. పదో సంవత్సరంలో ఆయన "వందనందన ఇందిరానాథ వరదా...." అనే పద్యం చెప్పారు. తమ పుత్రుడు కవితా ప్రకర్షకు ఆనాడే ముచ్చటపడి తండ్రి, పెద తండ్రి ఇద్దరూ ఆయనను ఎంతగానో ఆశీర్వదించారు.

కృష్ణ శాస్త్రి బాబాయి, తండ్రి ఇద్దరూ ఎక్కువ కాలం జీవించలేదు. వారి మరణానంతరం ఆయన విజయనగరంలో ఉంటున్న తమ పెద్ద బావ గారింటికి చేరి హైస్కూల్ చదువు ప్రారంభించారు. బావ గారి వేళాకోలాలకు బదులు చెబుతూ తన పన్నెండో సంవత్సరంలోనే ఆయన మంచి పద్యాలు చెప్పారు. విజయనగరంలో గురజాడ అప్పారావు ఆయనను ఆకర్షించారు. ఆయన దగ్గరకు తరచూ వెళ్ళి వస్తుండేవారు. ఆ పరిచయమే ఆయనను ఓ రకంగా నూతనత్వం వైపు చూసేలా కూడా చేసింది. గురజాడ గీతవాహినితో పాటుగా రాయప్రోలు సుబ్బారావు గీతాలను కూడా ఆయన అవగతం చేసుకున్నారు. రాయప్రోలు వారి అమలిన శృంగార తత్వాన్ని నిశితంగా పరికించారు. మరోవైపు అబ్బూరి, వెంకటపార్వతీశ కవుల వంటి భావ కవుల ఖండ కావ్య సుగంధ సౌరభాలతో ఆనాటి సమాజం పులకితమౌతుండగా ఆ సమాజాన్ని కృష్ణ శాస్త్రి తన వైపునకు తిప్పుకో గలిగారు. హైస్కూల్లో కూచి నరసింహం, కళాశాలలో బ్రహ్మర్షి రఘు వెంకట రత్నం నాయుడుల మహోన్నత సాహచర్యం కృష్ణ శాస్త్రిని సంస్కరణోద్యం వైపు మళ్ళించింది. ఆ స్ఫూర్తితో హరిజనోద్ధరణ కోసం రేయింబవళ్ళు కృషి చేశారు. పిఠాపురంలోనూ, కాకినాడలోనూ ఆయన విద్యాభ్యాసం జరిగింది. ఆ తర్వాత 1919వ సంవత్సరంలో తన పెద్ద బావ గారి కుమార్తెనే వివాహమాడారు. అనంతరం తల్లా వఝల శివ శంకర శాస్త్రి స్థాపించిన సాహితీ సమితిలో సభ్యత్వం పొందారు. అదే రోజుల్లో ఆయనతో పాటు విశ్వనాథ సత్యనారాయణ, అడవి బాపిరాజు, నండూరి సుబ్బారావు, నోరి నరసింహ శాస్త్రి, చింతా దీక్షితులు, కొడాలి ఆంజనేయులు, మొక్కపాటి నరసింహశాస్త్రి, ముని మాణిక్యం నరసింహరావు కూడా సాహితీ సమితిలో సభ్యులుగా వుండేవారు. సాహితీ సమితి సభ్యుడిగా కావటం తన అదృష్టమని ఆయన భావిస్తుండేవారు.

### 4.3.1. వృత్తి రచనా వ్యాసంగం:

మెల్ల మెల్లగా భావ కవిత్వం వైపు, సంస్కరణ ఉద్యమం వైపు దృష్టి సారిస్తున్న కృష్ణ శాస్త్రికి ఆనాటి వ్యావహారిక భాషా ఉద్యమం, బ్రహ్మ సమాజ ఉద్యమం మంచి స్ఫూర్తినిచ్చి ఆయన చేత గొప్ప గొప్ప గీతాలను ఆలపించేలా చేశాయి. కాకినాడ, పెద్దాపురం హైస్కూళ్ళలో ఉపాధ్యాయుడిగా రెండు సంవత్సరాల పాటు పని చేశారు. వృత్తి అలా కొనసాగుతున్నా ఆయన కవితాధార ప్రతిఫలిస్తున్న పాటలు, గేయాలు ఆనాటి సంప్రదాయ వాదులకు కటువుగా అనిపిస్తుండేవి. ఆ పాటలంటే గిట్టనివారు మహా కవుల వంశంలో కృష్ణ శాస్త్రి తప్ప పుట్టారని తిడుతూ, అంతటితో ఆగక మహారాజా వారికి చెప్పి ఆయనకు సంఘ బహిష్కరణ శిక్షను కూడా విధించేలాగా చేశారు. ఎన్ని కష్టాలు ఎదురొచ్చినా తలదించని ఆయన, పిఠాపురం రాజావారికి వ్యతిరేకంగా ధర్మ సాధన అనే పత్రికలో కొన్ని వ్యాసాలు రాయటంతో రాజా వారికి కోపం రావడంతో, చేస్తున్న ఉద్యోగం నుంచి తొలగించడమే కాకుండా తండ్రుల కాలం నుంచి వస్తున్న "వార్షికం"ను కూడా నిలిపేశారు. కృష్ణ శాస్త్రికి సంజాయిషి చెప్పుకునే అవకాశం కూడా ఇవ్వలేదు. కోటలోకి ప్రవేశాన్ని కూడా నిరోధించారు. ఇలాంటి కష్టాల రోజుల్లోనే ఆయన భార్య మరణించారు. శోక తప్త హృదయంతో అప్పుడాయన 'కన్నీరు' అనే ఖండ కావ్యాన్ని రాశారు. తరువాత సంఘ సంస్కర్త అయిన గాడేపల్లి సూర్య నారాయణ పెద్ద కుమార్తె 'రాజహంసను' వివాహమాడారు. సూర్య నారాయణ ప్రోత్సాహంతో సహాయ నిరాకరణోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. గతంలో చేస్తున్న పాఠశాల ఉపాధ్యాయ వృత్తి పోవటం కూడా తన మంచికేనని అప్పుడు ఆయన భావించారు.

**4.3.2. కవిత్వం ప్రచురణ – ప్రచారం:**

కృష్ణ శాస్త్రి 1925వ సంవత్సరం నాటికి తాను రచించిన ఖండ కావ్యాలను ఒక చోట చేర్చి 'కృష్ణ పక్షం' అనే పేరుతో సాహితీ సమితి తరపున ఒక పుస్తకాన్ని ప్రచురించారు. ఈ కావ్యాన్ని కృష్ణ శాస్త్రి పిఠాపురం మహారాజా 'సూర్యరాయ బహద్దూర్' కి అంకిత మిచ్చారు. తల్లా వజల శివశంకర్ శాస్త్రి సింహావలోకనం అనే పేరుతో దానికి పరిచయం రాశారు. అయితే ఈ పుస్తకాన్ని పిఠాపురం మహారాజా స్వీకరించటానికి నిరాకరించారు. అయినా కృష్ణ శాస్త్రి మొక్కవోని ఆత్మ విశ్వాసంతో తన కవితా ప్రస్థానాన్ని కొనసాగించటానికే నిర్ణయించుకొన్నారు. అప్పటి నుండి ఆయన తన కావ్య గానం చేస్తూ ఆంధ్ర దేశమంతటా తిరిగారు. కేవలం తన కవితలనే కాక తోటి భావ కవులు రచించిన అనేకానేక కవితలను కూడా ఆయన పాడుతూ భావ కవిత్వాన్ని ఒక ఉద్యమ స్థాయికి తీసుకువచ్చారు. ఆయన గళంతోపాటు వేషధారణ, శైలి కూడా అంటే గిరజాల జుట్టు, పంచె కట్టు ఇలాంటివన్నీ ఆనాటి యువకులను బాగా ఆకట్టుకున్నాయి. తన తొలి భార్య మరణానికి దుఃఖిస్తూ ఆయన 'ప్రవాసం', 'కన్నీరు' అనే కావ్యాలను ఆత్మాశ్రయ ధోరణిలో రచించారు. అలాగే 'ఊర్వశి' కావ్యం గూడా గొప్పగా ప్రజాదరణ పొందింది. బ్రహ్మ సమాజ ప్రభావంతో ఆయన రాసిన వందల కొద్ది గీతాలు 'మహతీ' అనే పేరుతో సంపుటిగా వచ్చాయి. ఇవి మంచి భక్తి గీతాలుగా కూడా ఆనాటి సమాజం చేత ప్రశంసలందుకున్నాయి. అలా ఆ కవితా ప్రస్థానం శాంతి నికేతనాన్ని గర్వించేలా కూడా ఆయన్ని ప్రోత్సహించింది. ఆ ప్రోత్సాహం శాంతి నికేతన్లో ఉండే కవులతో పరిచయాన్ని ఏర్పరచింది.

**4.3.3. వివిధ ఉద్యోగాలు – సినీరంగ ప్రవేశం:**

ఒకసారి స్కూలు మాస్టరీ గిరిపోయి ఆంధ్ర దేశమంతా తిరుగుతున్న కృష్ణ శాస్త్రి మళ్ళీ 1933వ సంవత్సరంలో ఉద్యోగంలో చేరారు. కాకినాడ ఎ.ఆర్. కళాశాలలో ఆంధ్రోపన్యాసకుడుగా ఆయన పది సంవత్సరాల పాటు పని చేశారు. 1942వ సంవత్సరం నాటికి సినిమాల్లో పాటలు రాసే అవకాశాలొచ్చాయి. కొంత కాలం పాటు హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రంలో సాహిత్య కార్యక్రమాల ప్రయోక్తగా పని చేశారు. ఆ రోజుల్లోనే సాహిత్య ప్రసంగాలు, రేడియో నాటికలు, రూపకాలు రాశారు. 1958వ సంవత్సరంలో ఆయన జీవితంలో మరో విషాదం అలముకుంది. చిన్న కుమార్తె గీత మసూచి వ్యాధి సోకి మరణించటంతో ఆమె స్మృతిగా గోదా దేవిని తలపించే తిరుప్పావును తమిళం నుండి తెలుగులోకి అనువదించారు. తిరుప్పావుతో పాటుగానే పల్లకి, రుగ్వీధి, అమృత వీణ, మంగళ కాపాళి, ధనుర్దాసు, శర్మిష్ఠ, పుష్పలావికలు లాంటి కావ్యాలను, నాటికలను, వ్యాసాలను సంపుటాలుగా వెలువరించటమేకాక అప్పుడు పుట్టి వుంటే, బహు కాల దర్శనం వంటి గద్యాత్మక కృతులను కూడా చేశారు.

1942వ సంవత్సరంలో నవ్య సాహిత్య పరిషత్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 1947వ సంవత్సరంలో మల్లీశ్వరి తెలుగు చలన చిత్రానికి మాటలు, పాటలు రాసి తనదైన విజయబావుటాను ఎగురవేసి ఆ చిత్రాన్ని సెల్యులాయిడ్ కావ్యంగా ఈ నాటికి అందరూ చెప్పుకునేలా మెరుగులు దిద్దారు. వంద సినిమాలకు అయిదు వందల పాటలను రాశారు.

**4.3.4. మలిసంధ్య:**

ఇంత ప్రతిభావంతంగా కాంతి వంతంగా భాసిల్లిన దేవులపల్లి వారి జీవితంలో అడుగడుగునా కష్టాలు ఎదురౌతూ చివరి దాకా ఆయన్ను వెంటాడినట్లే కనిపిస్తాయి. ఎంత అలవికాని కష్టాలెదురైనా ఏనాడు వాటి కాయన తలవంచలేదు. ఆంధ్ర దేశం అంతా తిరిగి భావ గీతాలను అద్భుతంగా ఆలపించిన ఆయన గొంతు మూగపోవలసిన పరిస్థితి దాపురించింది.

1964వ సంవత్సరంలో స్వర పేటికలో కాన్సర్ వ్యాధి సోకిన కారణంగా ఆపరేషన్ జరిగింది. దానితో ఆ కంఠం శాశ్వతంగా పాట ఎవరికీ వినిపించకుండా పోయింది. గొంతు మూగ పోయినా చివరి దాకా ఆయన ఎంతో ఉత్సాహంగానే జీవించారు. కవితా వ్యాసంగాన్ని ఓపిక ఉన్నంత కాలం విడిచిపెట్టలేదు. తన మనో భావాలను కవిత్వాన్ని తను చెప్పదలచుకున్న మాటలను కాగితం మీద రాసి చూపిస్తుండేవారు. గొంతు మూగపోయిన రోజుల్లో రాసిన పాటలకు కృష్ణ రంజని అనే పేరు పెట్టుకున్నారాయన. ఇలా కడదాకా ఆత్మ స్థైర్యంతోనూ ఓ స్థిర లక్ష్యంతోనూ ఉన్న ఆయన 24-02-1980వ సంవత్సరంలో దివ్యలోకాలకు లలిత మధుర సుందర కవిత్వాన్ని వినిపించటానికి వెళ్ళిపోయి ఆంధ్ర జాతికి మాత్రం కంటతడి పెట్టించారు.

**4.3.5. మధుర కవిత్వం ఆయన సొంతం:**

దేవులపల్లి కృష్ణ శాస్త్రి కలం నుండి జాలువారిన ప్రతి అక్షరం తేనెలొలుకుతూ అందాల పులుగులా కులుకులాడుతూ పాఠకుడిని మురిపిస్తుంటుంది. అది దేశ భక్తి గేయమైనా, భక్తి గీతమైనా, పద్యమైనా, గద్యమైనా చివరకు నాటికైనా పాఠకుడి చెవిన పడిన తర్వాత అతడి నాలుక మీద నిరంతరం నర్తించటమే దాని వంతవుతుంది. కృష్ణ శాస్త్రి జీవితం ఆరంభ దశ నుండి తుది దాకా స్వేచ్ఛను కోరుకున్నారు. అందుకే ఆయన కావ్యాల్లో ఖండ కావ్యాల్లో స్వేచ్ఛా ప్రియత్వం దర్శన మిస్తుంటుంది. కృష్ణ శాస్త్రి కావ్యాలలో మొదటిది, ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టింది కూడా కృష్ణ పక్షం. కృష్ణ పక్షం కావ్యంలో యాభై తొమ్మిది శీర్షికలున్నాయి. కానీ వాటిలో ఎక్కడా కృష్ణ పక్షం అనే శీర్షిక కనుపించదు. అయితే చాలా విచిత్రంగా "నాకు మరణమ్ము..." అనే శీర్షిక కింద ఉన్న ఒక తేట గీతి పద్యంలో మాత్రం కృష్ణ పక్షమనే ఒక్క పదం కనిపిస్తుంది. కృష్ణ పక్షం చక్కటి భావ గీతంతో ప్రారంభమైంది. ఆ భావ గీతం ఈ నాటికీ తెలుగువారి నాల్కల నిరంతరం వర్తనమాడుతూనే వుంది.

"ఆకులో ఆకునై పూవులో పూవునై
కొమ్మలో కొమ్మనై నునులేత రెమ్మనై
ఈ యడవి దాగిపోనా, ఎట్లయినా
నిచటనే యాగిపోనా?"

అనే ఈ గీతం ఎప్పటికీ తెలుగు వారి హృదయ సీమల్లో విహరిస్తూనే ఉంటుంది. భావ కవుల స్వేచ్ఛా ప్రియత్వం కృష్ణ శాస్త్రి స్వేచ్ఛా గానంలో ప్రతిబింబిస్తుంది. కృష్ణ శాస్త్రి ప్రేమతత్వం కూడా ఆయన స్వేచ్ఛా ప్రియత్వం లాంటిదే.

"సౌరభము లేల జిమ్ము పుష్ప ప్రజంబు?
చంద్రికల నేల వెదజల్లు చందమామ?
ఏల సలిలంబు పారు, గాడ్పు లేల వీచు
యేల నా హృదయంబు ప్రేమించు నిన్ను?"

అని అనడంలో ఆయన ప్రేమతత్వం ఎలాంటిదో అవగతమౌతుంది. ఆయన కవితా మాధుర్యం ఎంతటిదో అర్థమౌతుంది

**4.3.6. ఆంధ్రా షెల్లీ దేవులపల్లి:**

దేవులపల్లి కృష్ణ శాస్త్రి ప్రకృతిని కవిత్వీకరించి మనోహర దృశ్య కావ్యాలుగా మలిచిన తీరు ఆయనను అందరూ ఆంధ్రా షెల్లీగా గుర్తుంచుకునేలా చేసింది. బి.ఎన్. రెడ్డి ప్రోత్సాహంతో సినీ రంగంలో మల్లీశ్వరి సినిమా పాటలను పలికించినా

ఆయన సంపుటాలలోని మరే ఇతర గేయ పాదాన్ని గమనించినా ఓ సుందర ప్రకృతి, ఓలయాత్మక భావన వీలైన చోటల్లో దైవ భక్తి మనకు దర్శనమిస్తూనే ఉంటాయి. ఆయన భావ సౌకుమార్యానికి పదలాలిత్యానికి "ఆకాశ వీధిలో హాయిగా ఎగిరేవు, మనసున మల్లెల మాలలూగెనె, కోతి బావకు పెళ్ళంట, నీవుండే రాకొండపై" లాంటి అనేకానేక చలన చిత్రాల పాటలు ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. అలాగే ఆయన గొంతు మూగపోయిన తర్వాత రాసిన గేయ సంకలనంలో ఆస్తి గీతాల రూపంలో పొంగి పొరలుతుంది. వాటిలో –

ఏకాంత దర్శనమీనా? దేవా!

ఏకాంత దర్శన మీనా? ఎప్పుడైనా?

అలాగే "కృష్ణ రణని" కి సార్థకతను సమకూర్చిన

"ఒదిగిన మనసన పొదిగిన భావము

కని చెవ్వరో కదిపే దెవ్వరో

కదలని తీగకు కరగని రాగము

కూపే డెన్వరో కలిపే చెప్పర ? ఒదిగిన?

ఈ పాట ఇప్పటికీ లలిత సంగీతంగా అందరినోట వినిపిస్తూనే ఉంటుంది.

ఆయన రచించిన దేశ భక్తి గీతాలలో "జయ జయ ప్రియ భారత జనయిత్రి దివ్యధాత్రి" లాంటి గేయాలు అక్షర సత్యంగా అజరామరాటే, ఆయన కేవలం ఇలా పాటలూ, గేయాలే అందంగా రాస్తారనుకోవటం పొరపాటే. గద్య రచన చేసినా, నాటకాన్ని రాసినా, యక్షగానాన్ని రాసినా ఏది రాసినా ఆయన కలం సౌందర్య రసాన్ని అక్షర రూపంలో ఆవిష్కరించి తీరుతుంది. భావ కవితని ఉద్యమంగా చేపట్టి ఉన్నంత కాలం ఆ ఉద్యమానికి ఊపిరిలూది సజీవత్వాన్ని కల్పించిన ఆయన పద్యం చదివితే ఆహ్లాదకర ప్రభాతంలా ఉండేది. పాట పాడితే అందమైన ఆలపాతం శ్రోతలముందు ఆవిష్కృతమయ్యేది. ఆయన పదాల పట్టు భావ కవిగా నిలుద్దామనుకున్న వారికి ఆట పెట్టేసరి, దీనికి కారణం సంప్రదాయం నుంచి చైతన్య వంతమైన శబ్దాలను ఏరుకోవటం, తనచుట్టూ ఉన్న సమాజంలో ప్రేమ పూరితమైన సన్నివేశాలను సునిశితంగా పరిశీలించటం ప్రధాన కారణాలు.

### 4.3.7. నాటకాల ప్రత్యేకత:

కృష్ణ శాస్త్రి రచించిన నాటకాలు దాదాపుగా అన్నీ ఆకాశవాణికి మాత్రమే పరిమితమయ్యాయి. అందుకు కారణం మద్రాస్ ఆకాశవాణి కేంద్రంలో కృష్ణ శాస్త్రి కార్యక్రమ నిర్వాహకుడుగా వుండటం కూడా ఒకటి అయితే ఆ రోజుల్లో ఆయన ముందుగా తనకు తానుగా ఏ రచన చేయలేదు. ఆయన మిత్రులైన ఆచంట జానకీరామ్, బాలాంత్రపు రజనీకాంతరావు, బుచ్చిబాబు, సూరి నారాయణ మూర్తి, అయ్యగారి వీరభద్రరావు లాంటి వారంతా ఆయనను బ్రతిమాలి బామాలి నాటక రచనను ప్రోత్సహించారు. అలా రాసిన నాటకాలన్నీ ధనుర్దాసు, శర్మిష్ఠ అనే పేర్లతో రెండు సంపుటాలుగా వచ్చాయి. ధనుర్దాసులో సాయిజ్యం, గుహుడు, శివ క్షేత్రయాత్ర అనే నాటకాలు, శర్మిష్టలో కృష్ణాష్టమి, విహారి, ఏడాది పొడుగునా గౌతమి, వేణుకుంజం అనే నాటకాలు వున్నాయి. ఇవన్నీ చాలా వరకూ సంగీత ప్రధానంగా కనిపిస్తాయి. పాటల్లో పదాలు ఆకట్టుకున్నట్లే నాటకాలలో ఉన్న ప్రతి అక్షరం కూడా శ్రోతలను కట్టి పడేసేదిగానే వుంటుంది. ఆయన రాసిన యక్షగానాల్లో

బాలాంత్రపు రజనీకాంతరావు సూచన మేరకు రచించిన క్షీర సాగర మధనం మొదటిది. దానిలో ఉన్న కొలువైతివా రంగశాయి అనే దరువు కూచిపూడి వారికి బాగా నచ్చి దాన్ని ఇప్పటికీ ప్రచారం చేస్తూనే వున్నారు. అలా యక్షగాన ప్రక్రియలో కూడా తనదే పై చేయి అని కృష్ణ శాస్త్రి అనిపించుకున్నారు.

### 4.3.8. దేవులపల్లి కృష్ణశాస్త్రి రచనలు:

కృష్ణ శాస్త్రి చేపట్టని సాహిత్య ప్రక్రియ లేదనడం అతిశయోక్తి కాదు. రమ్యమైన అతని రచనలు పద్య, గద్యాలుగా విలశెల్లాయి.

1. ఖండ కావ్యాలు : కృష్ణపక్షం, ప్రవాసం, ఊర్వశి, నిశ్రేణి, పల్లకీ, బదరిక.
2. గేయనాటికలు : శర్మిష్ఠ, కృష్ణాష్టమి, యమునా విహారి, ఏడాది పొడుగునా, గౌతమి, వేణుకుంజం, ధనుర్దాసు (సంపుటి), శ్రీఆండాళ్లు, శ్రీవిద్యాపతి, అరుణ రథం.
3. బ్రహ్మ సమాజ కృతులు : మహతి, పద్యావళి, ఋగ్వీథి (అనువాదం).
4. అనువాదం : తిరుప్పావు.
5. యక్షగానం : శ్రీ విప్రనారాయణ.
6. గీత సంహిత : లలిత గీతాలు, సినీ గీతాల సంపుటి 'మేఘమాల', గోరింట.
7. సంగీత రూపకాలు : అతిథి శాల, కొత్త కోవెల, రాజఘట్టం, చౌరస్తా, ఋతు చక్రం.
8. వచన రచనలు : అప్పుడు పుట్టి ఉంటే (వ్యాస సంపుటి), ఏకాంత సేవ, పీఠిక, పాతిక సంవత్సరాల తెలుగు కవిత్వం (భారతిలో ప్రచురితం), బసవరాజు అప్పారావు మధుర స్మృతి (వ్యాసం), అన్నమాచారి, బహుకాల దర్శనం (సంపుటి), పుష్పలావికలు (సంపుటి).
9. పిల్లల పాటలు : పిల్లల రాజ్యం.

## 4.4. 'కృష్ణ పక్షం' కవితా సంపుటి - సారాంశం:

### 4.4.1. పరిచయం:

వియోగంలో మాధుర్యాన్ని, విషాదంలో సౌందర్యాన్ని అన్వేషించి, దర్శించిన భావకవి కృష్ణ శాస్త్రి స్వేచ్ఛ కోసం తపన, వెర్రి అన్వేషణలు కలిగి, ప్రణయం, ప్రకృతి ఆరాధన అస్తిత్వ భావంతో భావకవిత్వానికి ప్రత్యేకతను సంపాదించి పెట్టిన ఆంధ్రషెల్లీ కృష్ణశాస్త్రి గారు. భావకవిత్వశాఖ ఉన్నన్నాళ్ళే కాదు, తెలుగు సాహిత్యం ఉన్నన్నాళ్ళు సాహితీ వినీలాకాశంలో కృష్ణ శాస్త్రి ధ్రువ నక్షత్రంలా వెలగొందుతూ వుంటారు. కవితా ప్రియుల హృదయ వీణలను మీటుతూ మధుర రాగాల్ని పలికిస్తూనే వుంటారు.

### 4.4.2. ఉద్దేశ్యం:

ఈ పాఠంలో "కృష్ణ పక్షం" కవితా సంపుటి సమీక్షించడం జరిగింది. ముఖ్యమైన ఖండికలకు వివరణ ఇవ్వడం జరిగింది. విద్యార్థులు జాగ్రత్తగా అధ్యయనం చేయగలరు.

**4.4.3. పాఠ్యభాగ సందర్భం:**

కృష్ణ శాస్త్రి గారు బెజవాడ నుండి బళ్లారి రైలులో వెళ్తుండగా చుట్టూ ఉన్న నల్లమల అడవుల సోయగాలు చూస్తూ... “ఆకులో ఆకునై” అంటూ పలవరించారు. అదే తనకు భావ కవుల పరిచయం కల్గించిన తొలి రచన అని అన్నారు. ఆత్మాశ్రయం, వేదన, ప్రకృతి, విరహం, పదాల పోహళింపు, గాన లక్షణాలు కలగలపే కృష్ణపక్షం. 1921వ సంవత్సరంలో ఆరంభమయి. 1925వ సంవత్సరంలో పూర్తయింది. “కృష్ణపక్షం” కవితా సంపుటి లోని కవితలను సమీక్ష చేయడమే ఈ పాఠ్యభాగం.

**4.4.4. ‘కృష్ణ పక్షం’ కవితా సంపుటి–సారాంశం:**

“కృష్ణ శాస్త్రి ఒక గంధర్వ గీతం. నిశ్వాస పారిజాతం. పదశిల్ప విరించి, పాట పరమేశ్వరుడు. భావుకతా పట్టభద్రుడు. వేదనా మందాకిని. ఆయన స్పర్శతో ప్రాణం గానమయింది.

“కృష్ణ పక్షం” 59 శీర్షికలు గల పద్యగేయ మిశ్రమ గ్రంథం. అయితే కృష్ణపక్షమనే పదాన్ని కృష్ణ శాస్త్రిగారు, “నాకు మరణమ్ము...” అనే శీర్షిక క్రింద రాసిన తేటగీతి పద్యాల్లో ఒక్కసారే ప్రయోగించారు. అందులో ప్రియుడు నాకు మరణం వలదని వాంఛిస్తాడు. కారణం మహాంధకార కలుషితమైన కృష్ణపక్షం లాంటి చీకటి వీధుల్లో తనతో కష్టాలు పంచుకొన్న తన సహ ధర్మచారిణి, మధురమూర్తి, ప్రియురాలు, సఖురాలు, తనకు దూరమై పోతుందనే భయంవల్ల.

“మహాంధ కార కలుషిత కృష్ణపక్షంపు వీధి
కరము కరమున కీలించి కలసి మెలసి
యున్న సహధర్మచారిణి, మధుర మధుర
మూర్తి, ప్రియురాలు, సఖురాలు, పూర్ణరాగ
కలిత, నాదుఃఖ మసువులే తొలగి పోవ
వీడిపోవునేమో యను, వెరపు వలన
నాకు మరణమ్ము, వలదనినాను”

ఒకే ఒక గీతికలో ప్రయోగింపబడిన ఈ “కృష్ణ పక్షం” అనే పదంలో ఎంతో సింబాలిజమ్ వుంది. చీకటిని స్ఫురించే రేయికి, నిశీథం, అంధకారం, తమస్సు, రాత్రి మొదలగు పదాలెన్నో వున్నా, కవి ఎంచుకొన్న పదం ‘కృష్ణ పక్షం’. దానికి కారణం, మిగతా పదాల్లో వ్యక్తం కాని కాలప్రమాణం కృష్ణ పక్షంలో వుండడమే. కృష్ణ పక్షంలోని చీకటి రాత్రులు ఒకటి కాదు, రెండు కాదు, పదునాలుగు. నెలలో సగభాగం కృష్ణ పక్షం. మిగతా సగభాగం శుక్ల పక్షం, అంటే వెన్నెల రాత్రులు. తన జీవితంలో సగభాగమైన కష్టాల కాలాన్ని తనతో చేయి చేయి కలిపి ఆనందంగా స్వీకరించిన అర్ధాంగి, తన శుక్ల పక్ష రోజుల్లో తనతో సుఖాన్ని పంచుకోవలసిన సమయమాసన్నమైనప్పుడు తాను మరణిస్తే, ఇక ఆమెకి సుఖమెక్కడిది? నొసట కుంకుమ చెరిగిన భారత స్త్రీకి ఆనందమెక్కడిది? ఆమె జీవితమంతా కృష్ణ పక్షమే. అందుకే నాకు మరణము వలదంటాడు. ఇదే ఈ గీతికలోని కృష్ణ పక్షానికున్న సింబాలిజమ్.

పాఠకుల మనసుల్లో ఇంకో ప్రశ్న కూడా ఉదయించడం సహజం. “కృష్ణ పక్షం”లో ప్రణయ గీతాలు, ప్రకృతి గేయాలు, స్మృతి కవితలు, భక్తి గీతికలు వున్నాయి. కాని మొత్తం మీద ప్రణయం మీదే ఎక్కువ గేయాలున్నాయి. ప్రణయం,

ప్రేమ, శృంగారం అనేవి హృదయోల్లాసాన్ని కలిగించి, మనస్సును ఆనంద వీధులపై పరుగులెత్తిస్తాయి. మరి అలాంటి కవితలు ఎక్కువగా చోటు చేసుకొన్న ఈ కావ్యానికి కృష్ణ శాస్త్రిగారు "కృష్ణ పక్షం" అని ఎందుకు శీర్షిక పెట్టారో అని పాఠకులు ఆలోచనలో పడిపోతారు. దానికొక ముఖ్య కారణముంది. కావ్యంలోని ఎక్కువ గేయాలు, ప్రేమ, ప్రణయం, విరహం మీద వున్నావనే విషయం నిర్వివాదాంశం. ప్రేమ. అందరికీ లభ్యం కాదు. ప్రేమించిన వారినే పరిణయమాడడం, నాయని, వత్సల లాంటి, ఏ కొద్దిమంది జీవితాల్లోనే సంభవిస్తుంది. కాని అలాంటి అదృష్టానికి నోచుకున్న ఆ ప్రేయసి ప్రియుల ప్రేమకి కూడా పరీక్షలు తప్పలేదు. పెద్దవారి ఆశలు, మారిన విలువలు, వారి ప్రేమపై విషాద చాయల్ని ఆచ్ఛాదించింది. ఆ చాయలు వారి జీవితాల్లోనే కాదు, ప్రేమించి పరిణయమాడగోరే అందరి ప్రేయసీ ప్రియుల జీవితాల్లోనూ, సంఘం, ఆచారం, మతం, కులం, సంప్రదాయం, అంతస్తు అనే అడ్డుగోడలు వారిని తమ పరిధిలో బంధించి వివశుల్ని చేస్తాయి. వారి జీవితాల్లో విషాద పూరితమైన చీకటిని విరజిమ్ముతాయి. ఆ చీకటి ఒక్క రాత్రితో సమసిపోయేది కాదు. అది కష్టాల దొంతరలా ఒకటి తర్వాత ఇంకోటి మీద పడుతూనే వుంటాయి.

కృష్ణ పక్షం చీకటిలా ప్రతిరాత్రీ చీకటే. ఆ చీకటిలో నుంచి మనస్థైర్యం, విశ్వాసం, అకుంఠిత ప్రేమ కలవారే శుక్ల పక్షం వైపుకు ప్రయాణం చేయగలుగుతారు. మిగిలిన వారందరి జీవితాల్లో మిగిలేది "కృష్ణ పక్షమే". ఈ సత్యాన్ని బోధించుటకే కృష్ణ శాస్త్రిగారు తమ ప్రణయ కవిత్వానికి "కృష్ణ పక్షం" అని నామకరణం చేశారు. ప్రేయసీ ప్రియులందరికీ ఆ పేరే ఒక హెచ్చరిక. ప్రేమని సాధించడమనేది కృష్ణ పక్షాన్ని దాటడం లాంటిది. అమావాస్య, తర్వాతే పౌర్ణమి చంద్రుని కౌముదీ కాంతుల తళ తళలు కన్పిస్తాయి. అంతవరకూ కృష్ణ పక్షంలోని నిబిడ నిశీధ విషాద చీకట్లతోనే కాలం గడపక తప్పదనే సింబాలిజాన్ని ఈ శీర్షికలో, నిగూఢ పరిచారు కృష్ణ శాస్త్రిగారు.

"ఆకులో ఆకునై పూవులో పూవునై
కొమ్మలో కొమ్మనై నునులేత రెమ్మనై
ఈ యడవి దాగిపోనా.
నిచటనే యాగిపోనా....?
గలగలని వీచు చిరుగాలిలో కెరటమై
జల జలని వారు సెలపాటలో తేటనై
ఈ యడవి దాగిపోనా.
ఎట్లైన నిచటనే యాగిపోనా...."

ఆకులో ఆకు కావడం, పూవులో పూవు కావడం అద్వైతం. అలాగే గాలిలో కెరటం కావడం, పాటలో తేట కావడం అద్వైతమే. మనిషి చేత ఆత్మ, ఆకూ, పువ్వూ, జడ, ప్రకృతి సృష్టి అపూర్వ సౌందర్యానికి ఆ కృష్ణుడైన కవి ఆకుగా, పూవుగా మారాలనుకోవడం అతని స్వేచ్ఛా ప్రవృత్తిని ప్రకటిస్తుంది. అడవిలో దాగడం, ఆగడం ఎవరికీ ఇష్టమైన పనికాకపోవచ్చు. కానీ, కవి అలా కోరుకోవడంలో అతని స్వేచ్ఛతోపాటు చేతనాత్మక జగత్తు ఎంత దుఃఖ భరితమైందో స్పష్టమవుతుంది. కృష్ణ శాస్త్రి గారి కృష్ణ పక్షంలోని ప్రథమ ఖండిక ఇది. ప్రకృతిలో తాదాత్మ్యం పొందాలని ఆకాంక్షించిన భావకవి హృదయ దర్పణం ఈ గీతం. ఈ గీతంలో సాహిత్యపరమైన అర్థాన్ని అన్వయించవచ్చు. సాహిత్యానికి "అడవి" ప్రతీక. ఆకు అక్షరం.

పూవు పదం, కొమ్మ కావ్యం, నునులేత రెమ్మ వాక్యార్థం. అందులోనే దాగిపోవాలని, జీవన యాత్రను అక్కడే ముగించి ఆగిపోవాలని కవి ఆశ. గలగల వీచే చిరుగాలి హృదయ భావాల్ని వివరిస్తుంటే ఆ భావాల్ని తేటగా చెప్పాలని పారే సెలయేటి పాట జలజలమంటుంది కృష్ణ శాస్త్రికి గేయం. ఈ గీతం కవి నల్లమల అడవుల గుండా రైలు ప్రయాణం చేస్తున్న సందర్భంలో రాయబడింది.

స్వేచ్ఛాగానం (1) అనే ఖండికలో "తిమిర లత తారకా కుసుమముల దాల్ప" మొదలైన పాదాలు నవ చైతన్యాన్ని, "క్రౌర్య కౌటిల్య కల్పిత కఠిన దాస్య శృంఖలములు తమంతనె చెదరిపోవ" అనడంలో సామాజిక నియమాల కాఠిన్యం, అసంతృప్తి, తిరుగుబాటు స్ఫురిస్తాయి. ఇందులో సామాజికమైన స్వేచ్ఛను కవి వాంఛిస్తాడు. పారతంత్ర్యం, మూఢాచారాలు వీటన్నిటినుంచి స్వేచ్ఛ పొందిన నవజీవనాన్ని ఆకాంక్షిస్తాడు కవి ఈ ఖండికలో.

స్వేచ్ఛాగానం (2) లో వ్యక్తి స్వేచ్ఛను ప్రతిపాదిస్తాడు కవి. ఈ స్వేచ్ఛసామాజిక నియమాలనుండి కావచ్చు. లేదా సాహిత్య పరంగా లాక్షణిక శృంఖలాల నుండి కావచ్చు. "నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు నాయిచ్ఛయే గాక నాకేటి వెరపు?" అంటూ కవి తన స్వేచ్ఛా ప్రియత్వాన్ని ప్రకటిస్తాడు.

"నేను" అనే ఖండిక వ్యంగ్య విమర్శతో కూడింది. "రాజవీథుల రతనాల రథము నెక్కి వెడలు నిర్జీవ పాషాణ విగ్రహంబ" కవి స్వేచ్ఛకు ఆటంకం కలిగింప యత్నించిన పిఠాపుర సంస్థానంలోని ఒక ఉన్నతాధికారిని గూర్చి వ్యంగ్య విమర్శ ఇది.

"నా జీవితము" ఖండికలో నిజజీవితంలోని ఆనంద విషాదాల సమ్మిశ్రణం పట్ల ఆశ్చర్యాన్ని కవి వ్యక్తపరుస్తాడు. 'వెట్టిపాట' అనే ఖండిక ముత్యాలసరాల్లో కూర్చబడింది. ఇది బ్లేక్ ప్రభావంతో రాయబడినదని కవి పేర్కొన్నాడు.

"తేటి వలపు" బహునాయికాసక్తుడయిన నాయకుడిగా తుమ్మెదను ముగ్ధనాయికగా మల్లికను తీసుకుని అన్యాపదేశంగా జమీందారీ వ్యవస్థలోని భోగలాలసతను తెలియచేయడం జరిగింది. ఈ ఖండికలో ఏడు చంపకాలు, ఒక తేటగీతమూ వున్నాయి. ఈ ఖండిక మధ్య యుగాలనాటి జమీందారీ వ్యవస్థలో స్త్రీని విలాస వస్తువుగా పరిగణించే తత్త్వాన్ని ప్రతిబింబిస్తుంది.

"కవి కుమార" అనే ఖండిక ప్రకృతి యొక్క దివ్య సౌందర్యం నవ్య కవితా వీధుల్లో విహరించే కవి కుమారులకు ఎలా ఉత్తేజాన్ని కలిగించిందో తెలియజేస్తుంది. ప్రకృతి సౌందర్యాన్ని విశేష దృష్టితో దర్శించి దాని హృదయంలోకి చొచ్చుకునిపోయి అపూర్వానుభూతిని పొందడం కాల్పనిక కవితా లక్షణాల్లో ఒకటి. ఆ ప్రకృతి జన్యమైన ప్రేరణే ఈ ఖండికలో సూచించబడింది.

"విరిచేడె" అనే ఖండికలో రంగురంగుల రేకుల్ని సొగసు చీరల గానూ మంచు బిందువుల్ని ముత్యాలుగానూ, ఊహించి పుష్పాలకి స్త్రీత్వాన్ని కల్గించడం జరిగింది. ముగ్ధకన్యల నడుమ యవ్వనం సగం కరిగిన స్త్రీ లాగ కవికి గోచరిస్తుంది. కవి మనస్సును కరిగిస్తుంది. ప్రకృతికి హృదయాన్ని, అనుభూతుల్నీ కల్పించడం కాల్పనిక కవితలోని ప్రకృతి కవితా శాఖ లక్షణం. కొన్ననలు నవ్వు వెన్నెలలను కాస్తే వాడివాడని విరిచేడె మంచు ముత్తాయములను తాల్చిందనడంలో వయస్సులోని ఆనందోత్సాహాలు, వయస్సు మళ్లడంలోని నిరుత్సాహ విషాదఛాయలు స్ఫురిస్తాయి.

"అన్వేషణము" అనే ఖండిక కృష్ణ శాస్త్రి కవితల్లో చెప్పుకోదగ్గది. ఈ ఖండికలో ఆయన అత్యున్నత భావనాశక్తి, మహోర్జ్జ్వల రచనా సుషమ కవితా విహాయస వీధుల్లో స్వేచ్ఛా విహారం చేసాయి. ఇందులో కృష్ణ శాస్త్రి ఆత్మీయత స్పష్టంగా

ప్రతిఫలిస్తుంది. అంతర్నిగూఢమైన ఆరని సౌందర్య పిపాస జ్వాలా రూపంలో ఆయన కవిత్వమంతటా ప్రదీప్తమై సాక్షాత్కరించగా దానియొక్క పరాకాష్ట ఈ ఖండికలో దర్శనమిస్తుంది. ఇందులో గోపిక కృష్ణ శాస్త్రి హృదయం, మురళీగానం ఆయన హృదయంలో నిత్యజాగృతమైన మధుర వేదన. ఈ అన్వేషణ విరహ అయిన గోపిక విశ్వ సౌందర్య మనోజ్ఞ మంజుల మూర్తియైన కృష్ణుని కోసం అన్వేషించే తీయని తపన మాత్రమే కాదు. నిజానికిది కృష్ణ శాస్త్రి అంతశ్చేతనలో నిగూఢంగా దాగి వున్న భగవద్విరహ వేదనానుభూతి యొక్క కవితా రూపం. తానే గోపికయై తన విశ్వ సౌందర్య తృష్ణను కృష్ణ ప్రణయంగా కవి ఇందులో చిత్రిస్తాడు. ఈ విధంగా కవి హృదయాన్ని ఆవిష్కరించే ఈ రచన కృష్ణ శాస్త్రి రచనల్లో మకుటాయమానమైంది. ఇందులోని పదప్రయోగ, ఛందోవైవిధ్యం, పదాలకూర్పు, ఉపమానాల తీర్పు... అన్నీ రసావిష్కారానికి సహకారాలై సహృదయుడిని రసజగత్తులోకి లాక్కుని వెళ్ళి గోపికతోపాటు.... కృష్ణ శాస్త్రితోపాటు కృష్ణ ప్రణయ భావనలో పారవశ్యాన్ని పొందేలా చేస్తాయి. ఈ ఖండిక కందపద్యంతో ప్రారంభమవుతుంది. ఈ ఖండికలో కృష్ణ శాస్త్రి యొక్క కవితా వైశిష్ట్యమంతా దర్శనమిస్తుంది. కృష్ణ శాస్త్రి వేదన, గోపిక వేదనై, సార్వజనీనమైన అనుభూతిగా మారి, పాఠకుల్ని రసమగ్నుల్ని గావిస్తుంది. కృష్ణ శాస్త్రి కాల్పనిక కవితా ప్రస్థానంలో శిఖరాయమానమైంది "అన్వేషణము" ఖండిక.

"విశ్రాంతి" లో సర్వేశ్వరుని చేతుల్లో విశ్వమంతా విశ్రమించడాన్ని కవి ఇందులో వర్ణిస్తాడు. ప్రశాంతతను మూడు దృశ్యాల ద్వారా నిరూపిస్తున్నాడు కవి. "మహా కవి" లో గురజాడ అప్పారావుగారిని గూర్చి రాసిన కవిత. దీన్ని స్మృతిగీతగా పరిగణించవచ్చు. సన్నిహితులు, ఆప్తులు, మిత్రులు అయిన వారెవరి మరణాన్ని గూర్చి స్మృతి రూపకంగా గేయమో, కావ్యమో రాస్తే దాన్ని 'ఎలిజి' అంటారు. గురజాడ అప్పారావు గారి ముత్యాలసరాల్లోనే ఈ ఖండిక సాగడం ఔచిత్యంగా వుంది. గురజాడ కవులపై ఎంత ప్రభావాన్ని చూపించాడో, ఎలా ఆదర్శప్రాయుడయ్యాడో ఇందులో వ్యక్తమవుతోంది. ఇందులో కృష్ణ శాస్త్రిగారికి గురజాడమీద ఉన్న భక్తి ప్రపత్తులు వ్యక్తమవుతాయి. గురజాడ అడుగుజాడ తర్వాతి కవులపైన పడిందనే విషయాన్నీ గేయం సువ్యక్తం చేస్తోంది.

"అతని పాట" ఖండికలో మొదట సంధ్యావర్ణనంతో వాతావరణాన్ని కవి సృష్టిస్తాడు. ప్రకృతి ప్రేరణలో స్వచ్ఛందంగా వెలువడే గీతంలోని మాధుర్యాన్ని కవి ఇందులో స్ఫురింపజేస్తాడు. "లోకము" లో పరహితైకమతులు ఎలా స్వీయసుఖాన్ని పోగొట్టుకుని కష్టాల్ని పొందుతారో తెలిపి తన సానుభూతిని కవి వ్యక్తం చేస్తాడు. "ఏల ప్రేమింతును" అనే ఖండిక ప్రేమ ప్రతిఫలాపేక్ష రహితమైనదనే ఉపదేశాన్నిస్తుంది. ప్రకృతి అంతా ప్రేమమయంగా కవికి గోచరిస్తుంది.

"దివ్య భాగ్యము" అనే కవిత కూడ ప్రేమ యొక్క పరమోత్కృష్టతను చాటుతుంది. ప్రేమానుభూతి యొక్క పరమోత్తమత్త్వం ఇందులో వ్యక్తమవుతుంది. ప్రేమే అన్నిటినీ మించిన మహద్భాగ్యంగా కవి స్పష్టం చేస్తాడు. "నా ప్రేమ" రచన ప్రణయం ఎలా హృదయ కాలుష్యాన్ని ప్రక్షాళన మొనరిస్తుందో, ఎలా పవిత్రంగానూ, పరమ కోమలంగానూ తీరుస్తుందో చాటుతుంది.

"విరిసి విరియని" అనే ఖండికలో యవ్వనపు సౌందర్యం యొక్క లాలిత్యాన్ని "విరిసి విరియని క్రొవ్విరి" తో కవి పోలుస్తాడు. 'క్రొవ్విరిని' స్పృశించడానికి బుద్ధి పుట్టకపోవడం సంయోగావధికయైన శృంగారం పట్ల విముఖతను ధ్వనిస్తుంది. ప్రాణకాంతలో ప్రబంధ సాహిత్యంలో ప్రణయోద్దీపకాలైన వాటిని విరహంలో ఉపాలంభించడం విస్తృతంగా గోచరిస్తుంది. ఈ రచనలో కూడ ఆ ఛాయలు స్ఫురిస్తాయి. కాని చెప్పిన పద్ధతిలో క్రొత్తదనముంది. సౌరభాన్ని, గానాన్ని, హిమకణాన్ని, తేనె చినుకును, నీరదాన్ని, నీలాన్ని, తేటివ్రాతను కోయిలకూతను, శాంతినిమ్మని అర్థిస్తాడు. ప్రణయ భావనోద్వేగి అయిన కవి. ప్రణయాన్ని మలయానిలంతోనూ, నీరజంతోనూ, విమల అంబరాబ్ధితోనూ, వనతరు శాఖతోనూ పోల్చడంలో ప్రణయలాలిత్యం,

సౌకుమార్యం, సొంపు సహజత్వం స్ఫురిస్తాయి.

"మాటి మాటికి" ఖండిక కవి వియోగార్తిని ప్రకటిస్తుంది. సర్వ ప్రకృతిలోనూ ప్రణయినీ మూర్తే కవికి గోచరిస్తుంది. వియోగంతో బరువెక్కిన హృదయం అతి భయంకర సాంద్ర నీలాభ్రపటలిగా ఉపమింపబడింది. ఈ భారం విరహ బాధ కన్నీరుగా స్రవిస్తేనే గాని తీరదు. కన్నీరు తాపాన్ని పోగొట్టడమే భావకవులు బహుధా ప్రతిపాదించారు. ఇది అనుభవసిద్ధం కూడ. తన వేడి నిట్టూర్పుల్ని ప్రియురాలి చెంతకు మోసుకుని పొమ్మని మలయ పవనాన్ని అర్థిస్తాడు ప్రియుడు. అచేతనాలకు చేతనత్వాన్ని కూర్చి ప్రకృతి తమతో సానుభూతిని వ్యక్తం చేయాలని భావించడం భావకవితలో బహుధా గోచరిస్తుంది.

"ప్రేయసీ" లో తటిల్లతగా మెరిసి మాయమయిన ప్రేయసికి తన ప్రణయాన్ని నివేదించి "నన్ను తలచి రావో" అంటూ పిలిస్తే ఆమె తాను పరకీయనని ఇతని ప్రణయాన్ని తిరస్కరించడం తెలుపబడింది. ప్రకృతిలో తన ప్రియురాలిని వెదక్కుంటాడు కవి. అనేక ఖండికల్లో వివిధ ప్రకృతి రూపాలుగా సాక్షాత్కరించిన ప్రణయినీమూర్తి కవి ఊహలో ఊర్వశిగా రూపు దాలుస్తుంది.

"కిలకిలని" లో ప్రేయసి పువ్వుగా, మబ్బుగా, చిన్నిపులుగా, లావణ్యమూర్తిగా సాక్షాత్కరిస్తుంది. కవి మాత్రం బాధాతప్తుడు ఆమె వలపు తలపుల్లో తన్ను తాను దీనుడిగా భావిస్తాడు. ఆమెను కనులార కాంచడం వరకే అతని ఆకాంక్ష. కాని అది కూడ దుఃఖాశ్రు సలిలమౌక్తికంచే అవరోధింపబడుతుంది. ఉద్విగ్న ప్రణయభావనలా విషాదమాధుర్యమంతా ఈ ఖండికలో రూపు దాలుస్తుంది. "మోడునై, జాయినై నిలిచిపోదు" అనడంలో నిరాశ, నిశ్చైతన్యం స్ఫురించి ఒక విషాద వాతావరణాన్ని కల్పిస్తాయి.

"ఆరని దివ్వె" లో ప్రణయభంగంలో పొందిన నైరాశ్యం కవిలో మరణాసక్తిని కలిగిస్తుంది.

"అయ్యో" ఖండికలో భగ్న ప్రణయం తాలూకు వేదనే వ్యక్తమవుతుంది. ఆశలు, ఆశయాలు నశించి జీవన మకరందం, ప్రణయ సౌరభం కోలుపోవడం జరుగుతుంది. కవి తన అతృప్త హృదయంలోని మధురార్తిని ఒక విషాద భావనాన్ని వ్యక్తం చేయడానికి ఇందులో ప్రయత్నిస్తాడు. "నవ్య మోహన" అనే పద్యం ఇలాంటి అస్పష్టానుభూతినే తెలుపుతుంది. ఇందులో కోకిలానంద గీతి, మనోహర సుగంధం అని లభంగాల్లో కొట్టుకు పోవడమొక మనోహరమైన అనుభవం దూరం కావడాన్ని స్ఫురింపచేస్తాయి.

"నా విరుల తోట" కరుణ రస స్పర్శగల గీతం. తన అనుభూతుల్లో ప్రకృతి పాలు పంచుకుంటున్నట్లు వర్ణించడం కాల్పనిక కవితా విశిష్ట లక్షణం. కరుణ రస స్ఫూర్తికి ప్రకృతిలో విషాదాన్ని పలికించడం ఉద్దీపనాన్ని కలిగిస్తుంది. ఈ ఖండిక కృష్ణ శాస్త్రి గారి ప్రథమ కళత్రం మృతి చెందినప్పుడు రాశారు. ఆత్మాశ్రయ కవిత్వానికిదొక మచ్చుతునకనవచ్చు.

"చిన్ని పూవే" ఖండిక ఒక సౌందర్యాత్మకమైన వస్తువు విధ్వస్తమైనప్పుడు కవిలో కదిలిన కరుణ గీతి. 'చిన్ని పూవె' అనడం పుష్పం యొక్క సౌకుమార్యాన్ని, లాలిత్యాన్ని స్ఫురింపచేసి అది వాడిపోవడంలో కలిగే విషాదనుభూతికి బలాన్ని సంతరిస్తుంది. "లోకమా" ఖండిక ప్రణయ మాధుర్యాన్నెఱుగని లోకం స్వేచ్ఛా ప్రణయ జీవులన్నీ బంధింపబూనడం పట్ల నిరసన తెలుపుతుంది. ఈ రెండు ఖండికలు సమకాలీన సమాజం వల్ల కలిగిన అవరోధాలు కవి హృదయంలో రేపిన విషాదాల్ని వ్యక్తం చేస్తాయి.

"అబ్బ" శీర్షికే దుర్భరమైన బాధననుభవించడాన్ని వ్యక్తం చేస్తుంది. క్రూరమైన సమాజం తన హృదయోద్యానవనంలో సుమము యొక్క మృదులం, మనోహరమయిన దళాల్ని నిర్దయగా త్రుంచి నలిపి ధూళిలో కలిపారని ఆక్రోశిస్తాడు. కవిలోని

సున్నితమైన మనస్తత్వం మీద సమాజం తాలూకు శృంఖాలు చూపిన దారుణ ప్రభావాన్ని ఇందులో వ్యజింపచేస్తాడు. తన ఆశయ భరితమైన జీవితాన్ని సామాజిక నియమాలు విధ్వంసం చేయడంలో కలిగిన తీవ్రమైన పరితాపాన్ని వ్యక్తం చేస్తాడు కవి. ఇది సామాజిక నియమాలనుండి వ్యక్తి స్వేచ్ఛను ఆకాంక్షించే కాల్పనిక కవితాతత్త్వాన్ని ప్రతిబింబిస్తుంది. సమాజ మూలకమైన విషాదాన్ని ఇందులో కవి స్ఫురింపచేస్తున్నాడు.

"చుక్కలు" లో కాంక్షావైఫల్యం స్ఫురిస్తుంది. కవి హృదయంలోని ఆరని సౌందర్య తృష్ణ ఎలా అసంతృప్తమై వేదనా జనకమౌతుందో ఇందులో స్ఫురిస్తుంది. కాల్పనిక కవులు ఈ ఊహాలోక విహారాల వల్లనే విషాదపు బరువును తమ రచనల్లో వెలిగక్కడం జరిగింది. ఈ కాంక్షావైఫల్యం తాలూకు విషాదచ్ఛాయలు కృష్ణ శాస్త్రి రచనల్లో విస్తృతంగా గోచరిస్తాయి.

"ఆశ" కన్నీటి కెరటాల్లో వెన్నెల్ని, నిట్టూర్పు గాడ్పులో నెత్తావినీ, చూడగలగడం. విషాదంతో ఆనందాన్ని అనుభవించడాన్ని సూచిస్తుంది. "నేనొకండ" ఖండికలో శోక ప్రియత్వం కన్పిస్తుంది. "ఏడ్వలేక ఏడ్వలేక ఏడ్చుచుంది" అని "ఇట్లే విలపించి కృశియింతు నేను" అని "ఏడ్వలేక కృశియింతు నే నొకండ" అని కవి శోక ప్రియత్వాన్ని ప్రకటిస్తాడు. ఇందులో ప్రకృతి క్షాళనం జరగడం స్ఫురిస్తుంది.

"దుఃఖం" ఖండికలో కవి తన దుఃఖానుభూతిని ప్రకటించి ఈ దుఃఖం యొక్క దుర్భరత్వాన్ని వ్యక్తం చేస్తాడు. దుఃఖానికి కవి హృదయానికి వున్న నిరంతర సంబంధం ఇందులో వ్యక్తమవుతుంది. కాని ఇంత దుఃఖ భారాన్ని భరింప లేనంటాడు కవి. "సగము వాడిన మృదుల పుష్పమ్ము సుమ్ము. నిదురపోనిమ్ము లేకున్న నేలవాలు" అంటూ దుఃఖ విముక్తిని ఆకాంక్షిస్తాడు. శోకప్రియత్వమే ప్రధానంగా కన్పించే కాల్పనిక కవితా ధోరనిణలో దుఃఖ నిరాసం అరుదుగా కన్పిస్తుంది.

"ఓయి సంధ్యా సమీరణా" అనే గీతంలో "రేయి, కారు చీకటి" దుఃఖానికి సైదోడులుగా అభివర్ణింపబడ్డాయి. అవి రాకముందే నిత్య తేజోమయ ఆనంద నిలయమునకు తనను చేర్చమని కవి సంధ్యా సమీరణాన్ని ఆర్థిస్తాడు. విషాదంలో నుంచి ఆనందంలోకి పయనించాలన్న ఆకాంక్ష ఇందులో కన్పిస్తుంది. రేయి, కారు చీకటి నిశ్చైతన్యానికి, భయంకర వాతావరణానికి ప్రతీకలుగా నిలుస్తాయి. సంధ్యా సమీరణానికి నునులేత రెక్కల్ని కల్పించడం కాల్పనిక జగత్తులోని ఊహాచిత్రం మాత్రమే. సంధ్య మబ్బులపావడాల ఛాయలలోనో, తరణి బంగారు కిరణాల మెఱుగులలోనో లీనం కావాలనుకోవడం ప్రకృతిలో తాదాత్మ్యాన్ని పొందాలన్న వాంఛను తెలుపుతుంది. "నిరాలోచనం" కూడ విషాద భావనా కటమే.

"వద్దు" అనే ఖండికలో ఒక కన్నీటి చినుకు, ఒక నిట్టూర్పు శోకలవం ఎంత తీవ్రమైన విశ్వాన్ని సంక్షుభితం చేస్తాయో, ఆ శోకమెంత బలవత్తరమైనదో వ్యక్తమవుతుంది. "నన్నుగని యేరు జాలి చెందంగవలదు" ఖండికలో "ఎవ్వరని యెంతురో నన్ను?.. ఏననంత శోకభీకర తిమిర లోకైక పతిని" అంటూ శోకమే తన సామ్రాజ్య సంపదగా కవి చాటుతాడు. తన శోకంలోనే ఆనందం ఉందంటాడు. కవి తన విలాప నిబిడ గీతికావళీ విరామంలో అర్ధరాత్రి గర్భాన్ని మరీమరీ భీషణకాళిమోన్మత్తరాగ చేస్తాననడంలో తన శోక ప్రభావాన్ని ప్రకృతిపై ఉన్నట్టుగా ఊహించుకుని ఈ శోకానికి మరింత ఉద్దీపనాన్ని కలిగిస్తాడు.

"నేను కూడ" ఖండిక కవిలోని స్వేచ్ఛాకాంక్షను వ్యక్తం చేస్తుంది. "మూగవోయిన నాగళమ్మునను గూడ నిదురవోయిన సెలయేటి రొదలు కలవు" అనే పాదాలు ఖండిక అంతటా పరివ్యాప్తమైన విషాదభావనకు మకుటాయమానం కావడమే కాకుండా గీత రచనకు దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత కవి కంఠం మూగపోవడంతో ఇప్పుడివి కవిలో ఆనాడే తనకు తెలియకుండానే భావి విషాద ఘటన కవితా రూపంలో వ్యక్తమయిందేమోనన్పిస్తుంది.

"మీరు మనసారగ నేడ్వనీరు నన్ను" అనే ఖండికలో శోకప్రియత్వం గోచరిస్తుంది. "విసువు లేక విరతి లేక దుర్భర శోక విషమ గీతులేడ్చి వైతు" అంటూ తన శోకంలోంచి ఎలా విషాద గీతాలు వెలువడుతాయో కవి సూచిస్తాడు. ఈ శోక తీవ్రత కవిని తీవ్రంగా ఆక్రమించుకుంటుంది. ఇది మృత్యువాంఛను ప్రేరేపిస్తుంది.

"మా బాబయ్య – నాన్నగారు" అనే శీర్షికతో వున్నవి, కవి తన పెత్తండ్రి గారి మీద, తండ్రి గారి మీద రాసుకున్న స్మృతి గీతాలు. ఈ ఏడు ఖండికల్లో వారిరువురి కవితా వైభవాన్నీ, పిఠాపుర ప్రభువులైన గంగాధర రామరాయలు, సూర్యారావు బహుదూర్ వారిరువురి మీద చూపిన ఆదరాభిమానాలు. వారి కవితాగాన మహత్త్వం, తనపై వారి ప్రభావం వారి మూలంగా తన జీవితం పునీతంగావడం కవి ప్రకటించాడు. పిఠాపుర ప్రభువు రావుబహద్దర్ గంగాధర రామారావు ఈ మహాకవుల్ని తన సింహాసనం మీద అధివసింపజేసి స్వయంగా వింజామరలు వీవడాన్ని కవి ఇందులో వివరించాడు.

"నాకు మరణమ్ము" ఖండికలో మృత్యు నిరసన వ్యక్తమవుతుంది. ఈ మృత్యు నిరసన లోకసామాన్యమైన మృత్యుభీతి కాదు. ఈ మృత్యు నిరసనానికి కారణం లౌకిక బంధాల మీద, సుఖాల మీద వాంఛకాక శోక ప్రియత్వం కావడం ఇందులోని విశేషం. కవి మరణాన్ని వలదన్నాడే కాని మరణ భయం అతనికి లేదు. మరణమన్న మాటను భయంకరమైనదిగా కాక "లేతనుడి' గా అనడంలో కవి నిర్భీకత వ్యక్తమవుతుంది.

"ప్రతీక్ష" అనే ఖండికలో విషాద సుఖమన్నది అపురూపమైన భావన. ఇది వరకు చాల ఖండికల్లో లాగానే ఇందులోనూ దుఃఖంలో సుఖాన్ని అనుభవిస్తాడు కవి. "ఇదె వచ్చుచున్నాను" ఖండికలో మార్మికత ధ్వనిస్తుంది.

"నిర్యాణం" అనే ఖండిక కూడా మార్మిక కవితా ఛాయల్లో సాగిందే. కృష్ణ శాస్త్రి కవిత్వాన్ని పరిశీలించేటప్పుడు భావ కవి ఎంతటి సౌందర్యారాధకుడో, అంతటి శోకమూర్తి అన్పిస్తుంది. 'కృష్ణ పక్షం' కృష్ణ శాస్త్రి విషాద హృదయాన్ని పరిచయం చేసే ఖండ కవితా సంపుటి. అనేక కవితల్లో అతని అవధుల్లేని దుఃఖాన్ని మనం గుర్తించవచ్చు. కవులు చంద్రబింబాన్ని చెలిమోముతో పోలుస్తారు. కృష్ణ పక్షంలో చంద్రుడు క్రమ క్రమంగా తన కళల్ని పోగొట్టుకుని అమావాస్యనాడు అసలే కన్పించకుండా పోతాడు. అలాగే కవికి నచ్చిన ప్రేయసి మొదట ఆయా కవితల్లో కొద్ది కొద్దిగా కన్పిస్తూ చివరికి దూరమౌతుంది. తన నుంచి దూరమైన ప్రేయసిని స్మరింపకుండా ఉండలేడు. ప్రియుడు. సౌందర్యారాధకుడైన కవికి చంద్రబింబం కన్పించక పోతే ఎంత బాధ కలుగుతుందో, ప్రియునికి ప్రేయసి కన్పించకపోతే అంతే బాధ కలుగుతుంది. "కృష్ణ పక్షం" కృష్ణ శాస్త్రి జీవితంలోని విషాదానికి సంకేతం. కృతి పూర్తిగా కవి హృదయ ఘోషను వ్యక్తం చేస్తుంది. "కృష్ణ పక్షం" కృష్ణ శాస్త్రికి పర్యాయ పదం అయింది. భావకవిత్వ యుగానికి ఎత్తిన పతాక అయింది.

**– డా॥ బలరామ్ కచ్చుళ్ళ**

## పాఠం - 5

# కృష్ణ పక్షం

**- దేవులపల్లి కృష్ణ శాస్త్రి**

**విషయసూచిక:**

**5.1. కఠిన పదాలకు అర్థాలు**

**5.2. 'కృష్ణ పక్షం' కవితా సంపుటి - సందర్భ సహిత వ్యాఖ్యలు**

## 5.1. కఠిన పదాలకు అర్థాలు:

1. కృష్ణ పక్షం = నెలలో పున్నమి నుండి అమావాస్య వరకూ గల రోజుల భాగం.
2. అవిరళ = విరామము లేకుండా, నిరంతరం
3. మలయా = కొండ, ఆరామము
4. ఊర్మి = అల, ప్రకాశము, వస్త్రపు ముడత
5. ప్రమద = యవ్వనంలో ఉన్న స్త్రీ
6. షట్పదము = తుమ్మెద
7. తలరు బోడి = చిగురు వలె మనోజ్ఞురాలైన స్త్రీ
8. తలిరు = చిగురు, పల్లవము
9. జిలుగు = స్వర్ణ పుష్పం
10. పాషానము = రాయి, శిల
11. శీకరము = తుంపర
12. అలరు = వికసించు, పుష్పము, సంతోషము
13. సుమము = కుసుమము, పువ్వు
14. తేటి = భ్రమరము, తుమ్మెద
15. కరణి = విధము
16. తిమిరం = చీకటి
17. మ్రోడు = స్థాణువు, మొక్క
18. ఝరులు = సెలయేళ్ళు
19. ప్రమద = మిక్కిలి మదము గలది

| | |
|---|---|
| 20. తలిరు | = చిగురు |
| 21. వికస్వరము | = వికసించునది |
| 22. భూధరము | = పర్వతము |
| 23. క్రొన్ననలు | = క్రొత్త మొగ్గలు |
| 24. తలిద | = రాగి పైరు |
| 25. తుహినము | = హిమము, మంచు |
| 26. స్వాదము | = రుచి |
| 27. అరయు | = వెదకు |
| 28. కౌముది | = స్త్రీ, చంద్రిక, వెన్నెల |
| 29. తొట్రు | = సంభ్రమము, ఆశ్చర్యము |
| 30. యుగము | = జత, యుగళము |
| 31. పరభృతము | = కోయిల |
| 32. చిత్తము | = మనసు |
| 33. మధుపము | = తుమ్మెద |
| 34. సౌరభము | = వాసన |
| 35. ముత్తి | = మోక్షము |
| 36. ఏలిక | = రాజు |
| 38. వెరపు | = ఉపాయము |
| 39. క్రొవ్విరి | = క్రొత్త పువ్వు |
| 40. అచల | = కదలనిది, కొండ |
| 41. సరోజము | = తామర, కమలము, పద్మము |
| 42. సలిలము | = జలము |
| 43. సౌదామిని | = అప్సరస |
| 44. తావు | = స్థానము |
| 45. మత్తి | = కామము |
| 46. విరులు | = పూవులు |
| 47. కుంతలము | = వెంట్రుక, నాగలి |
| 48. అనలము | = అగ్ని |

49. కుహరము = రంధ్రము, గుహ

50. జాహ్నవి = గంగ

51. నెత్తావి = పరిమళము, సువాసన

## 5.2. "కృష్ణ పక్షం" కవితా సంపుటి - సందర్భ సహిత వ్యాఖ్యలు:

### 1. "ఈ కరణి వెఱ్ఱినై యేకతమ తిరుగాడ"

**పరిచయం:** ఈ వాక్యం దేవులపల్లి కృష్ణ శాస్త్రి రచించిన 'కృష్ణ పక్షం' కవితా సంపుటిలోని 'ఆకులో ఆకునై ....' అనే కవితా ఖండిక నుండి గ్రహించబడింది.

**సందర్భం:** ప్రకృతిలోని ఆహ్లాదానికి, రమణీయతకు పరవసుడై కవి తనకు తాను ప్రకృతిలో మమేకమై ప్రకృతితో కలిసి సాగిపోవాలని భావించిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ప్రకృతిని సూచి పరవశించిపోతూ కాని ఆకలి దప్పులు లేకుండా ఒంటరిగా ఈ ప్రకృతిలో తిరుగుతానన్నది భావం.

### 2. "విశ్వమే పరవశ మయి వెంట బాడ"

**పరిచయం:** ఈ వాక్యం దేవులపల్లి కృష్ణ శాస్త్రి రచించిన 'కృష్ణ పక్షం' కవితా సంపుటిలోని 'స్వేచ్చా గానం-1' అనే కవితా ఖండిక నుండి గ్రహించబడింది.

**సందర్భం:** కష్టాలన్నీ తొలగిపోయిన తరువాత కవి మానసిక పరిస్థితి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** లోకంలో ఉన్న కష్టాలన్నీ తొలగి పోయిన తరువాత స్వేచ్ఛగా తాను పాడుకొనే పాటకు ఈ విశ్వం వంతపాడగా ఈ విశ్వమంతా సేచ్చాగాలులతో నింపుతానంటాడు కవి.

### 3. "పక్షినయ్యెద చిన్ని ఋక్ష మయ్యెదను"

**పరిచయం:** ఈ వాక్యం దేవులపల్లి కృష్ణ శాస్త్రి రచించిన 'కృష్ణ పక్షం' కవితా సంపుటిలోని 'స్వేచ్చా గానం-2' అనే కవితా ఖండిక నుండి గ్రహించబడింది.

**సందర్భం:** స్వేచ్ఛా ప్రవృత్తి కలిగిన కవి తనకు ఇష్టమైన రీతిలో బ్రతికే స్వేచ్ఛ ఉందని తెలియజేసే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** సామాజిక కట్టుబాట్లు తొలగి స్వేచ్ఛా ప్రవృత్తి కలిగిన మీదట ప్రకృతిలో తనకు నచ్చిన విధంగా పక్షిలాగా, చిన్న ఎలుగుబంటిలాగా రూపం ధరిస్తానని అనంద పరవసుడు అవుతాడు కవి.

### 4. "చిత్ర చిత్ర గతుల మార్పు జీవితంబు!"

**పరిచయం:** ఈ వాక్యం దేవులపల్లి కృష్ణ శాస్త్రి రచించిన 'కృష్ణ పక్షం' కవితా సంపుటిలోని 'నా జీవితము' అనే కవితా ఖండిక నుండి గ్రహించబడింది.

**సందర్భం:** ఆధునిక సమాజ ధోరణిని తెలియజేసే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** మనిషి వాస్తవం తెలిసి కూడా వక్రమార్గాల్లో ప్రయాణించే తీరు చూస్తే వాని జీవితం విచిత్రంగా ఉందని తెలియజేసాడు కవి.

**5. "విశ్వమే హాయిగా విశ్రాంతి జెందె!"**

**పరిచయం:** ఈ వాక్యం దేవులపల్లి కృష్ణ శాస్త్రి రచించిన 'కృష్ణ పక్షం' కవితా సంపుటిలోని 'విశ్రాంతి' అనే కవితా ఖండిక నుండి గ్రహించబడింది.

**సందర్భం:** ఈ విశ్వం నందు ఏమేమి ఏ విధంగా విశ్రాంతి పొందుతున్నాయో తెలియజేసే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** నక్షత్రాలు ఆకాశంలోనూ, పిల్ల గాలులు కొమ్మల ఆకులలోనూ, నాట్యం శైవలిని నందు ఏ విధంగా విశ్రాంతి పొందుతున్నాయో ఈ విశ్వం కూడా సర్వేశ్వరుని చల్లని చేతులలో హాయిగా విశ్రాంతి పొందుతుంది.

**6. "లోకమోహన మధురగానా స్వాద మోదమున"**

**పరిచయం:** ఈ వాక్యం దేవులపల్లి కృష్ణ శాస్త్రి రచించిన 'కృష్ణ పక్షం' కవితా సంపుటిలోని 'మహాకవి' అనే కవితా ఖండిక నుండి గ్రహించబడింది.

**సందర్భం:** మహాకవి గురజాడ అప్పారావును స్మరిస్తూ కవి చెప్పిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** నవ్య కవిత్వానికి నాంది పలికిన గురజాడ వారి మరణంతో చుక్కలు ప్రకాశించడంలో అలసి నిద్రలోనికి జారుకున్నాయని, పర్వతాలు చలించాయని, లోకమంతా కీర్తించిందని కవి భావించాడు.

**7. "వెర్రి మిత్రుడు, లోకంపు విధము కనవా?"**

**పరిచయం:** ఈ వాక్యం దేవులపల్లి కృష్ణ శాస్త్రి రచించిన 'కృష్ణ పక్షం' కవితా సంపుటిలోని 'లోకము' అనే కవితా ఖండిక నుండి గ్రహించబడింది.

**సందర్భం:** సమాజ తీరుని గ్రణించి నడచుకోమని చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** వేష్యా వ్యామోహంతో అలంకరించుకొని వెలుతున్నావే! ఇంటి దగ్గర లేనిది అక్కడ నువ్వు పొందిన సుఖమేమిటో తెలుసుకొని, సమాజ తీరుని గ్రహించి నడచుకోమని చెబుతాడు కవి.

**8. "గాన మొనరింపక బ్రతుకు గడవ బోకా?"**

**పరిచయం:** ఈ వాక్యం దేవులపల్లి కృష్ణ శాస్త్రి రచించిన 'కృష్ణ పక్షం' కవితా సంపుటిలోని 'ఏల ప్రేమింతును?' అనే కవితా ఖండిక నుండి గ్రహించబడింది.

**సందర్భం:** ప్రకృతిలో జరిగే ప్రతి చర్యకు కారణాలు లేనట్లే నిన్ను ప్రేమించడానికి కూడా కారణం లేదని ప్రేమతత్త్వాన్ని వివరించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** పువ్వులు సువాసనలను, చందమామ చల్లని కాంతులను, గాలులు ఏ విధంగా సహజంగా వస్తున్నాయో, కోయిల ఏవిధంగా గానం చేస్తుందో, నీ మీద నా ప్రేమ కూడా అటువంటిదే. బ్రతుకు గడవక కోయిల గానం చేయడం లేదన్నది కవి భావన.

**9. "దిగిరాను దిగిరాను దివి నుండి భువికి".**

**పరిచయం:** ఈ వాక్యం దేవులపల్లి కృష్ణ శాస్త్రి రచించిన 'కృష్ణ పక్షం' కవితా సంపుటిలోనుండి గ్రహించబడింది.

**సందర్భం:** స్వేచ్ఛా ప్రియత్వం కలిగిన కవి, తన ఇష్టాన్ని ప్రకటించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** లోకమంతా పరవశమై తనతో పాట పాడుకొనేటట్లు స్వేచ్ఛా గానాన్ని పాడుతాను. మబ్బుల తెరచాటు చేసుకున్న చందమామతో జతకట్టి దోబూచులాడి సరసాలాడుతాను. ఆకాశం నుండి మాత్రం దిగిరాను. ఎవ్వరు నవ్వితే నాకేంటి? అని కవి తనకున్న కోర్కెను ప్రకటిస్తాడు.

**10. "మోడునై రాయినై నిల్చిపోదు నకట"**

**పరిచయం:** ఈ వాక్యం దేవులపల్లి కృష్ణ శాస్త్రి రచించిన 'కృష్ణ పక్షం' కవితా సంపుటిలోని 'కిలకిలని...' అనే కవితా ఖండిక నుండి గ్రహించబడింది.

**సందర్భం:** కవి ప్రకృతిలో ప్రేయసిని దర్శిస్తూ, దుఃఖంతో నిశ్చేష్టుడైన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** తన ప్రేయసి పువ్వుగా, మబ్బుగా, లావణ్యమూర్తిగా సాక్షాత్కరించిన క్షణాన బాధాతప్తుడై ఒక మోడులాగా, రాయిలాగా నిశ్చేష్టుడై అక్కడ నిల్చుంటానని కవి తెలియజేసాడు.

**11. "విరిసి విరియని క్రొవ్విరి".**

**పరిచయం:** ఈ వాక్యం దేవులపల్లి కృష్ణ శాస్త్రి రచించిన 'కృష్ణ పక్షం' కవితా సంపుటిలోని 'విరిసి విరియని' అనే కవితా ఖండిక నుండి గ్రహించబడింది.

**సందర్భం:** ప్రణయ భావోద్వేగి అయిన కవి యవ్వనం గురించి వర్ణించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** యవ్వనపు సౌందర్యం యొక్క లాచిత్యాన్ని విరిసి విరియని పువ్వుతో పోలుస్తూ, ప్రణయాన్ని మలయానిలంతోనూ, నీరజంతోనూ, విమల అంబరాబ్ధితోనూ, వనతర శాఖతోనూ పోల్చుతాడు కవి.

**12. "ఈ శిథిల జీవనమ్ము మ్రోయింప గలదు".**

**పరిచయం:** ఈ వాక్యం దేవులపల్లి కృష్ణ శాస్త్రి రచించిన 'కృష్ణ పక్షం' కవితా సంపుటిలోని 'అన్వేషణ' అనే కవితా ఖండిక నుండి గ్రహించబడింది.

**సందర్భం:** రేపల్లిలో యమునా నది సమీపంలో బృందావన వీధులలో ఎవరికోసమో అన్వేషిస్తూ తిరుగాడుతూ తనలో తాను అనుకునే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** బాలకృష్ణుని గురించిన పాటలు ఏ రోజూ వినలేదు. అతని పాట చేతులలోని మురళి గాదు, నాలోని ఎండిపోయిన హృదయన్నే కాదు, ఈ శిథిలమైన జీవనాన్ని కూడా మ్రోయింప గలదన్నది కాని భావన.

**13. "చింతలను బాయుదము చేయి చేయి కలిసి"**

**పరిచయం:** ఈ వాక్యం దేవులపల్లి కృష్ణ శాస్త్రి రచించిన 'కృష్ణ పక్షం' కవితా సంపుటిలోని 'దివ్య భాగము' అనే కవితా ఖండిక నుండి గ్రహించబడింది.

**సందర్భం:** కవి తన ఊహా ప్రేయసిని తలుచుకుంటూ ఆవేదనతో పలికిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** కవి తన మనసులోని ఊహా ప్రేయసిని ఊహించుకొన్నాడు. కానీ ఆమెను చేరలేదు. అప్పుడు అతని మనసు పరిపరి విధాలుగా ఉంటుంది. అతని మనసు సముద్రాలు దాటి, ఎత్తైన పర్వతాలెక్కి క్రిందా మీదా తెలియకుండా పక్షిలాగా రెక్కలు దాల్చి మాటిమాటికి తన వలపుల పేటి దగ్గరకు పరుగులెత్తుతుంది.

**14. సుకుమార కుసుమ మొకటి నవ్వె కిలకిల మని నా మనమ్ములోన'**

**పరిచయం:** ఈ వాక్యం దేవులపల్లి కృష్ణ శాస్త్రి రచించిన 'కృష్ణ పక్షం' కవితా సంపుటిలోని 'నా విరుల తోట' అనే కవితా ఖండిక నుండి గ్రహించబడింది.

**సందర్భం:** కవి ఒక పూల తోట పెంచుకుంటూ, దాని గురించి ప్రస్తావించిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** కవి ఒక పూల తోటను వేసి, అందులో ఒక గులాబీ మొక్కను ప్రాణ ప్రదంగా చూసుకుంటూ ఉంటాడు. కొన్ని రోజులకు మరొక సుకుమార కుసుమము ఆ పూల తోటలోకి చేరిందని భావం.

**15. "వెఱ్ఱిలోకమా! హృదయంపు స్వేచ్ఛ నెటులు పంజరమున బంధింతె?"**

**పరిచయం:** ఈ వాక్యం దేవులపల్లి కృష్ణ శాస్త్రి రచించిన 'కృష్ణ పక్షం' కవితా సంపుటిలోని 'లోకమా' అనే కవితా ఖండిక నుండి గ్రహించబడింది.

**సందర్భం:** ప్రేమ జీవుల స్వేచ్ఛను ఎవరూ బంధించరాదని కవి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** లోకమా ఎంతటి ధారుణ కార్యం చేయడానికి తలపెట్టావు. నీవు ప్రణయ మాధుర్యాన్ని ఎరగవు, పాపము అనవు, రెక్కలు కూలుస్తావు, పంజరంలో బందిస్తావు, వెఱ్ఱిలోకమా! భౌతికంగా ఇవన్నీ చేస్తావేమో గాని హృదయ స్వేచ్ఛను ఏ విధంగా పంజరంలో బంధిస్తావు అని కవి భావం.

**16. "పేదనై పోయి ఎట్లు జీవింతునోయి".**

**పరిచయం:** ఈ వాక్యం దేవులపల్లి కృష్ణ శాస్త్రి రచించిన 'కృష్ణ పక్షం' కవితా సంపుటిలోని 'స్వాధు సంగీత' అనే కవితా ఖండిక నుండి గ్రహించబడింది.

**సందర్భం:** కవి ఊహలోని ఊహా ప్రేయసి తాను అన్నీ కోల్పోయానని బాధపడు సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ఊహా ప్రేయసి తాను పొంద వలసిన వీణను, పూల దండను, రాజ కిరీటాన్ని పొందలేక పోవడంతో, ఆ విషయములను తలచుకుంటూ అన్నీ పోగొట్టుకొని – పేదనైపోయిన నేను ఎట్ల జీవిస్తాను అని బాధపడుతుంది.

**17. "ఎచట కేగుచు నుంటివో యేమో నేడు!"**

**పరిచయం:** ఈ వాక్యం దేవులపల్లి కృష్ణ శాస్త్రి రచించిన 'కృష్ణ పక్షం' కవితా సంపుటిలోని 'నిర్యాణం' అనే కవితా ఖండిక నుండి గ్రహించబడింది.

**సందర్భం:** కవి కుమారుడు పరమపథానికి వెలుతున్న రీతిని గూర్చి తెలుపు సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** చల్లని ప్రశాంత వేళ, దూర ప్రయాణానికి బయలు దేరవలసిందని, చుక్కలు, ఆశలు అంతరించిపోతున్నాయని, ఎప్పుడూ లేని విధంగా మాంద్యము, చల్లదనము కనిపిస్తున్నామని, కవి కుమార ఈ రోజు ఎక్కడికి వెలుతున్నావో ఏమో తెలియదని, తెలుపమని కవి భావం.

**18. "సగము వాడిన మృదుల పుష్పమ్ము సుమ్ము"**

**పరిచయం:** ఈ వాక్యం దేవులపల్లి కృష్ణ శాస్త్రి రచించిన 'కృష్ణ పక్షం' కవితా సంపుటిలోని 'దుఃఖం' అనే కవితా ఖండిక నుండి గ్రహించబడింది.

**సందర్భం:** కవి తన దుఃఖాన్ని ప్రకటించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ఉదయమంతా సూర్యుని ప్రతాపానికి ఎండిపోయాను, కనీసం రాత్రి చల్లని చంద్రుని కాంతిలోనైనా నేను నిద్రపోలేకపోతే పుష్పం నేల రాలిపోతానంటూ దుఃఖ విముక్తిని కోరుకుంటాడు కవి.

**19. "నన్ను తలచి రావో"**

**పరిచయం:** ఈ వాక్యం దేవులపల్లి కృష్ణ శాస్త్రి రచించిన 'కృష్ణ పక్షం' కవితా సంపుటిలోని 'ప్రేయసీ' అనే కవితా ఖండిక నుండి గ్రహించబడింది.

**సందర్భం:** కవి తన ప్రేయసిని ఒకసారి కనిపించమని పిలిచే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** కవి తన ఊహలో మెరుపులా కనిపించి మాయమైన తన ప్రేయసిని ఒకసారి కనిపించమని ప్రాధేయపడతాడు. తాను పరకాయినని తెలిపి కవి ప్రేమను ప్రేయసి తిరస్కరించిందని కవి తెలియజేసాడు.

**20. "రాజ వీథుల రతనాల రథము నెక్కి**

**వెడలు నిర్జీవ పాషాణ విగ్రహంబ"**

**పరిచయం:** ఈ వాక్యం దేవులపల్లి కృష్ణ శాస్త్రి రచించిన 'కృష్ణ పక్షం' కవితా సంపుటిలోని 'నేను' అనే కవితా ఖండిక నుండి గ్రహించబడింది.

**సందర్భం:** కవి స్వేచ్ఛను ఎవరూ నివారించలేరని తెలిపే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** తాను సామాన్యుడనైనప్పటకీ లోక పాలకునిలా అలంకరించుకొని దేవుని విగ్రహంలో రాచ మార్గాలంట స్వేచ్ఛగా ప్రయోగించగలనని కవి భావం.

**– డా॥ బలరామ్ కచ్ఛుళ్ళ**

## పాఠం - 6

# కృష్ణ పక్షం

**- దేవులపల్లి కృష్ణశాస్త్రి**

**విషయసూచిక:**


**6.1.** ప్రశ్నలు - సమాదానాలు

**6.2.** మాదిరి పరీక్షా ప్రశ్నలు

**6.3.** ఆధార గ్రంథాలు


### 6.1. ప్రశ్నలు-సమాధానాలు

**1. దేవులపల్లి కృష్ణ శాస్త్రి భావకవిత్వం రీతిని కృష్ణ పక్షం ఆధారంగా వివరించండి?**

భావకవిత్వాన్ని ఒక స్థాయికి తెచ్చి, దాని తత్త్వాన్ని లక్ష్య లక్షణ సమన్వితంగా ఊరూరూ తిరిగి ప్రచారం చేసిన వారు దేవులపల్లి వారు. కృష్ణ శాస్త్రి గారి కవిత్వ రచనా ధోరణి ఎందరినో ఆకర్షించింది. ఎందరో అనుయాయులనూ, ఏకలవ్య శిష్యులను ఏర్పరచింది. చివరకు వారి వేషభాషలు కూడా ఔత్సాహికులకు అనుకరణ యోగ్యంగా, ఆదర్శప్రాయంగా భ్రమగొల్పాయి. అయినా విశ్వనాథ వారు అన్నట్లు "ఎవ్వరూ ఆయనను అందుకోలేరు" అదే కృష్ణ శాస్త్రి గారి వైశిష్ట్యం. అందుకే భావకవితాయుగంలో కృష్ణ శాస్త్రి గారు మేరుపర్వత సదృశులు. కృష్ణ శాస్త్రి "కృష్ణ పక్షం" లో ప్రధానంగా భావ కవిత్వంలోని

1) ప్రణయ కవిత్వం,

2) ప్రకృతి కవిత్వం,

3) భక్తి కవిత్వం మరియు

4) స్మృతి కవిత్వం మొదలైన విభాగాలు చోటు చేసుకున్నాయి.

**1) ప్రణయ కవిత్వం:**

భావకవిత్వంలో ప్రణయ కవిత్వం ఆత్మాశ్రయరీతి, వస్త్వాశ్రయ రీతులుగా ప్రవహించింది. కథ, పాత్రలు వున్న కవిత్వాన్ని వస్త్వాశ్రయం అనీ, ఇవి లేనివి ఆత్మాశ్రయం అని మనం చెప్పవచ్చు.

**అ) ఆత్మాశ్రయ రీతి:**

కవి తన సుఖ దుఃఖాల్ని, కోపోద్రేకాల్ని, కాంక్షా, నిస్పృహల్ని తన అనుభూతులుగా కవిత్వంలో వ్యక్తం చేస్తే ఆ కవిత్వం ఆత్మాశ్రయ కవిత్వం. అలాకాక, కవి తాను వీక్షించిన సౌందర్యాన్ని అవగాహన చేసుకొన్న సత్యాన్ని, అనుభూతి పొందిన ఉద్రేకాన్ని, ఒకటి రెండు పాత్రల సహాయంతో, వారి అనుభూతులుగా ప్రకటిస్తే, ఆ కవిత్వం వస్త్వాశ్రయ కవిత్వం.

కృష్ణ శాస్త్రి గారి "కృష్ణ పక్షం" లో "అన్వేషణం" అనే ఖండిక వస్త్వాశ్రయ రీతికి చెందిందే. దీన్ని మినహాయించితే మిగిలిన గేయాలన్నీ ఆత్మాశ్రయ కవితా రీతికి చెందినవే. అందులో ప్రణయ గీతాలూ వున్నాయి, తాత్త్విక గేయాలు వున్నాయి. "కృష్ణ పక్షం" లోని "చుక్కలు" అనే గేయం, ఈ ఆత్మాశ్రయ రీతికి ఒక చక్కని ఉదాహరణ. ఈ గేయంలో కవి తనలోని

కోరికలకి దాసుడై, కాంక్షల గుఱ్ఱాలపై స్వారి చేస్తూ, తన బంగారు జీవితాన్ని ఎలా నిష్ప్రయోజనం చేసుకుంటాడో మన కళ్ళకు కట్టినట్లు చిత్రించి, తన స్వానుభవంతో తెలుసుకొన్న "అందరాని పండ్లకై ఆశించ వద్దు" అనే జీవిత సత్యాన్ని సహృదయ పాఠకులకు ప్రబోధిస్తాడు.

**ఆ) వస్త్వాశ్రయరీతి:**

ఏదైనా సంఘటన లేక కథ నాశ్రయించి అందులోని పాత్రల యొక్క మనోభావాల్ని, సుఖ దుఃఖాల్ని ప్రకటిస్తే అది వస్త్వాశ్రయ కవిత్వం. "కృష్ణ పక్షం" లోని "అన్వేషణం" అనే ఖండిక ఈ రీతికి చెందిందే. అంతేకాక అందులో కృష్ణ శాస్త్రి గారు భారతీయ ఆధ్యాత్మిక పారలౌకిక తత్త్వాన్ని నిగూఢంగా నిక్షేపించారు. "అన్వేషణం" అనే ఖండిక కృష్ణుని మురళికా మంద మంద మాధురుల రుచులు ఎదను పరవశింపజేయ, 'ఎలదేటి చిరుపాట సెలయేటి కెరటాలబడిపోవు విరికన్నె వలపువోలె' పరుగులెత్తిన గోపిక విప్రలంభ వేదననూ, సంయోగ మధుర కాంక్షనూ, వర్ణించిన ఖండిక ఇది. ఇందులో 22 పద్యాలు వున్నాయి. కంద పద్యంతో ప్రారంభమై, కంద పద్యంతో అంతమవుతుంది. మధ్యలో ఉత్పల మాలలు, తేటగీతులు, సీస పద్యంతో పాటు, ఒక ముత్యాల సరం కూడా చోటు చేసుకుంది. ఇదీ దీని బాహ్య నిర్మాణ స్వరూపం. ఇందులోని ఇతివృత్తం ఇతిహాస సంబంధమైంది.

ఈ ఖండికలో కృష్ణుని ముగ్ధ మోహనాకారమూ, అందరినీ తన్మయులుగా చేసే అతని వేణు గానమూ, ఆ మురళీ నాదాన్ని స్వాప్నికావస్థలో విన్నట్లు భ్రమించిన ఓ గోపిక, పరవశురాలై తన్ను తానే మరచి, భర్త కౌగిలి వీడి, ఇల్లు విడిచి, పల్లె దాటి, నిర్జన దారులతిక్రమించి, అర్ధ రాత్రి వేళ, కడిమి చెట్ల వనంలో అతని గూర్చి వెదకడం మనందరికి స్ఫురించే వేరో 'అర్థం ఇందులో ధ్వనిస్తుంది. అది వాచ్యార్థం. ఈ వాచ్యానికి విప్రపత్తి లేకుండా వ్యంజనా శక్తిచే అవగతమయ్యే అన్వేషణ అంటే వెదకడం అని అర్థం. గోపికా కాంత, కృష్ణుడి కొరకు వనంలో వెదుకుతూ వున్నదనే ఇతి వృత్తానికి, అన్వేషణ వాచ్యార్థం బాగానే కుదిరింది. కాని ఈ విషయమే ప్రధానమైతే, కృష్ణ శాస్త్రి గారు ఇతర ఖండికల్లో మాదిరి, దీన్ని కూడా ఐదారు పద్యాలతోనే ముగించి వుండేవారు. కాని అలా కాకుండా, వారు ఈ విషయంపై 22 వృత్తాల్ని రాశారు. "కృష్ణ పక్షం" లోని అన్ని గేయాల కంటే ఇదే పెద్దది. అంతే కాక మిగిలిన గేయాల్లో లేని ఇతిహాస కథ ఇందులో ప్రతిధ్వనిస్తుంది. వాచ్యార్థాన్ని చెప్పుకొన్న పిదప, తరచి లోతుగా పరిశీలిస్తే, మన అర్థతత్త్వ విచారం ఇందులో ప్రస్ఫుటమవుతుంది. దీనికి సంబంధించిన వ్యంజనార్థం మనకు ధ్వనిస్తుంది. అదే కృష్ణశాస్త్రిగారి అభిమతం, ఉద్దేశ్యం కూడా.

ఇందులో వున్నవి మూడు పాత్రలు మాత్రమే. మొదటి పాత్ర కృష్ణ పరవశురాలైన గోపిక. రెండో పాత్ర ప్రశ్నించే గోపిక. మూడో పాత్ర మనకు కన్పించని కృష్ణుడు. జరిగిన రంగస్థలి నీపవిటపీవనం. హైందవ హృదయంలో నిత్యమూ జరిగే సంఘర్షణకి ఈ గీతం అద్దం పట్టింది. మొదటి గోపిక శరీరానికి సంకేతం. రెండో గోపిక ఆత్మకి ప్రతీక. మనకి అగుపించని కృష్ణుడు మాయకి చిహ్నం. కడిమి, మట్టి చెట్ల వనం, మనము నివసించే కష్ట భూయిష్టమైన లోకానికి సంకేతం. కాంక్షలకి అలవాలమైన ఈ శరీరం క్రొత్త అనుభోగాలకై ఆరాటపడుతుంది. ఉన్న దానితో తృప్తి పడదు. వన్యప్రాణులు మరీచిక వెంట పరువిడిన కరణి, ఈ బుద్బుద శరీరం అందని సౌఖ్యాల వెంట పరుగులెత్తుతుంది. ఇదంతా భ్రమేనని ఆత్మకి తెలుసు. అందుకే అదెప్పుడూ శరీరాన్ని ప్రశ్నిస్తూనే వుంటుంది. శరీరం దృశ్యమానం. కాబట్టే మొదటి పద్యంలోనే దాన్ని చంద్రరేఖవా? లేక పూల తీగెవా? అని సంబోధించుట జరిగింది. వీటిని మనం చూడగలం. కాని ఆత్మకి ప్రాతినిధ్యం వహించే రెండో గోపికను మాత్రం కవి వర్ణించలేదు. కారణం ఆత్మకి రూపు రేఖలు లేవు గనుక.

ఈ ఖండిక ప్రారంభం, ఆత్మ శరీరాన్ని "ఎవరు నువ్వు? ఈ అడవిలో, అర్ధ రాత్రి వేళ, ఎక్కడికి పోతున్నావు? అని ప్రశ్నించడంతో మొదలవుతుంది. అలా ఆత్మ ప్రశ్నించడంలోని అంతరార్థం, "నీవేమి చేస్తున్నావో బాగా ఆలోచించే చేస్తున్నావా? లేక క్షణికోద్రేకంలో బలహీనతకు లోనై తొందర పడుతున్నావా?" అని శరీరాన్ని హెచ్చరించుటే. ఈ గేయం అఖరిలో శరీరం ఆత్మని 'ఎవ్వతెవు నీవు? అని ప్రశ్నించడంతో ముగుస్తుంది. వ్యామోహాన్ని జయించలేక, ఈ లోకం యొక్క మాయా జాలంలో చిక్కుకున్న శరీరాన్ని చూచి భయపడి, "ఇది నా శరీరమేనా" అని తొట్రు పడి, బెదురు చూపులతో, అటూ ఇటూ తన శరీరం గూర్చి వెదకుతూ వున్న ఆత్మని, "ఎవ్వతెవు నీవు? అని తన ఆత్మని గూడా గుర్తించ లేని దీన స్థితికి చేరుకున్న శరీరం ప్రశ్నిస్తుంది. ఇంద్రియాలకి బానిసైన శరీరానికి ఆత్మగుర్తుండదు. అది అడ్డు తగిలినప్పుడల్లా దాని పీకనొక్కి, దాని నోరు మూయిస్తుంది. ఇది ప్రతి మానవుడిలో నిత్యమూ జరిగే సంఘర్షణే. కృష్ణుని వెదకి అతని వలపు పొందితే గాని తనలో రేగే తుఫాను చల్లారదంటుంది శరీరానికి ప్రతీకయైన మొదటి గోపిక. తన శరీరాన్ని చూచి, ఆత్మ తొట్రిల్లి, "నా శరీరం ఇదేనా లేక అది ఇంకెక్కడైనా వుందా " అని అటూ ఇటూ బెదురుతూ చూడడంలో ఆశ్చర్యం లేదు. ఆత్మని ఆశ్రయిస్తే కైవల్యాన్ని పొందవచ్చు. కాని శరీరాన్ని నమ్ముకుంటే నరకం తప్పదు. మాయలకి లొంగి పోయే శరీరం, మాయలని అధిగమించేది ఆత్మ. శరీరానికి బదులు ఆత్మని అలంబనం చేసుకుంటేనే మానవుడి కైవల్యాన్వేషణం సఫలమవుతుందనే ధ్వని ఈ గేయంలో నిక్షిప్తమైవుంది. "అన్వేషణము" కృష్ణ పక్షము' సంపుటిలోని గేయాలన్నింటికీ తలమానికమైనది.

**ఎ) ప్రణయ కవిత్వం వర్గీకరణ:**

"కృష్ణ పక్షం" లో ప్రణయ కవిత్వం పది విధాలుగా విస్తరించి వుంది. అవి:

1. ప్రేమాంకురం
2. ప్రేమ ప్రభావం
3. నిర్గుణ ప్రేమ
4. ప్రేమౌన్నత్యం
5. ప్రేమ ప్రతిస్పందన
6. విరహం
7. పరిణయం
8. సంయోగ మాధుర్యం
9. నైరాశ్యం
10. విషాదం.

**1. ప్రేమాంకురం:**

ప్రతి మనిషి యుక్త వయస్సులో తనకి నచ్చిన, తాను మెచ్చిన అమ్మాయి ప్రేమను పొందాలని తహతహలాడుతాడు. అంటే అతని హృదయంలో ప్రేమాంకుర మయ్యిందన్న మాట. అయితే ప్రణయ విషయాల్లో పరిణతి పొందని అతని హృదయం సంకోచిస్తుంది. ఆమెతో మాట్లాడేదానికి కూడా అతనికి ధైర్యం చాలదు. అందుకే ఆమెను దూరం నుంచే చూసి తృప్తిపడతాడు. ప్రేయసి తన చెలులతో కలసి పోయే మార్గంలో ఏ చెట్టు నీడలోనో, కళాశాల ప్రాంగణంలోనో, నిరీక్షించిఆమెను కరువుదీరా చూచి ఆనందిస్తాడు. ఆ దశలో ఆమె అతని కంళ్ళకి సౌరభం విరజిమ్మే పుష్పంలా, వర్షించే మేఘంలా కనబడుతుంది. అప్పటి ఆ ప్రియుని పరిస్థితి ఎంతో దయనీయంగా వుంటుంది. అందరు ప్రియుళ్ళూ ఆరంభంలో పొందిన ఆరాటం, సంకోచం, తపన, ఆశక్తత అతనిలోనూ ప్రస్ఫుటిస్తాయి. "కిలకిలని" ఖండికలో –

"కిలకిలని నవ్వు చెలులతో కలసి మెలసి
పూవువై, మబ్బువై, చిన్ని పుల్గువాచు.
ప్రసవ కోమల రమణీయ పథము పట్టి
పోవుచుందువు లావణ్యమూర్తి వీవు.

ఎనొ దీనుడ నే నీడనైన నొదిగి
అడుగిడగ లేక నిట్టూర్పు విడువ లేక
పొరలు కన్నీటి కాల్వలు గురియ లేక
ఏనొ దీనుడ నే నీడ నైన నొదిగి
కాంచెదను నిన్ను కనులార కరువు దీర"

ఒక కన్యను ఇలా కనులార, కరువు దీర చూడాలనే కాంక్షకి మరో పేరే ప్రేమ. అప్పటి నుంచే అతనిలో పరివర్తన ప్రారంభమవుతుంది. మునుపటిలా జీవించలేడు. నిత్యం ప్రేయసి దర్శన భాగ్యం కొరకు తహ తహ చెందుతాడు. ఆమెని తన హృదయంలో ప్రతిష్టించుకుంటాడు. ఆమె ఎక్కడికి పోతే అక్కడికి పోతాడు. ఆమె పాదధూళే దివ్య సంపదగా భావిస్తాడు. అతని హృదయాన్ని కలవర పరిచే ఈ గాథ ప్రేమ దాటికి తట్టుకోలేక అతని కంటిలో దుఃఖాశ్రువు ముత్యంలా అతని చూపును కప్పి వేయగా ఆమెను చూడలేక, అక్కడే మ్రోడులా, రాయిలా నిల్చిపోతాడు.

**2. ప్రేమ ప్రభావం:**

భావ కవులు ఆంగ్ల కాల్పనిక కవుల ప్రేరణతో ఉత్తేజితులై ప్రేమ అనేది ప్రాణికి సహజ లక్షణమని భావించారు. అందుకే "కృష్ణ పక్షం' లో 'ఏల ప్రేమింతును' అనే కవితలో పువ్వులు ఎందుకు సౌరభాల్ని చిమ్మునో, చందమామ ఎందుకు వెన్నెల వెదజల్లునో, సలిలమేల పారునో, గాడ్పేల విసరునో, ఆకారణం చేతనే, నేను నిన్ను ప్రేమిస్తున్నానని ప్రియుడు ప్రేయసితో అంటాడు.

"సౌరభమునేల చిమ్ము పుష్ప వ్రజంబు?
చంద్రికల నేల వెదజల్లు చందమామ?
ఏల సలిలంబు పారు? గాడ్పేల విసరు?
ఏల నా హృదయంబు ప్రేమించు నిన్ను"

ఈ ప్రణయ భావనతో తన్మయుడైన ప్రియునికి కాలమే స్తంభించగా, ప్రకృతి రమణీయతలో లీనమై నిల్చి పోవాలన్పిస్తుంది.

"ఆకులో ఆకునై" అనే ఖండికలో

"ఆకులో ఆకునై పూవులో పూవునై
కొమ్మలో కొమ నునులేత రెమ్మనై
ఈ యడవి దాగి పోనా ఎట్లైన నిచటనే యాగి పోనా"

ఆ పరిస్థితిలో అతనికి దేనిమీదా మనసు లగ్నం కాదు. ఆకలుండదు, దాహముండదు, మాటలు వుండవు చింతలుండవు, వంతలుండవు. ఒక పిచ్చి వానిలా తిరుగుతాడు. అదే ప్రేమ పిచ్చి పిచ్చిప్రేమ కూడా.

**3. నిర్గుణ ప్రేమ:**

పవిత్రమైన హృదయాల్లో మాత్రమే ప్రేమ జనిస్తుంది. రాణిస్తుంది. భ్రమితో ప్రయిని దుర్గుణాల్ని తలపోస్తూ ఆ కూర్ర, కుటిల కల్మష హృదయంలో ఎలా ప్రేమ భాసించ గలదని ప్రేయసి సందేహిస్తున్న సమయంలో ఆమె మనసులోని అంతర్యాన్ని గ్రహించిన ప్రియుడు "నా ప్రేమ" ఖండికలో –

"క్రౌర్య కౌటిల్య కలుష పంకంబు వలన
మాలినమౌ నా హృదయము ధామ మెటులయ్యె
నతి విశుద్ధము మధురము నఘరహితము
ప్రణయమున కంచు సందియ పడుదువేమొ"

అలాంటి సందేహమేమీ పెట్టుకోవద్దంటాడు ప్రియుడు. రాత్రి క్రమ్మిన చీకట్ల వీథుల్లో నుంచే కదా, పూర్ణ తేజస్సుతో చంద్రుడు ఉదయిస్తాడు. అలాగే పాపపంకిలమైన నా హృదయంలోని చీకటిని నీ ప్రేమ ప్రసరించిన వెలుగు పారద్రోలి పవిత్రంచేసిందని ఆమెకి నచ్చజెప్పుతాడు.

"ప్రేయసి, శర్వరీతమో వీధులబడి
చందురుడురాడె పూర్ణ తేజస్వియగుచు:
అఘ విదూషిత మీ హృదయంబునందె
ప్రేమ కోమలతమము పవిత్రమయ్యె"

ప్రేమ స్పందించిన హృదయంలో విచక్షణకి తావు లేదు. తాను ప్రేమిస్తున్న వ్యక్తి ఎలాంటి వాడైనా, ఆమె హృదయం అతని సమ్ముఖంలో సూర్యుడు స్పృశించిన సూర్య కాంత పుష్పంలా వికసిస్తుంది. కళాకారుని నఖస్పర్శకి ఏణతంత్రులు సమ్మోహన శబ్దతరంగాల్ని ప్రకంపించినట్టు, ప్రియుని సాన్నిధ్యం ఆమె హృదయాన్ని రాగరంజితం చేస్తుంది. అదే విధంగా ఆమె నిష్కల్మశ ప్రేమే అతనికి శ్రీరామ రక్షగా పనిచేస్తుంది. రక్షిస్తుంది కూడా. అతన్ని సన్మార్గంలో పయనించేటట్లు ప్రభావితం చేసే మహిమ ప్రేమకే వుంది. అది గుణాలతో సంబంధం లేకుండా మంచి వారిలోనూ, చెడ్డవారిలోనూ స్పందిస్తుంది. అందుకే అది నిర్గుణ ప్రేమగా భాసించగలుగుతూ వుంది. తన పవిత్రతతో దుర్జునుని కూడా సజ్జనునిగా మార్చగలుగుతూ వుంది. అదే ప్రేమ యొక్క గొప్పతనం.

**4. ప్రేమోన్నత్యం:**

పరస్పరం ప్రేమించు కోవడమే మహా భాగ్యమని, అలాంటి ప్రేమ ముందు రత్న, హేమ, మణి, మౌక్తికాలు మొదలైన సంపదలన్నీ దిగదుడుపే అన్పిస్తుంది ప్రేమికునకు. అందుకే అంటాడు ప్రేయసితో "దివ్యభాగ్యం" ఖండికలో–

"హేమ మణి రత్న గణ మేల లేమ మనకు?
సాంధ్య సమయ సువర్ణిత చ్ఛాయలరసి
తారకా శోభితాంబర తలము గాంచి
చింతలను బాయుధము చేయి జేయి కలిపి:
ముత్తియంపు సరము లేల ముదిత, మనకు?"

సాయంకాల సూర్యాస్తమయంలో పశ్చిమాకాశం పులుముకొనే బంగరు రంగుల్ని గాంచి ముగ్ధులమవుదాం. తారకల తరళకాంతులతో ప్రకాశిస్తున్న అంబరాన్ని అవలోకిస్తూ మన చింతల్ని మరిచి పోదాం. చేయి చేయి కలిపి వలపు బాటపై పయనిద్దాం పద అని అంటాడు ప్రియుడు. అలాంటి స్థితిలో తమ ప్రేమ సామ్రాజ్య పట్ట భద్రభాగ్యం ముందు, సార్వభౌమ

భోగాలు, మిగతా సంపదలన్నీ తృణంగానే కన్పిస్తాయి అతనికి.

"సార్వభౌమ భోగములేల చాన, మనకు?
ఏలికల మౌద మన్యోన్య హృదయములకు
ప్రవిమల ప్రేమ సామ్రాజ్య పట్ట భద్ర
భాగ్యముంగన్న చిరుత సంపదలవేల?

**5. ప్రేమ ప్రతిస్పందన:**

ప్రేయసికి ఏ చిన్న బాధ కలిగినా ప్రియుడు భరించలేడు. అతనిలో ఆ బాధ ప్రతిస్పందిస్తుంది. అందుకే అతను ఆమె బాధని తన బాధగా చేసుకొని ప్రకృతిలో ఆ బాధని వీక్షిస్తాడు. ఆ పరిస్థితిలో కొండగాలి కదలికవల్ల కలిగే లయనూ, అది విరులను తాకి తెచ్చిన సౌరభాన్ని తన ప్రేయసి నిట్టూర్పుల అలలుగా అగుపిస్తాయి. పద్మంలోని సుగుంధాన్ని ఆఘ్రాణించే మంచుబిందువు, దానిలోని ద్రవాన్ని తియ్యగా మార్చే తేనె చినుకు, తన ప్రేయసి హృదయా వేదన భరించ లేక అశ్రువులుగా రూపధారణ చేశాయనుకుంటాడు. ఆ పిచ్చి ప్రేమికుడు "ప్రాణకాంత" ఖండికలో –

"ప్రణయ మలయానిలోర్మికావటలి నూగు
సౌరభమ, గానమా, నిందు శాంతి నిందు!
ప్రాణమునకును బ్రాణమౌ ప్రాణ కాంత
యూర్పు తరగల నోలాడి యున్న వారె!
ప్రణయ నీరజ మధుర సౌరభము గ్రోలు
హిమకణమ, తేనె చినుక, మీరిందు శాంతి
ప్రాణమునకును బ్రాణమౌ ప్రాణ కాంత
యెదద శోధించి యశ్రులై పడిరే యిచట?"

ఆకసంపై తేలియాడే శ్యామల మేఘం, నీటిలో కదలాడే నల్లని కలువ తన ప్రేయసి దు:ఖాన్ని పంచుకొని నల్లగా మారినవని తలపోస్తాడు ఆ ప్రియుడు. చెట్ల కొమ్మల్లో మ్రోగే తేనెటీగ ఝుంకారం, కోయిల విరహగీతిక, తన ప్రాణకాంత దుఃఖానికి విషాద గీతికలు పాడుతున్నాయనుకుంటాడు. ఇలా సానుభూతి చూపిస్తున్న ప్రకృతితో, తన ప్రేయసి బాధని పరిహరించమని ప్రాధేయ పడతాడు.

"ప్రణయ విమలాంబరాబ్ధి గర్భమున దేలు
నీరదమ, నీలమా యిందు నిండు శాంతి
ప్రాణమునకును బ్రాణమౌ ప్రాణ కాంత
మానస క్షేతలవ మూని మారినారె?"

**6. విరహం:**

ప్రేయసిని చూడకుండా చాలా కాలం వున్న ప్రియుడి విరహ వేదనని తపనని, కృష్ణ శాస్త్రిగారు "ఇదె వచ్చుచున్నాను" అనే గేయంలో ఎంతో వాస్తవికంగా చిత్రించారు. ఎంతో కాలంగా హృదయమనే చెరలో బందీగా వున్న ప్రియుడు ఇక

తాళలేక దుఃఖమనే ప్రవాపుపై పరుగులు తీస్తూ "ఇదే వస్తున్నాను ప్రియురాలా" అని ఆక్రందిస్తాడు.

"ఇదె వచ్చుచున్నాను ప్రియురాలా!
ఇక నిలువ లేను నా ప్రియురాలా!
చిరకాలమీయెడద చెరలో నిమిడి నేడు
పొరలి పొంగెడు దుఃఖ ఝురులపై"

విరహ వేదననూ, ఈ ప్రవాస భేదాన్ని ఇంక ఏ మాత్రమూ భరించలేను. రాత్రి పగలు నీ పిలుపే నా వీనుల్లో నినదిస్తున్నది. అందుకే ఆనందరహితమైన ఈ శూన్యలోకాన్ని దాటి, కోరికలతో తపించే ఈ శుష్క దేహాన్ని అధిగమించి, అన్యోన్యగాఢ ప్రేమ కాంక్షతో ఇదె నీ దగ్గరకు వస్తున్నానంటాడు ప్రియుడు.

"అవలిదరి నీ పిలుపు పవలు రేలును మ్రోయ
మివుల తొందర నసువు నవసి తపియించున్
శూన్యలోకము దాటి శుష్క దేహము దాటి
యన్యోన్య నిబిడ నిత్యా శ్లేష కాంక్షతో.."

ప్రేయసికి దూరమైన ప్రియుని విరహవేదనని, ప్రకృతి ప్రవృత్తిలో గోచరించే సారూప్యాలతో సమన్యాయం చేసి అత్యుత్తమ చిత్ర కల్పనలతో ఎంతో వాస్తవికంగా, సరళ శైలిలో వర్ణించారు కృష్ణ శాస్త్రి గారు. "మాటి మాటికి" అనే గేయం ఇందుకు నిదర్శనం. ఎక్కడికి వెళ్ళినా, ఎప్పుడు కళ్ళు మూసినా ప్రేయసి యొక్క సుందర రూపమే చిరునవ్వుతో తన ముందు నిలిచి తన హృదయాన్ని కలచి వేస్తుందట.

"ఏడ జనిన మనోహరి జాడలరసి
కలగు హృదయంబు నెమ్మది చలన మొందు
కనులు మూసిన, లోకమోహన మనోజ్ఞ
మూర్తి చిరునవ్వు జిలుకుచు మ్రోల నిలుచు."

శ్యామల మేఘ సమూహం తమలోని దుఃఖమనే నల్లని నీటిని వర్షించిన తర్వాత ఎలా తెల్లదనాన్ని సంతరించు కుంటాయో, అదే విధంగా నా హృదయంలోని ఈ కఠిన విరహ బాధని కన్నీరుగా కురిపించిన తర్వాతే క్రొత్తగా పూచిన పువ్వులా నా హృదయం మృదుత్వాన్ని పొంది తేలికవుతుంది.

"హృదయ మక్కట ! నవసుమ మృదులమగుట
విరహ బాధ కన్నీరుగా వెడలరాదె?
అతి భయంకర సాంద్రనీలాభ్రపటలి
వాన గురిసిన దవళి మబూనుగాదె?"

చంద్రుని దర్శనంతో కిల కిల నవ్వుతూ పొంగి పొరలుచున్న ఓ తరంగంలాగ, నా బాధని కొంచెమైనా అర్థం చేసుకోరెందుకు? మీ ప్రాణనాథుడైన చంద్రుడు మీకు దూరమైనప్పుడు ఈ గంతులు, చిందులు అన్నీ మాయమై పోతాయి

కదా. ప్రేయసి దూరమైన నా పరిస్థితి అలాగే వుందని ఎందుకు తెలుసుకోరు?

"పొంగి కిల కిల నవ్వి యుప్పొంగి పొరలు
తరగలార, నా బాధల దలపరయ్యే!
ప్రాణ నాథుండు మీ యుదురాజు మిమ్ము
వీడినప్పుడు త్రుళ్ళింత లేద కరుగుతె"

నా హృదయం, పక్షిలా రెక్కలు దాల్చి క్రింద, మీద అనే భేదాన్ని, విస్మరించి క్రిందున్న సముద్రాలని దాటి ఎత్తు మీదున్న పర్వతాలపై కెగసి, మాటి మాటికి నా ప్రేయసి సమ్ముఖానికి చేరుకోవాలని తాపత్రయ పడుతుంది.

"జల నిధులు దాటి యున్న తాచలము లెక్కి
హృదయ మది యేమో క్రిందుమీ దెరుగ కుంద
పక్షివలె రెక్కలం దాల్చి పరువు లిడును
మాటి మాటికి వలపుల పేటి కదుకు."

**7. పరిణయం:**

గాఢంగా ప్రేమించుకున్న ప్రేయసీ ప్రియులందరూ ఆ ప్రేమని పరిణయం ద్వారా సార్థకం చేసుకుంటారు. పెళ్ళి నిశ్చయమయ్యింది. పెళ్ళి కుమార్తె ఇంటి ప్రాంగణమంతా శోభాయమానంగా అలంకరించబడింది. కృష్ణ శాస్త్రిగారు "తేటి వలపు" అనే గేయంలో పెండ్లింటి వాతావరణాన్ని ఎంతో హృద్యంగా చిత్రించారు. అంతా మన ఎదుటే జరుగుతున్నట్లనిపిస్తుంది. ఇందులో గమనించవలసిన విషయం ఈ శుభకార్యాన్నంతా కావ్య జగత్తులో ప్రేయసీ ప్రియులుగా స్థిరపడి పోయిన పుష్పాన్ని వధువుగానూ, తేనెటీగను వరుడుగానూ ప్రతీకలుగా తీసుకొని ఈ పెళ్ళి సందడి వర్ణించబడింది. పూల కన్యలు పెళ్ళికూతురును మంచు బిందువులతో స్నానం చేయించారు. వారు కూడా పెళ్ళికని కళ్ళు మిఱుమిట్లు గొలిపే రంగు రంగుల చీరెల్ని కట్టుకున్నారు.

"అలరు పడంతు లెల్లరు హిమాంబువులన్
నవ మల్లికా సతిన్
జలకము లార్చినారు, వనజాత
పరాగమలందినారు, మేల్
జిలుగు హెరీరంగు పొందళుకు
చీరల గట్టిరి పెండ్లి కంచు"

ఇక ఆ పెండ్లికి వచ్చిన బంధువులంతా తలా ఒక పని చేస్తున్నారు. కోయిల పాడే దానికి గొంతుకు సవరించింది. తేనెటీగలు తేనెపానకాన్ని సిద్ధం చేశాయి. పుష్పాదుల సువాసనలు గల సుగంధ ద్రవ్యాల్ని పవనుడు సమకూర్చాడు.

"అలరుచు మల్లికాపరిణయంబని
వచ్చిరి పూవు బోండ్లు, కో
యిల సవరించె గొంతు, తమ

యేలికకై విరిదేనె పానకం

బళితతి గూర్చి, పుప్పొడుల

నత్తరులం బవనుందు చేర్చి"

**8. సంయోగ మాధుర్యం:**

ఎలాగైతేనేం, ప్రేయసీ ప్రియుల పెళ్ళయింది. ఇప్పుడు వారు నవదంపతులు. వారి శృంగార క్రీడల్ని చిత్రించేటప్పుడు భావకవులు ఎంతో నిగ్రహాన్ని పాటించారు. హద్దులు దాటి కామానికి పట్టం కట్టి అశ్లీల వర్ణనలకి పూనుకోలేదు. కృష్ణ శాస్త్రి గారు కూడా సంయోగ మాధుర్య వర్ణనల్లో అలాంటి నిగ్రహమే పాటించారు. అతని సంయోగ దశ కౌగిలింతలు దాటిపోలేదు. అలసి బిగువు సడలిన భర్త కౌగిలిలో హాయిగా సుఖ దుఃఖాలు లేని నిద్రలో తీపికలలు కంటూన్న ప్రాణసఖిని, నిశీధ శీతల పవనం, యమునా నది అలల సంగీతం, వెన్నెలచే శుభ్రం చేయబడి తెల్లగా మెరుస్తున్న దిక్కులూ, వీటన్నింటినీ తన రవళిలో లీనం చేసుకొన్న మురళీ మధుర ధ్వనులు, మేలు కొలిపినవని "అన్వేషణం" ఖండికలో అంటాడు.

**9. నైరాశ్యం:**

"సాము సడలిన పతి పరిష్వంగమందు

సుఖము దుఃఖము లని సుషుప్తిలోన

స్వప్న వీథీయధేష్ట సంచార కలన

మేను మఱచిన నన్నంత మేలుకొలిపే

శర్వరీ శీతపవన పక్షముల మలసి

స్వాదు యమునోర్మి సంగీతఝురులు గలసి

కౌముదీ ధౌత శుభ్ర దిక్తటుల సొలసి

మురళీకామంద మంద మాధురుల రుచులు"

ప్రేమించి పెళ్ళి చేసుకోవడం అందరికీ సాధ్యపడదు. పెద్దల ఆటంకం, సమాజ కట్టుబాట్లు అన్నీ అధిగమించినా, ఒక్కోసారి ప్రేయసీ ప్రియుల మధ్యే అపోహలు రావచ్చు. అంతవరకూ తనకు తగిన వాడే అనుకున్న ప్రేయసి, పునరాలోచించి అతడిని తిరస్కరించి ఇంకొకరికి తన హృదయాన్ని అర్పించిన సందర్భాలు కూడా లేకపోలేదు. అప్పుడు ప్రియుడు, ప్రేయసీ, నీకై వేయి కన్నులతో వెదుకుచున్నాను. నీవు నాకు కనబడకుండా వుండడం న్యాయమా? తళుకుమని కన్పించి, వలపులో నన్ను ముంచి ఇలా మాయమవ్వడం నీకు ధర్మమేనా?" అని విలపిస్తాడు "ప్రేయసీ" ఖండికలో –

"ప్రేయసీ ప్రేయసీ ప్రియుడనే ప్రేయసీ

వేయి కన్నులు దాల్చి వెదకుచున్నావే!

నల్ల మేఘాలలో నాయమా దాగంగ!

తళుకుమని కనిపించి వలపు వెల్లువ ముంచి

వలపించి మాయమై వనట గూర్చితివా ॥ప్రేయసీ

దానికి ఆ ప్రేయసి సౌమ్యంగా నవ్వుతూ జవాబిస్తుంది. ఇక నీవెక్కడ? నేనెక్కడ? మన ప్రేమ ఏనాడో మాసిపోయింది. ఇప్పుడు లాగే నాగూడు నల్లమబ్బే నా ప్రియుడు. ఇక నన్ను కోరకు, నా ఊసెత్తకు. నన్ను మరిచిపో, అంటూ ఆడుతూ పాడుతూ, నవ్వుతూ పరుగెత్తింది ఆ ప్రేయసి. ఇక్కడ మెరపు ప్రేయసికి ప్రతీక, మేఘం ప్రియుడికి సంకేతం.

"నల్ల మబ్బుల నింగి నా సౌధ రాజమ్ము
నల్ల మబ్బే ప్రియుడు నన్ను గోరకుమా!
ఆడుచును బాడుచును హాయిగా నవ్వుచును
పాడు మేఘాలలో పరుగెత్తె మెరుపు"

ప్రగాఢంగా ప్రేమించుకున్న ప్రేయసీ ప్రియుల్ని, లోకం తన కట్టుబాట్లతో విడదీయగా కుపిత మనస్కుడైన ప్రియుడు, "లోకమూ, ఎంత దారుణానికి ఒడిగట్టావు. నీకు ప్రేమంటే ఏమిటో తెలియదు. పాపభీతి కూడా లేకుండా మా రెక్కల్ని ఖండించి, మమ్మల్ని ఈ సమాజ కట్టుబాట్లనే పంజరంలో బంధించావు" అని లోకాన్ని కఠోరంగా నిందిస్తాడు "లోకమా" అనే ఖండికలో–

"ఏటి పని యిది లోకమా! హృదయ దళన
దారుణ మహోగ్ర కార్యంబు తలచినావు!
ప్రణయ మధురిమ మెరుగవు, పాపమనవు,
పక్షములు దూల్తు, బంధింతు పంజరాన"

**10. విషాదం:**

లోకం నిర్దాక్షిణ్యమైంది. తన కట్టుబాట్లను దిక్కరించిన వారిని క్షమించదు. అది కవి ప్రేమను నిషేధించింది. దానితో కవి నిరాశానిహతుడై, వియోగ దందహ్యమానుడై పోయాడు. ఆ పరిస్థితిలో, ఆ భావకవి ప్రకృతిలోని చంద్రుడు, కోయిల, మేఘం, మలయానిలాదులు మొదలైన తన మిత్రులతో, లోకం తనకి చేసిన అన్యాయాన్ని ఏకరువు పెట్టి ఆ బాధలనుంచి, తన్ను విముక్తి కావించమని ప్రాధేయపడుతాడు.

కృష్ణ శాస్త్రిగారు కూడా సందెగాలితో, దుఃఖం నన్ను వెదుకుంటూ వస్తున్నది. నీ రెక్కల మీద వడిగా, ఈ దుఃఖం వెంటాడ లేని చోటికి, నిత్య ఆనందం వెల్లివిరిసే చోటికి నన్నెత్తుకొని పోరాదా, అని ప్రాధేయ పడతాడు "ఓయి సంధ్యా సమీరణా" అనే ఖండికలో –

"ఓయి సంధ్యాసమీరణా, రేయితోడ
కారుచీకటి తోడ దుఃఖమ్ము కూడ
పరువు పరువున నాకొఱ కరుగుదెంచు:
నీదు నునులేత రెక్కల మీద వడిగ
నెత్తికొని పోవరాదె సన్నెచటకేని
నిత్య తేజోమయానంద నిలయమునకు"

ఈ కర్కశ కఠోర లోకంలో ఒక్క నిముసమైన వుండలేను. తొందరగానన్ను, సంధ్యాకాలపు మేఘాలు విరజిమ్మే అరుణ కాంతుల్లోనో, సూర్యుడు ప్రసరించే బంగారు కిరణాల తళ తళలందో, దాచెయ్యరాదా, అని సంధ్యగాలిని అర్థిస్తాడు.

"నిముస మేనియు నిటనుండ నేరనోయి!
సంజ మబ్బుల పవడాల చాయలందొ
తరణి బంగారు కిరణాలు మెరుగులందొ
లీన మొనరింపరాదె యాలోన నన్ను?"

లోకాన్ని ఎదిరించలేక, దానితో రాజీపడి జీవించలేక, సంధ్యాసమీరుని సహాయాన్నో, లేక నైటింగేల్ సహాయాన్నో అర్థించి దుఃఖం లేని ఊహా లోకాల లోకి తరలి పోవాలని తాపత్రయ పడతాడు. అది సాధ్యం కానప్పుడు ఆఖరికి దుఃఖాన్నే జాలి చూపమని అభ్యర్థిస్తాడు. ఈ పలాయన తత్వం ఆంగ్ల కాల్పనిక కవుల నుంచి మన భావ కవులు వారసత్వంగా పుణికి పుచ్చుకున్నారు. కృష్ణ శాస్త్రి గారు కూడా విషాదం తన్ను రాహువు వలె గ్రహించగా, భరించలేక "నన్ను విడవండి, ఒంటరిగా మనసారా నేడ్వనివ్వండి.... దుర్భర శోక విషమ గీతాల్ని ఎలుగెత్తి యేడ్చి నా శోకభారాన్ని తగ్గించుకుంటాను", అని రోదిస్తాడు.

"మీరు మనసారగా" అనే ఖండికలో
"మీరు మనసారగా నేడ్వనీరు నన్ను
నన్ను విడువుడు! ఒకసారి నన్ను విడిచి
నంత నేకాంత యవని కాభ్యంతరమున
వెక్కి వెక్కి రోదింతును.
విసువు లేక
విరతి లేక దుర్భర శోక విషమగీతు
లేడ్చివైతు, ఎలుంగెత్తి యేడ్చివైతు"

అని రోదిస్తాడు. "కృష్ణ పక్షం" లోని ప్రణయ కవిత్వం పరాకాష్ఠకు చేరుకుంది.

**2) ప్రకృతి కవిత్వం:**

"కృష్ణ పక్షం" లో ఈ ప్రకృతి కవిత్వం పాఠకుల హృదయాల్ని రంజింప జేస్తుంది. "స్వేచ్ఛాగానం (2) అనే కవితలో, తన్ను బంధించి ఊపిరాడ నివ్వని ఈ వసుధ నుంచి స్వాప్నిక జగత్తులో తారసిల్లే విహంగం యొక్క రెక్కలపై తేలియాడుతూ నక్షత్రాల్లో నక్షత్రంగా మెరసి తన మధుర గానంలో తానే లీనమై మాయమవుతానంటాడు కవి.

"కల విహంగము పక్షముల దేలియాడి
తారకా మణులలో తారనై మెరసి
మాయ మయ్యెదను నా మధుర గానమున!"

ప్రకృతిలోని ప్రతి వస్తువూ తన కార్యసిద్ధికి దోహదమిచ్చే పరికరంగా అతను భావిస్తాడు. మేఘాల పడవల్లో ఆకాశమంతా విహరించి మెరుపులా మెరసి, పాడుతూ ఆ మేఘాలు కురిపించే వర్షంలో ఒక చినుకునై భూమి మీదకు రాలిపోతానంటాడు కవి.

"మొయిలు దోనెలలోన పయనం బొనర్చి
మిన్నెల్ల విహరించి మెరపునై మెరిసి
పాడుచు చిన్నునై పడిపోదు నిలకు"

తెల్లటి మబ్బును తెరగా చేసుకొని నా చెలియైన చంద్రునితో జత గూడి స్వర్గలోకంలో సరసాలాడుతూ ఇక భూలోకానికి తిరిగి రానేరాను, అని కవి తన కృతనిశ్చయాన్ని వెలిబుచ్చుతాడు.

"తెలిమబ్బు తెరచాటు చెలి చందమామ
జతగూడి దోబూచి సరసాల నాడి
దిగిరాను దిగిరాను దివినుండి భువికి"

ఇలా ఆకాశంలోని విహంగాలు, తారలు, మేఘాలు, చంద్రుడు అన్నీ కవి సంకల్ప సిద్ధికి దోహదమిస్తాయి. ఇక కవి దృష్టి ఆకాశం నుంచి సముద్రం మీదికి పారింది. అక్కడ అలలు చిందే నీటి తుంపరుల తోనూ, శరవేగంతో దూసుకుపోయే చిరుచాపలతోనూ, ఆలుచిప్పలలో ప్రభవించే వినూత్న ముత్యాలతోనూ చేరి నాట్యమాడి, జలధి గర్భంలో మునిగి పోతానంటాడు కవి.

"శ్రీకరంబుల తోడ చీరుమీల తోడ
మౌక్తికములతో నాట్యమ్ములాడి
జలధి గర్భమ్ము లోపల మగ్గిపోదు"

ఇలా నింగి నీరదాల్లో సాక్షాత్కరించు నక్షత్ర, విహంగ, మేఘ, శీకర, మీల, మౌక్తికాల్లో లీనమై, వాటిలాగే స్వేచ్ఛా జీవితాన్ని గడపాలని తహతహలాడే కవి, పరుగులిడే పవనుని జూచి, అతనితో పరుగెత్తి, చెట్లకొమ్మలలో దూరి ఆకులతో చేరి ప్రణయ రహస్యాలు పలికెదనని తన కోరికను వెల్లడిస్తాడు.

"పరువెత్తి పరువెత్తి పవనుని తోడ
తరుశాఖ దూరి పత్రములను జేరి
ప్రణయ రహస్యాలు పల్కుచు నుందు"

ప్రకృతిలోని అన్నింటిలోనూ లీనమై తనే అవిగా, అవే తనుగా తాదాత్మ్యం పొంది వివిధ రకాలైన అనుభూతుల్ని స్పందింప చేశాడు. అందుకుగాను అతను పక్షిగా, నక్షత్రంగా, మేఘంగా, మెఱుపుగా, పువ్వుగా, తుమ్మెదగా, చిగురాకుగా, చందమామగా, గాలిగా, అలగా, పాటగా, సెలయేరుగా, మారి మాయమై పోవుటకు అభిలషిస్తాడు.

"పక్షి నయ్యెద చిన్నిబుక్క మయ్యెదను
మధుప మయ్యెద చందమామ నయ్యెదను
మేఘ మయ్యెద వింత మెరపు నయ్యెదను
అలరు నయ్యెద చిగురాకు నయ్యెదను
పాట నయ్యెద కొండవాగు నయ్యెదను
పవనమయ్యెద వార్ధిభంగ మయ్యెదను

ఎలాకో యెప్పుడో యెటులనో గాని

మాయ మయ్యెద నేను మారిపోయెదను"

ఇలా ప్రకృతిలోని సమస్త చరాచర సముదాయంతో ఐక్యమై వాటిలో లీనమై, తనకి ప్రకృతికి అభేదాన్ని సాధించి, తానే ప్రకృతిగా ప్రకృతే, తానుగా తాదాత్మ్యం పొందాలని కాంక్షిస్తాడు కవి. ఇలా "స్వేచ్ఛా గానం" అనే గేయం ఆత్మాశ్రయ కవిత్వమనే దర్పణంలో ప్రకృతికవిత్వాన్ని ప్రతిబింబించింది. "అన్వేషణము" అనే గేయం కృష్ణునికై తపించిన గోపికా విరహ వేదనకు దర్పణం పట్టింది. అందులో కృష్ణ శాస్త్రి కలంనుంచి జాలువారిన ప్రకృతి రామణీయత వర్ణనాతీతమనే చెప్పాలి. ఆ ప్రకృతి వర్ణనలు ప్రబంధాల్లోని వర్ణనా శైలిని -

"తలిరాకు జొంపముల నం.

చులత్రోవల నేల వాలు తుపానకిరణ కో

మల రేఖవొ! పువుదీనవా?

తొలిప్రొద్దు తెమ్మెర త్రోవలో పయనమై

పరువెత్తు కోయిల పాటవోలె

వెల్లువలై పారు వెండి వెన్నెలలోన

మునిగిపోయిన మబ్బుతునుకవోలె"

కృష్ణ శాస్త్రి గారు "విశ్రాంతి" అనే గేయంలో నీలాకాశమనే సరస్సులో పున్నమి చంద్రుడు రాయంచవ విహరిస్తున్నాడనీ, చల్లని పిల్లగాలులు కొమ్మల ఆకులలోనో లేక కల్లోల సాగర తరంగాల చాటునో దాక్కున్నాయని మనోహరంగా ఉత్ప్రేక్షిస్తాడు. నీలాగ్ర సరసిలో నిండు జాబిల్లి రాయంచ వలె విహారము సల్పుతుంది. కమ్మ తెమ్మెరలు శాఖా పత్రములతో కల్లోలినీ తరంగములనో దాగె "లోకము" అనే గేయంలో కృష్ణ శాస్త్రి గారు ప్రకృతిలోని సెలయేరుని ప్రతీకగా తీసుకొని ఒక అమూల్యమైన జీవిత సత్యాన్ని వెల్లడించారు. సెలయేరు తన తియ్యటి నీరుతో అందరి దాహాన్ని తీరుస్తుంది. తన దగ్గరకు వచ్చి వలపును ప్రకటించే పిల్లగాలిని సైతము తాను అనుభవించకుండా, దానికి చల్లదనాన్నిచ్చి ఇతరుల తాపాన్ని తీర్చుటకై విసరివేస్తుంది. అలా పరులకు సహాయం చేసిన ఆ నిస్వార్థ సెలయేరు తుదకు వేసవి యొక్క తీవ్ర తాపానికి గురై తనలోని నీరు ఆవిరై హరించుకుపోగా, చిక్కిశల్యమై పోయింది. అప్పటి దాని దీనావస్థని చూచిన కవి 'నీకు పట్టిన గతికి' అని ఖేదంతో-

"తోయముల తీయనైన పానీయ మొసగి

వలపు నునులేతగాలి వీవనల విసరి

ప్రజల వైఘ తీవ్ర తాపంబు వలన

నిట్టు లైతివి సెలయేర, తుట్టతుదకుగా"

నిస్వార్థంగా పరులకు సహాయం చేసిన వారెవ్వరినీ ఈ లోకం గుర్తించదు. పైగా అలాంటి నిస్వార్థ పదుల నుంచి అందరూ సహాయం పొందుతారు గాని వారి కష్టకాలంలో మాత్రం ఎవరూ వారికి సహాయం చేయరని, ఈ లోకంలో వారికి మిగిలేది దుఃఖం మాత్రమే అనే ధ్వని ఈ గేయంలో ప్రస్ఫుటిస్తుంది.

**3) భక్తి కవిత్వం:**

భక్తుడు, ఒక్కొక్కప్పుడు, తన ప్రభువునకు ఏమేమో కానుకలు ఇవ్వాలనుకుంటాడు. అందులో భక్తుడి స్వార్థమేమీ వుండదు. అలా కానుకలిచ్చి భగవంతుడి నుంచి ఏమైనా వరాలు పొందాలని కూడా అతడు ఆలోచించాడు. తాను ప్రేమించిన వారికి ఏదైనా ఇవ్వడంలో నున్న తృప్తి, ఆనందాన్నే, భక్తుడు కూడా. భగవంతునికేమైనా కానుకగా ఇచ్చినప్పుడు పొందుతాడు. ఇదే నిష్కార్థ, నిస్క్యామ భక్తి, అలాంటి భక్తిగల భక్తుడు తన ఆరాధ దైవానికి కాన్యగా ఏమియ్యగలను అని ప్రశ్నించుకుంటే, అతనికి భగవంతుని ఔన్నత్యం గుర్తుకొస్తుంది. అప్పుడనుకొంటాడు: ఓ, భగవంతుడా! నీవు మెరిసే తారల మాలికనే హారంగా ధరించిన వాడవు. రాజ రాజేశ్వరుడవు. సమస్త చరా చరములకు ప్రభువ్వు, నీ కాలి ధూళే దివ్య సంపదగా యెంచి వీధుల్లో భిక్షగానిలా తిరిగే పేదవాడిని నేను. అలాంటి నేను నీ కేమియ్యగలను ప్రభూ!' అని తన దైస్యతను చాటుకుంటాడు. "నాకాన్య" ఖండికలో–

"కావ్యగానే మోసంగ గాగలను నీకు?
తారక రత్న భాసుర తారహార
సుప్రభామాలికాజాల శోభితుడవు,
రాజ రాజేశ్వరుడ వీవు, ప్రభుడ వీవు
హృదయ పతి నీవు, భవదీయపద సరోజ
మృదు రజోలేశ దివ్య సంపదను వలచి
వీధి వీధుల వాడల విపినములను
భిక్షుకుని బోలె తిరుగాడు పేదనోయి!
గానే మొసంగ గాగలను నీకు?"

భగవంతుడు వరంగా ఇచ్చిన ఈ ఉత్కృష్ట మానవ జీవితాన్ని, మహోన్నతంగా జీవించుటకై అతను ప్రసాదించిన అన్ని అవకాశాలను చేజేతులా పాడుచేసుకొని అంతా అయిపోయిన తర్వాత తన తప్పుని గ్రహించి పరితప్త హృదయంతో, ప్రభూ! జీవితమనే తియ్యటి వీడెని నాకిచ్చి మధురంగా పాడుకొమ్మన్నావు. కాని మూర్ఖంగా నేను దాని మహత్తును తెలుసుకోలేక, దాని తంత్రుల్ని దెంచి నాశనం చేసుకున్నాను. ఇలా చేదుగా చేసుకొన్న జీవితాన్ని ఎలా బద్రకమంటావు. స్వామి అని విలపిస్తాడు "స్వాదుసంగీత" ఖండికలో"

"స్వాదు సంగీత కలనాల సద్విపంచి
కరమునందుంచి జీవిత భరము వాయ
పాడుకొమ్మంటి తియ్యని ప్రణయగీతి
తంత్రులను డ్రెంచి మెట్లవిదల్చి స్వామి!
ఎటుల పాడుదు, నీ బ్రదుకెట్లు పుత్తు?"

ఈ ఖండికలో మొదటి పద్యంలో భక్తుడు పరమాత్ముణ్ణి, స్వామి అని సంభోదిస్తాడు అప్పటికి అతని మనస్సులో పరమాత్ముడు, తాను అందుకోలేని మహాత్ముడుగానే గోచరిస్తాడు. కాని అఖరి పద్యం పూర్తయ్యేటప్పటికి, భక్తుడు తాను చేసిన పాపాలన్నింటినీ సవివరంగా ప్రభువుకి మనవి చేసుకొని పశ్చాత్తాప జ్వాలల్లో పునీతుడై హృదయ పరివర్తన పొంది, పవిత్రుడుగా

మారుతాడు. అతనికిప్పుడు పరమాత్ముడు ప్రభువుగా కాకుండా తన స్నేహితుడిగా గోచరిస్తాడు. అందుకే అని ఓ ని మిత్రుడిని సంభోదించినట్లు సంభోదిస్తాడు. అంటే భక్తుడికి, పరమాత్ముడికి మధ్య దూరం తొలగిపోయి పరమాత్మ సాయుజ్యానికి సమీపమయ్యాడన్న మాట.

ఒక్కోసారి భక్తుడికి, భగవంతునికి మధ్య అహం అడ్డుగోడగా నిలుస్తుంది. నా అంత గొప్ప భక్తుడు లేడని విర్రవీగే భక్తుడి నుంచి భగవంతుడు దూరంగానే వుంటాడు. ఆ పరమాత్ముడు, అహం, దర్పం, ఆడంబరం లేని బీదల, నిరుపేదల, బిచ్చగాళ్ళ మధ్య చింపిరి దుస్తులు ధరించి, వారి జీర్ణకుటీరాల్లో నివసిస్తాడు. అహంపొరలు క్రమ్మిన ఆ భక్తుడికి ఇదంతా వింతగా కన్పిస్తుంది. అందుకే ఆశ్చర్యంతో భగవంతుడిని ప్రశ్నిస్తాడు. స్వామీ, రాజులు, చక్రవర్తులు పూజలు చేసి నీకు మ్రొక్కగా వారు దాల్చిన కిరీటాల లోని రత్నమాణిక్య వైదూర్య కాంతులతో నీరాజనాలందుకున్న పాదాలు నీవి. అలాంటి నీవెక్కడ? ఈ గర్భ దరిద్రులెక్కడ? "క్రుంగిపోదు" ఖండికలో –

"రాజరాజేశ్వర కిరీట రాజ ఘటిత
రత్న మాణిక్య కాంతి నీరాజనార్చి
తాంఘ్ర నీరేజ యుగళుడవయ్య! చింపి
పాతలం గట్టికొని జీర్ణవట కుటీర
పాళికా ప్రాంగణముల నివాసమేల?"

అంతేకాదు. శిథిలమైన పాత్రని చేతపుచ్చుకొని వారితో ఇంటింటికి పోయి ఎందుకయ్యా బిచ్చమెత్తుకుంటావు. ఈ అవస్థలన్నీ నీకెందుకు? నాభక్తి, నిష్ట, పూజ అన్నీ కాదని ఆ దరిద్రుల చెంతనే ఎందుకుంటావు స్వామీ? ఇదంతా నాకు వింతగా వుంది. నిన్నెలా పొందాలో ఊహించ లేకుండా వున్నాను. ఈ చింతతోనే, నిత్యమూ కృంగిపోతున్నాను అని విలపిస్తాడు. పరమాత్ముని సాయుజ్యానికై పరితపించే భక్తుడు, తానాశించిన కైవల్యాన్ని పొందలేక, ఆర్ద్రుడై, పరితప్త హృదయుడై ప్రభూ, నా పాపాలకి సిగ్గుతో కుమిలిపోతున్నాను. నా కన్నులనుంచి కారే ఈ వేడి కన్నీళ్ళు, కన్నీళ్ళ కావు అవి నా హృదయాన్ని చీల్చిబయటకుబుకుతున్న చిక్కటి రక్తధారలు సుమా" అని విలపిస్తాడు "కన్నీరు" ఖండికలో–

"గాట మగు ల వలన దుఃఖమ్ము వలన
నా కనుల జారు నుష్టాశ్రు శీకరములు
హృదయము కలంచి విదిలించి యేర్చి వెడలు
సాంద్ర శోణిత బిందు వర్షమ్ము సుమ్ము!"

అంభోరాశిపై శేషశయనుడవై రమా వినోదివైన, నీ పాదాల మీద నిలవనియ్యి ప్రభూ ఈ నా వేడి కన్నీటి బిందువుని. అలల మీదనుంచి ప్రసరించే కమ్మని సుగంధాన్నైనా తనివితీరా త్రాగనియ్యి, కనీసం ఈ భాగ్యానికైనా నన్ను నోచుకోనియ్యమని ప్రాదేయపడతాడు ఆ భక్తుడు.

"తావకీన పద సరోజ దళములందు
నిలువని మొక్క వేడి కన్నీటి చుక్క
కదల ప్రసరించు నెత్తవి కమ్మదనము.

త్రావమ్మో ప్రభూ, దాని తనివి తీర"

పాప పంకిలమైన నా హృదయ కుహరాల్లో జనించి, ఈ మలినాశ్రుధారలని నేను నిగ్రహించలేను స్వామి వాటినినీ పాదాల మీద నుంచి పారనీయి ప్రభూ! నీ పాద స్పర్శతో పునీతమై అవి గంగా జలంలా పవిత్రమౌతాయి. ఆ భాగ్యానన్నా నాకు కలిగించమని యాచిస్తాడు ఆ భక్తుడు.

"కలుష దుర్దాంత పంక సంకలిత కుహరం
ముల జనించు మదీయాశ్రు మలిన ధార
స్వామి, భవదీయ పాద దేశమున బారి
పరమ పావన జాహ్నవీ ప్రతిభ గాంచు"

ఇలా పశ్చాత్తాపాన్ని ప్రకటించిననూ, ఇంతగా వేడుకొన్ననూ, భగవంతుడు కరుణించలేదు. భగవంతుని సాన్నిధ్యం లభించక, అతని కృపకు నోచుకోక, తనలో తానే కుమిలిపోతూ ఇదంతా తన పాప ఫలమేననీ, తనలాంటి పాపికి తగిన శాస్తే జరిగిందని, తన్ను తానే దూషించుకుంటాడు. తనలోని నిర్వేదనకీ, చుట్టూవున్న ప్రకృతిలోని ప్రఫుల్లత మధ్య వున్న వ్యత్యాసాన్ని చూచి భరించలేక ప్రకృతంతా తన్ను హేళన చేస్తూ వుందనే న్యూనతా భావానికి లోనై తనలో తానే బాధపడతాడు "పాపీ" అనే ఖండికలో–

"మలిన భాష్ప మౌక్తికమ్ము
మిలమిల నీకనుల నిలువ
తళ తళమని తారలు నటి
యించునురా పాపీ!!

దుఃఖ భారంతో వెలువడే తన వేడి వేడి నిట్టూర్పులకి పెదవులు వాడిపోతూ వుంటే మ్రోడైన చెట్లు కూడా మురిసి క్రొత్త చిగుర్లు తొడుగుకుంటూ వున్నాయని ఖేదిస్తాడు.

"వేడి వేడి నిట్టూర్పుల
వాడిన నీ పెదవు లదర
మ్రోడు మ్రాకు చివురులతో
మురియునురా పాపీ!"

తన పాపాలు జ్ఞప్తికి రాగా నిగ్గుతో, లజ్జతో పంచిన శిరస్సు ఎత్తలేక దీనత్వంతో తన హృదయం కృంగిపోగా, మబ్బు తెరల మసక చీకటిని దాటి బయటకు వచ్చిన చందమామ తన్ను పరిహసిస్తున్నట్లు భ్రాంతిని పొందుతాడు.

"భరియింపగ రాని లజ్జ
శిరము వంగి క్రుంగినంత
తెరల దాటి చందమామ
నవ్వునురా పాపీ!"

ఇంద్రియాల మాయా జాలంలో చిక్కుకొని ముక్తి మార్గాన్వేషణలో దారితప్పిన తాను, 'దారి చూపించు స్వామి అని ఎలుగెత్తి ఆక్రందిస్తూంటే గగన వీధిలో విహరించే గంధర్వులు కూడా తన దుస్థితికి సంతసించి ఆనంద గీతికలు అలాపిస్తున్నారని ఊహిస్తాడు.

"చారిగాన లేను స్వామి!
రారా!" యని కంఠమెత్త
గగన వీధి గంధర్వులు
పాడుదురో పాపీ!"

ఇలా ప్రకృతితోపాటు దేవతలు కూడా కష్టకాలంలో తన్నిలా అవహేళన చేస్తూ వున్నారని కుమిలి పోతున్న అతనికి, వీటన్నింటికంటే మించిన విఘాతం భగవంతుడి వల్ల కలుగుతుంది. ప్రకృతి తన్ను పరిత్యజించినా ఎలాగో ధరించేవాడే కాని, ఆఖరికి భగవంతుడు కూడా తనను, తన్ని తరిమేయడమే కాక, తన కన్నీటి బిందువులతో ముత్యాల సరాన్ని కూర్చి మెడలో హారంగా వేసుకున్నాడు. ఇక తనకు మిగిలింది కన్నీరే. అందుకే జీవితమంతా ఇలాగే విలపింపుమురా పాపీ అని తన్ను తానే తిట్టుకుంటాడు.

"కురియుమురా కన్నీటిని!
మరి మరి విలపింపుమురా
సరము గూర్చి పరమేశుడె
తాల్చునురా పాపీ!"

ఇదీ 'కృష్ణ పక్షం'లో పారమాత్మిక ప్రేరణతో పరిఢవిల్లిన భక్తి కవిత్వం. ఆ పరమాత్ముని దయా భిక్షకై, కైవల్య ప్రాప్తికై, కవి కంఠమెత్తి మొరపెట్టుకున్న గేయాలివి.

**4) స్మృతి కవిత్వం:**

కృష్ణ శాస్త్రి "కృష్ణ పక్షం" లోని స్మృతి గీతాల్ని రెండు విధాలుగా వింగడించవచ్చు. మొదటి కోవకు చెందింది దేశనాయక స్మృతి. రెండోది ఆప్తస్మృతి. గురజాడ అప్పారావుగారి నిర్యాణానంతరం కృష్ణ శాస్త్రి గారు రాసిన "మహాకవి" అనే గేయం దేశనాయక స్మృతికి చెందుతుంది. 'మహాకవి' అనే 'ముత్యాలసర గేయాన్ని కృష్ణ శాస్త్రి గారు ఎంతో చమత్కారంగా రాశారు. ప్రశస్తమైన ముత్యాల్ని అందమైన హారంలో గ్రుచ్చి, భక్తితో తెలుగు తల్లికి ఇచ్చాడట. అంటే తెలుగు కవితామతల్లికి 'ముత్యాల సరం' అనే అందమైన వృత్తాన్ని కానుకగా ఇచ్చాడని ధ్వని.

"గుత్తునా యని జాతి ముత్యాల్
గుచ్చినాడే మేలి సరముల
ఇత్తునా యని తెలుగు తల్లికి
ఇచ్చినాడే భక్తితో!"

నవ వసంతంలో క్రొత్తగా చిగిర్చిన మావి కొమ్మల చివురుల స్వాదురుచులు చవి చూచిన కోయిల గళం నుంచి

వెలువడే కమ్మని పాటని ఆపగల శక్తి ఎవరికున్నది? ఎవరికీ లేదు. అలాగే నవయుగంలో తన సృజనా శక్తితో తెలుగు కవితా లతపై కొత్త చివురులు పూయించి, తెలుగు కీర్తిని గళమెత్తి గానం చేసిన గురజాడ కవితా ప్రతిభను ఎవరాపగలరు? ఎవరూ ఆపలేరు. ఆయన ఆధునిక యుగాన్ని తట్టిలేపిన నూత్న వైతాళికుడు.

"నవ వసంతము నవ్య వనరమ
మావి కొమ్మల కమ్మ చివురుల
పాట పాడెడి పరభృతంబును
ఎవ్వరాపుదురో"

గురజాడ వారిని స్మరిస్తూ అతని స్మృతి తెలుగువారి హృదయాల్లో చిరకాలం నిలిచిపోయేలా రాసిన స్మృతి గేయం ఇది. అందుకే దీన్ని దేశనాయక స్మృతి గేయంగా పరిగణించటం జరిగింది. రెండో కోవకి చెందిన స్మృతి గేయాలు "ఆప్తస్మృతి" గేయాలు. "కృష్ణ పక్షం" లో కృష్ణ శాస్త్రి గారు తన బాబాయి, నాన్నగార్లను తలుస్తూ రాసిన స్మృతి గీతాలు కూడా వున్నాయి. వారిద్దరూ విద్వత్కవులే. జీవితంలో సాఫల్యాన్ని పొంది, మరణంలో ముక్తిని పొంది ఎనలేని ఆనందాన్ని ఎదనిండా నింపుకొని, స్వర్గసీమలల్లోని ఏ పవిత్ర నిర్మల తేజోమయ విశాల వీధుల్లో విహరించు చున్నారో కదా అని తన హర్షాన్ని ప్రకటిస్తాడు కవి.

"ఏ మనోహర సీమలందే పవిత్ర
విమల తేజోమయ విశాల వీధులందు,
అక్షరామోద, సంభరి తాంత రంగు,
లగుచు, విహరించు చున్నారో".

అక్కడ కూడా మీరూరికే కూర్చోలేరు. ఆకాశగంగ లోని నీటి అలల తుంపరుల మోహన నాట్య భంగిమల్ని, మీ కవిత్వంతో వర్ణిస్తూ కళ్ళకు కట్టినట్లు చూపుచున్నారేమో అనే సందేహాన్ని వెల్లడిస్తాడు.

".....అమృతగాన
మధుర మందాకినీ భంగమాలికాంబు
శీకర వితాన మోహన చిత్రనటన
యెన్ని యెన్ని రీతుల చూపుచున్న వారో"

ఇలా సార్థకమైన మీ జీవిత కుసుమ మధుర సౌరభాన్ని అన్ని వైపులా చిమ్ముచున్నారేమో! మీ దివ్య సుందర రూపాల నుంచి ప్రసరించే నవ్యకాంతుల్ని అన్నిదెసలు కురిపిస్తున్నారేమో అని ఊహించుకొని ఆనందిస్తాడు కవి.

"పూర్ణ వికసిత పుష్ప కద్రమ
సౌరభముల చిమ్ముచున్నారొ ఎల్ల
దెసల భవదీయ సుందర దివ్యరూప
నవ్యరోచిస్సు కురియు చున్నారో మీరు"

కృష్ణ శాస్త్రి గారంటే, అతని బాబాయ్య, నాన్నలకు ఎనలేని మక్కువ. కలలో కూడా అతన్ని విడిచివుండే వారు కారు. ఆ అపూర్వ నిత్యానురాగ బంధాల్లో బంధించబడిన కృష్ణ శాస్త్రి గారు అందులోని ఆనందాన్ని తన జీవితాంతం మరువలేక పోయారు.

ఈ విధంగా 'కృష్ణ పక్షం'లో భావకవిత్వ విభాగాలైన ప్రణయ కవిత్వం, ప్రకృతి కవిత్వం, భక్తి కవిత్వం, స్మృతి కవిత్వం మొదలైనవి చోటుచేసుకున్నాయి.

**6.2. మాదిరి పరీక్షా ప్రశ్నలు:**

1) కృష్ణ పక్షంలోని భావ కవిత్వాన్ని తెలియజేయండి.

2) కృష్ణ పక్షంలోని ఆత్మాశ్రయ రీతిని విశ్లేషించండి.

3) కృష్ణ పక్షంలోని వస్త్వాశ్రయ రీతి గురించి వివరించండి

4) కృష్ణ పక్షంలోని ప్రణయ కవిత్వంను పరిశీలించండి.

5. కృష్ణ పక్షంలోని 'అన్వేషణ' ఖండికను వివరించండి.

**6.3. ఆధార గ్రంథాలు:**


1. భావ కవులు - ప్రతిభా స్ఫూర్తి - డాక్టర్ శివలెంక ప్రకాశరావు
2. కృష్ణ శాస్త్రి కవితా వైభవం - డాక్టర్ కె. రామమోహన్ రాయ్
3. కృష్ణ శాస్త్రి - కృష్ణ పక్షము - ఒక పరిశీలన మేరువ వేంకటేశ్వర రావు
4. కృష్ణ పక్షం - కృష్ణ శాస్త్రి
5. కృష్ణ శాస్త్రి జీవితం సాహిత్యం - డాక్టర్ బి. భాస్కర చౌదరి, జి. చెన్నయ్య
6. కృష్ణ శాస్త్రి కవితాతత్త్వం - డాక్టర్ బొందలపాటి కేశవ హనుమంతరావు
7. తెలుగు సాహిత్య చరిత్ర - ఆచార్య వెలమల సిమ్మన్న
8. కృష్ణ శాస్త్రి కవితాత్మ - ఆవంత్స సోమ సుందర్.


- డా॥ బలరామ్ కచ్చుళ్ళ

## పాఠం - 7

# తృణ కంకణము

**- శ్రీ రాయప్రోలు సుబ్బారావు**

**విషయసూచిక:**


**7.1.** కవి పరిచయం

**7.2.** కథా నేపథ్యం

**7.3.** పాఠ్యభాగ సారాంశం


### 7.1. కవి పరిచయం:

భావ కవిత్వానికి మార్గదర్శకులై నవ్య కవితా పితామహుడుగా పేరుగడించిన రాయప్రోలు సుబ్బారావుగారు 17-03-1892న నేటి బాపట్ల జిల్లా గార్లపాడు గ్రామంలో జన్మించారు. మేనమామ గారైన అవ్వారి సుబ్రహ్మణ్య శాస్త్రి గారి వద్ద సంస్కృత ఆంధ్ర భాషలు నేర్చుకున్నారు. చదువు కోసం రాజమండ్రి వెళ్ళినప్పుడు చిలుకూరి వీరభద్రరావు, అత్తిలి సూర్యనారాయణ వంటి వారి సహకారం లభించింది. గుంటూరు, కాకినాడ, హైదరాబాదులలో విద్యనభ్యసించారు. శాంతినికేతనంలో గురుకులవాసం చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆంధ్రశాఖలో ఆచార్యులుగా పనిచేశారు. అక్కడే కళాశాల అధ్యక్షులుగా పనిచేస్తూ ఆంధ్ర సాహిత్య అకాడమీ కార్యవర్గ సభ్యులై తమ కవితా పరిమళాలను గుబాళింప జేశారు. ఎందరో కవుల్ని, విమర్శకులను తయారుచేసి “ఆచార్య దేవోభవ” అనిపించుకున్నారు. ఒక యుగానికి పాయలు తీసిన తోటమాలి, కోకిలస్వామి అని అనిపించుకొని సుదీర్ఘమైన, ఆదర్శవంతమైన జీవితం జీవించి 1984 జూన్ 30న స్వర్గస్థులయ్యారు. రాయప్రోలు వారు వారి మేనమామ వేసిన పునాదులతో ఆసుకవిత్వంలో ఆరితేరి అష్టావధానాలు చేసి ఆ వ్యసనం వద్దని, రమ్యాక్షర రచనా మార్గంలో ప్రయాణించేలా చేయమంటూ …

> “తెనుగే తీయని దందు పద్యపదరీతి క్రీడలత్యంత మో
>
> హనముల్ శోభనముల్ తదీయ రసరక్తాలాపనంబుల్ లభిం
>
> చిన వాగర్థ కలాకలాప జయలక్ష్మిన్ గాలికింబుత్తునే
>
> జననీ, యేమిటి కింక ఆశుకవితా సన్యాసమిప్పించవే”

అని వేడుకొని రసము, భావము, జీవిత అర్థం తెలియజేసే సాధు హృదయ స్పందన వైపు నన్ను త్రిప్పుమింక జననీ రమ్యాక్షర క్షోణికిన్ అని కవితామతల్లిని వేడుకొని 1911వ సంవత్సరంలోనే భావకవితా శాఖకి బీజం వేసిన ధన్యజీవి సుబ్బారావుగారు.

**రచనలు:** రాయప్రోలు వారి రచనలను పల్లా దుర్గయ్య గారు 3 విధాలుగా విభజించారు.

**1. అనువాదాలు:** లలిత, అనుమతి అనువాద లఘుకావ్యాలు. ఉమర్ ఖయ్యాం పారసీక భాషలో రాసిన రుబాయిలకి అనువాద

కావ్యంగా "మధు కలశం" రాశారు. భజగోవిందం, సౌందర్య లహరి అనే సంస్కృత కావ్యాలను ఆంధ్రీకరించారు. వాల్మీకి రామాయణంలోని సుందరకాండను గేయ రూపంలో తెనిగించారు.

**2. లక్షణ కావ్యాలు:** రమ్యాలోకం, మాధురీ దర్శనం వీరి లక్షణ కావ్యాలు. ఈ కావ్యాలలో కవిత్వం గురించి, రసాలంకారాదుల గురించి పద్యాలలో వివరించారు. వీటిని సుబ్బారావు గారి లక్షణ గ్రంథాలుగా చెప్పవచ్చు.

**3. స్వతంత్ర ఖండకావ్యాలు:** తృణకంకణం, కష్టకమల, స్నేహలత, స్వప్న కుమారం ఈ మూడు ఖండ కావ్యాలు రాయప్రోలు వారికి భావ కవితా ఆచార్యునిగా కీర్తి తెచ్చి పెట్టినవి. ఇవేకాక ఆంధ్రావళి, జడకుచ్చులు, వనమాల, మంజరి, కన్నెపాటలు వంటి ఖండకావ్యాలు రాశారు. మంజరీ కావ్యం కవితా సంపుటి. ఈ "మిశ్ర మంజరి" రచనకు 1965వ సంవత్సరంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. స్త్రీ మనస్తత్వాన్ని తెలుపుతూ రూపనవనీతం అనే గ్రంథం రాశారు. ఆంగ్లంలో గోల్ట్ స్మిత్ రచించిన Hermit అనే గ్రంథాన్ని ఆధారం చేసుకోని "లలిత" అనే కావ్యం రాశారు. అదేవిధంగా టెన్నిసన్ రాసిన "డోరా" కావ్యాన్ని ఆంధ్రీకరించి 1910వ సంవత్సరంలో "అనుమతి" కావ్యాన్ని ప్రకటించారు. కొందరు పండితులు వీరి "తృణ కంకణం" కావ్యమే నవ్య కావ్యాలలో మొదటిదని నిర్ణయించారు. "ఏ దేశమేగినా ఎందుకాలిడిన", "మేలుకోవోయ్ భరత పుత్ర", "నాదు జాతి నాదు దేశం నాదు భాష" వంటి గేయాలు రాసి వారికున్న దేశ, రాష్ట్ర భాషాభిమానాన్ని చాటుకున్న మహనీయులు.

**4. బిరుదులు:** కోకిల స్వామి, అభినవ కవికుల గురువు, కాల్పనిక కవితా భీష్ముడు, భావకవితా పితామహుడు వీరి బిరుదులు. నవీన సాహిత్యంలో వీరిని అభినవ నన్నయ అని పిలుస్తారు.

**గురువు:** రాయప్రోలు వారు రవీంద్రనాథ్ ఠాగూర్ తన సాహిత్య గురువుగా చెప్పుకునేవారు.

**5. వక్తిత్వం:** రాయప్రోలు సుబ్బారావు గారు మొదటి చూపులోనే చూపరులను ఆకట్టుకుంటారని ప్రసిద్ధి. తమ బెట్టుతో, బింకంతో, ఠీవితో పల్లెవాటుల వయ్యారంతో చెక్కుచెదరని రూపం వారిది. ఏ దేశ మేగినా జాతి గౌరవం నిలపాలని రాస్తూనే తెలంగాణాలో ఆనాటి ప్రజలు నైజాం నవాబులతో పోరాడుతుంటే నైజాం రాజ్యాన్ని పొగుడుతూ రాశారనే అపవాదు కూడా వీరికి ఉంది.

**6. కలం పేరు:** తన లేఖిని పేరు "నిత్యదర్శిని" అని సుబ్బారావు గారు స్వయంగా చెప్పుకున్నారు.

**తృణకంకణము:** తృణకంకణము రాయప్రోలు సుబ్బారావు రచించిన సుప్రసిద్ధమైన ఖండ కావ్యం. 20వ శతాబ్దపు తెలుగు కవిత్వంపై గొప్ప ప్రభావాన్ని చూపిన భావ కవిత్వ యుగంలో మొదటి రచనగా చారిత్రక ప్రాధాన్యత సంతరించుకొన్న కావ్యమిది. 1913వ సంవత్సరంలో ఈ రచన విడుదలయ్యింది. ప్రబంధ బంధురమైన తెలుగు సాహిత్యాన్ని ఇతివృత్తం, శైలి, శిల్పం పరంగా గొప్ప మార్పు చూపిస్తూ నూతన యుగానికి నాంది పలికిన ఖండ కావ్యమిది. ఈ రచనలో రాయప్రోలు వారు అమలిన శృంగార తత్వాన్ని ఆవిష్కరించిన మొదటి కవి. దీనిని ఆంగ్లంలో 'Romanticism' అంటారు. తృణ కంకణంలో 89 పద్యాలున్నాయి. పదాడంబరం కనిపించదు. కథకి, భావానికి తగినట్టుగా వృత్త, కంద, తేటగీతి, ఆటవెలది పద్యాలు కనిపిస్తాయి. ఆచార్య ఖండవల్లి లక్ష్మీ రంజనంగారు "ఒక ప్రేమగీత" గా అభివర్ణించారు. ప్రేమ తత్వాన్ని ప్రవచించడానికి పుట్టిన 'గీతా శాస్త్రం' అని కూడా అన్నారు.

## 7.2. కథా నేపథ్యం:

శృంగార రసానికి సంభోగమే ఫలితంగా ప్రబంధ రచనల్లో పూర్వికులు ప్రతిపాదించారు. అది రాయప్రోలు వారికి నచ్చలేదు. అందుకే ప్రేమను అక్షయమైనదిగా చూపించడానికి అమలిన శృంగారాన్ని ప్రతిపాదించారు.

ఒక యువతీ, యువకుడు బాల్యస్నేహితులు. ఒకరిని ఒకరు ప్రేమించుకున్నారు. కానీ వారిద్దరికి వివాహం కాలేదు. ఆ యువతికి వేరొక వ్యక్తితో వివాహం జరిగింది. ఆ యువకుడు దుఃఖంతో, వియోగంతో సృష్టిని క్రూరంగా విమర్శిస్తాడు. అప్పుడు ఆ యువతి ప్రణయతత్వాన్ని బోధిస్తుంది. శారీరక సంబంధమే ప్రణయం కాదనీ, అంతరంగంలోని భావ స్థిరత్వమే ఆదర్శ ప్రణయమనీ అలౌకికమైన అనుబంధం ముఖ్యమని అతనికి సున్నితంగా హితవు చెప్తుంది. ఇది తృణ కంకణంలోని కథ. ఆ ప్రేమనే రాయప్రోలు వారు "అమలిన శృంగారం" అన్నారు. ప్రేమపెళ్ళికి దారితీయని యువతీ, యువకులు స్నేహితులుగా మిగిలిపోవడానికి నిర్ణయించుకొన్న ఇతివృత్తం ఉన్న రచన ఇది.

## 7.3. పాఠ్యభాగ సారాంశం:

కాళ్ళు కాలి బొబ్బలు వస్తున్నాయి. ముఖముపై చెమటలు కారి చారికలు కడుతూ ఉండగ ఒక యువతి భయంకరమైన భానుని ప్రతాపం భరిస్తూ జారిపోతున్న తన చీర పైటను సరిచేసుకుంటూ కనిపిస్తూ ఉన్న ఒక పచ్చని తోట దగ్గరికి పోతూ ఉంది. లేత నిమ్మకాయ వలే అందంగా నవనవలాడుతూ ఉన్న ఆమె శరీరం భయంకరమైన ఎండకు లేత చిగురాకువలే వాడిపోతుంది. స్త్రీలకు అందం ఆభరణాలవల్ల అధికమవుతుంది. కానీ ఆ పడతి ఎటువంటి ఆభరణాలు పెట్టుకోకపోయినా ఆమె చెక్కిళ్ళపై నుండి కారుతున్న చెమట బిందువులే ఎంతో అందంగా కనిపిస్తున్నాయి. ఆ చెమట బిందువుల అందానికి ముత్యాల అందం కూడా దిగదుడుపే. (అంటే ఆమె సహజ సౌందర్యవతి).

తోటవైపు వెళుతున్న ఆమెను కనీసం 16 సంవత్సరాలు కూడా నిండని అప్పుడే బాల్యదశ నుండి యవ్వన దశకు చేరుకున్న అందమైన అమ్మాయిలా ఉన్న రూప లావణ్యవతి ఆమె. ఆ ఊరి చివరన ఉన్న దారిలో నడుస్తూ పోతూ ఉంది. ఆమెకు వెనుక ముందు ఎవరూ లేరు. ఇసుకలో కాళ్ళు కూరుకుపోతూ ఉండగా మండుటెండకు నడవలేక నడుస్తూ నిట్టూర్పులు విడుస్తూ పడుచు జింకవలే పోతూ ఉంది. ఆమె వెళ్ళే దారిలో అక్కడక్కడ మామిడి చెట్లు ఉన్నాయి. కానీ ఆమె అక్కడ నిలువకుండా పోతూ ఉంది. చిన్న చిన్న పూవులతో ప్రింట్ వేయబడిన కలంకారీ జిలుగు పూవుల చీర కట్టుకుంది. ఆ చీర కుచ్చిళ్ళు జారిపోకుండా కాళ్ళ కడియాలు సరిచేసుకుంటూ దగ్గరలోని తోటలోకి వెళ్ళింది.

ఆమె తోటలోకి వెళ్ళేటప్పటికి ఇంకా సూర్యాస్తమయానికి ఒక జాము పొద్దు ఉంది. ఎండ కొంత తగ్గి చల్లగాలి వీస్తుంది. ఆమె కష్టాలను పంచుకోడానికా అన్నట్లు ఆ సమయంలో ఆమె పెంచిన లేడి పిల్ల ఆమె దగ్గరికి వచ్చింది. తన కడియాల చప్పుడు విని వచ్చిన దానిని చెమటలు కారుతున్న చల్లటి చేతులతో తాకుతూ, ప్రేమగా నిమురుతూ కొంత సమయం గడిపింది. ఆ లేడిపిల్ల కళ్ళవెంట నీరుకారుతుంటే చెల్లెలా! ఎందుకు కన్నీరు కారుస్తున్నావు? పసితనం వల్ల తెలియక ముళ్ళ పొదలలోకి తిరుగుతూ బాధపడుట లేదు కదా? అంటూ దాని ముఖాన్ని ముద్దుపెట్టుకుంది. గడ్డి వాసన వస్తున్నప్పటికీ నవ్వుతూ ప్రేమగా ముద్దిడింది. మండుటెండలో సొక్కిసోలిపోయినా, ఇంకా ఆయాసం తీరకపోయినా తనకు తెలిసిన లేడి వచ్చేసరికి దాని కంటతడి చూసి ఆమె తట్టుకోలేక పోయింది. ఆమెది చాలా గొప్ప మనసు. తన బాధను మరచిపోయి హరిణాన్ని దగ్గరకు తీసుకొని ముద్దాడిందంటే నిజంగా ఆమెది దయార్ద్ర హృదయం. అందమైన కళ్ళతో ప్రేమగా చూస్తున్న లేడి పిల్లను తీసుకొని ప్రేమగా మాట్లాడుతూ ఒక పోక చెట్టు నీడకి వెళ్ళింది.

ఆ పోక చెట్టుకి సమీపాన ఒక పెద్ద వృక్షం ఉంది. దానికి ఆశలు పెనగొని చలువ పందిళ్ళు వేసినట్లు ఆకులు, కాయలతో, కొమ్మలతో సందులేకుండా పొదలాగ ఆ చెట్టు ఉంది. ఆ చెట్టు కొమ్మ ఒకటి పశ్చిమ దిక్కుకి అభిముఖంగా పూవులు రెమ్మలతో నిండి కాలువ దాటడానికి ఉపయోగపడే వంతెనలాగ పొడవుగా, సుందరంగా వ్యాపించి ఉంది. ఆ తోటలో గెలలు దిగిన కోమలమైన కొబ్బరి చెట్లు, చిలుకల కూతలను ఆకర్షించే వెదురు పొదలు, పెద్దపెద్ద గంధపు మ్రానులు ఉన్నాయి. నడచి సోలిపోయి బడలికగా ఉన్న ఆమెపై చల్లని గాలి వీచింది.

అందమైన లేడితో ముద్దుముచ్చట్లు, గాలికి ఊగుతూ తననే చూస్తున్నట్లున్నీ చెట్ల ఆకులూ, తీగలు, జారిపోతున్న పొద్దు ఆ ఇల్లాలిని ఏదో తెలియని బాధలోకి త్రోశాయి.

ఆ పడతి తన చీరకొంగుతో ముఖాన్ని తుడుచుకొంటూ మనసులోని బాధ ముఖంలో తెలిసేటట్లు ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ ఉంది.

ఆమె చిటికిన వేలికి ఉన్న ఉంగరం, పచ్చని తోరణాలు వివాహ బంధాన్ని తెలియజేస్తూ తీరని కోరికలతో కూడిన ఆమె చూపులను బలవంతం చేస్తున్నాయి. తెలియని ఏదో బాధ తనను కలతపెడుతూ ఉండగా ఆ పడతి నిట్టూర్పు విడుస్తూ ఎవరో తనను పిలిచినట్లు భ్రమపడి కళ్ళు మిటకరించి రెప్పకొట్టకుండా నిశ్చేష్టురాలై చూస్తూ ఉంది. ఆ కోమలాంగి తన అందమైన విశాలమైన కళ్ళతో బెదిరి బెదిరి చూస్తూ చేయి చెంపపై పెట్టుకొని ఏదో ఒక స్వరం విన్నది.

మధురమైన వేణు నాదంతో లయ కలిపినట్లు బిలబిలా ప్రవహిస్తున్న పూవుల, చెట్ల సొనను కూడా అధిగమించి బాధతో సొమ్మసిల్లి ఆవేదనను వ్యక్తం చేస్తున్న బొంగురుపోయిన స్వరం ఈ విధంగా ఆమెకు వినిపిస్తూ ఉంది. "కాలమా ఆశలు అడియాశలు చేసి పుష్పాన్ని కొమ్మ నుండి రాలి పోయేటట్లు చేశావు. ఆ పువ్వు బాధపడకుండా ఏవిధంగా ఉండగలదు? నా ప్రియురాలు అనుకూలవతి. నిర్మలమైన అందమైన స్వభావం కలది, మృదు మధురమైన హృదయ శీలి. ఆమె ఎడబాటును నేను సహిస్తూ ప్రాణాలతో ఏవిధంగా ఉండగలను?. కాలమా మొదట పూవులపై అసలు ఆశలే లేవు. కానీ ఒక మృదు పుష్పాన్ని ఆశపడ్డాను. అది చివరికి విషాదమే మిగిల్చింది. సహించడం ఎలా? ప్రేమను వ్యక్తం చెయ్యాలని హృదయంపై ప్రియురాలి రూపం చెరగని విధంగా రక్తంతో రాసుకున్నాను. అది ఇప్పుడు సంతోషాన్ని ఇవ్వకుండా దుఃఖాన్ని మిగిల్చింది. గ్రహణం మింగిన చంద్రునివలే కాంతిహీనమయ్యింది.

ఈ పద్ధతి మంచిదని, మంచిది కాదని కొంత కాలం మన్మథ వ్యధను అనుభవిస్తూ యవ్వనాన్ని గడపాను. ప్రియురాలిపై మమతను పెంచుకున్నాను. చివరికి కాలకూటాన్ని (విషాన్ని) మిగిల్చింది. అయ్యో! ఇదేమి ప్రేమా.. ఓ మనసా! ప్రేమ పుట్టినప్పటి నుండి ఆ ఇంతిపై మధురమైన ప్రేమను చూపిస్తూ ఆరాటపడి దోషిగా మిగిలావు. ఎవరికోసం ఆ ఆరాటం. అయ్యో! నిష్కళంకమైన ప్రేమను ప్రేయురాలిపై చూపిస్తూ ఆమె నుండి ఏమి కోరుకున్నావో చివరికి అది దక్కకపోగా భయంకరమైన వ్యధనే మిగిల్చింది. ప్రేమించిన మొదటిదీ ఆమె స్నేహంతో సౌకుమార్యం, లావణ్యం, విలసనత్వం కనిపిస్తూ ఉంది. కళ్ళు మూసినా తెరిచినా ఆ సుందరి రూపమే కనిపించేది. రాత్రి పగలుకి తేడా తెలిసేది కాదు.

ఓ స్త్రీ! నీ ప్రేమ, అనురాగాలను తలచుకొంటూ నిదుర లేని రాత్రిళ్ళు గడిపాను. నిదుర పట్టిన రాత్రిళ్ళు నీవు ప్రక్కనే ఉన్నట్లు భ్రమించి సుఖం పొందాను అబలా! రాగ విశేషమైన హృదయం, సునిశిత ప్రేమ గల చందురుని వంటిదానా! తుమ్మెదలు వైరాగ్య భాష్పాలు విడిచినట్లు నాపై మన్మథ బాణాలు విడిచావు. (నన్ను మన్మథ వికారానికి గురిచేశావు) ఓ

చెలియా! చిన్న వయసులో తెలియలేదు గాని మన ఇద్దరి ఎడబాటు మనోదుఃఖాన్ని కలిగిస్తుంది. ఆశ భంగమయ్యే విధంగా కఠినమైన చురకత్తులు ఖండించినా బాధ పడలేదు. భయంకర వ్యధని అణచుకొన్నాను. ఏ ప్రేమ కోసమైతే ఓర్చుకున్నానో అది కనీసం ప్రేమ భిక్ష పెట్టలేక పోయింది. భయంకరమైన పాశాలు ప్రాణం పోకుండా నన్ను బంధించివేశాయి.

చాతక పక్షి సంవత్సరమంతా వర్షం కోసం ఎదురు చూస్తే వర్షం రాక దాని ఆశ తీరనట్లు నా ప్రేమ కూడా అయిపోయింది. నా బ్రతుకు చీకటి బారినట్లైయ్యింది. ఇంకా అంగలార్చి ప్రయోజనం ఏముంది. (ఏడ్వడం ఎందుకు?) అయ్యో! ఓ ప్రేమానురాగమా అనురాగ రహితమై శూన్యమైపోయిన ఈ దేహాన్ని ఇంకా వదలక మన్మథ బాణాలు అనే చురకత్తులతో ఎందుకు హింసిస్తావు (దయచేసి వేరేవారిని వరించు)

ఓ దైవమా! ఇంత జరిగినా కృశించిపోతున్న ఈ శరీరాన్ని ఇంకా ఎందుకు జ్ఞానం లేని ఈ లోకంలో జీవింప జేస్తావు? ఓ కోమలీ! నీ స్వభావం అనే తీగలు వికసించిన అందాలా! అన్నట్లు మందహాసము (చిరునవ్వు) చల్ల దనపు బంతులు విసురుతుండగా ఆ చేష్టలు చూపుతున్న అనురాగ మాధుర్యమా అన్నట్లు మాట్లాడే తీగలు, పూవులు మధుపాలు ఒలికించగా తన యొక్క మనోభావం ఆశ్చర్యం కొలిపే చూపులు అనే వలపు సంకెళ్ళను వేయగా తన యొక్క ప్రేమ భావాలను చూపు కొత్త కళలా అన్నట్లు ప్రవర్తన, వయస్సు, సోయగాన్ని చూపుచుండగా కళ్ళను సగం మూసి కృశించిన కళ్ళతో చూసి కూడా చూడలేని అరగంటి చూపులు విపరీత వాడియైన చూపులు కురిపించుచుండ ఆ మనోహర రూపంను ఎడబాటు లేకుండా నా మనస్సులో దర్శిస్తున్నాను అంటూ బాధతో చింతిస్తూ చలించిన హృదయం గల యవ్వనుడు ఒకడు సరిహద్దు (కంచె) దాటి వస్తూ ఉండటం ఆ స్త్రీ చూసింది.

అతనికి సౌందర్యం సడలిన దేహం, హృదయం మాత్రం సంపూర్ణంగా ఎటువంటి కల్మషం అంటని ఒక స్త్రీ కనిపించింది. అంతట వారిరువురూ అనురాగంతో ఒకరిని ఒకరు చూసుకుంటూ అటూ ఇటూ కలియదిరిగి ఒక చోటుకు చేరారు. వారి చూపులు కలిశాయి. ఒకరి చేయి ఒకరు పట్టుకొని సంతోషం, శోకం, అనుమానాలలో ఊగిసలాడుతూ కొంతసేపు కళ్ళు మూసుకుని నిశ్చేష్టులై మౌనంగా ఉండిపోయారు. పుట్టినప్పటి నుండి ఏర్పడిన స్నేహబంధం వారిది. బహుకాలపు పరిచయం, అనురాగ కోరికలను పెంచుకోగా విధి వారి ఆశను బలవంతంగా భంగపరిచింది. వారిని అలా చేసింది. మూగ బొమ్మల వలే కొంత సమయం నిలబడిపోయారు. చివరికి ఆ యువకుడు యువతి చేయి విడిచిపెట్టాడు. సొగసరియైన ఆమెను సంతోషం ఉప్పొంగుతూ ఉండగా మంచి మాటలలో ఈ విధంగా పలుకరించాడు.

ప్రియసఖీ! కుశలమేనా? అన్ని విషయాలు అనుకూలంగా ఉన్నాయా అని బాధగా మాట్లాడాడు. కన్నీటి దారలతో నిండిన ఆ యువకుడు సంతోషం లేని తన కళ్ళలో కోరికలు అధికమౌతూ ఉండగా కలుషితమైన ఆ స్త్రీ గుర్తులను చూస్తూ, ఉన్నాడు. గద్గద స్వరంలో దుఃఖముఖుడైన ప్రాణప్రియుని చూడడానికి తహతహలాడుతూ కళ్ళను పైకెత్తింది. చీకటిని చీల్చుకుంటూ ఉదయించిన తెల్లని కాంతిని వెదజల్లుచూ ప్రకాశించే సూర్యుని వంటి కన్నులు గల ఆమె తన కళ్ళని ఒత్తుకొంటూ అనేక మార్లు ప్రియుని వైపు ముఖం తిప్పింది. వెల్లివిరిసీ విరియని ప్రేమనుతాకు వలపులు వ్యక్తం అయ్యి అవ్వనట్లు ముద్దులొలికే సిగ్గ వినయ నిర్మలమైన జ్ఞానం గల ఆమెకు సమయ భారాన్ని గుర్తు చేస్తూ ఉండగా కళ్ళు తెరచి ప్రియుని చూచి అతని హృదయ వేదన, మనస్సులోని అంతరార్థం గ్రహించింది. నిష్కళంకమైన తన జ్ఞానంతో శౌఖ్యం కోరినదై ఈ క్రింది విధంగా చెబుతుంది.

ఓ స్నేహితుడా! స్నేహితుల మధ్య బంధాలు ఎన్నటికీ విడదీయలేనివని విన్నాము కదా! అయ్యో! నీవు ఆ మాత్రం తెలుసుకోలేక నన్ను ఎందుకు దుఃఖంలో ముంచుతావు. స్నేహితుల మధ్య ప్రేమ ప్రేమతో మధురాన్నం తినిపించే తల్లి ప్రేమ

వంటిదే. బాల్యం నుండి ప్రాణ సమానమైన స్నేహాన్ని, ప్రేమతత్వాన్ని నీవు గ్రహించింది ఇంతేనా? సహృదయుడా ! వేరవడం తెలియని కోరికలు; ఎడము తెలియని భావాలు, తృప్తి పడీపడనట్లుండి భేదం తెలియని అనురాగ బంధాలు పెనవేసుకోగా ఇప్పుడు విడదీయడం ఎలా? అని తన అనుకూలాన్ని మూగబోయిన గొంతుతో కన్నీటి పర్యంతమౌతూ ప్రేమను గూర్చి తనకున్న విశ్వాసాన్ని తెలిపింది. ప్రేమపై కోరికలు పెంచుకున్న, ఆ జంట ఆశలు కాష్టాల పాలయ్యేసరికి ఉత్సాహ భరితమైన ప్రియురాలి గొంతు ఆవిధంగా పలికింది. ఓ సఖీ! స్నేహాన్నే నమ్మి నానిన ప్రేమ చిగురించి మిక్కిలి మధురం కాగా పుష్పించిన ఆ స్నేహమనే పూవు రేకులను తుంచి దానిని మొండిదిగా (వట్టిదిగా అంటే అందం కోల్పోయేటట్లు చేయడం వల్ల) చేసిన పరిస్థితులు ఈ భూమిపై కలిగాయి అని చెప్పిన ప్రియురాలిని చూసి అతను ఇలా అన్నాడు.

ఓ చెలీ ! ఇంకా ప్రేమగా మాట్లాడి ఎందుకు నన్ను వ్యధకు గురిచేస్తావు? వ్యర్థమైన ప్రేమ భ్రాంతిలో పడి వెధ చెందాను. ఇకనైనా జ్ఞానం నేర్చుకొంటూ ఈ జీవితం వెళ్ళబుచ్చుతాను. ఓ ప్రియురాలా! రసవత్తరమైన వరుసలు కలుపుకొని ఎటువంటి భేదం తెలియని అను రాగమే స్థిరమని ప్రేమలో లీనమై బ్రతుకుతున్నాను. చివరికి దేవుడు కఠినుడై ఎడబాటు కలిగే విధంగా తెగతెంపులు చేశాడు. ఈ విషాదాన్ని సహిస్తూ ఏవిధంగా జీవించగలము. ఓ స్త్రీ విడువని కోరికలతో పుట్టిన స్నేహం పెంపొందిన నీ మనసున బాధించు శ్రమలు కలిగినవి. ప్రేమ లేని భావన కలిగింది అయ్యో! ఎడబాటులో అమృతమైనా! విషమైనా ఒకటేలే సుమా!. ఏ భేధం లేకుండా ఒక కంచంలో తిని ప్రేమను పెంచుకొని కలసిమెలసి జీవించే జంటను విడగొట్టేది దైవిక ప్రేమకాదు. సంతోషం కలిగించే వస్తువు వల్ల ప్రాణి కోటి సేదదీరుతుంది. ప్రశాంతంగా ఉంటుంది. ఉత్తేజం లేని జీవితానికి తన్మయత్వం పొందేటంత సుఖం ఉండదు.

ముత్యపు చిప్ప నుండి ముత్యం పుట్టడం, పద్మం నుండి తేనెకారడం చోద్యం కాదు. అది వాటి స్వభావం. అది మంచిది కాకపోతే నా హృదయంలో ప్రేమ పుట్టడం కూడా మంచిది కాకపోవచ్చు. (అంటే ప్రేమ పుట్టడం తప్పు కాదని అర్థం). ఓ స్త్రీ శరీరంతో జీవించి ఉన్నంత వరకు సౌఖ్యాలు అనుభవించ వలసిందే. (భోగ భాగ్యాలు) ఉంటే దుఃఖమైనా ఉంటుంది. లేదా సుఖమన్నా ఉంటుంది. వాటిలో ఏదో ఒకటి అనుభవించవలసిందే. ఆ రెండూ లేని మానవ జీవితం లేదు. ఉదయించే సూర్యరశ్మి అనే లక్ష్మికి ముత్యాల దండా? అన్నట్లు కురిసే మంచు సాయంత్రం అయ్యే సరికి చీకటి అనే స్త్రీ ని విడిపోతాయి. ఇదే కదా సృష్టి రహస్యం. అంటే ఒకే విషయం (వస్తువు) ఒకరికి సంతోషాన్ని, ఒకరికి దుఃఖాన్ని ఇస్తుంది. ఇది సృష్టి రహస్యం. నిష్కళంకమైన చంద్రుని తెల్లని శోభలను కాల చక్రం కనిపించకుండా ఎక్కడో దాచి పెట్టగా రాత్రి అనే స్త్రీ వేకువ జాము మంచు అనే కన్నీరు కారుస్తుంది కదా? వలపును కలిగించే వసంత కాలంలో చిగురించి నవనవలాడుతూ పచ్చగా ఉండే మామిడాకుని చల్లదనం, హాయిని ఇచ్చే చంద్రుపై (మంచే) అందం కోల్పోయేటట్లు చేస్తుంది. నిలకడలేని కాలానికి మంచీ చెడూ అనే నియమం ఏమీ లేదు.

ఓ నేస్తమా! రసవతరమైన కలయిక వల్ల కలిగే సుఖం కంటే సహించలేని ఎడబాటు వల్ల కలిగే బాధే మంచిది. అదేలాగంటే చీకటి ఉంటేనే వెలుగు విస్తరిస్తుంది. అలాగే బాధ లేకపోతే (ఎడబాటు) కామక్రోధాల వల్ల పుట్టే దోషం అర్థం కాదు. మనసు కఠినమై ప్రేమను కోల్పోయిన తరువాత సువాసనలు వెదజల్లుచూ హాయిని కొలిస్తే చంద్రుని వెన్నెల గొప్పతనాన్ని ఆశ్వాదించలేదు.

యువతీ యువకులు కోరికతో జీవించేటప్పుడు పాము విషం లాంటి కష్టాలను కూడా పూలదండలా భావిస్తారు. ఆ ప్రేమ నశిస్తే పూల దండ కూడా పాములాగే అనిపిస్తుంది. ఈ సృష్టిలో జీవరాసి ఏదో ఒక విషయంపై కోరిక పెంచుకొని తీరక

వ్యధ చెందే సమయంలో ఆషాడ మాసంలో కురిసే మేఘం వంటి కన్నీటి వ్యధలో అష్టైశ్వర్యాల వంటి సుఖాన్ని ఇచ్చేది స్నేహమే సుమా!. ప్రణయవల్లీ (ఓ ప్రియురాలా) నశించిన నాప్రేమ గుర్తుల శిధిలాలు ఏదో ఒక సుకవి పాటగా మారాలనేది నా ఆశ. అంతకు మించి వేరే కోరిక నాకు లేదు. ప్రాణ నేస్తమా! ప్రేమానురాగాలతో నిండిన ఆ తొలి రోజులు మరచి పోవద్దు. ఆ విన్యాసాలు జీవితాంతం గుర్తు చేసుకో. ప్రశాంతంగా ఉండాలనుకుంటే జరిగిందంతా మరిచిపో అని తన వేదన వ్యక్తం చేశాడు.

నన్ను మరచి పోవద్దు అంటూనే నీవు సుఖంగా ఉండాలనుకుంటే (ప్రశాంతంగా) అంతామరచిపో అని కన్నీటి పర్యంతమైన ప్రియుని చూసి ఆ కోమలి నెమ్మదిగా ప్రేమ రహస్య లీలలను ఈ విధంగా తెలిపింది. ఓ స్నేహితుడా! ఈ విధంగా నిరంతరం దుఃఖంలో మునిగి పోవడం తగదు. నాస్థిక సందేహాలను మనస్సులో ఉంచుకొని భ్రమ చెందకూడదు. ప్రేమాను బంధాలు ఒకరు విడదీస్తే విడిపోయేవి కావు. భగవదనుగ్రహం వల్లే యువతీ యువకులలో ప్రేమ ఈ భువిపై పుడుతుంది. అది చెరగకుండా జీవితాంతం ఒకటిగా ఉండాలంటే ఎన్నో జన్మల నోము ఫలితం గాని అది లభించదు. ఓ స్నేహితుడా! శరీరం ద్వారా నటించి జీవరాసి అనురాగాల వలలో చిక్కుకొన్నప్పుడు ఇంద్రియాలను తృప్తిపరచు కుతూహలం మాసిపోగా ధర్మ బద్ధంగా ఏర్పడిన ప్రేమ బంధాలు అభివృద్ధి చెంది వికసించలేక గొడ్డుబారినదైన జీవన రాగానికి చిక్కుకొని చివరికీ ఆ అనురాగ మాధుర్యాలకు దూరమవడం తెలియదా? ప్రాణ ప్రియుడా! అనేక విధాలుగా సుఖం పొందాలని తపించే మనసును కలుషిత పరచుకోకుండా మృదువుగా మనసు కలత చెందకుండా మలచుకొని తృప్తి చెందడమే మంచిది అనే కవుల పలుకులే సరియైనవి. చైత్రమాసంలో చెట్లు చిగురించి, (వసంత ఋతువు) శిశిర ఋతువులో మంచుకు ఎండిపోయినట్లు యవ్వనంలో పుట్టిన ప్రేమ వలపులు వృదాప్య దశలో సడలి పోతాయి.

ఓ ప్రియుడా! సముద్రపు అలలు (ఆటు పోటులు) స్థిరము కావు. ఉదయ అలలు (ఆటుపోటులు) స్థిరము కావు. ఉదయ సాయింత్రపు సంధ్యలలో ఆకాశపు ఎరుపు శాశ్వితం కాదు. అలాగే బాధలు, భంగపాట్లు శాశ్వితం కాదు. అరటి చెట్టు మొగ్గ తొడిగే దశకు రావడం. సంతోషకరమే గాని కాయలు రాగానే నరకబడుతుంది. అలాగే అశాశ్వతమైనవి శాశ్వితం అనుకోనేకూడదు. అవి ఎప్పటికైనా నశించడం విధి విధానం.

రెండు శరీరాలు కలిస్తేనే ప్రేమ కాదు. రెండు మనసులు కలవడమే ప్రేమ అని జ్ఞానవంతులు తెలిసికొని జీవిస్తారు. ఏ స్త్రీ యైనా అలాగే అనుకొని జీవిస్తుంది. (మలినం లేని ప్రేమతో జీవిస్తుంది). భార్యా భర్తల ప్రేమైన మరి ఏదైనా ప్రేమ అను రాగాలనేవి తల్లి చనుబాలతోనే ప్రారంభం అవుతాయి. ధర్మ పరమైన ప్రేమానురాగాలు ముక్తి పొందుతాయి. మలినం లేని ఆ ప్రేమే ధర్మ మార్గంలో నడుపుతుంది. సృష్టిలో మెత్తని కలయికలు ఏర్పరచుకున్న గువ్వల జంట, ఆవు దూడలు, స్నేహితులు అందరూ నిష్కళంకమైన ప్రేమ ఆప్యాయతలతోనే జీవిస్తారు. అది కూడా ప్రేమ రహస్యమే.

ఈ భువిలో మనసు, మాట, క్రియలలో ప్రేమ మలినం అవుతూనే ఉంటుంది. కాబట్టి ఓర్పుతో మౌనంగా దానిని జయించాలి. నిష్కల్మషమైన ప్రేమను పొందుకోవాలి. మనసు పూల బుట్టతో సమానం. దానిలో ప్రేమ, ఆప్యాయత, అనురాగాలనే కుసుమాలు జారిపోకుండా ఎప్పటికీ వికసిస్తూనే ఉంటాయి. ప్రేమ అనేది మనసుల అంతరంగాలలో పుడుతుంది. దానిని కలపడం, విడదీయడం ఏ విధంగానూ సాధ్యం కాదు. స్నేహితుడా? తోటలోని పూలు ఒక దానిని ఒకటి విడువక పెనవేసుకొని పెరుగుతాయి. వాటికి ఏ కోరికలు ఉండవు. అయినా అవి ఒకదానిని ఒకటి విడిచి పెట్టక పెనవేసుకొని పెరుగుతాయి. ఎంత తపస్సు చేస్తే గాని ప్రేమ ఫలం లభించదు. మరి అటువంటి చిరకాల స్నేహాన్ని అప్పుడే తుంచివేయడం పాపకర్మ. అటువంటి

కార్యానికి పూనుకున్నావు. ఓయీ! సఖుడా మనం నిమ్మ చెట్టు కింద రాసుకునే రాతలు నా మనస్సులో ఇంకా చెరిగిపోకుండా ఉన్నాయి. చెరగని కోరికలతో మనసూ మనసూ కలిసి ప్రేమ ఏర్పడితే ఆ ప్రేమను చెరుపుకోవడం అనేది కన్న బిడ్డలే తల్లికి కడుపు కోత మిగిల్చినట్లు కాదా! అలా జరిగితే ఇక దిక్కు ఏది?

స్నేహితుడా! ప్రేమ అనేది చాలా రహస్యమైనది. ఆ ప్రేమ విఫలం చెందడం అనేది మరీ గూఢమైనది. దానిని ఎరిగిన వారే నేర్పరులు. వారి గురి అనుభవమే. ఆ రహస్యాలను ఇప్పుడు ఎందుకు విమర్శించడం. మిత్రమా! కళ్ళతో ఒకరిని ఒకరు చూసుకోవడం, మనసులో వేరే ఆలోచనలు లేకుండా ఒకరి పైనే ధ్యాస పెట్టుకోవడం ప్రేమగా ఏమోయ్! అని కొసరి పిలుచుకోవడం కంటే ప్రాణ స్నేహితులకు ఏమికావాలి? ప్రేమకు గుర్తుగా తొలినాళ్ళలో నా చేతికి కట్టిన పట్టు వ్రత సూత్రం ఇప్పుడు తెంచివేస్తావా? అని విలపించింది.

విలపిస్తూ, నిశ్చేష్టురాలై కళ్ళు మూసుకొని ఉన్న ప్రియురాలిని ప్రేమ అతిశయించేటట్లు తాకుతూ ఏదో చెప్పలేక చెప్పడానికి ప్రయత్నం చేస్తున్నాడు. జారిపోతున్న తన పైటను సరిచేసుకొని బిగుతుగా గాజులు తొడిగిన తన చేతిని కళ్ళకు అడ్డం పెట్టుకొని చెట్టు కొమ్మకు ఆనుకొని నిలబడింది. హృదయం అనేది పైకి కనబడదు. దాని స్వభావం కొన్నిసార్లు మృదువుగా కొన్ని పర్యాయాలు కఠినంగా ఉంటుంది. మన ఆలోచనకు అందదు. అలాగే ప్రేమ కూడా ఎప్పుడు ఎలా ఉంటుందో దాని చెప్పనలవి కాదు.

కొంత సమయం ఇద్దరూ ఏమీ మాట్లాడుకోకుండా నిశ్చేష్టులై ఉన్నారు. అప్పుడు ప్రియుడు తన ప్రేమను తెలియ జేయడానికి ఒక వ్రత సూత్రం తయారు చేసి ఆమె చేతికి కట్టి తన బాధను వ్యక్తం చేయాలనుకున్నాడు. తన దగ్గరలో ఉన్న లవంగ తీగలతో ప్రాకుతూ కాలువ అంచులలో నీటి ఊటలతో నిరంతరం పచ్చగా ఉన్న లేత గడ్డి మొక్కను తుంచి విచిత్రమైన ఒక కంకణం తయారుచేశాడు. మృదువైన గడ్డితో చేసిన కంకణాన్ని ఆమె చేయి పట్టుకొని ఆమెను చూస్తూ మిత్రమా! మన ప్రేమకు గుర్తు ఇదే అని చెప్పి ఆమె చేతికి ఆ కంకణం కట్టి ఓ సోదరీ! మన ప్రేమకు గుర్తుగా కట్టిన ఈ గడ్డి కంకణం వాడిపోకుండా వేకువజాము సమయాలలో గుర్తు వచ్చినప్పుడు కాస్తంత కన్నీళ్ళు జల్లి వాడిపోకుండా చూడు. ఇదే నా చివరి ఆశ అన్నాడు. తను కట్టిన కంకణాన్ని మరచిపోవద్దని బాధగా చెప్పగా మధురమతియైన ఆమె కూడా తన వేలికి ఉన్న తనకు ఎంతో ఇష్టమైన ఉంగరం తీసి అతని చేతి వేలికి తొడుగుతూ ఈ విధంగా చెప్పింది.

వలపు నశించినా ప్రేమ ఎన్నిటికీ నశించదు. కాబట్టి మన ఇద్దరం నీడ వలే ఒకరిలో ఒకరం విడదీయరాని విధంగా ఐక్యం పొంది జీవిద్దాము అని చెప్పింది. ఆ సమయంలో వారి నిర్ణయానికి మెచ్చుకొన్నట్లు అదృష్ట దేవత చేయి చాపి అమృత వర్షం అనే అక్షంతలు కురిపించిందా అన్నట్లు ఆ జంటపై పొగడ చెట్టు పూలు రాల్చింది. ఆ స్నేహితుడు ఆమెను చూస్తూ ఏదో ఆలోచిస్తూ కనిపించకుండా వెళ్ళిపోయాడు. వారి మృదువైన అనురాగానికి దారిలేకుండా అంతరార్థం అనే అలల కాలువ అడ్డుపడి వారిద్దరినీ విడదీసింది.

ఆ జంట విలువైన వ్రత సూత్రం ఏర్పరచుకొని ఆ మాటకు విలువనిస్తూ సంధ్యాకాలంలో కాంతి నశించినట్లు బాధగా ఒకరిని ఒకరు చూసుకొంటూ ఎవరి ఇండ్లకు వారు వెళ్ళిపోయారు. విధి వారిని విడదీసినప్పటికీ కస్తూరి పుష్పాన్ని కడిగినా దాని పరిమళం వెదజల్లడం మాననట్లు వారి స్నేహ బంధం కూడా ఎన్నటికీ విడిపోక శాశ్వతంగా నిలిచే ఉంటుంది.

**– డా॥ దొప్పలపూడి సుజాత.**

పాఠం - 8

# తృణ కంకణము

## - శ్రీ రాయప్రోలు సుబ్బారావు

**విషయసూచిక:**


**8.1. కఠిన పదాలకు అర్థాలు**

**8.2. సందర్భ సహిత వ్యాఖ్యలు**


### 8.1. కఠిన పదాలకు అర్థాలు:

1. తృణ కంకణము = గడ్డితో చేయబడిన కంకణము.
2. వదనాంచలము = చెక్కిలి
3. కవటాకు = లేత ఆకు
4. జవ్వనపు మవ్వ = యవ్వనకాలపు రూపం
5. నిదాఘశాంతి = సూర్య ప్రతాపం (ఎండ) తగ్గుట.
6. తృణపరిమళము = గడ్డివాసన
7. నీ లాలక = నల్లని కురులు కలది. (నీలవేణి)
8. సిగ్ధ = దట్టమైన
9. సికత = ఇసుక
10. స్కంధ = చెట్టు బోదె
11. మవ్వపు = కోమలత్వపు
12. కన్నె గందపుమాకులు = పెద్దవైన గంధపు మ్రానులు
13. సోలింపు = అలసత్వం
14. ప్రదోష = పాలిపోవు
15. వాలికల్ = వాడియైన
16. చారు = అందము.
17. పాణి బంధము = వివాహబంధం
18. క్లాంతకంఠ = సొమ్మసిల్లిన గొంతు
19. వికాసపతన = తెలివి మాలిన

| | |
|---|---|
| 20. మృషాపాశంబులు | = అసత్య తాళ్ళు |
| 21. వాలికల్ | = వాడియైన చూపులు |
| 22. ఆర్తి | = సంపూర్ణమైన |
| 23. ప్రసన్నము | = నిర్మలము |
| 24. చిర సమేళన | = బహు కాలపు కలయిక |
| 25. స్వసనుడు | = వాయువు |
| 26. మలీమసము | = మాసిన |
| 27. తివుట | = కోరిక |
| 28. నిర్వేద భరము | = దుఃఖం వల్ల కలిగే హేయము. |
| 29. విదారించు | = చీల్చు |
| 30. దవళరోచి | = తెల్లని (నిర్మలమైన) |
| 31. చెనకు వగలు | = తాకు వలపు |
| 32. నొవ్వ | = వేదన |
| 33. కక్కసించు | = బాధించు |
| 34. పొరుపెఱుంగక | = భేదం తెలియక |
| 35. భాగదేయము | = సౌందర్యాలు (సౌఖ్యాలు) |
| 36. ఖేదము | = దుఃఖం |
| 37. గువ్వకుత్తుకతో | = మూగబోయిన గొంతుతో |
| 38. ప్రదోష దోహలమై | = ఉత్సాహభరితమై |
| 39. నిశ్శాంతము | = తెల్లవారు జాము. |
| 40. శుక్తి | = ముత్యపు చిప్ప |
| 41. మావి | = మామిడి. |
| 42. హిమ కుమారుడు | = చంద్రుడు |
| 43. చంద్రికలు | = వెన్నెలలు |
| 44. నెఱ + వగలు | = అధికమైన దుఃఖం |
| 45. దురపిల్ల | = తపింప |
| 46. జరాక్రాంతదశల | = ముసలితనం |
| 47. అనటి | = అరటి |

48. జ్ఞాన విదగ్ధులు = జ్ఞానవంతులు
49. స్ఖలిత = జారిన
50. పేశల = నేర్పుకలది
51. స్వాంత = మనసు
52. విసఙవోని = విడువని
53. విదగ్ధులు = నేర్పరులు
54. సుహృన్మణీ = స్నేహితుడు
55. నెమ్మిగదురు = ప్రేమాతిశయం
56. తమి = చీకటి (వలపు, ఆపేక్ష, కుతూహలం)
57. నవక = మృదుత్వం
58. ప్రాభాతికవేళ = వేకువజాము
59. వకుళ = పొగడచెట్టు
60. మృగమదపాత్రతి = కస్తూరి పాత్ర (కస్తూరి పుష్పం)

## 8.2. సందర్భ సహిత వ్యాఖ్యలు:

**1) "కవటాకన వసివాడె నిదాఘతాప పరిపీడనలన్".**

**కవి పరిచయం:** ఈ పద్య పాదము శ్రీ రాయప్రోలు సుబ్బారావు గారిచే రచించబడిన "తృణ కంకణము" అనే ఖండ కావ్యము నుండి స్వీకరించబడినది.

**సందర్భం:** లేత నిమ్మపండు వలే అందంగా మిసమిసలాడుతూ ఉన్న ఒక యువతి పూవు వంటి సువాసనలు వెదజల్లు తన కోమలమైన శరీరం కవటాకు వలే (లేత ఆకువలే) సూర్యుని ప్రతాపానికి వాడి పోయిందా! అన్నట్లుంది అని చెప్పే సందర్భంలో ఈ మాటలు చెప్పబడినవి.

**అర్థాలు:**

| | | |
|---|---|---|
| | కవటాకు + అన్న | = లేత ఆకా అన్నట్లు |
| | నిదాఘతాప | = భానుని ప్రతాపానికి |
| | పరిపీడనల్ | = పీడించబడి (బాధకు గురియై) |
| | వసివాడె | = మిక్కిలి వాడిపోయింది. |

**భావం:** సూర్యుని ఎండ తాపానికి ఆమె శరీరం లేత ఆకు వాడిపోయినట్లు వాడి పోయింది అని భావం.

**2. "పదుచు జింకపదంతి నా నదుచు నామె".**

**కవి పరిచయం:** ఈ పద్య పాదము శ్రీ రాయప్రోలు సుబ్బారావు గారిచే రచించబడిన "తృణ కంకణము" అనే ఖండ కావ్యము నుండి స్వీకరించబడినది.

**సందర్భం:** సూర్యుని ప్రతాపానికి బాగా వేడెక్కిన ఇసుకలో కాళ్ళు కూరుకుపోతూ ఉన్నాయి. నిట్టూర్పులు విడిస్తూ పోతూ ఉండగా కొద్ది దూరం పోగానే ఇసుక కొద్దిగా చల్లారినట్లు అనిపించగా లేత వయసులో ఉన్న జింక చంగు చంగుమని వెళ్ళినట్లు ఆమె నడుస్తుంది. (నాయిక) అని చెప్పే సందర్భంలో ఈ మాటలు చెప్పబడినవి.

| | | |
|---|---|---|
| **అర్థాలు:** | పడుచు | = యవ్వనంలో ఉన్న (కుర్ర వయసు) |
| | జింక పడంతి + అన | = జింకా అన్నట్లు |
| | ఆమె | = ఆ స్త్రీ |
| | నడుచు | = నడుస్తుంది. |

**భావం:** యవ్వనంలో (కుర్రదైన) ఉన్న జింక నడిచినట్లు ఆ స్త్రీ నడుస్తుంది అని భావం.

**3. "వనలు దిరుగవు గద చిన్న తనపు చేష్ట!**

**కవి పరిచయం:** ఈ పద్య పాదము శ్రీ రాయప్రోలు సుబ్బారావు గారిచే రచించబడిన "తృణ కంకణము" అనే ఖండ కావ్యము నుండి స్వీకరించబడినది.

**సందర్భం:** నాయిక ఎండలో నడుచుకుంటూ దగ్గరలో ఉన్న వనంలోకి వెళ్ళింది. ఆమె కాలి చప్పుడు గమనించి ఆమె పెంచిన జింక పిల్ల దగ్గరికి వచ్చింది. దానిని తీసుకొని ముద్దు ముచ్చట్లు కొలుపుతూ ఉండగా ఆ జింక కళ్ళ నుండి కన్నీరు కారుతుంది. దాని కన్నీటిని చూసి చలించిన ఆమె "చిన్న వయసులో తెలిసి తెలయని చేష్టల వలన ముళ్ళ తుప్పలలో తిరుగుతూ ఇబ్బంది "పడుట లేదు కదా? చెల్లెలా అని దానిని ముద్దుగా అడుగుతున్న సందర్భంలో ఈ మాటలు చెప్పబడినవి.

| | | |
|---|---|---|
| **అర్థాలు:** | చిన్నతనపు చేష్ట | = చిన్న వయసు వల్ల |
| | వనలు | = వనములో తెలిసీ తెలియక (తోటలో) |
| | తిరుగవు + కద! | = తిరుగుటలేదు కదా! |

**భావం:** తెలిసీ తెలియక వనాలలో తిరుగుట లేదుకదా? అని భావం.

**4. "నీలాలక మొక్క పోకనీడకు చనియెన్"**

**కవి పరిచయం:** ఈ పద్య పాదము శ్రీ రాయప్రోలు సుబ్బారావు గారిచే రచించబడిన "తృణ కంకణము" అనే ఖండ కావ్యము నుండి స్వీకరించబడినది.

**సందర్భం:** వాలు కన్నులతో తనను చూస్తూ దగ్గరికి వచ్చి జింక పిల్లను తీసుకొని నాయిక ఒక పోక చెట్టు (వక్క చెట్లు) నీడకు తీసుకు వెళ్ళిన సందర్భంలో ఈ మాటలు చెప్పబడినవి.

| | | |
|---|---|---|
| **అర్థాలు:** | నీల + అలక | = అందమైన ఆమె కురులు గల (నల్లని వేణి) |
| | ఒక్క | = ఒక |
| | పోక నీడకున్ | = పోకచెట్టు క్రిందకి |
| | చనియెన్ | = వెళ్ళింది. |

**భావం:** నల్లని (అందమైన) కురులు గల ఆమె ఒక్క చెట్టు నీడకి వెళ్ళిందని భావం.

**5. కన్నె గందపు మాకులున్ కలవు మఱియు.**

**కవి పరిచయం:** ఈ పద్య పాదము శ్రీ రాయప్రోలు సుబ్బారావు గారిచే రచించబడిన "తృణ కంకణము" అనే ఖండ కావ్యము నుండి స్వీకరించబడినది.

**సందర్భం:** నాయిక ఒక పోక చెట్టు క్రిందకి జింక పిల్లను తీసుకొని వెళ్ళింది. ఆ వనములో గెలలు దిగి అందంగా ఉన్న కొబ్బరి చెట్లు ఉన్నాయి. పూల గుత్తులు వేలాడుతున్న పొన్న చెట్లు, చిలుకల రావాలను ఆకర్షించే ఎదురు పొదలు ఉన్నాయి. అంతేకాక పెద్ద పెద్ద గందపు మ్రానులు ఉన్నాయని కవి చెప్పే సందర్భంలో ఈ మాటలు చెప్పపడినవి.

| | | |
|---|---|---|
| **అర్థాలు:** | మఱియు | = అంతేగాక |
| | కన్నె గంధపు మాకులున్ | = పెద్దపెద్ద గంధపు చెట్లు కూడా |
| | కలవు | = ఉన్నాయి. |

**భావం:** ఆ వనంలో పెద్దపెద్ద గందపు మ్రానులు కూడా ఉన్నాయని భావం.

**6. "అడుగు లోరయుచు పవళించె హరిణపుత్రి".**

**కవి పరిచయం:** ఈ పద్య పాదము శ్రీ రాయప్రోలు సుబ్బారావు గారిచే రచించబడిన "తృణ కంకణము" అనే ఖండ కావ్యము నుండి ఈ పాద్యపాదం స్వీకరించబడినది.

**సందర్భం:** నాయిక తన దగ్గరకు వచ్చిన జింక పిల్లను తీసుకొని పోక చెట్టు నీడకు వెళ్ళింది. ఆమె ప్రకృతిని చూస్తూ అనేక విధాలుగా ఆలోచిస్తూ ఉండగా ఆమె వెంబడి తన పాదాలకు తగులుతూ (ఆమెను తాకుతూ) జింక పిల్ల వచ్చి కాళ్ళ దగ్గర పడుకుంది అని చెప్పే సందర్భంలో ఈ మాటలు చెప్పబడినవి.

| | | |
|---|---|---|
| **అర్థాలు:** | ఆడుగులు | = కాళ్ళకు (అడుగుల) |
| | ఒరయుచు | = రాచుకొనుచూ |
| | హరిణపుత్ర | = జింక పిల్ల |
| | పవళించె | = పడుకుంది. |

**భావం:** నాయిక దగ్గరికి వచ్చి ఆమె కాళ్ళ దగ్గర జింక పిల్ల పడుకుంది అని అర్థం.

**7. "గ్రహణగతమైన చంద్రుని కల విధాన"**

**కవి పరిచయం:** ఈ పద్య పాదము శ్రీ రాయప్రోలు సుబ్బారావు గారిచే రచించబడిన "తృణ కంకణము" అనే ఖండ కావ్యము నుండి స్వీకరించబడినది.

**సందర్భం:** తృణ కంకణంలో నాయకుడు తన చిన్ననాటి స్నేహితురాలికి వేరొక పురుషునితో వివాహం జరిగిందని ప్రకృతిని గూర్చి వైరాగ్యంగా తనను తాను నిందించుకుంటూ హృదయమా ఏ స్త్రీ రూపాన్నైతే రక్తంతో చెరగకుండా రాసుకున్నావో ఆ రూపము నీకు సంతోషాన్ని ఇవ్వక వ్యధనే మిగిల్చింది అని అనుకునే సమయంలో ఈ మాటలు చెప్పబడినవి.

**అర్థాలు:** గృహణ గతము + మన = గ్రహణం పట్టిన

చంద్రుని = చంద్రబింబం యొక్క

కల = రూపం

విదాన = వలే!

**భావం:** చంద్ర గ్రహణం రోజు చంద్రుడు కాంతి హీనుడైనట్లు గుండెలలో రక్తంతో చెరిగిపోకుండా రాసుకున్న ప్రియురాలి రూపం కనిపించకుండా అయ్యిందని భావం.

**8. "తహతహంపడు చబల నేత్రముల నెత్తి"**

**కవి పరిచయం:** ఈ పద్య పాదము శ్రీ రాయప్రోలు సుబ్బారావు గారిచే రచించబడిన "తృణ కంకణము" అనే ఖండ కావ్యము నుండి స్వీకరించబడినది.

**సందర్భం:** చిన్ననాటి స్నేహితుడు తన స్నేహితురాలితో "నెచ్చలీ కుశలమేన?" ఈ రోజు అనుకులంగానే ఉన్నదా? అంతా సంతోషమేనా? అని గద్గద స్వరంతో అడుగుతున్న ప్రియుని ముఖం చూడడానికి తహతహలాడుతూ అతనిని చూసింది అని చెప్పే సందర్భంలో ఈ మాటలు చెప్పబడినవి.

**అర్థాలు:** చబల = నిలకడలేని (చలించే)

నేత్రములను = కళ్ళను

తహతహంపడు = ఆతురపడుచూ

ఎత్తి = పైకి ఎత్తి.

**భావం:** ఆతురపడుచూ (రెప్పకొడుతూ) తత్తరపాటుతో ప్రియుని ముఖం చూడడానికి కన్నులు పైకెత్తిందని అర్థం.

**9. "ప్రేమ తత్వము వెఱిగిన వృత్త విదియె?"**

**కవి పరిచయం:** ఈ పద్య పాదము శ్రీ రాయప్రోలు సుబ్బారావు గారిచే రచించబడిన "తృణ కంకణము" అనే ఖండ కావ్యము నుండి స్వీకరించబడినది.

**సందర్భం:** చిన్ననాటి నుండి ప్రేమించిన ప్రేయసి వేరొకరికి భార్య అయ్యింది. అది తట్టుకోలేక స్నేహితుడు ప్రకృతిని నిందిస్తూ ఉన్నాడు. అతని సంభాషణ విన్న స్నేహితురాలు మిత్రమా! ప్రేమ అంటే రెండు శరీరాల కలయిక కాదు, రెండు మనసుల కలయిక. అమ్మ పాలు రంగరించి ప్రేమతో పోస్తుంది. ఆవు దూడల మధ్య, గువ్వల జంట మధ్య సుమధురమైన, నిస్వార్థమైన ప్రేమ ఉంది. బాల్యం నుండి నీవు నిస్వార్థమైన ప్రేమ ఉంది. బాల్యం నుండి నీవు నేర్చుకున్న ప్రేమ తత్వం ఇదేనా? అని ప్రశ్నించే సందర్భంలో (మృదువుగా మందలించే) ఈ మాటలు చెప్పబడినవి.

**అర్థాలు:** ప్రేమతత్వము = ప్రేమను గూర్చిన తాత్విక జ్ఞానము

ఎరిగిన = తెలిసిన (తెలుసుకున్న)

వృత్తము + ఇది + ఎ = విషయం ఇంతేనా?

**భావం:** చిన్నతనం నుండి గ్రహించిన ప్రేమ తత్త్వము ఇంతేనా? అని అర్థం.

**10. "పద్మమున తేనె యూరుట పాపమేని!"**

**కవి పరిచయం:** ఈ పద్య పాదము శ్రీ రాయప్రోలు సుబ్బారావు గారిచే రచించబడిన "తృణ కంకణము" అనే ఖండ కావ్యము నుండి స్వీకరించబడినది.

**సందర్భం:** సంతోషం కలిగించే వస్తువు వల్ల ప్రాణికోటి సేదదీరుతుంది. ప్రశాంతంగా ఉంటుంది. ఉత్తేజం లేని జీవితానికి తన్మయత్వం పొందితే సుఖం ఉండదు. ముత్యపు చిప్ప నుండి ముత్యం పుడుతుంది. పద్మం నుండి తేనె కారుతుంది. అలాగే యువతీ యువకుల మధ్య ప్రేమ కూడా సహజంగానే పుడుతుంది. అది పాపం కాదు అని చెప్పే సందర్భంలో ఈ మాటలు చెప్పబడినది .

| | | |
|---|---|---|
| **అర్థాలు:** | పద్మమున | = పుష్పంలో |
| | తేనె + ఊరుట | = తేనె పుట్టడం |
| | పాపము + ఏని | = పాపమైతే |

**భావం:** పద్మమున తేనె పుట్టడం దాని సహజ గుణం. అందులో కల్మషం లేదని భావం.

**11. "చీకటులు లేక దీపిక చెలగ నట్లు".**

**కవి పరిచయం:** ఈ పద్య పాదము శ్రీ రాయప్రోలు సుబ్బారావు గారిచే రచించబడిన "తృణ కంకణము" అనే ఖండ కావ్యము నుండి స్వీకరించబడినది.

**సందర్భం:** వియోగ భార హృదయంలో ఉన్న ప్రియునికి ప్రేమ రహస్యం తెలిపిన ప్రియురాలితో ప్రియుడు "ఓ నేస్తమా! రసవత్తరమయిన కలయిక వల్ల కలిగే సుఖం కంటే సహించలేని ఎడబాటు వల్ల కలిగే బాధ మంచిది. అది ఎలాగంటే చీకటి ఉంటేనే వెలుగు విస్తరించినట్లు బాధ లేకపోతే కామక్రోధాల వల్ల పుట్టే (మాధుర్యం) దోషం అర్థం కాదు అని చెప్పే సందర్భంలో ఈ మాటలు చెప్పబడినవి.

| | | |
|---|---|---|
| **అర్థాలు:** | చీకటులు | = చీకటి |
| | లేక | = లేకపోతే |
| | దీపిక | = దీపం (వెలుతురు) |
| | చెలగను + అట్లు | = వ్యాపించనట్లు. |

**అర్థం:** చీకటి ఉంటేనే దీపం తన వెలుగును విస్తరింపచేయగలదు. అంటే చీకటి లేకపోతే వెలుగు గొప్పదనం తెలియదు అని భావం.

**12. "ఏల ప్రేమ గర్భ విమర్శయిపుడు సఖుడ!"**

**కవి పరిచయం:** ఈ పద్య పాదము శ్రీ రాయప్రోలు సుబ్బారావు గారిచే రచించబడిన "తృణ కంకణము" అనే ఖండ కావ్యము నుండి స్వీకరించబడినది.

**సందర్భం:** నాయిక నాయకునితో ప్రేమ రహస్యాన్ని వివరిస్తూ చెరగని కోరికలతో మనసూ మనసూ కలిసి ప్రేమ ఏర్పడితే ఆ ప్రేమను చెరుపుకోవడం అనేది కన్నబిడ్డలే తల్లిని తృణీకరించినట్లు అవుతుంది. అంటే ప్రేమించిన వారే ప్రేమను నాశనం చేసుకుంటే వేరేగతి ఏమీ ఉండదు. స్నేహితుడా ప్రేమ చాలా రహస్యమైనది. ఆ ప్రేమ విఫలం చెందడం మరీ రహస్యమైనది. దానిని విమర్శ చేయకూడదు. దానిని తెలుసుకున్న వారే నేర్పరులు అని చెప్పే సందర్భంలో ఈ మాటలు చెప్పబడినది.

**అర్థాలు:**

| | | |
|---|---|---|
| | సఖుడ! | = స్నేహితుడా! |
| | ప్రేమ గర్భ విమర్శ | = నిగూఢమైన ప్రేమను విమర్శించడం |
| | ఏల? | = ఎందుకు? |

**భావం:** ప్రియుడా! నిగూఢమైన ప్రేమను విమర్శించకూడదని భావం.

**13. "కొమ్మ వెన్నూత గాగ ఆకొమ్మ నిలిచె!"**

**కవి పరిచయం:** ఈ పద్య పాదము శ్రీ రాయప్రోలు సుబ్బారావు గారిచే రచించబడిన "తృణ కంకణము" అనే ఖండ కావ్యము నుండి స్వీకరించబడినది.

**సందర్భం:** నాయిక నాయకునికి ప్రేమతత్వాన్ని రహస్యాన్ని వివరించి దుఃఖంతో నిండినదై తన ముఖాన్ని పైటతో తుడుచుకొంటూ అక్కడ ఉన్న ఒక చెట్టు కొమ్మకు ఆనుకొని నిలుచుని ఉంది అని చెప్పే సందర్భంలో ఈ మాటలు చెప్పబడినవి.

**అర్థాలు:**

| | | |
|---|---|---|
| | కొమ్మ | = చెట్టుకొమ్మను |
| | వెను + ఉతకాగా | = ఊతంగా చేసుకొని (ఆధారంగా చేసుకొని) |
| | ఆ కొమ్మ | = ఆ స్త్రీ |
| | నిలిచె | = నిలుచుంది. |

**భావం:** చెట్టు కొమ్మను ఆధారం చేసుకొని ఆ స్త్రీ నిలుచుని ఉంది అని భావం.

**14. "నీడ లట్టులనైక్య మందెదము గాత!"**

**కవి పరిచయం:** ఈ పద్య పాదము శ్రీ రాయప్రోలు సుబ్బారావు గారిచే రచించబడిన "తృణ కంకణము" అనే ఖండ కావ్యము నుండి స్వీకరించబడినది.

**సందర్భం:** ప్రేయసీ ప్రియులు ఇరువురూ స్నేహితులుగా బ్రతికినంత కాలం ఉండాలని నిర్ణయించుకొని ప్రియుడు ప్రియురాలి చేతికి గడ్డితో చేసిన విచిత్రమైన కంకణం కట్టాడు. ప్రేయసి కూడా తనకు ఎంతో ఇష్టమైన ఉంగరం తీసి అతని చేతి వేలికి పెట్టింది. మన ఇద్దరం నీడవలే మనస్సులు ఐక్యం పొంది విడదీయలేని అమలిన ప్రేమతో జీవిద్దాము అని నిర్ణయించుకొన్న సందర్భంలో ఈ మాటలు చెప్పబడినవి.

**అర్థాలు:**

| | | |
|---|---|---|
| | నీడలు + అట్టుల | = నీడవలే |
| | ఐక్యము + అందెదము | = ఐక్యత చెందెదము |
| | గాత | = గాక |

**భావం:** మన ఇద్దరం నీడవలే ఐక్యంగా జీవిద్దాము అని అర్థం.

**15. "జలజలం బూలు రాలె నా జంటమీద"!**

**కవి పరిచయం:** ఈ పద్య పాదము శ్రీ రాయప్రోలు సుబ్బారావు గారిచే రచించబడిన "తృణ కంకణము" అనే ఖండ కావ్యము నుండి స్వీకరించబడినది.

**సందర్భం:** నాయికా నాయకులు ఇద్దరూ స్వార్థ చింతన లేని స్నేహితుల్లా మిగిలి పోవాలని నిర్ణయించుకొన్నారు. ప్రియుడు తృణ కంకణం ఆమె చేతికి ధరింపచేశాడు. ఆమె అతని చేతిని ఉంగరం తొడిగింది. వారి నిర్ణయానికి దైవం మెచ్చిందా! అన్నట్లు (దేవుడు మెచ్చాడా?) వారిపై పొన్న చెట్ల పూలు రాలాయి అని చెప్పే సందర్భంలో ఈ మాటలు చెప్పబడినవి.

**అర్థాలు:**

| | |
|---|---|
| ఆ + జంటమీద | = ఆ జంటపై |
| జలజలం | = జలజలా అని |
| పూలు | = పూవులు |
| రాలె | = రాలినవి. |

**భావం:** ఆ జంటపై జలజలా పూవులు రాలెనని భావం.

**16. "ప్రేమ నలయించు సృష్టి దైవికము కాదు"**

**కవి పరిచయం:** ఈ పద్య పాదము శ్రీ రాయప్రోలు సుబ్బారావు గారిచే రచించబడిన "తృణ కంకణము" అనే ఖండ కావ్యము నుండి స్వీకరించబడినది.

**సందర్భం:** చిన్ననాటి స్నేహితురాలికి వేరొక ప్రియునితో వివాహం అయ్యింది. అది తట్టుకోలేక హృదయ వేదనతో ప్రియుడు తన ప్రియురాలితో ఒకే కంచంలో తిని ఏ భేదం తెలియకుండా పెరిగిన జంటలను విడదీసేది దైవిక ప్రేమ కాదు అని చెప్పే సందర్భంలో ఈ మాటలు చెప్పబడినది.

**అర్థాలు:**

| | |
|---|---|
| ప్రేమను | = ప్రేమను |
| అలయించు | = ఇబ్బంది పెట్టే |
| సృష్టి | = విధానం |
| దైవికము కాదు | = దేవుని వల్ల జరుగదు. |

**భావం:** ప్రేమజంటను విడగొట్టడం అనేది దైవతత్వం కాదు అని భావం.

**– డా॥ దొప్పలపూడి సుజాత.**

**పాఠం - 9**

# తృణ కంకణము

## - శ్రీ రాయప్రోలు సుబ్బారావు

## ప్రశ్నలు - జవాబులు

**1) తృణ కంకణంలోని నాయకుని ప్రణయ విరహాన్ని వివరించుము?**

**లేదా**

**నాయకుని విరహ తాపమును వివరించుము?**

జ) ఒక యువతీ యువకుడు చిన్ననాటి స్నేహితులు. వారు ఇద్దరూ ఒకరిని ఒకరు ఇష్ట పడ్డారు. ఆ ఇష్టం ప్రేమగా మారింది. వివాహం చేసుకొని సుఖంగా జీవించాలని గాఢమైన విశ్వాసంతో ఉన్నారు. ఈ లోపు ఆ అమ్మాయికి తల్లిదండ్రులు వేరొక పురుషునితో వివాహం చేశారు. ఆ యువకుడు ప్రియురాలి ఎడబాటును తట్టుకో లేకపోయాడు. ఊరికి దగ్గరలో ఉన్న తోటలోని చెట్ల మధ్య తిరుగుతూ "కాలమా నా ఆశలు ఆడియాశలు చేశావు. పుష్పాన్ని కొమ్మ నుండి వేరు చేశావు. ఆ పువ్వు బాధపడకుండా ఏవిధంగా ఉండగలదు. నా ప్రియురాలు అనుకూలవతి. నిర్మల మనస్కురాలు. అందమైనది. ఉన్నత స్వభావం కలది. మృదు మధుర హృదయ శీలి. ఆమె ఎడబాటును నేను సహిస్తూ ప్రాణాలతో ఏవిధంగా ఉండగలను? కాలమా! నాకు మొదట పూవులపై ఆశలేదు. కానీ ఒక మంచి పుష్పాన్ని ఆశపడ్డాను. అది చివరికి విషాదమే మిగిల్చింది. నేను ఎలా సహించగలను? ఆమెపై నాకున్న ప్రేమను వ్యక్తం చేయాలని ఆమె రూపాన్ని రక్తంతో నా హృదయంలో రాసుకున్నాను. అది సంతోషం ఇచ్చిందని ఆశపడితే దుఃఖాన్ని మిగిల్చింది. గ్రహణం మింగిన చంద్రుని వలే నా జీవితం కాంతి హీనమయ్యింది. అని కాలాన్ని ప్రశ్నించాడు.

మంచి చెడులు ఆలోచిస్తూ ప్రియురాలిపై మమతను పెంచుకున్నాడు. చివరికి కాలకూట విషాన్ని మిగిల్చింది. ప్రియురాలిపై నిష్కళంకమైన ప్రేమ చూపిస్తూ ఆమె నుండి కోరుకున్న ప్రేమ వలపు అతనికి దక్కకుండా పోయేసరికి అతనికి భయంకరమైన వ్యధ మిగిలింది. ప్రేమించిన మొదటిలో అతనికి కళ్ళు మూసినా, తెరిసినా ప్రియురాలి రూపమే కనిపించేది. రాత్రింబవళ్ళు ఆమెనే తలుచుకొంటూ జీవించాడు. ప్రియురాలు అతనిపై మన్మథ బాణాలు కురిపించి వలపు పెంచి చివరికి ప్రేమ భిక్ష కూడా దక్కకుండా చేసింది. అయినా ప్రాణం పోకుండా బలమైన పాశాలు (త్రాళ్ళు) తన ప్రాణాన్ని బంధించాయి. లేదంటే ఎప్పుడో ప్రాణాలు పోవాలి కదా? అని వాపోయాడు.

చాతక పక్షులు వాన చినుకుల కోసం (శరద్రుతువు కొరకు) సంవత్సరమంతా ఎదురుచూసినా అశతీరనట్లు నా ప్రేమ కూడా అయిపోయిందని బాధ పడ్డాడు. నా బ్రతుకు చీకటి బారినట్లైపోయింది. ఇంకా అంగలార్చడం వల్ల ప్రయోజనం ఏముందని వాపోయాడు. అయ్యో! ప్రేమా! అనురాగరహితమై శూన్యమై పోయిన ఈ దేహాన్ని ఇంకా వదలక మన్మథ వ్యథకు గురి చేసి ప్రేమ బాణాలనే చురకత్తులతో ఎందుకు హింసిస్తావు అని ప్రేమను నిందించాడు.

ఓ దైవమా! ఇంత జరిగినా శరీరాన్ని ఇంకా ఎందుకు జ్ఞానం లేని ఈ లోకంలో జీవింపజేస్తావు? ఆ కోమలి రూపాన్ని ఎడబాటు లేకుండా మనసులో దర్శిస్తూనే ఉన్నాను. అని దైవాన్ని తనను తాను నిందించుకున్నాడు.

ప్రియురాలు కనబడగానే మలినమైన ఆమె దేహాన్ని, కళంకంలేని ఆమె హృదయాన్ని చూసి తహతహలాడుతూ అటుఇటు కలియదిరిగి చివరికి ఆమెను చేరుకుని అంతబాధలో కూడా ఆమెను కుశల ప్రశ్నలు అడిగాడు. తన మనసులో దుఃఖం, అనురాగం అతిశయిల్లుచుండగా ప్రియసఖీ, కుశలమేనా? అన్ని విషయాలు అనుకూలంగా ఉన్నాయా? అని బాధగా పలుకరించాడు. కన్నీటి పర్యంతమౌతున్న తన స్నేహితుని చూసి ఆ స్త్రీ ప్రేమ రహస్యాన్ని, ప్రేమ తత్వాన్ని బోధించింది. ఆ సమయంలో కూడా! ఓ చెలీ! ఇంత జరిగినా ఇంకా ప్రేమగా మాట్లాడి ఎందుకు నన్ను వ్యధకు గురిచేస్తావు? వ్యర్థ మైన ప్రేమ భ్రాంతిలో పడి భంగపడ్డాను. ఇకనైనా బుద్ధి తెచ్చుకొని జ్ఞానంగా జీవిస్తూ బ్రతుకు వెళ్ళబుచ్చుతాను.

రసవతరమైన వరుసలు కలుపుకొని ఎటువంటి భేదం తెలియకుండా అనురాగమే స్థిరమని ప్రేమలో లీనమై బ్రతుకుతున్నాను. చివరికి దేవుడు కఠినుడై ఆ ప్రేమను తెంచేశాడు. ఆమె మనస్సులోని భావాన్ని గ్రహించి ఓ స్త్రీ విడువని కోరికలలో పుట్టిన స్నేహం పెంపొందిన నీ మనస్సు బాధించే శ్రమలు కలిగాయి. అందుకే నీకు ప్రేమ లేదనే భావన కలిగింది. ఏ భేదం లేకుండా ఒక కంచంలో తిని బ్రతికిన మన జంటను విడగొట్టింది అంటే ఆ ప్రేమ దైవికం కాదు. ఎడబాటులో అమృతమైనా, విషమైనా ఒకటేనని వాపోయాడు. ఉత్తేజం లేనిది జీవితానికి సుఖం ఉండదు. శరీరంతో జీవించి ఉన్నంత కాలం సుఖదుఃఖాలు అనుభవించక తప్పదు. దుఃఖం ఉందని భోగభాగ్యాలు అనుభవించకుండా ఉండలేము. ఉదయకాలంలో కురిసే మంచు మంచి చేస్తే అదే మంచు రాత్రి కాలంలో చేటు చేస్తుంది. వసంత కాలంలో చిగురించి అందంగా ఉండే మామిడి ఆకులు మంచుకి నాశనమైనట్లు ఒక విషయం (ప్రేమ) ఒకరికి సంతోషాన్ని, ఒకరికి దుఃఖాన్ని మిగుల్చుతుంది.

యువతీ యువకులు ప్రేమలో జీవించే సమయంలో విషపూరితమైన పాము కూడా పూల దండవలే అందంగా కనిపిస్తుంది. ఆ ప్రేమ విఫలమైతే పూల దండ కూడా పాములాగ అనిపిస్తుంది. సృష్టిలో జీవరాసి ఏదో ఒక విషయంపై కోరిక పెంచుకొని తీరక వ్యథ చెందే సమయంలో ఆషాడమాసంలో కురిసే మేఘం వంటి కన్నీటి వ్యధలో అష్ట ఐశ్వర్యాలు, వంటి సుఖాన్నిచ్చేది స్నేహమే. నశించిన నా ప్రేమ శిధిలాలు ఏదో ఒక సుకవి పాటగా మారాలనేదే నా ఆశ. అంతకుమించిన కోరిక నాకు లేదు. నేస్తమా! ప్రేమ, అనురాగాలతో గడిపిన ఆ తొలి రోజులు మరిచి పోవద్దు సుఖంగా ఉండాలంటే నన్ను మరిచిపో అని తన మనస్సులోని వ్యధను వ్యక్తం చేసి విలపించాడు.

ప్రియురాలు ప్రేమ రహస్యాన్ని, ప్రేమ తత్వాన్ని వివరించిన తరువాత ఒక గడ్డి పరక తీసుకొని విచిత్రమైన కంకణం తయారు చేసి ఆమె చేతికి తన ప్రేమ గుర్తుగా కట్టాడు. ఆమె కూడా తన వ్రేలి ఉంగరం తీసి అతని చేతికి పెట్టింది. సహోదరీ! మన ప్రేమకు ఇదే గుర్తు. సంధ్య వేళలలో గుర్తు వచ్చినప్పుడు కొద్దిగా కన్నీరు చల్లి ఇది వాడిపోకుండా చూడు అని తన చివరి కోరిక చెప్పి ప్రియురాలిని చూస్తూ మనసులో ఏదో ఆలోచిస్తూ తన ఇంటికి వెళ్ళాడు.

ఈ విధంగా ఆ యువకుడు విఫలమైన తన ప్రేమను తలచుకొని వ్యథ చెందుతూ ప్రకృతిని, దైవాన్ని, కాలాన్ని, తనని తాను నిందించుకున్నాడు. ఈవిధంగా సుబ్బారావు గారు ఆ విడిపోయిన ప్రేమ జంటలోని యువకుని మానసిక స్థితిని వివరించారు.

**2) "తృణ కంకణంలోని నాయకి గుణ గుణాలను, ప్రేమతత్వాన్ని బోధించిన విధమును వివరించుము"?**

**లేదా**

**"తృణ కంకణంలో నాయకి నాయకునికి వివరించిన ప్రణయ రహస్యమును వివరించుము"**

**లేదా**

**"రచయిత నాయకి గుణగణాలు చిత్రించిన తీరు తెలుపుము"?**

**జ)** తృణ కంకణంలో నాయకి సహజ సుందరి. రూప లావణ్యవతి. ఎర్రటి ఎండలో భానుని ప్రతాపానికి కాళ్ళు బొబ్బలెక్కాయి. చెమటలు ధారలు కారుతున్నాయి. ఎండకు కాలుతున్న ఇసుకలో కాళ్ళు కూరుకుపోయి కాళ్ళు నడవలేక ఈడ్చుకుంటూ ఎంతో ఆయాసంగా అడుగులు ఈడ్చుకుంటూ వెళ్ళింది. ఆమెకి అలవాటు అయిన జింక తనను గుర్తు బట్టి రాగానే ఏమాత్రం ఆయాసం తీర్చుకోకుండా తన శ్రమను పట్టించుకోకుండా ఆ జింకపిల్లను ప్రేమగా స్పృశిస్తూ ముద్దులిడింది. ముద్దు ముచ్చట్లతో దానిని సంతోషపెట్టింది. దాని మూతి పసర గడ్డి వాసన వస్తున్నా ఛీదరించుకోకుండా తన కోమలమైన చేతులతో పట్టుకొని చెట్టు నీడకు తీసుకువెళ్ళి దాని కళ్ళవెంట నీరు చూసి చలించి పోయింది.

చెల్లెలా తెలిసీ తెలియని పసి వయస్సు వల్ల ముళ్ళ పొదలలో తిరిగి ఇబ్బంది పడుతున్నావా ఏమి? అని ఆ జింక పిల్ల యోగ క్షేమాలు అడిగి తెలుసుకుంది.

కాలాన్ని, దైవాన్ని, తనను తాను నిందించుకుంటూ వైరాగ్య జీవితం గడుపుతున్న ప్రియునికి ప్రేమతత్వాన్ని తన మృధు మధురమైన భాషతో కోమలంగా వివరించింది. ప్రియుని మనోవ్యథ చూసి కృంగిపోయింది. జీవితంపై విరక్తి చెందిన ప్రియునికి స్నేహితుడా! అని ప్రేమగా సంబోధిస్తూ ప్రేమంటే మలినం లేనిది. పసిబిడ్డకు తల్లిపాలతోనే ప్రేమ మొదలౌతుంది. ఆవు దూడల మధ్య కూడా అనురాగం ఉంది. గువ్వలు ఏ మలిన భావం లేకుండానే జంటగా వీడకుండా ఉంటాయి.

ప్రేమను ఎవరూ విడదీయలేరు. మనసు కలుషిత పరచుకోకుండా మంచిగా మలచుకొని తృప్తిగా జీవించాలనే కవుల పలుకులు గుర్తు చేసింది. ఈ ప్రేమ వలపులు ఎల్లవేళలా ఒకేవిధంగా ఉండవు. చైత్ర మాసంలో చిగురించిన చెట్లు మంచుకు ఎండినట్లు యవ్వనంతో పుట్టిన ప్రేమ వృద్ధాప్య దశలో సడలిపోతుంది. సముద్రపు ఆటుపోటులు స్థిరం కాదు. ఉదయ సాయం సంధ్యలలో ఎరుపు రంగు లాగే జీవితంలో బాధలు, భంగపాట్లు శాశ్వితం కాదు. అరటి చెట్టు మొగ్గ తొడిగిందని సంతోష పడతాము. కానీ గెల దిగగానే నరకబడుతుంది. కాబట్టి ఈ లోకంలో ఏదీ శాశ్వతం అని అనుకోకూడదు.

రెండు శరీరాలు కలిస్తేనే ప్రేమ కాదు. రెండు మనసుల కలయికే ప్రేమ ఈ జ్ఞానం తెలుసుకోవాలి. ప్రతి స్త్రీ కూడా తన ప్రేమలో మలినం లేకుండానే జీవిస్తుంది. తల్లి చనుబాలతోనే ప్రేమ ప్రారంభం అవుతుంది. ఈ సృష్టిలో మెత్తని కలయికలు ఏర్పరచుకున్న గువ్వల జంట, ఆవు దూడ, స్నేహితులు అందరూ నిష్కళంకమైన ప్రేమ ఆప్యాయతలతోనే జీవిస్తారు. మలినం లేని ప్రేమ ధర్మ మార్గంలో మనల్ని నడిపిస్తుంది. ఈ లోకంలో మనసు, మాట క్రియలలో ప్రేమ మలినం అవుతూనే ఉంటుంది. కాబట్టి ఓర్పుతో మౌనంగా జయించాలి. మనసు పూల బుట్ట వంటిది. దానిలో ప్రేమ ఆప్యాయత అనురాగాలనే కుసుమాలు ఉండి వికసిస్తాయి. అవి ఎన్నటికి జారి పోవు. ప్రేమ అనేది మనసుల అంతరంగాలలో పుడుతుంది. దానిని కలపడం విడదీయడం ఏవిధంగానూ సాధ్యం కాదు. తోటలోని పూవులు ఒకదానితో ఒకటి పెనవేసుకొని పెరుగుతాయి. వాటికి ఏ కోరికలూ ఉండవు.

ఎంతో తపస్సు చేస్తే గాని ప్రేమ ఫలం లభించదు. అటువంటి చిరకాల ప్రేమను అప్పుడే తుంచి వేయడం పాపం. అటువంటి కార్యానికి ఎందుకు పూనుకున్నావు? మనస్సులో పెరిగిన ప్రేమను చేతులారా (మనంతట మనమే) చంపుకోవడం కన్న బిడ్డలే తల్లికి కడుపుకోత మిగిల్చిన దానితో సమానం. ప్రేమ చాలా రహస్యమైనది. అది అనుభవం ద్వారానే తెలుస్తుంది. ప్రేమికులు ఒకరికళ్ళలో ఒకరు చూసుకుంటూ ఏమోయ్! అని కొసరి ప్రేమగా పలుకరించుకోవడం కంటే ఇంకా ఏమి కావాలి?

తొలిరోజులలో ప్రేమించుకున్న నా చేతికి కట్టిన వ్రత సూత్రం తెంచివేస్తావా? అని ఏడ్చింది. కొంత సమయం మౌనంగా ఉంది ప్రియుడు పచ్చ గడ్డితో కంకణం చేసి తన చేతికి కట్టాడు. ఆమె కూడా తన ఉంగరం అతని వేలికి తొడిగి మన ఇద్దరం నీడవలే ఒకరితో ఒకరం అంతర్లీనమై జీవిద్దాం అని చెప్పింది.

ఈ విధంగా రాయప్రోలు సుబ్బారావు గారు తృణ కంకణంలో నాయిక పాత్రను మృదు మధురంగా కోమలత్వంగా, ఆదర్శవంతమైన ప్రియురాలిగా, జ్ఞాన వివేచన కలగిన వ్యక్తిగా ఉత్తమ గుణశీలవతిగా, ప్రేమమూర్తిగా, తాత్విక జ్ఞానవతిగా, మంచి స్నేహితురాలుగా ఓర్పు కలిగిన వ్యక్తిగా, సహన మూర్తిగా, కాలానికి అనుగుణంగా మలినం అంటకుండా హితబోధినిగా నాయిక పాత్రను తీర్చిదిద్దారు.

**3) రాయప్రోలు వారు "తృణ కంకణం" నామ సార్థక్యతను, అమలిన శృంగారం తీర్చిదిద్దిన విధానాన్ని వివరించుము?**

**జ)** తెలుగు సాహిత్యంలో శ్రీనాథుడు, శ్రీకృష్ణ దేవరాయల కాలంలో ప్రబంధ ప్రక్రియ తారాస్థాయికి చేరింది. ఆ ప్రబంధాలతో నాయికా నాయకుల శృంగార తత్వం రాయప్రోలు వారికి నచ్చలేదు. అందుకే మొట్టమొదటిగా తెలుగు సాహిత్యంలో ప్రబంధ ఛాయలతో "అమలిన శృంగార తత్వాన్ని" తెలియజేస్తూ "తృణ కంకణాన్ని" ను రచించారు.

**నేపథ్యం:** సుబ్బారావు గారి తృణ కంకణములో చిన్న నాటి స్నేహితులైన ఇద్దరు యువతీ యువకులు ప్రేమించుకున్నారు. వారికి వివాహం కాలేదు. ఈ లోపు ఆ అమ్మాయికి వేరే పురుషునితో వివాహం జరుగుతుంది. చివరికి వారిద్దరూ మంచి స్నేహితులుగా జీవితాంతం మిగిలిపోతారు. ఈ నేపథ్యంతో తృణ కంకణం రచన చేసి మలినం లేని "అమలిన శృంగారాన్ని" ప్రతిపాదించి ఉత్తమ రచనగా తీర్చిదిద్దారు. 20 వ శతాబ్దంలో తెలుగు సాహిత్యంలో ఈ రచన గొప్ప ఆదరణ పొందింది.

**అమలిన శృంగారం:** "అమలిన శృంగారం" అంటే మలినం లేని స్త్రీ పురుషుల మధ్య ప్రేమ అని అర్థం. తృణ కంకణంలో నాయకుడు ప్రియురాలి ఎడబాటుతో కృంగిపోతాడు. భయంకర వ్యాధికి గురౌతాడు. వెర్రివాడిగా తోటలో తిరుగుతూ ప్రకృతిని శపిస్తూ ఉంటాడు. మన్మథ వ్యథ భరించ లేక ప్రియురాలి ఎడబాటు తట్టుకోలేక ఆమెనే తలచుకుంటూ అశ్రునయనాలతో విలపిస్తాడు. "కాలమా ఆశలు అడియాశలు చేశావు. కొమ్మ నుండి పూవును వేరు చేసి వ్యథకు గురిచేశావు. ప్రేమంటే తెలియని నాకు ఒక మృదుపుష్పంపై ప్రేమ పెరిగేటట్లు చేశావు. చివరికి ఆ పుష్పాన్ని కొమ్మ నుండి వేరు చేసి రెక్కలన్నీ చించి పారవేసి సౌందర్య చెడగొట్టవు. దేనికి పనికి రాకుండా చేశావు. నిర్మలమైన, సుందరమైన నాప్రియురాలి చిత్రాన్ని నా గుండెలలో, రక్తంలో శాశ్వతంగా ఉండేటట్లు రాసుకున్నాను. అది సంతోషానికి బదులు విషాదం మిగిల్చింది.

ప్రియురాలిని తలుచుకుంటూ నిద్ర లేని రాత్రులను గడిపాను. ఆమె ప్రక్కనే ఉన్నట్లు భ్రమించి సుఖంగా నిద్రపోయాను. ఆమె లేదని తెలిసి వ్యథ చెందాను. వలపు కురిపించి చివరికి ప్రేమభిక్ష పెట్టలేక పోయింది. చాతక పక్షులు వర్షం కోసం సంవత్సరమంతా ఎదురుచూస్తే చివరికి వాన చినుకు లేక అడియాశలైనట్లు నా బ్రతుకు అయిపోయింది. దేవుడు కఠినుడై

ఇంత జరిగినా నన్ను చనిపోనివ్వకుండా ఏదో పాశాలతో బంధిస్తున్నాడు. అని దైవాన్ని, ప్రకృతిని, కాలాన్ని, విధిని తనను తాను నిందించుకుంటాడు.

ప్రియురాలు ఎదురై అతని వ్యధ చూసి మనసున కృంగి ప్రియునికి ప్రణయ రహస్యాన్ని మృదువచనాలతో మాట్లాడింది ప్రేమంటే రెండు శరీరాల కలయికే కాదు రెండు మనసుల మధ్య కలిగేది. దానిని కలపడం విడదీయడం ఎవరివల్లా కాదు. తల్లీ బిడ్డల ప్రేమ, ఆవు దూడ ప్రేమ, గువ్వల జంట ప్రేమ గుర్తు చేసి ధర్మపరమైన శృంగారతత్వాన్ని ప్రేమను వివరించి మృదు వచనాలతో చెప్పింది. ప్రియుని లోని మనో దుఃఖాన్ని కొంత సడలిపోయేటట్లు చెప్పి అతనిచే సహోదరి! అని పిలిచేటట్లు చేసింది. వారిద్దరూ జీవితాంతం స్నేహితులుగా ఉండడానికి నిర్ణయించుకున్నారు. ఈ విధంగా వారి పాత్రల ద్వారా అమలిన శృంగారాన్ని, ప్రేమ రహస్యాన్ని కవి బోధించాడు.

**తృణ కంకణం నామసార్థక్యం:** తృణ కంకణం అంటే గడ్డితో చేయబడిన కంకణం. ఈ రచనలో ప్రేయసీ ప్రియులు ఇద్దరూ జీవితాంతం స్నేహితులుగా ఉండడానికి నిర్ణయించుకొన్నారు. ప్రియుడు పచ్చని లేతగడ్డి పరక తీసుకొని విచిత్రమైన కంకణం చేసి ప్రియురాలి చేతికి కట్టాడు. ఆమె కూడా తనకు ఎంతో ఇష్టమైన ఉంగరం తీసి అతని వెలికి తొడిగింది. ఆ కంకణం ఎండిపోకుండా కాస్తంత గుర్తు వచ్చినప్పుడు కన్నీళ్ళతో తడిపి వాడిపోకుండా గుర్తు చేసుకోమని చివరి కోరిక కోరాడు. వారి వ్రత సూత్రానికి వారు చేసుకొన్న బాసలకు, తీసుకున్న నిర్ణయానికి భగవంతుడు మెచ్చుకున్నాడా? అన్నట్లు పొన్న చెట్టు వారిపై పుష్పాలు రాల్చింది. వారి ప్రేమ తీరని కోరికగా మిగిలిపోయింది. అది మలినం లేని స్నేహంగా మిగిలి పోయింది. కాబట్టి "తృణ కంకణం" అనే నామం సార్థక్యం అయ్యింది.

ప్రేమంటే శరీరాలు కలవాల్సిన అవసరం లేదు. దానికి పెళ్ళే అవసరం లేదు. ప్రేమంటే శరీర ఇచ్ఛ కాదు. మనసుల కలయిక. ప్రేమంటే స్నేహం. స్నేహంలో మలినం లేదు. ప్రేమంటే లోకంలో స్థిరపడిన అర్థం కంటే వినూత్నమైన అర్థాన్ని కవి చూపించారు. నాయిక నాయకుల ద్వారా నిరూపించారు. మలినం లేని నాయకుల ద్వారా నిరూపించారు. మలినం లేని శృంగార రహస్యాన్ని లోకానికి చూపించారు. యవ్వనంలో ఉన్న యువతీ యువకుల వలపు ఎలా ఉండాలో గౌరవప్రదమైన సంభాషణలతో నిరూపించి, సుందరంగా తీర్చిదిద్ది ప్రేమకు వినూత్న అర్థాన్ని చెప్పారు.

ప్రేమంటే తల్లీబిడ్డల ప్రేమ వంటి నిస్వార్థ, అమలిన, అనురాగ భరితమైనదిగా ఉండాలి. ధర్మ పరమార్గంలో నడవాలి. ఒకరి క్షేమం ఒకరు కోరాలి. స్వార్థం లేకుండా జీవించాలి. భాషలోను, భావంలోను, నడవడిలోను ఆదర్శవంతమైన ప్రేమ అనురాగాలను లోకానికి చూపించిన గుణ సంపన్నులు రాయప్రోలు సుబ్బారావు గారు.

ప్రస్తుత పరిస్థితులలో పెడత్రోవ పడుతున్న ప్రేమ తత్వానికి దైవ నిర్ణయమైన ప్రేమను వినయ సంపన్నంగా విశదీకరించి పేరుకు తగిన విధంగా పాత్రలను నిష్కళంకంగా తీరిద్దిది ఆదర్శ ప్రాయంగా చిత్రించారు.

**– డా॥ దొప్పలపూడి సుజాత.**

పాఠం - 10

# ముంటాజ మహలు

**- గుఱ్ఱం జాషువ**

**విషయసూచిక:**

10.1. కవి పరిచయం

10.2. రచనా నేపథ్యం

10.3. పాఠ్యభాగ సారాంశం

## 10.1. కవి పరిచయం:

"కవిశక్రేశుడ గండపెండెరములన్ గాంగేయ తీర్థంబులన్
వివిధోపాయ నసత్కృతుల్ గొనిన గాంధీ శాంతి సిద్ధాంతమా
ర్దవ మార్గాటుడ గబ్బిలంబులకు దౌత్యంబుల్ ప్రబోధించు మా
నవతా స్రష్టను నవ్యభావచతురుండన్ జాషువాభిఖ్యుడన్"

అని చెప్పుకున్న కవి గుఱ్ఱం జాషువ, కవికి కలమే కాని కులం ముఖ్యం కాదని, మనిషికి మానవత్వమే కాని మతం ముఖ్యం కాదని, మేధావులకు గుణమే కాని ధనం ముఖ్యం కాదని నిరూపించిన కవి కోకిల జాషువా. వేమన పద్యాల తర్వాత జనం నాలుకల మీద నాట్యాలు చేసిన పద్యాలు జాషువాయే అంటే అతిశయోక్తి కాదు. భావ ప్రకటనకు ఛందోబద్ధమైన పద్యాన్ని ఎన్నుకున్నప్పటికీ భావనలో ఆధునికుడు.

జాషువా గుంటూరు జిల్లా వినుకొండ మండలం మిస్సమ్మతోటలో 28 సెప్టెంబర్, 1895వ సంవత్సరమున జన్మించారు. ఇతడి తల్లిదండ్రులు గుఱ్ఱం వీరయ్య, లింగమాంబ దంపతులు. జాషువ దళితుడైన కారణంగా అతడి కవిత్వాన్ని మెచ్చుకున్నవారే అతడి కులం తెలిసిన తర్వాత చీత్కరించారు.

"నా కవితా వధూటి వదనంబు నెగాదిగ జూచి రూపురే
ఖా కమనీయ వైఖరులు గాంచి భళీభళియన్న వారెమీ
దే కులమన్న ప్రశ్న వెలయించి చివాలున లేచి పోవుచో
బాకున గ్రుమ్మినట్లగును పార్థివచంద్ర వచింప సిగ్గగున్"

అని జాషువా తమ ఆవేదనను వ్యక్తీకరించారు.

ఆధునికాంధ్ర సాహిత్యంలో తొలి తరం కవులలో అన్ని రకాల విలక్షణంగా రచనలు చేసిన కవి జాషువ. కవి కావటానికి అనుకూల పరిస్థితులు లేని సమాజంలో మహాకవిగా పేరు సంపాదించుకున్న మానవతామూర్తి. విద్యార్థి దశలోనే సోదరుడు ఇజ్రాయేలు సహకారంతో నేత్రావధానం చేసి పండితుల పామురుల ప్రశంసలు పొందాడు. దీపాల పిచ్చయ్య శాస్త్రి

లాంటి పండితుడితో జంట కవిత్వం కూడా చెప్పారు. ప్రాథమికోపాధ్యాయుడిగా ఉద్యోగం ప్రారంభించారు. ఆనాటి మూకీ చిత్రాలకి వ్యాఖ్యాతగా ఊరూరా తిరిగినప్పుడు కందుకూరి, చిలకమర్తి, తిరుపతి వెంకట కవుల ప్రోత్సాహం పొందారు.

**రచనలు:**

| | |
|---|---|
| పద్య కావ్యాలు | – హిమధా మార్కధర పరిణయం |
| అముద్రితాలు | – కన్యకా పరమేశ్వరి, శివాజీ ప్రబంధం |
| కావ్య ఖండికలు | – 7 సంపుటాలు, రక్త గానం (యుద్ధ ప్రచార గీతాలు) |
| ఖండ కావ్యాలు | – అనాథ, స్వప్న కథ, గబ్బిలం, కాందిశీకుడు, నేతాజీ, బాపూజీ, స్వయంవరం, రాష్ట్ర పూజ, కొత్త లోకం, ముసాఫరులు, నాగార్జున సాగర్ |
| లఘు కావ్యాలు | – పిరదౌసి, ముంటాజ మహలు, క్రీస్తు చరిత్ర |
| గద్య కృతులు | – చంద్రిక (అముద్రితం, అలభ్యం), కుశలలోపాఖ్యానం, చిన్న నాయకుడు |
| దృశ్యకావ్యాలు | – దావీదు చరిత్ర (అముద్రితం, అలభ్యం), మదాలస (అముద్రితం, అలభ్యం), రుక్మిణీ కల్యాణం, చిదానంద ప్రభాతం, ధ్రువ విజయం, వీరబాబు, తెరచాటు |
| స్వీయ చరిత్ర | – నా కథ (పద్య రచన) |

క్రైస్తవుడై వుండి హిందూ గ్రంథాలు చదివాడని, హిందూ నాటకాలు రాశాడని ఉద్యోగం నుంచి తీసివేస్తే జీవనం కోసం ఎంతో కష్టపడినా తెలుగు సాహిత్యాన్ని మాత్రం తన రచనలతో సుసంపన్నం చేశారు.

"నాదు కన్నీటి కథ సమన్వయము సేయ
నార్ద్ర హృదయంబు గూడ కొంతవసరంబు"

అని చెప్పిన కవి ఇతరుల వెతలను అంటే ఆర్ద్రతతో తన రచనలలో వెలయించారు. అంటరానితనానికి, స్త్రీ అవిద్యకు, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా జీవితాంతం సంఘసంస్కరణే ధ్యేయంగా రచనలు చేశారు. అందుకే శ్రీ శ్రీ వంటి విప్లవ కవిని కూడా ప్రభావితం చేసిన భావ కవిత్వానికి ఈయన ప్రాధాన్యతనివ్వలేదు.

"కవి సమయంబును తప్పి నుడికారపు సొంపును పాడుచేసి నీ
వెవతుక కోసమో కుమిలి యేడ్చుచు చక్కని తెల్గుకైతకా
యువులు కుదించి యేమిటి కయోమయం బొనరింతు నీవు నీ
కదనము పాడుగాను వెడగా యికనేనియు రమ్ము దారికిన్"

అని భావ కవిత్వాన్ని నిరసించాడు కూడా. ఊహల్లోకాక వాస్తవంలో జీవించినవాడు జాషువ. అందుకే ఈయన దృష్టి అమానుషం మీద, అసమ సమాజం మీదే ఉంది.

జాషువాకు కవి కోకిల, కవితా విశారద, మధుర శ్రీనాథ, నవయుగ కవి చక్రవర్తి వంటి బిరుదులున్నాయి. కళా ప్రపూర్ణ, పద్మ భూషణలచే సత్కరింపబడ్డారు. వీరి 'క్రీస్తు చరిత్ర' కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. రాష్ట్ర శాసన మండలిలో సభ్యులయ్యారు. 24 జులై 1971వ సంవత్సరమున కీర్తిశేషులయ్యారు.

"రాజు మరణించె నొక తార రాలిపోయె
కవియు మరణించె నొక తార గగనమెక్కె
రాజు జీవించే రాతి విగ్రహములందు
సుకవి జీవించె ప్రజల నాలుకల యందు"

అని తానే చెప్పినట్లుగా ప్రజల నాలుకల మీదే కాక హృదయాలలోనూ సుస్థిరంగా నిలిచిపోయారు.

"గవ్వకు సాటిరాని పలుగాకుల మూకలసూయచేతన
న్నె విధి దూరినన్ ననువరించిన శారద లేచిపోవునే
యివ్వసుధా స్థలిం బొడమరే రసలుబ్ధులు గంటమూనెదన్
రవ్వలు రాల్చెదన్ గరగరల్ పచరించెద నాంధ్ర వాణికిన్"

అన్నట్లుగానే తెలుగు సాహిత్యాన్ని తమ రచనలతో సుసంపన్నం చేసి సాహితీ లోకంలో ధృవతారగా నిలిచిపోయారు.

## 10.2. రచనా నేపథ్యం:

భారతీయ శిల్ప ప్రౌఢిని చాటే తాజ్‌మహల్‌ను చూడాలనే కోరిక చిన్నతనం నుంచి జాషువాకు కలదు. కానీ అది సాధ్యం కాలేదు. దేశ విదేశీయుల నమస్కారాలకు పాత్రమై శిల్పులకు గర్వకారణమై ముంటాజ మహలు సమాధి ఒక్క షాజహానుకే కాదు యావత్ భారతదేశానికి చెందింది. దానిని సృష్టించిన ముప్పై ముగ్గురు శిల్పాచార్యులలో నలుగురు మచిలీపట్నం నుండి ఆహ్వానింపబడినట్లు తాజ్‌మహల్ నిర్మాణ కాలంలో స్వయంగా చూసిన బాగ్దాదు వాసి అయిన ఒక చరిత్రకారుడు రాశాడని అందుచేత ఆ గౌరవం ఆంధ్రులకు దక్కుతుందని జాషువా తెలిపారు. దీని నిర్మాణం కోసం ఇరవై లక్షల మంది కార్మికులు పగలు రాత్రనక ఇరవై సంవత్సరాలు పనిచేసినట్లు, ఇరవై కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు చరిత్ర ఘోషిస్తుంది.

ప్రేమ మూర్తి అయిన తన భార్య ముంటాజ్ కోసం 22 సంవత్సరాలు ఎత్తిన తల వంచక షాజహాన్ కట్టడాన్ని సమాప్తి చేయించాడు. ఆవిధంగా షాజహాను చేసిన పనిలో ప్రణయ సందేశం. కళాపోషణ దీక్ష, ఆవేశం, దంపతులకు అందించ బడుతుందని కవి ఆలోచన. తాజమహల్‌కు ప్రాణ ప్రతిష్ఠ చేసి షాజహాను శాశ్వతుడయ్యాడు. శ్మశానాన్ని స్వర్గంగా మార్చాడు. ఆ తాజమహల్ సౌందర్యం గురించి వినిన కవికి భావావేశం కలిగి ఈ కావ్య రచన చేశారు. కవితా జగత్తులో కవి ఊహించిన దృశ్యమే ఈ కావ్యంలో వర్ణించబడింది. వాస్తవిక దృశ్యానికి, దీనికి పోలిక ఉండనూవచ్చు, లేకపోవచ్చు. రసపోషణ కోసం కవి ఒక పిచ్చివాడి కథను కూడా ఈ కావ్యంలో కల్పించారు..

తిక్కన జయంతి రోజున జాషువాను ఆహ్వానించి మహాకవి సన్మానం చేసిన శ్రీ తిక్కవరపు రామిరెడ్డి గారు జాషువాను తన భార్య పేర ఒక కావ్యం రాయమని కోరారు. వారి కోరిక మీద ఈ ముంటాజ మహలు రచించారు. అయితే రచించిన తర్వాత జాషువా గారు ఆ రచనను తన తల్లికి అంకితమిస్తానంటే ఆనందంగా అంగీకరించి ముద్రణా ఖర్చంతా ఇచ్చిన రామిరెడ్డి గారికి

"నూరున్నారులు మూడుమారు లిడి నన్నుం దన్పి నా వాంఛలం
గారుణ్యంబునఁ దీర్పనెంచిన సుధాకల్ప ప్రజల్పుండు ల
క్ష్మీరమ్యుండు పరేంగితజ్ఞుఁడగు శ్రీ శ్రీ రామిరెడ్డి ప్రభున్
నూరున్నార్లు సువర్ణ గీతుల నుతింతున్ సాహితీసీమలన్ "

తన కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

"జననీ! నీ యనుగుంమారుఁడను నీ స్తన్యంబు సేవించి వ్రా
సిన కబ్బంబిది నీకునౌ మనుమరాల్జేకొమ్మ చేదోడుగా
ననుకూలించి కవీంద్ర మాతవగు నీ యాశీస్సులందేవి నీ
ఘనకీర్తిం బ్రకటించెడిన్ సుగుణసక్తా! లింగమాంబా సతీ!

అని తన తల్లికే ఈ రచనను అంకితమిచ్చారు జాషువ.

## 10.3. పాఠ్యభాగ సారాంశం:

షాజహాను మహారాజు ప్రజలందరూ ఆనందించే రీతిలో ఢిల్లీ సింహాసనాన్ని అధిష్టించి లోకైక మోహిని ముంటాజ మహలుతో కూడి మొగల్ సామ్రాజ్యాన్ని పాలిస్తున్నాడు. ఎంతో మృదు స్వభావం కలిగినవాడై ఢిల్లీ నగరంలో ముత్యాల మసీదు నిర్మింపజేసి నీతి పథాన్ని విడువక పాలన సాగిస్తున్నాడు. తన ఇంటిలోనున్న రత్నరాసులను సార్థక్యం చేసేటందుకు సార్థక్యం చేసేటందుకు కనువిందు కలిగించే విధంగా సౌధాన్ని కట్టించాడు. స్వర్గంతో పనిలేదు అనే విధంగా వజ్రమణి దీపాల సమూహాన్ని ముట్టించి ఎంతో భోగభాగ్యాలతో తులతూగుతున్నాడు. నిష్కల్మష హృదయం గల షాజహాను కుల విద్వేషాలను పోగొట్టి తురుష్కులు హిందువుల సమస్యలు తీర్చే సమయంలో సమదృష్టి చూపిస్తూ శిక్షా దక్షుడై దిక్కులన్నిటిలో మొగల్ రాజుల ప్రతిష్ఠను విస్తరింపజేశాడు. ఎన్నో కృతులను పొందిన జహంఘీరుకు తగిన కుమారుడు అనే పేరు నిలబడే విధంగా భారత శిల్పాన్ని సముద్ధరించి ఎంతో దర్పంతో సామ్రాజ్యాన్ని విస్తృతం చేశాడు, రసజ్ఞుడై కవులనాదరించాడు.

వేయి సంవత్సరాల నాటి సింహాసనాన్ని తీయించి నెమలి సింహాసనాన్ని చేయించాడు. రాజసభలో పన్నెండు నెమళ్ళతో కూడిన సింహాసనం ఇంద్రుడి వైభవాన్ని తలదన్నే విధంగా ఉండగా శత్రువుల గుండెలలో నిద్రపోతు తన తాతతండ్రుల కంటే గొప్పగా షాజహాను ఎంతో తేజస్సుతో వెలుగొందాడు. బిరుదులు పొందిన అరబ్ కవుల వాణి మధుర కావ్యాలను వెలయించగా ఆసేతు హిమాలయం వరకు ఖ్యాతి విస్తరించింది. దీనులైన బుక్కా ఫకీరుల గిన్నెలు బంగారంతో నిండాయి. అప్పటివరకు చేతినిండా పనిలేని శిల్పకారుల సుత్తి ప్రసిద్ధి చెందింది. ఢిల్లీ నగరంలో ఐదు వేళ్ళల్లో నమాజు వినిపిస్తుంది. ఎంతో భోగపరమైన మొగల్ నాగరికత మూడు పూవులారుకాయలై విస్తరించింది. గుట్కా, మద్యాన్ని రాజు సేవించడు, ఇతర స్త్రీలను కన్నెత్తి చూడడు షాజహాను ఏకపత్నీవ్రతుడు. మక్కా మీదీనాలకు అల్లాకని మణులు పంపించాడు. లెక్క పెట్టలేనంతగా ఖజానాలో ధనం చేరుకుంది. ప్రతి రోజు ఖురాన్ చదువుతాడు. తన వంశం ఆశ్చర్యపోయే రీతిలో శత్రు దుర్గాలపై దండయాత్రలు జరిపాడు, తెలతెలవారుతుండగా పసిడిపాన్పు దిగి పన్నీటి కోనేరులో స్నానం చేసి మేలి వస్త్రం కట్టుకొని ఎంతో భక్తితో కాలినడకతో మసీదుకు వెళ్ళాడు షాజహాను. భయంకరమైన గోవధని నిషేధించి తన పూర్వుల లాగానే హిందువులకు

పూజనీయుడయ్యాడు. మత విద్వేషాలు లేవు, జుట్టు పన్ను, పిలక పన్ను వంటికి అతడి పాలనలో లేవు. కుటిల రాజభీతితో క్రుంగు భారతభూమి భయం వీడి ఆదమరిచి నిదుర పోయింది.

పది వేల మంది పరిచారికలు పగలు రాత్రి తనను సేవించగా మెహరున్నీసకు మేనకోడలైన ముంటాజమాల్ షాజహాను తనను సన్మానింపగా అతడికి రాణియై ఆ గృహంలో కాలం గడుపుతుంది. ఎలాంటి కవులైనా ఆమె అందాన్ని వర్ణించలేరు, ఆమె చక్కదనాన్ని ఎలాంటి చిత్రకారులు చిత్రించలేరు. అసమాన్య సౌందర్యవతి అయిన నూర్జహాను రాణి తన కోడలి విలాసానికి తనే సిగ్గుపడుతుంది. షాజహాను భార్య పల్లెత్తి పలుకరిస్తేనే కరిగిపోతాడు. రాణిపై నిశ్చల పవిత్ర స్నేహ మోహాన్ని షాజహాను చూపేవాడు. ముద్దుల రాణి మాటకు రాజు ఎదురుచెప్పడు, రాజు ఆజ్ఞకు రాణి మారుమాట్లాడదు, వారిరువురిని చూసిన పెద్దలు సహవాసమంటే అది అనేవిధంగా ప్రణయరాజ్య సింహాసనాన్ని అలంకరిస్తారు వారిద్దరు. ప్రకృతి కూడా వారి ప్రేమకు పులకరిస్తుంది. వారి స్నేహాన్ని వర్ణన చేసి సుప్రసిద్ధి పొందని కవి లేడు. ఆ భార్యా భర్తల స్నేహం దంపతులందరికీ అద్భుతాదర్శమైంది.

ముంటాజ్ సంతానాన్ని పొంది మాతృత్వ గౌరవాన్ని, ప్రజల పట్ల వాత్సల్యాన్ని చూపుతూ ఉత్తమ రాణి అనే గౌరవాన్ని పొందింది. ఆ మొగలు రాణి సంతానాన్ని పొందినప్పటికీ ఆమె లావణ్యం తరుగలేదు. జీవితంలో ఏ చెడు ఆలోచన లేని సత్యవంతుల వయస్సు జారదంటారు. అనేక కావ్యాలు రచించిన కవులు చుట్టూ చేరి కొలిచే శారదాదేవి లాగా అనేక మంది పిల్లలు చుట్టూ ఉండగా కన్నుల పండుగగా ఉంటుంది. ముంటాజ్ సౌందర్యం ప్రభువు కన్నులు దాటి బయటకు రాదు, అతడి కన్నులు దాటిపోదు. పదమూడు మంది పిల్లలను పొందినప్పటికీ భర్త ప్రేమసాగరంలో మునిగి ఉయ్యాలూగుతుంది ముంటాజ్. పద్నాల్గవసారి గర్భవతి అయ్యింది. దేవుడు ఇస్తే సంపదపై సంపద, పేదరికంపై పేదరికం చిత్రంగా అనుగ్రహిస్తాడు.

కాలు కదల్చకుండా చెలికత్తెలు అవసరాలు తీర్చగా సుల్తాను రాణి రత్నాలమహల్‌లో ఎంతో సంతోషంగా ప్రొద్దు గడుపుతుంది, ఇంట్లో కొడుకులు కూతుర్లు తిరుగుతుంటే ఆమె మనసు సంతోషిస్తుంది. ఆ రాజగృమంలో సంపదనిచ్చే నిండుబండిలాగా నట్టింట్లో తిరుగుతందామె. నిండుచూలాలైన రాణి ఒకనాటి రాత్రి పూలపాన్పుపై నిద్రపోతుంది. కాపల జవాను కత్తి ఒకటి రెండు సార్లు నేలకు జారింది. ఖంగుమంటూ ఒంటి గంట కొట్టింది. ఐదు సంవత్సరాల ఔరంగజేబు పక్కమీద మసలి పలువరించాడు. చిదికిపోతూ భూమికి ఆకాశం నుండి ఒక తోక్క చుక్క బెదిరిపడింది. వెన్నెలలో జగతినిండుగా చంద్రుడు నిరంకుశంగా అధికారం చెలాయిస్తుండగా రాణి గర్భంలోని కుమారుడు తల ఊపుతూ నవ్వాడు. ఉలికిపడి లేచిన మహారాణి అది అశుభ సూచకమని కలతచెందింది. అసలు ఎప్పుడు కంట తడిపెట్టని ముంటాజ మహలు రాణి లోపల కలిగిన చింతలలో ఒకటి రెండు కన్నీటి బిందువులు రాలాయి. చల్లని మంచు బిందువులతో తడిసి సంతోషాన్నిచ్చే ఆ రాత్రి రాణికి ఎంతో కష్టంగా గడిచింది యమసదనమై.

విచిత్రంగా సర్వేంద్రియాలు కుంచించుకు పోయేటంత చలి జ్వరం రాణి శరీరంలో కలిగింది. ప్రసవ వేదన ప్రారంభమైంది. తన సంతానం మాతృహీనమై బాధ పడుతున్నట్లుగా, తన రాజు వియోగభారంతో బాధలో మునుగుచున్నట్లుగా తన కోసం గొప్ప సమాధి కడుతున్నట్లుగా ఊహ కలిగింది రాణికి. సతుల ఊహలు సత్యమైనవి. రాజు అల్లాకు వజ్రమణులు మొక్కుకున్నాడు. కాని భార్య ఆరోగ్యం పొందలేదు, విధి లంచగొండి కాదు. చండశాసనుడైన మహాచక్రవర్తి తన భార్యకు ప్రాణం పోయలేడు, న్యాయంగా ఆత్మకి అధికారి కాదు గనుక ముంటాజ్ కొడుకులను కౌగిలించుకొని కళ్ళల్లో నీరు నిండగా, శోకమూర్తిలా తన పక్క నున్న భర్తతో మూతలు పడుతున్న కళ్ళు విప్పుతూ గద్గద స్వరంతో ఈ విధంగా అంది. "సుఖ దుఃఖాల

మిశ్రమమైన భూమి అనే సత్రశాలలో నీ భార్యనై నా ప్రవాసయాత్ర ముగించాను. ఇలాంటి పరదేశుల స్నేహం స్థిరం కాదు, ఈ శరీరమున్నంత వరకు ప్రాణికి సుఖంలేదు. భూమిపై కష్ట సుఖాలు చెలికత్తెలు, మృత్యుదేవత జూదమాడే వినోద రంగం, సంపదలన్నీ పాచికలు. ఆవిరి ఓడలో ప్రయాణం చేసే బాటసారులు తమ రేవుల్లో దిగిపోతారు. నరజన్మ వ్యాపారులు తమ పని ముగించి స్వదేశానికి పోతుంటారు. పరాక్రమవంతుల కపాల పాత్రలలో నీరు సింహాలు త్రాగుతున్నాయి. ఏ పువ్వును చేసి ఆ దేవుడు ఈ శరీరాన్ని వాడుకుంటాడు. రాజా! విచారించద్దు. ఈ మృత్యు వ్యాపారంలో సమస్త జీవులు మాపురేపులు ఎందరో ఇముడుతున్నారు, అందులో నేనొకదాన్ని సమతా ధర్మం గల ఈ మరణం వేదనతో నిండిన జీవులకు విశ్రాంతి కలిగిస్తుంది. హుమాయును వంటి మీ తాతలు ఆ పూలశయ్యలలో పడుకున్నారు, ఎందరో ఇలా వెళ్ళారు. మహమ్మదు ప్రవక్త వంటి వారి పాదముద్రలచే నిండిన ఆకాశ మార్గంలో భక్తులు వెళతారు, వారిని కలిసి స్వర్గానికి వెళతాను, సహరా మండుటెడారి వేదనలను పోగొట్టుకుంటాను ఇంక. కల్మషం లేని నీ మధుర ముగ్ధమైన మనస్సు లోపల నిద్రిస్తానింక ఎప్పుడూ. అదుగో దేవతలు రెక్కల రథాలతో వచ్చి ఆహ్వానిస్తున్నారు, సెలవిప్పించండి” అని భర్త వక్ష స్థలంపై తలవాల్చేసింది.

పట్టు పరదాల చీకటి వనాలతో పుట్టి, శోభించిన మొగలు మహారాణి లోకానికి పరిమళాలు వెదజల్లి రాలిపోయిన ముత్తైదు ముత్యం. ముంటాజ మహలు రాణి ఈ విధంగా అన్యాయమైపోగా భుజ బలం కలిగి అంత గొప్ప సామ్రాజ్యానికి రాజైనప్పటికీ భార్య లేని కారణంగా షాజహాను క్రుంగిపోయి దుఃఖించాడు. బంధువులు ఎంత ఓదార్చినా అతడు ఊరడిల్లక ఉన్మత్తుడిలా రాత్రి పగలు నిద్రాహారాలు మాని తన భార్య తిరిగిన చోటులనే తిరుగుతూ, బిడ్డలను చూసి దుఃఖిస్తూ ఉన్నాడు. “నిన్నటి వరకు మణి మందిరాలలో నిద్రించిన నీవు ఈరోజు స్మశాన భూమిలో నిద్రిస్తున్నావు. ఇన్ని రోజులలాగా కాక నిన్న, నేడు ఎంత విషాగ్నిని కక్కాయి. అంతా భస్మరాశిలా కనిపిస్తుంది, ఓడిపోయిన జీవితం చీకటిలో ప్రవేశించింది. నీతో కలిసిన సమావేశాలన్నీ ఈ రోజు కథలలాగా అయిపోయాయి. సహించలేని ఈ ఎడబాటు కలుగగా దుఃఖంతో నిండిన ఈ శిథిలమైన అస్థిపంజరాన్ని ఎలా ఈడ్చగలను. జీవన తారవలె నువ్వు స్వర్గ సీమలకేగగా చుట్టుముట్టిన ఈ విశ్వవలయంలో శాశ్వత శోకమూర్తినై ఈ చివరి జీవితనాటక రంగంపై నీవు లేని విధురత్వంతో బాధపడుతున్నాను. నీ ఆయుష్షునంతా మింగి మృత్యువు నీ శరీరాన్ని ఉంచిపోయింది. నా శౌర్యసంపద ఏమాత్రం భార్యను రక్షించలేక అరణ్యంలో కాసిన వెన్నెల అయింది. ఓ రాణి, ఇలాంటి సంఘటనలలో చక్రవర్తి కూడా సామాన్య మానవుడే కదా ! నీవు ధరించి విడిచిన వస్త్రంలాగా నీ కళేబరం భూమిపాలయ్యింది. మళ్ళీ తిరిగి నువ్వు అమృత దేహంతో ఆ పరమ పదంలో కనిపిస్తావన్నమాట నిజమో లేక బులిపించే మాటేమో, అయ్యో, ఎందరో పయగంబర్లు, ముముక్షువులు గొప్పదైన స్వర్గాన్ని ఆశించి మహాత్యాగంతో తమ శరీరాలను వదిలారు. వారు ఎటు వెళ్ళారో కనీసం ఒక్కడైనా ఈ రోజుకి కబురు చేయడు. వారి అవశేషాలు దుమ్ముకొట్టుకొని ఎదురుచూస్తుంటాయి. ఓ రాణీ, ఆ మహాశిల్పి అయిన దేవుడికి నిన్ను సృష్టించటం కష్టం, ఏ కారణంచేతో నీ బొమ్మ అచ్చును భగ్నం చేశాడో, నన్ను శిక్షించటానికి, ప్రపంచానికి వైరాగ్యం నేర్పడానికి, మొగల్ రాజ సింహాసనానికి ఆయుష్షు తీరిందో?

చావుకి అవతలి తీరం నువ్వు చేరావు, నేను ఇవతలి ఒడ్డునున్నాను. ఒకరికొకరి మాటలు వినిపించని వేరు వేరు ప్రాంతాలలోనున్న మనకు స్నేహం కలగటం ఎలా? నీ కాలికాడలు, నీ శరీరకాంతి, నీ నవ్వు, నీ వాక్కు నాకు తెలియనిరీతిలో రహస్యంగా నీ రథం వెళ్ళింది, నా కళ్ళలో నాట్యం చేసే నిన్ను ఈశ్వరుడు ఎలా దొంగిలించాడు? నీవు నివసించే ప్రదేశానికే రేపో, మాపో నేనూ వస్తాను, నా కోసం కొంచెం స్థలం దాచివుంచు. నిరాశతో నిండిన నా జీవిత శేషాన్ని అవివాహితుడనై నీకే అంకితం చేస్తాను” అని విలపిస్తున్నాడు మహారాజు.

ఇంకా "నేను కట్టించిన మసీదులలో తిరుగుతూ, నేనిచ్చే కానుకలు ఆశిస్తూ నాకే కీడు తలపెట్టాడు కృతఘ్నుడై ఆ దేవదేవుడు. ఆ దేవుడి దయ సందేహమనిపిస్తుంది, ఈ భక్తితో చేసే సేవలు వృధా నాట్యాలేనని అనిపిస్తున్నాయి. కనికరం లేనివాడై మృత్యువనే కిరాతరాజు నీ మరణంతో తృప్తిచెందడు, జంట పక్షులలో ఒకటి సరిపోదు, తన రెండవ బాణంతో నన్ను చంపకుండా ఉండడు. రాజు రహస్యాలన్నీ కాపాడేది అతడి భార్యయే కదా, నీ ప్రాణాలు పోగానే ఇంత గొప్ప సైన్యం ఉన్నప్పటికీ, రాజ్యం ఉన్నప్పటికీ నిర్భాగ్యుడనై భయపడుతున్నాను. ఆరిపోని నీ శరీర శోభంతా యమునా నదీ తీరాలలోని ఇసుకతిన్నెలను, నీ సుకుమారత్వమంతా ఆ నదిలోని తామరలు పంచుకొన్నాయి. గొప్పదైన సత్యలోకానికి వెళ్ళి సుఖిస్తున్నావో లేక ప్రకృతిలో లీనమయ్యావో తెలిసినవారు లేరు. మానవులకు చావు తరువాతి విషయాలన్నీ అయోమయం కలిగించేవి, అర్థం కానివి. నీ రూపం అనే స్వర్గం ఇక్కడ జీర్ణించింది. ఈ సమాధిపై మొలచిన పచ్చగడ్డి నాకేదో వైరాగ్యం బోధిస్తుంది. నీ భర్తను విడిచి ఒంటరిగా దేవదూతలు తిరిగే దివికి ప్రయాణించావా, నీకు తోడుగా ఎగరటానికి నాకు రెక్కలు లేవు కదా! మరణించిన వారికి మరల జన్మనిచ్చేవి రచనలే కదా, అటువంటి కృతులతో నిన్ను మళ్ళీ బ్రతికిస్తాను, చక్కటి రత్నాల సమాధి మందిరాన్ని నిర్మిస్తాను. సృష్టి మొత్తం ప్రాతః సమయాన ఆనందంలో మునగగా నీవు మాత్రం లేవలేదు. దేవుడు పంతొమ్మిది సంవత్సరాల మన దాంపత్యాన్ని నా మనసు నొప్పించి పెకలించి వేశాడు, ఆ గాయాన్ని మాన్పే వైద్యుడు లేడు. జీవరత్నమైన నిన్ను తీసుకొని వట్టిరత్నాలు నా ఇంట్లో వదిలాడు. ఇచ్చి మురిపించి మళ్ళీ తిరిగి తీసేసుకోవటం ఎందుకు అలవాటు చేశాడో ఈశ్వరుడు. ఒకప్పుడు ఎంతో ఆనందం కలిగించిన ఈ సృష్టి మరొకనాడు ఎందుకో దుఃఖాన్ని కలిగిస్తుంది. నీవు లేని ఈ వియోగబాధలో సూర్యోదయ సౌందర్యం, యమునా నది నన్ను సంతోషపెట్ట లేకపోతున్నాయి. నిన్ను తన కడుపులో దాచుకున్న భూమికి ఈ నాటికి 'రత్నగర్భ' అనే పేరు సార్ధకమైంది. నీవు తలపై ధరించటం వల్ల భూమి పైకి బొగ్గు కోహినూర్ వజ్రమైంది. ఎప్పుడో పరమపదించిన నవాబుల రాణులు తోడు నీడగా గానం చేస్తూ శాంతి పొందుతారు. యమున నదీ తీరవాసులు – అంటూ షాజహాన్ మనసులో దుఃఖ భారం శ్రమించక విలపించాడు, తన భార్య సమాధి నిర్మాణం కోసం ఉత్సాహంతో పూనుకున్నాడు.

రాజు పల్లెలలో, పేటలలో సమాధి నమూనాలు చేయమని శిల్పకారులకు చాటింపు వేయించాడు. ఢిల్లీ రాజ్యంలోని ఒక పిల్ల జమీందారుగిరి, రత్నాలు, గజారోహణ, పల్లకి బహుమతిగా నిర్ణయించాడు. శిల్పులందరూ బొమ్మలు తయారుచేశారు. భారతదేశం మొత్తంలోనూ షాజహాను ప్రేమరసాన్ని ఆవిష్కరించగలిగిన బొమ్మ కనిపించలేదు. కళలు అనుభూతి ఆవేశాలకు సంబంధించినవి, బహుమతులకు, మెచ్చుకోళ్ళతో సాధ్యమయ్యేవి కాదు కదా ! ఆ దేశంలో భార్యను కోల్పోయిన దుఃఖంతో బాధపడే మహాదరిద్రుడొకడు వైరాగ్యంతో ఉన్మాదిలా శ్మశానాలలో తిరుగుతూ అక్కడి బూడిదతో బొమ్మలు చేస్తూ ఉండేవాడు. అతడి తలలో విహరించే కళాధిదేవత విరహాగ్నితో నున్న అతడి చేత అనేక సమాధి బొమ్మలు చేయించింది. అతడు చేసిన ఆ బొమ్మలలో ఒకటి మనసును రంజింపజేసే విధంగా ఉంది. షాజహాను రాజు ఊహలో ఉండి మాటకు అందకుండా ఉన్న సమాధి బొమ్మ సృష్టి శిల్పరమకు తలమీది నగలాగా అతడి చేతిలో అవతరించింది. కళలు ఉన్నత కులస్థులనే కాదు, కులంలేని వాడిని కూడా వరిస్తాయి ఎందుకంటే కళాదేవత దయకు ఎక్కువ తక్కువలు లేవు కదా! అతడు తన భార్యకు ప్రేమ చిహ్నంగా దానిని బంగారు రేకులతో కట్టించాలని భిక్షమెత్తుతూ ఊరురా తిరుగుతున్నాడు. అతడి కోరికను విని నవ్వుకొని, ఆ బొమ్మ సౌందర్యానికి ఆశ్చర్యపోయిన ఒక శిల్పి దానిని తెప్పించి రాజుకి ఇచ్చాడు. ఆ బొమ్మ పనితనంతో, కొత్తదనంతో రాజు మనసును సంతోషంలో ముంచింది. అందరు పండితులు ఉన్న సభలో ఆ రాజు సెహబాసని బహుమతికి తగిన బొమ్మది అని, ఆ బొమ్మ చేసిన ప్రజ్ఞావంతుడు మహనీయుడని అనేక రకాలుగా పొగిడాడు. ఆ రాజు అలా పొగుడుతుంటే అయిష్టంగానే

అవునవునన్నారు ఈర్ష్యాపరులు. రాజేమి రసజ్ఞుడు ఒక అభాగ్యుడిని గౌరవించి తమని అవమానిస్తున్నాడనుకున్నారు కొందరు కులపక్షపాతులు. రహస్యంగా రాజు భార్యను కోల్పోయిఉన్నాడు, ఆ బైరాగి భార్యను పోగొట్టుకున్నాడు, వీరి సహవాసం అంతేకాని ఇతడు ఏ మాత్రం శిల్పి, రాజు ఏమాత్రం పరీక్షకుడు అనుకొన్నారు కొందరు అసూయపరులు. ఎన్ని గ్రంథాలనైనా చదవచ్చు. కావ్యాలలోని సొగసులను ఏరవచ్చు కానీ రసం సృష్టించే ప్రజ్ఞ చదువు కాదు, సాధనతోనే వస్తుంది కదా! పిరదౌసికన్నా పండితులు, సూఫీకన్న విద్యాంసులు ఉంటారు. గురుశుశ్రూషలతోనే రస సృష్టి చేసే శక్తి అలవడదు కదా! కొందరు గొప్పవారు మాత్రం భిక్ష అడిగే అతడి చేతిలో ఏ గొప్ప వైదుష్యం ఉందో అని అనుకున్నారు.

ఆ నిరుపేదవాడిని మహాసభకు పిలిపించి మంత్రులు, తానూ ఎదురు వెళ్ళి తెచ్చి తన దగ్గరలోని పీఠంపై కూర్చోబెట్టి కొత్త బంగారు వస్త్రాలు, పది వేల నాణాలు కానుకగా ఇచ్చాడు. "సుల్తాను రాజా! మీ కళాభిరుచికి జోహారులు, భార్యావియోగులైన మీకు సానుభూతి, మీ వినయంతో కూడిన మాటలకు, సమదృష్టికి నమస్కారాలు, మీ రాజ్యానికి, మీకు నలుదిశలా కీర్తి కలుగుతుంది. మీ తాతలు, వీరులు, పూర్వ సుల్తానులు బాబరు, హుమాయూన్ కృతార్థులయ్యారు. మీ వంశం చక్కటి సౌధాన్ని నిర్మించింది. ఢిల్లీ అనే కన్య మీ కౌగిట్లో లేనవ్వులు విరజిమ్ముతుంది. మీ అర్థ చంద్రుడు గల జెండా నీడలో హిందువులు, ముసల్మానులు భాయి భాయి అని సంతోషిస్తారు. ఏ మాత్రం తేడా లేకుండా నా భిక్షా పాత్రలో ఎంతో దయతో బంగారు బియ్యం పోసిన దానవీరుడిని, భారతావనికి కళాలతలు విచ్చి శోభిస్తాయి. ఆశలు మాని ఆకలికి ఏదో ఇంత తిని రోజులు వెళ్ళదీసే అభాగ్యుడికి, భార్యను పోగొట్టుకున్న సన్యాసికి నీ బంగారు నాణాలు ఎందుకు? కళాసరస్వతి దాసులు అనేకమందున్నారు వారిని తృప్తి పరుచు. మొగలు రాజశేఖరుల సభా మధ్యంలో కళాజగత్తులో నా శ్రమ పొగడబడింది. పసిడి పూజలతో, దిగులు సగం తీరింది, మీ గొప్పతనానికే బహుమతిగా ఈ ధనం తిరిగి ఇస్తున్నాను స్వీకరించండి, నాలాగా భార్యా వియోగ బాధితులైన మీకు నా కానుక చిత్తశాంతి కలిగిస్తుంది" అంటూ అతడు మాట్లాడి బంగారం, రత్నాలు వదిలేసి సభికులందరూ ఆశ్చర్యపోతుండగా ఆలశ్యం చేయకుండా వెళ్ళిపోయాడు. రాజు ఆశ్చర్యపోతూ 'ఇతడు నా కోరిక తీర్చటం కోసం వచ్చిన జగదీశ్వరుడో పయగంబరుడో అయివుంటాడు. లేకపోతే లభించిన సంపదను ఎవరైనా తిరస్కరిస్తారా, ఇతడు మహానుభావుడు' అని ఆలోచిస్తూ ఆ ధనాన్ని పేద పకీరు సాహెబులకు దానమిచ్చి దర్బారు ముగించి శయ్యాగారాన్ని చేరాడు. అనేక దేశాల నుంచి ప్రఖ్యాతి చెందిన గ్రీకు శిల్పులను ముంటాజీ సమాధి నిర్మాణానికి పిలిపించాడు. అద్దాల కంటే మెరుగైన పాలరాళ్ళను వెన్నెల ప్రతిబింబించి నెలరాజుకు దీప్తి ఇచ్చే వాటిని తెప్పించాడు. ఆ రాజు ఆహ్వానంపై శిల్పాచార్యులు, కళాసమగ్రులు, వరి గింజపై చిత్రాలు చెక్కగలిగినవారు, వాస్తు శాస్త్రజ్ఞులు తూర్పు పశ్చిమ దేశ వాసులైన ప్రజ్ఞావంతులు నేల ఈనినట్లుగా యమునా తీరంలో చేరారు.

మహాశిల్పులు నిర్మాణం సంగతి తెలిసి ఆనందం పొందిన మనసు గలవారై ఏ రంగు గల తీగకు, ఏ పచ్చ సవరించాలో, ఏ పువ్వుకి ఏ పుష్యరాగం సరిపోతుందో దానిని కలిపి, ఏ చిగురుకి ఏ కెంపు జోడించాలో కూర్చి, ఏ గులాబి మొగ్గకి ఏ రవ్వ పొదగాలో దానిని అతికించి, ప్రకృతి సిద్ధమైన రంగుతో రంగుకు స్నేహం కలిపి భావాలను ఇమిడ్చి చలువరాతులను తీర్చసాగారు. రసికుల విమర్శ, తర్కాల కారణంగా అనేకమంది కవులు అందమైన వర్ణాలతో భూమి మీద సాహిత్యమంతా పొగిడేవిధంగా ముంటాజ్ మహలు తయారయ్యే వేళ శిలలకు ప్రాణం ఉందనే మాట నిరూపించగా ఫలకాలపై అనేక రంగుల లతలు మొలిపించారు. కలం చేతబట్టిన కవి ఎదుట తలలు వంచే శబ్దాలలాగా ఆనాటి శిల్పి చేతిలో

మేటి శిలలన్నీ వెన్నలాగా మెత్తదనాన్ని పొందాయి. తాకితే కందుతాయేమో అనే విధంగా రాళ్ళకు సుకుమారత్వాన్ని అద్దే నేర్పరులైన ముప్పై ముగ్గురు శిల్పులు ఎంతో చమత్కారం పొదిగి ఇరవై ఏళ్ళు శ్రమించి భారతదేశ శిల్ప సంపదకు ప్రాణం పోశారు. ఎంతో కుమిలిన పాదుషా హృదయ కుండం నుండి విశ్వం వికార నాట్యం వలన రేగిన వేదనతో కూడిన వెచ్చని కంటినీరు తాజమహలు రాళ్ళపై ఉదయ సంధ్యలలో చల్లని మంచు బిందువులుగా ఉంది. రాణి మనసులా మధురమై ముత్యం చిప్పలోని తెల్లటి కాంతులు చిమ్ముతూ దిక్కులను వెలిగించే ముంటాజ్ కాంతుల ముందు చంద్రుడి కాంతులు కూడా నశిస్తాయి. తాజమహలు శిల్పం మనసులను రంజింపజేస్తుంది.

యాభై ఆరు అక్షరాలు గల తెలుగుభాషకే తాజ్ లావణ్యం వర్ణించడానికి అలవికాకపోతే ఇతర భాషలకు సాధ్యమా! “వేరే స్వర్గముందా, నిజంగా ఇది నీతిమంతుల విశ్రాంతి నికేతనం” అనే సూక్తులు ద్వారబంధాలపై అరబ్బీ పారసీ భాషలలో నవాబు రాయించాడు. చివరి సుత్తి దెబ్బతో శిల్పవరుల ప్రతిభ విశ్రమించింది. షాజహాను దీక్ష సఫలీకృతమైంది, మొగలు కీర్తి మొదటి మొగ్గ తొడిగింది. అది మహారాజు భగ్నమైన ఆశయాలలో పుష్పించిన పాలరాళ్ళ కవిత. అదే కొత్త భావాలతో ప్రజ్వలించే అజ్ఞాత వాఙ్మయం, అక్కడ అవధి దాటిన పాదుషాల విభూతి, నిత్యనూతనమైన ఆనంద పరిమళం, అనుకూల దాంపత్య క్షేత్రాలపై చింది ప్రతిఫలిస్తుంది. పావనమైన ప్రేమ ముంటాజ్ బురుజులలో మ్రోగుతుంది. కాలమనే దొంగ టాజి సౌందర్యాన్ని ఆపహరించాలనుకుంటున్నాడు. మొదటి కొత్తదనం చెక్కుచెదరదిపుడు. మంచి కృతుల ముందు కాలబలం సాగుతుందా? గొప్పదైన, అందగత్తె అయిన ఆగ్రా రాణి ముంటాజ్ చేసిన పుణ్యంలాగా తాజమహలును సృష్టించి సంతృప్తులై శిల్పులందరూ వెళ్ళిపోయారు, షాజహాను కూడా భార్య ముఖాన్ని చూస్తున్నట్లుగా తృప్తి చెందాడు.

రాజు చివరి కొడుకైన ఔరంగజేబు అన్నలను చంపి సింహాసనాన్ని అపహరించి, కన్న తండ్రిని చెరసాలలో ఉంచాడు, కాలమాంత్రికుడి పనులు వికృతమైనవి కదా! అన్నలను వధించి రక్తంతో తడిచిన తన రెండు చేతులతో అల్లాను స్తుతించాడు, ఆ హత్య తనది కాదన్నట్లు పొగడ్తలను పొంది దేవుడు మెదలకుండా ఉన్నాడు. అతడి ముత్తాత కొడుకు కోసం ప్రాణాలు ఇచ్చాడు. ఇతడు తండ్రిని పట్టి బంధించాడు. తాత సౌమ్యుడు, మనుమడు భయంకరుడు, గుణాలకు వంశం కారణం కాదు. తండ్రి భోగి, కొడుకు విరాగి, భిన్న తత్వాలు గల వీరు తండ్రీకొడుకులెలా అయ్యారు. కళలు కళ తప్పాయి. దేవాలయాలు మూలబడ్డాయి. హిందు ముస్లిములలో భేద భావం తలచూపింది, తల పన్ను వేయబడింది. శాంతి తలక్రిందయ్యింది. ఔరంగజేబు ఖురాను రాసి ధన సంపాదన చేస్తూ కష్టజీవియై బ్రతుకుతూ నేలపై శరీరం వాలుస్తూ రాజ్య పాలన చేస్తున్నాడు. భక్తి తత్పరతతో తన మతోద్ధరణ దీక్షతో శుష్కించిన శరీరం కలవాడై ఎల్లప్పుడు ఉపవాసాలు రాచపకీరులాగా చేసేవాడు, మత్తు వస్తువులను సేవించడు, ఇతర స్త్రీలను చూడడు, ఏక పత్నీవ్రతం ఆచరిస్తాడు. ఈర్ష్యతో నిండిన మనసుతో ఇతర మతస్థులపై నిప్పులు గ్రక్కేవాడు, నానా బాధలు పెట్టాడు. మక్కా యాత్రికులను తృప్తి పరచేవాడు. మానవులకు ఈ తలతిక్క భక్తి కారణంగా ఎన్నో చిక్కులొచ్చాయి, తనకు పట్టిన పిచ్చి నల్గురికి అంటించాలని చూస్తాడు, వారు నిందించి శపిస్తారు. పరమార్థం అంతా సాధించి తెచ్చిన వాడిలా విర్రవీగుతాడు, భూభారం అంతా తన నెత్తిన బడినట్లుగా దుఃఖపడతాడు.

సకల లోకానికి సంతోషాన్నిచ్చే తాజమహలు హొయలు పాదుషా మనసును వలపించలేదు, భక్తితో కళకు పొత్తు లేదు. మనుషుల్లోనే దేవుడుగా పేరు పొందాడు ఔరంగజేబు, రాజు కావాలంటే బిరుదులకు ఏమి కొరత. అతడి పేరు వింటే అఖిల భారతదేశం దద్దరిల్లి కంటతడి పెట్టింది, అతడి గుండెలో ఎప్పుడూ శివాజీ కత్తి ఘోష వినిపిస్తుంది. కళ్ళ ఎదురుగా

మహోజ్వలంగా వెలుగొందుతూ తాజమహలు కనపడుతూ ఊరడిస్తుంటే బందిఖానాలో ఉన్న వృద్ధరాజు షాజహాను జీవంలేని శవంలాగా కాలం నెడుతున్నాడు. ఈ భూమి మీద శత్రువేలేని తండ్రికి కొడుకే శత్రువయ్యాడు, విధి విరోధిస్తే జరగని వింత ఏముంటుంది? ఏడు సంవత్సరాలు చెరసాలలో ఉండి లోకాన్ని వదిలి ప్రేయసిని చూడటం కోసం దివికేగాడు, ముంటాజి సమాధి దగ్గరే షాజహాను శరీరం విశ్రమించింది. మొగల్ సింహాసనానికి ఏడులు గడిచినా టాజి నిలిచింది. స్మృతిలాగా నేటికీ వారిద్దరు ఒకచోటే శయనించారు తాజమహల్ నీడలలో. ఆ ఇద్దరూ కీర్తిమంతులు

> "రాణి విడిచిపోయె రాజునొంటరిఁ జేసి
> రాజు విడిచిపోయె రాజ్యరమను
> రాజ్యరమయు విడిచె రాజులఁ బెక్కండ్ర
> తాజి విడువలేదు రాజసంబు"

అంటూ జగానికి తెలియజేస్తున్నారు జాషువ.

**– ఆచార్య ఇరపని మాధవి**

**పాఠం - 11**

# ముంటాజ మహలు

**- గుఱ్ఱం జాషువ**

**విషయసూచిక:**

**11.1. కఠిన పదాలకు అర్థాలు**

**11.2. సందర్భ సహిత వ్యాఖ్యలు**

## 11.1. కఠిన పదాలకు అర్థాలు:

బర్హి = నెమలి

ఉన్మీలం = విరియుట

అమల స్వాంతుడు = నిర్మల హృదయుడు

మరీచి = కిరణం

ఓలగం = కొలువు

రిపురాజు = శత్రురాజు

అంభోజం = కమలం

క్రూర కర్మఠం = క్రూరమైన పని

బర్తరఫు = నిషేధం

గేహంబు = ఇల్లు

విన్నాణంబు = నేర్పు

విహ్వలం = అవయవాలపై స్వాధీనత కోల్పోయిన

ఆశ్లేషం = ఆలింగనం

రుక్కు = సూర్యకిరణం / కాంతి

పరేతం = ప్రేతం

పరేతభూతలం = స్మశానం

నిశి = చీకటి

పజ్జ = ప్రక్క

కంకాళంబు = అస్థి పంజరం

| | |
|---|---|
| చెల్మి | = స్నేహం |
| జ్యోత్స్న | = వెన్నెల |
| ద్యూతం | = జూదం |
| కళత్రం | = భార్య |
| పరాఙ్ముఖం | = పెడమొగం |
| బుభుక్ష | = ఆకలి |
| కృతకం | = కృత్రిమం |
| విదురుడు | = భార్య మరణించినవాడు |
| సాహిణంబులు | = గుర్రాలు |
| హర్షం | = సంతోషం |
| శుశ్రూష | = సేవ |
| మచ్చరకించిరి | = ద్వేషించిరి |
| తన్పుము | = తృప్తిపరచు |
| నజరాన | = కానుక |
| నెలరేడు | = చంద్రుడు |
| నవనీతము | = వెన్న |
| వంగడంబు | = వంశం |

## 11.2. సందర్భ సహిత వ్యాఖ్యలు:

**1. సమకూర్చెన్ మొగలాయిరాజుల ప్రతిష్ఠా ద్రవ్య భాండారమున్**

**పరిచయం:** ఈ వాక్యం నవయుగ కవిచక్రవర్తి గుఱ్ఱం జాషువాచే విరచితంబైన "ముంటాజ మహలు" పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** మొగల్ రాజు షాజహాను పాలనను గురించి చెప్పే సందర్భంలోనిది వాక్యం.

**వివరణ:** నిర్మల హృదయం గల షాజహాను మహారాజు కుల విద్వేషాల వలన రాజ్యంలో కలిగిన అలజడులను పోగొట్టి తురుష్క హిందువుల సమస్యలను సాధించేటప్పుడు సమదృష్టి పాటిస్తూ కఠిన శిక్షలను అమలు చేయటంలోను నేర్పు కలవాడై మొగల్ రాజుల కీర్తి సంపదతో నిండిన భాండారాన్ని దిక్కులన్నిటిలో విస్తరింపజేశాడు.

**2. మూడుపూవులారుకాయలై ముమ్మరించె**

**పరిచయం:** ఈ వాక్యం నవయుగ కవిచక్రవర్తి గుఱ్ఱం జాషువాచే విరచితంబైన "ముంటాజ మహలు" పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** షాజహాను కవులను, కళాకారులను, ఫకీరులను ఆదరించటం వివరించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** బిరుదులు పొందిన అరబ్బీ కవులు కావ్యాలను రచించారు. అర్ధచంద్రుడితో కూడిన మొగల్ పతాక ఛ్ఛాయలో ఆ సేతు హిమాలయాలు చిగురించాయి. దీనమైన బుక్కా ఫకీరుల గిన్నెలలో బంగారం దానం చేయబడింది. పనేలేని శిల్పకారులకు పని కల్పించగా వారి ప్రసిద్ధి దిక్కుల వరకు విస్తరించింది. ఢిల్లీ పురంలో ఐదువేళల నమాజు చేయబడింది. భోగపరమైన మొగల్ నాగరికత మూడు పువులు ఆరుకాయలై వ్యాపించింది.

**3. బెదురుమాని మఱచి నిదురపోయె.**

**పరిచయం:** ఈ వాక్యం నవయుగ కవిచక్రవర్తి గుఱ్ఱం జాషువాచే విరచితంబైన "ముంటాజ మహలు" పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** షాజహాను పాలనలోని భారతదేశం ఎలా వుందో చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** షాజహాను తన పాలనలో క్రూరకర్మ అయిన గోవధని నిషేధించాడు, తన పూర్వుల లాగానే హిందువులకు పూజనీయుడయ్యాడు. మత విద్వేషాలు లేవు, జుట్టు పన్ను, పిలక పన్నులు లేవు. కుటిలమైన రాజకీయ భయంతో క్రుంగిపోయే భారతభూమి భయంలేక ఆదమరచి నిద్రపోయింది.

**4. సుప్రసిద్ధి గనని సుకవి లేడు.**

**పరిచయం:** ఈ వాక్యం నవయుగ కవిచక్రవర్తి గుఱ్ఱం జాషువాచే విరచితంబైన "ముంటాజ మహలు" పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** షాజహాను, ముంటాజుల అన్యోన్య దాంపత్యాన్ని వర్ణించే సందర్భంలోనిది వాక్యం.

**వివరణ:** ఆ భార్యాభర్తల గాఢ ఆలింగనాల నుండి జారిపోయిన నిముషం లేదు, ఆ దంపతులకు ఆహ్లాదం అందించని వెన్నెల తునకలేదు. ఆ ప్రేమ జీవుల అనురాగవృద్ధికి కృషి చేయని కోకిలలు లేవు. ఆ అందమైన వారి స్నేహపు ముద్దులతో తీపెక్కని ద్రాక్ష తీగలేదు. హద్దులేని వారి ఆనందకేళికి సహకరించని పూల తోటలేదు. వారి దాంపత్యాన్ని కోరి వర్ణించి ప్రసిద్ధి చెందనటువంటి కవిలేదు.

**5. లేమి లేమిపయి నాపాదించు చిత్రంబుగన్**

**పరిచయం:** ఈ వాక్యం నవయుగ కవిచక్రవర్తి గుఱ్ఱం జాషువాచే విరచితంబైన "ముంటాజ మహలు" పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** ముంటాజుకు కలిగిన సంతానం గురించి చెప్పే సందర్భం లోనిదీ వాక్యం.

**వివరణ:** పదమూడు మంది బిడ్డలను కని కూడా భర్త ప్రేమసాగరంలో మునిగితేలు ముంటాజ్‌కి పద్నాలుగవ గర్భ మేర్పడింది. దీనిని గురించి ఆలోచిస్తే భగవంతుడు ఇస్తే సంపదపై సంపద ఇస్తాడు, లేకపోతే పేదరికంపై పేదరికం ఇస్తాడు కదా !

**6. అశుభదంబని విహ్వల స్వాంతయయ్యె.**

**పరిచయం:** ఈ వాక్యం నవయుగ కవిచక్రవర్తి గుఱ్ఱం జాషువాచే విరచితంబైన "ముంటాజ మహలు" పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** ఒకనాటి అర్ధరాత్రి దుశ్శకునాలు గన్న ముంటాజు మహలు మానసిక స్థితిని వర్ణించే సందర్భం లోనిదీ వాక్యం.

**వివరణ:** రాత్రి నిరంకుశంగా అధికారం చెలాయిస్తుండగా పున్నమి చంద్రుడు జగాన్ని నిద్రపుచ్చగా రాణి గర్భంలో ఉన్న బిడ్డ తలవూపుతూ నవ్వాడు. ఉలికిపడి లేచి రాణి దిక్కులు కలయజూచి అది గర్భస్థ పిండం నవ్వని తెలుసుకొని అది అశుభం అని స్వాధీనంలో లేని మనస్సు కలిగినదై కలవరపడింది.

**7. సత్సతుల యూహల్ సత్య సామీప్యముల్**

**పరిచయం:** ఈ వాక్యం నవయుగ కవిచక్రవర్తి గుఱ్ఱం జాషువాచే విరచితంబైన "ముంటాజ మహలు" పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** ప్రసవ వేదనతో బాధపడుతున్న రాణి ఊహలు తెలియజేసే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** తన సంతానం తల్లిని పోగొట్టుకొని బాధపడుతున్నట్లుగా, తన భర్త వియోగభారంతో దుఃఖంలో మునుగుతున్నట్లుగా తన కోసం గొప్ప సమాధి కడుతున్నట్లుగా ఆమె ఊహిస్తుంది. పతివ్రత ఊహలు సత్యానికి దగ్గరగా ఉంటాయి కదా!

**8. చండతరుండైన విధి లంచగొండి కాదు**

**పరిచయం:** ఈ వాక్యం నవయుగ కవిచక్రవర్తి గుఱ్ఱం జాషువాచే విరచితంబైన "ముంటాజ మహలు" పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** షాజహాను భార్య కోసం దేవుడికి మ్రొక్కుకునే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** షాజహాను భక్తితో మానెడు వజ్రమణులిస్తానని అల్లాకు మ్రొక్కుకొన్నాడు. కానీ ఇల్లాలు ఆరోగ్యం పొందలేదు, తీవ్రమైన విధి లంచగొండి కాదు కదా !

**9. భూవర రేవులందు దిగిపోయెద రించుక వెన్క ముందుగా**

**పరిచయం:** ఈ వాక్యం నవయుగ కవిచక్రవర్తి గుఱ్ఱం జాషువాచే విరచితంబైన "ముంటాజ మహలు" పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** చనిపోబోయే ముందు భర్తకు, ముంటాజ్ వైరాగ్యపు మాటలు చెప్పే సందర్భం లోనిదీ వాక్యం.

**వివరణ:** ఈ భూమి మీద శరీరమున్నంత వరకు సుఖం లేదు, కష్ట సుఖాలు చెలికత్తెలై మృత్యుదేవత తాండవిస్తుంది. ఇది జూదరంగం, సంపదలన్నీ పాచికలే. ఆవిరిఓడలో ప్రయాణిస్తున్న బాటసారులు అందరూ. రాజు ! రేవులలో వెనుక ముందుగా అందరూ దిగిపోతారు, ఈ భూమి మీద వచ్చిన పని పూర్తయి తమ స్వదేశానికి వీరులనే వ్యాపారులు పోయి వస్తూ ఉంటారు.

**10. సెలనిప్పింపు మటంచు నేత్రములు మోడ్చెన్ భర్తృవక్షస్థలిన్**

**పరిచయం:** ఈ వాక్యం నవయుగ కవిచక్రవర్తి గుఱ్ఱం జాషువాచే విరచితంబైన "ముంటాజ మహలు" పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** రాణి మరణించు సమయంలో రాజుకు చివరి మాటలు చెప్పే సందర్భం లోనిదీ వాక్యం.

**వివరణ:** కల్మషం ఏ మాత్రం లేని మధురం ముగ్ధం అయిన నీ మనసులో ఎప్పుడూ ఇక నిద్రిస్తాను. నా కోసం రెక్కల రథాలపై

వచ్చిన దేవతలు నన్ను ఆహ్వానిస్తున్నారు, సెలవిప్పించు అని రాజు వక్షస్థలంపై వాలి కళ్ళు కన్ను మూసింది రాణి.

**11. దుఃఖాంకితమైన యీ శిథిల కంకాళంబు నెట్లీడ్చెదన్.**

**పరిచయం:** ఈ వాక్యం నవయుగ కవిచక్రవర్తి గుఱ్ఱం జాషువాచే విరచితంబైన "ముంటాజ మహలు" పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** భార్య మరణంలో ఉన్మత్తుడై ఆమె వియోగం భరించలేక ఆమెనే షాజహాను స్మరించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** నిన్న మణి మందిరాలలో నిద్రించి నేడు శ్మశానంలో నేల మీద నిద్రిస్తున్నావా, లోకమంతా నాకు బూడిద కుప్పలాగ కనిపిస్తుంది, జీవితం చీకటిలోకి ప్రవేశించింది. నీతో సమావేశాలు కథలై పోయాయి సహించలేని నీ వియోగ బాధతో దుఃఖానికే అంకితమైన ఈ శిథిలమైన అస్థిపంజరాన్ని ఎలా వెళ్ళదీస్తాను?

**12. యివలి ఒడ్డున నిలిచి పోయితిని నేను**

**పరిచయం:** ఈ వాక్యం నవయుగ కవిచక్రవర్తి గుఱ్ఱం జాషువాచే విరచితంబైన "ముంటాజ మహలు" పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** భార్య వియోగంతో ఉన్మాదిలా దుఃఖిస్తూ అమెనే షాజహాను స్మరించే సందర్భంలోనిదీ వాక్యం

**వివరణ:** ఏ కారణం చేత ఆ దేవుడు నిను తీసుకువెళ్ళాడో, నన్ను శిక్షించటానికో, ఈ ప్రపంచానికి వైరాగ్యం నేర్పటానికో, చావుకు అవతలి ఒడ్డుకి నువ్వు చేరావు, ఇవతలి ఒడ్డున నేను నిలిచిపోయాను.

**13. రతనాల సమాధి మందిరము గావింతున్**

**పరిచయం:** ఈ వాక్యం నవయుగ కవిచక్రవర్తి గుఱ్ఱం జాషువాచే విరచితంబైన "ముంటాజ మహలు" పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** ముంటాజ్ సమాధి నిర్మించాలని షాజహాను నిశ్చయించుకొన్న సందర్భంలోనిదీ వాక్యం,

**వివరణ:** యమునా తీరంలో చెక్కుచెదరని స్వర్గధామం నిర్మిస్తాను శుభస్వరూపిణి! రా మరణించిన వారికి మరో జన్మను ఇచ్చేవి కృతులే కదా. అలాంటి వందల కృతులచే నిను బ్రతికించి రతనాల సమాధి మందిరాన్ని నిర్మిస్తాను.

**14. బొమ్మ గనరా దొకటేనియు వానిలోపలన్**

**పరిచయం:** ఈ వాక్యం నవయుగ కవిచక్రవర్తి గుఱ్ఱం జాషువాచే విరచితంబైన "ముంటాజ మహలు" పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** రాజు ముంటాజ్ సమాధి నిర్మాణం కోసం నమూనా బొమ్మ చేసి తెమ్మని శిల్పులకు తెలిపిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** భారతదేశంలోని శిల్పులందరూ అనేక రాళ్ళను, లోహాలను ఉపయోగించి ప్రతిభలు చిందే విధంగా సమాధి నమూనాలు చేశారు. కానీ షాజహాను ప్రేమ రసాన్ని వెల్లడించే విధంగా నున్న బొమ్మ ఒకటి కూడా వాటిలో కనరాదు.

**15. సమయు గావుత ముచ్చ నీచతల బెడఁద**

**పరిచయం:** ఈ వాక్యం నవయుగ కవిచక్రవర్తి గుఱ్ఱం జాషువాచే విరచితంబైన "ముంటాజ మహలు" పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** భార్య వియోగంతో, వైరాగ్యం పొంది ఉన్మాదిలా ఉన్న కటిక పేదూడు సమాధి బొమ్మలు చేసిన సందర్భం లోనిది వాక్యం.

**వివరణ:** షాజహాను ఊహలో ఉండి మాటల్లో చెప్పటానికి అందరాకుండా ఉన్న సమాధి నమూనా ఆ విరాగి చేతిలో సృష్టించబడింది. కళలు గొప్పకులంలో జన్మించినవారినే కాదు కులం లేదన్నవాడిని కూడా వరిస్తాయి. కళాదేవత కటాక్షంతో ఎక్కువ తక్కువ అనే సమస్య తొలగిపోతుంది.

**16. బహు భంగులఁ బొగడె నిఖిల పండితుల సభన్**

**పరిచయం:** ఈ వాక్యం నవయుగ కవిచక్రవర్తి గుఱ్ఱం జాషువాచే విరచితంబైన "ముంటాజ మహలు" పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** పేదవాడు చేసిన సమాధి బొమ్మను చూసి షాజహాను మెచ్చుకొనే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** పనితనం కుదిరిక, నూతనత్వం గల ఆ బొమ్మ రాజు మనసులో సంతోషాన్ని పెంచింది. వహవా! సెహబాస్ అంటూ రాజు అది బహుమతికి తగిన బొమ్మని, ప్రజ్ఞావంతుడు ఈ బొమ్మ చేసినవాడని అనేకరకాలుగా ఆ పండితుల సభలో పొగిడాడు.

**17. దాసులు పెక్కులుండెదరు తన్పుము వారి శరణ్యశూన్యులన్**

**పరిచయం:** ఈ వాక్యం నవయుగ కవిచక్రవర్తి గుఱ్ఱం జాషువాచే విరచితంబైన "ముంటాజ మహలు" పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** రాజు ఇచ్చిన బహుమతులను నిరుపేద తిరస్కరించిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ఆశలు కోల్పోయి ఆకలికి ఇంత తిని ఎలాగే రోజులు గడుపుతున్న అభాగ్యుడిని, భార్యను కోల్పోయి సన్యాసినైన నాకు ఈ బంగారం, నాణాలు ఎందుకు, కళా సరస్వతిని సేవించే దాసులు అనేకమందుంటారు, వారిని తృప్తిపరుచు.

**18. జనుదెంచియున్న జగదీశ్వరుడే పయగంబరో యగున్**

**పరిచయం:** ఈ వాక్యం నవయుగ కవిచక్రవర్తి గుఱ్ఱం జాషువాచే విరచితంబైన "ముంటాజ మహలు" పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** రాజిచ్చిన సంపదను స్వీకరించక వెళ్ళిన నిరుపేదను గురించి రాజు గొప్పగా తలచే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ఇతడు ఒక దేవదూత, ఇలాంటి మహానుభావులు లభించిన పెన్నిధిని తిరస్కరించే ధైర్యవంతుడు నా కోరిక తీర్చటం కోసం మానవ రూపంలో వచ్చిన జగదీశ్వరుడో, పయగంబరుడో అయివుంటాడు.

**19. మొగలు కీర్తి మొదటి మొగ్గ దొడిగె.**

**పరిచయం:** ఈ వాక్యం నవయుగ కవిచక్రవర్తి గుఱ్ఱం జాషువాచే విరచితంబైన "ముంటాజ మహలు" పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** తాజ్‌మహల్ నిర్మాణం పూర్తయిన సందర్భం లోనిదీ వాక్యం.

**వివరణ:** తాజ్‌మహల్ సోయగం నేటికీ చాటుతూ 'నీతి మంతుల విశ్రాంతి నికేతనం ఇదే' అని ద్వారబంధాలలో రాయబడింది. పున్నమికి తాజ్‌మహల్‌కి స్నేహం కుదిరి వెలుగులు విరజిమ్మబడ్డాయి. చివరి సుత్తిదెబ్బతో శిల్పవరుల ప్రతిభ వట్టిపోయింది. షాజహాను దీక్ష సఫలీకృతమైంది, మొగలు కీర్తి మొదటి మొగ్గ తొడిగింది.

**20. వికటములు సుమ్ము కాలమాంత్రికుని పనులు**

**పరిచయం:** ఈ వాక్యం నవయుగ కవిచక్రవర్తి గుఱ్ఱం జాషువాచే విరచితంబైన "ముంటాజ మహలు" పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** ఔరంగజేబు తండ్రిని చెరసాలలో ఉంచిన సందర్భం లోనిదీ వాక్యం.

**వివరణ:** రాజు చివరికొడుకు ఔరంగజేబు అన్నలను చంపి సింహాసనం అపహరించి కన్న తండ్రిని చెరసాలలో ఉంచాడు. కాలమాంత్రికుడి పనులు వికృతమైనవి సుమా!

**21. నృపతి వలెనన్న బిరుదుల కేమి కొదువ**

**పరిచయం:** ఈ వాక్యం నవయుగ కవిచక్రవర్తి గుఱ్ఱం జాషువాచే విరచితంబైన "ముంటాజ మహలు" పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** మత విద్వేషి, కళ పట్ల ఆసక్తి లేని వాడు నిర్దయుడు అయిన ఔరంగజేబును గురించి చెప్పే సందర్భం లోనిదీ వాక్యం.

**వివరణ:** తన మతపిచ్చిని నలుగురికి రుద్దాలని చూస్తాడు, సకలలోకానికి సంతోషాన్నిచ్చే తాజమహలు ఔరంగజేబు మనసును రంజింపచేయలేదు, భక్తికి, కళకు పొత్తు లేదు, మానవులందరికీ దేవుడు, మహితాత్ముడు అనే బిరుదులు ఔరంగజేబుకు కలిగాయి. రాజు కావాలంటే బిరుదులకేమి కొదువ.

**– ఆచార్య ఇరపని మాధవి**

## పాఠం - 12

# ముంటాజ మహలు

**- గుఱ్ఱం జాషువ**

**విషయసూచిక:**

**12.1. ప్రశ్నలు - సమాదానాలు**

## 12.1. ప్రశ్నలు-సమాధానాలు

**1) "ముంటాజ మహలు" ఇతివృత్తాన్ని రాయండి?**

**జ)** ప్రపంచంలోనే భారతదేశానికి గుర్తింపు తెచ్చిన కట్టడం తాజ్‌మహల్. దానిని నిర్మించిన షాజహాన్‌కు తన భార్య ముంటాజ్‌పై గల అపురూపమైన ప్రేమను గుఱ్ఱం జాషువ తాను దర్శించి పాఠకులకు 'ముంటాజ మహలు' రచన ద్వారా తెలియజేశారు.

మొగల్ సామ్రాజ్యాన్ని షాజహాను తన భార్య లోకైకమోహిని అయిన ముంటాజ్ మహల్‌తో కలిసి సమర్థవంతంగా పాలిస్తున్నాడు. ఐశ్వర్యంలో వైభవంగా తాను జీవించటమే కాకుండా ఢిల్లీ నగరంలో ముత్యాల మసీదు నిర్మించాడు. నీతి మార్గంలోనే నడుస్తూ మృదుస్వభావంతో పాలన చేసేవాడు. కుల మత విద్వేషాలు తన రాజ్యంలో లేకుండా 'పరమత సహనంతో తన పూర్వికుల పేరు నిలిపేవిధంగా ప్రజారంజకంగా పాలన చేసేవాడు. నెమలి సింహాసనంపై అధిష్టించి కవులను పోషిస్తూ, బీదసాదలకు దానధర్మాలు చేస్తూ, భక్తి కలిగినవాడై, ఎలాంటి వ్యసనాన్ని తన దరిచేరనీయక, శత్రువులను అదుపులో ఉంచుతూ, గోవధ వంటి వాటిని నిషేధించి, మతకల్లోలాలు లేకుండా భారతావని ప్రశాంతంగా నిద్రించేవిధంగా పాలన చేసేవాడు.

ఎంతో అందమైన ముంటాజ్ మహల్ సాహచర్యంతో ఆనందంగా కాలం గడుపుతున్నాడు షాజహాను. వారి దాంపత్యం అన్యోన్య స్నేహంతో అలరారుతుంది.

> "ముద్దులరాణి మాటకు విభుం డెదురాడడు రేని యాన క
> మ్ముద్దియ మాఱుపల్కడదెపో సహవాస" మటంచు నిత్యమున్
> బెద్దలు ప్రస్తుతింప నతివేల సుధా ప్రణయైక రాజ్యపుం
> గద్దె నలంకరింతురు మొగల్ మగలమ్మహనీయ దంపతుల్"

వారి అనురాగానికి ప్రకృతి సహకరిస్తుంది. వారి దాంపత్యాన్ని గురించి కవులు కీర్తించేవారు. వారి స్నేహం దంపతులకందరికీ ఆదర్శం అనే రీతిగా ఆ ఆలుమగలు జగత్తునంతా అలరించారు. రాణిగా ప్రజలపై వాత్సల్యం చూపుతూ, తాను సంతానాన్ని పొంది మాతృమూర్తి అయ్యింది. ఎంతమంది సంతానం కలిగినా ఆమె సత్యవంతురాలు కనుక యవ్వనం తరగలేదు. పదముగ్గురు సంతానం తన చుట్టు తిరుగుతూ ఉంటే అనేక కావ్యాలతో అలరారే సరస్వతి దేవిలా ఉండేది. పద్నాలుగవసారి ఆమె గర్భవతైంది. తన చెలికత్తెలు కాలు కదలనీయనిండా సేవలు చేస్తుంటే తన పిల్లలు మనసు రంజింప జేస్తుంటే ఆ రత్నాల మహల్‌లో ఎంతో సంతోషంగా రాణి కాలం గడుపుతుంది. రెండువైపుల చెలికత్తెలు చేయూతనిస్తుంటే

సంపదతతో కూడిన నిండుబండి లాగా చక్రవర్తి ఇంట్లో ముంటాజ మహలు నడయాడుతుంది.

ఒక రోజు రాత్రి నిండుచూలాలైన రాణి నిద్రిస్తుండగా కాపలా జవాను కత్తి ఒకటి రెండు సార్లు నేలకు జారింది, అతడు నిద్రపోయాడు. సమయం ఒంటి గంట. ఐదు సంవత్సరాల ఔరంగజేబు పక్కమీద మనలుతూ పలువరించాడు. ఆకాశంలోని ఒక తోక చుక్క చిదికి చెదరి భూమిపైకి జారింది. రాత్రి ఏలుతుండగా జగం నిద్రిస్తుండగా రాణి గర్భంలోని కుమారుడు తల ఊపుతూ నవ్వాడు. రాణి ఉలిక్కిపడి నిద్రలేచి దిక్కులు చూస్తూ గర్భస్థ శిశువు నివ్వటం అశుభమని కలత పడింది. ఆ కాన్పుతో తన భర్తతో తన స్నేహం ముగుస్తుందనే కలత ఆమె మనసులో కలిగి బాధపడింది. ఎప్పుడూ కంటతడి పెట్టని ముంటాజ మహలు రాణికి లోన కలిగిన చింతతో ఒకటి రెండు కన్నీటి చుక్కలు రాలాయి. ఆ రాత్రి కాల రాత్రిలా ఆమెకు గడవటం కష్టమైంది. ఏమి మాయో ప్రసవ వేదనతో పాటు శీత జ్వరం ఆ రాణికి కలిగింది. తన సంతానం తల్లి లేక బాధపడుతున్నట్లు, తన భర్త తన వియోగ బాధలో మునుగుతున్నట్లు తన కోసం గొప్ప సమాధి నిర్మించినట్లుగా ఆమెకు ఊహలు కలిగాయి. బిడ్డలను కౌగిలించుకొని కళ్ళల్లో నీరు కళ్ళల్లోనే ఆపుకుంటూ భర్తతో కళ్ళు విప్పి గద్గద స్వరంతో ఈ భూమి అనే సత్రంలో నీ భార్యగా నా ప్రవాస ముగిస్తున్నాను. పరదేశుల స్నేహం స్థిరం కాదు కదా. ఈ శరీరమున్నంత వరకు ప్రాణికి నెమ్మది లేదు. కష్ట సుఖాలు చెలికత్తెలుగా మృత్యుదేవత జూదమనే వినోద మాడుతుంటుంది.

ఆవిరి యోడలో జలధియాన మొనర్చెడు బాటసారు లో
భూవర రేవులందు దిగివోయెద రించుక వెన్కముందుగా
నీ వసుధాపణంబు పనియెల్ల ముగించి స్వదేశగాములై
పోవుచు వచ్చుచుండ్రు సతమున్ బ్రజ లీ నరజన్మ వర్తకుల్

ఎంతో పరాక్రమంతో భూమి నాలుగు దిక్కుల పాలించినా వారి కపాలాలలో శ్మశానంలోని సింహాలు నీళ్ళు తాగుతున్నాయి. మృత్యువు సహజం, నువ్వు బాధపడవద్దు, ఓ రాజా! ఈ మృత్యు వ్యాపారంలో ఎందరో ఇముడుతున్నారు. వారిలో నేనొకదానిని. ఈ మరణం సమతా చిహ్నం. మీ పూర్వీకులకు విశ్రాంతి ప్రసాదించింది. మహమ్మదు ప్రవక్త వంటి వారు నడిచిన దారిలో వెళ్ళి ఈ బాధలు పోగొట్టుకుంటాను. కల్మషం లేని నీ హృదయంలో ఎప్పుడు నిద్రిస్తాను ఇంక, నాకు శెలవిప్పించు" అంటూ భర్త వక్షస్థలంపై కన్నుమూసింది.

పట్టుపరదాల చీఁకటి వనములందు
ప్రభవమును గాంచి, శోభిల్లి రాలిపోయె
పరిమళం బొండు లోకాన బారజిమ్మి
మొగలు రేరాణి ముత్తైదు ముత్తియంబు

ముంటాజ మహలు రాణి మరణంతో షాజహాను మహారాజు కృంగిపోయాడు. ఉన్మత్తుడిలా రాత్రి పగలు నిద్రాహారాలు మాని భార్య స్మృతులతో, బిడ్డలను చూసి దుఃఖిస్తూ ఎవరూ ఓదార్చినా ఊరట చెందలేకపోయాడు. భార్యనే తల్చుకుంటూ భార్య కోసం ఒక సమాధి కట్టించాలనుకున్నాడు. సమాధి నమూనాలు చేసి తెమ్మని శిల్పులకు తెలిసే విధంగా చాటింపు వేశాడు. శిల్పులు అనేక మంది వివిధ నమూనాలు తెచ్చినా ఏదీ రాజుకి నచ్చలేదు.

ఆ దేశంలోనే మహా దరిద్రుడు ఒకడు భార్యా వియోగదుఃఖంతో వైరాగ్యం రేకెత్తగా శ్మశానంలో బూడిదను ముద్దలు చేసి సమాధి బొమ్మలు అందంగా చేసేవాడు. అతడి చేతిలో షాజహాను మనసులో ఉండి మాటలలోకి రాని ప్రతిమ రూపు దిద్దుకోంది.

కళలు మోహించుటొక కులీనులనే కాదు
కులము లేదన్న వానినిఁ గూడ వలచు
సత్కళా దేవతా కటాక్షంబు కతన
సమయు గావుత ముచ్చు నీచతల బెడఁద

అనే విధంగా తయారైన ఆ బొమ్మను తన భార్య ప్రేమ చిహ్నంగా బంగారు రేకులతో కట్టించాలని ఊరూరా భిక్షమెత్తుతున్నాడు. ఆ బొమ్మను చూసిన ఒక శిల్పి అతడి పనితనానికి ఆశ్చర్యపడి దానిని మహారాజుకు చూపించాడు. సెహబాష్‌ని రాజు ఆ పేదవాడి పనితనాన్ని పండితుల సభలో పొగిడి వారందరూ అసూయ పడే విధంగా అతడిని సభలో బంగారు వస్త్రాలు, పదివేల నాణెములు కానుకగా ఇచ్చాడు. దానికి అతడు

సులతానా గ్రణి! మీ కళాభిరుచికిన్ జోహారు భార్యావియో
గులు మీకియ్యదె సానుభూతి వినుతోక్తుల్ మీ సభాశాలకున్
వలపు ల్మీసమదృష్టి దార్ఢ్యతకుఁ గైవారంబు మీ నేలకున్
కులుకు న్మెమ్ముల తఖ్తుకుం దిశల నిగ్గుల్ దేరు మీ కీర్తికిన్

అన్నాడు. ఇంకా హిందువులు, ముస్లిములు భాయి భాయి అంటూ మీ నీడలో సుఖంగా ఉన్నారు. బిచ్చపు గిన్నెలో బంగారపు బియ్యం పోసిన దానశీలివి. ఆకటికి ఇంత తిని ఎలాగో రోజులు గడిపే అభాగ్యుడిని, సన్యానికి నాకెందుకో బంగారు నాణెలు, నవాబు సభలో పూజలందుకొన్నాను దానితో నా సగం దిగులు తీరింది. ఈ పసిడి నాణాలను కళా సరస్వతి దాసులకు ఇవ్వమని వేగంగా సభ నుండి వెళ్ళిపోయాడు. ఆశ్చర్యంతో రాజు

ఇతఁడొక దేవదూత కలరే యిటువంటి మహానుభావు లీ
వితముగ పెన్నిధానము లభించినదాని తిరస్కరించు ధీ
యుతులు మదీప్సితంబును ఫలోన్ముఖముం బొనరింప మానవా
కృతి జనుదెంచియున్న జగదీశ్వరుఁడో పయగంబరో యగున్

అనుకొని అతడు కోరిన విధంగా ఆ నాణాలను దానం చేశాడు.

యమునాతీరంలో శిల్పాచార్యులందరినీ రప్పించి సమాధి నిర్మాణం ప్రారంభించాడు. శిలలకు ప్రాణముందా అనే విధంగా, కలం అందుకొన్న కవివరేణ్యుడి ముందు తలలు వంచే శబ్దాలలాగా, వెన్నలాగా మెత్తదనం దాల్చి శిలలు ఆ శిల్పులు చేతిలో ప్రాణం పోసుకున్నాయి. ముప్పై ముగ్గురు శిల్పులు ఇరవై సంవత్సరాలు కష్టపడి భారతదేశం శిల్పసంపదకు ప్రాణం పోశారు.

రాణి మనస్సువోలి మధురంబయి ముత్తెపుఁ జిప్పలోని పిం
గాణి చెమక్కులన్ ధవళకాంతులు జిమ్ముచు చంద్రకాంత పా
షాణపు టింపు సొంపుల దిశల్ వెలిగించెడు టాజి పొంత ని
ద్రాణములై నశించు నమృతాంశుని పున్నమి నాటి పోడుముల్

అనే రీతిగా తాజ్ మహలు నిర్మాణం పూర్తయింది. ఆ అందాన్ని యాభై ఆరు అక్షరాలు గల తెలుగుభాషకే పొగడటం అలవికాకుంటే ఇతర భాషా కవులకు సాధ్యమా! మహారాజు సృజించిన ఆ తాజమహలు మొగలు కీర్తికి మొదటి మొగ్గ. ముంటాజ మహలు మహారాణికి చిరస్థాయిగా నిర్మించిన గొప్ప కావ్యమది. ఆ తాజ్‌మహలును చూసి తన భార్య ముఖాన్ని చూస్తున్నట్లుగానే షాజహాను భావించాడు.

రాజు చివరి కొడుకు ఔరంగజేబు అన్నలను వధించి, సింహాసనాన్ని ఆక్రమించి తండ్రిని కారాగారంలో ఉంచాడు. తండ్రి కొడుకుల తత్వాలు పూర్తిగా భిన్నమైనవి, కళలు కళ తప్పాయి. హిందువులు, ముస్లిములతో వైషమ్యాలు పెరిగాయి. ఔరంగజేబు ఖురాను రాసి ధనం సంపాదించి కష్టజీవియై బ్రతుకుతూ నేలపై పడుకుంటూ రాజ్యపాలన చేసేవాడు. తనకు పట్టిన మతపిచ్చిని అందరికీ అంటించాడు.

సకల లోకమునకు సంతోషకరమైన
మధురమైన తాజమహలు హొయలు
పాదుషాహ మనసు వలపింపలేదయ్యె
భక్తి తోడ కళకు పొత్తు లేదు

చెరసాలలోని షాజహాను తాజ్‌మహలు చూస్తూ ఊరడింపు పొందేవాడు. ఏడు సంవత్సరాలు చెరలో ఉన్న తర్వాత షాజహాను తన ప్రేయసిని చూడటానికి దివికెళ్ళాడు. షాజహాను సమాధి తాజ్ మహాలు పక్కనే కట్టబడింది. రాణి రాజు వెళ్ళిపోయినా తాజమహల్ రాజసాన్ని విడువలేదు.

**2) ముంటాజ మహలు మరణంతో దుఃఖితుడైన షాజహాను ఆవేదనను వివరించండి.**

**జ)** అన్యోన్య దాంపత్యంతో సహజీవనం చేసే భార్యాభర్తలలో ఏ ఒక్కరు ఎడబాసినా రెండవవారి పరిస్థితి దయనీయంగా వుంటుంది. అది కుల, మత, ఆర్థిక పరిస్థితులకు అతీతమైంది. శత్రువులందరినీ తన ఆధీనంలో ఉంచుకొని సకల రాజ్యాన్ని పరిపాలించే షాజహాను ఏకపత్నీవ్రతంతో భార్యను అపురూపంగా చూసుకొనేవాడు. వారి అన్యోన్యత చూసి జగత్తంతా వారినే ఆదర్శంగా తీసుకొనేంత స్నేహంగా మెలిగేవారు. పదముగ్గురు సంతానాన్ని ఇచ్చిన భార్య ముంటాజ మహలు పద్నాలుగో కాన్పులో మృత్యువు తప్పదని ఒక ప్రక్క భర్తకు ధైర్యం చెబుతూనే అతడి యెదపైనే కన్నుమూసింది. ముంటాజ మహలు రాణి చివరికిలా అన్యాయమైపోగా రాజు దీనుడై భుజబలం, గొప్ప సామ్రాజ్యం పోయినట్లుగా దుఃఖించాడు, క్రుంగిపోయాడు. ఎంత ఐశ్వర్యమున్నా భార్య మరణిస్తే అది ఆనందాన్ని ఇవ్వలేదు. అతడు నిరుత్సాహంతో బంధువులు, స్నేహితులు ఎందరు ఓదార్చినా ఊరడిల్లక ఉన్మత్తుడిలా రాత్రీపగలు నిద్రాహారాలు మని తన భార్య సంచరించిన ప్రదేశాలలో తిరుగుతూ తన సంతానాన్ని చూచి దుఃఖిస్తూ నిట్టూరుస్తూ కాలం గడపసాగాడు.

తన భార్యనే స్మరిస్తూ "నిన్న మణి మందిరాలలో నిద్రపోయావు, ఈరోజు శ్మశాన భూమిపై నిద్రిస్తున్నావా, నిన్న ఈ రోజు ఇంతక్రితం రోజుల వలె కాక ఎంత విషాగ్నిని చిమ్మిపోయాయి". ఈ జగత్తంతా భస్మరాశిలలా నాకు తోస్తుంది. ఆశ ఓడిపాయి జీవితం అంధకారమయమైంది. నీతో గడిపిన కాలం కథలైపోయాయి. భరించలేని వియోగజ్వాల దహిస్తుంటా దుఃఖానికే అంకితమైన ఈ ఆస్తిపంజరాన్ని ఎలా ఈడ్చగలను?

జీవన తారనై యమర సీమల నీవు సముజ్జ్వలింప మా
యావృతమైన విశ్వవలయంబుల శాశ్వత శోకమూర్తినై
జీవిత మూని యీ చరమ జీవిత నాటకరంగ మెక్కివా
పోవుచునుంటినీ విధురభూమికతోడ కిరీటధారినై

చావు నీ ఆయుష్షును ఆరగించి నీ శరీరాన్ని నా ఒడిలో ఉంచిపోయింది. ఓ రాణి! భార్యను రక్షించలేని నా శౌర్య సంపదంతా అడవి కాచిన వెన్నెలైపోయింది. చక్రవర్తి అయినా ఇలాంటి సమయాలలో సాధారణ మనుష్యుడే కదా! నీవు ధరించి విడిచిన వస్త్రంలాగా శ్మశానం పాలయిన నీ శరీరం నా మనసును బాధిస్తుంది. నీవు తిరిగి అమృత దేహంతో పరమపదంలో కనిపిస్తావంటారు, అది వాస్తవమో, లేక బురిపించు మాటో కదా! అయ్యో! ఎందరో పయగంబర్లు, ముముక్షువులు స్వర్గాన్ని ఆశించి తమ శరీరాన్ని గొప్ప త్యాగంతో త్యజించారు. వారందరూ ఎటుబోయారో కదా! వారి కబురు చెప్పే ఒక్కడూ లేడు భూమిపై. వారి అవశేషాలు దుమ్ముకొట్టుకొని ఎదురు చూస్తున్నాయి. నిన్ను మళ్ళీ సృష్టించటం మహాశిల్పి అయిన ఈశ్వరుడికి కష్టం. నీ బొమ్మ అచ్చును నన్ను శిక్షించటానికో, ఈ లోకానికి వైరాగ్యం నేర్పటానికో పాడుచేశాడు. చావుకి అవతలి ఒడ్డుకు నువ్వు చేరావు, నేను ఇవతలి ఒడ్డున నిలిచిపోయాను. మాటలందని వేరువేరు చోట్ల నున్న మనకు స్నేహం ఎలా కుదురుతుంది? నీ సమాధి మీద కాల రథం చక్రం ముద్రులున్నాయి.

పయనంబు సాగించు మొయిలు తిన్నెల మీఁద
　　కనుపింపలేదు నీ కాలిజాడ
అరవిచ్చి మురిపించి మెరుపుల తోఁటలో
　　మిట్టాడలేదు నీ మేని కాంతి
కొమరారు నిండు పున్నమ చందమామలో
　　భాసిల్ల లేదు నీ హాసలవము
సచరాచరంబైన సర్వ సర్వం సహా
　　వినిపింపలేదు నీ విమలవాక్కు
ఏ రహస్య సరణి యే హరిత్తుల జాడ
నీ నిలింప రథము నిర్గమించె
నాదు నేత్రయుగళి నాట్యమాడెదు నిన్ను
నెట్లు దొంగిలించె నీశ్వరుండు

ఏ రహస్య మార్గంలో నీవు ఎక్కిన రథం వెళ్ళిపోయింది.. నా రెండు కళ్ళల్లో ఎప్పుడూ నాట్యం చేసే నిన్ను ఈశ్వరుడు ఎలా దొంగిలించాడు. ఓ దేవీ! నీవు నివసించే దగ్గరే నేను నివశిస్తాను. నా కోసం కొంత నేల దాచివుంచు, నేను రేపోమాపో వస్తాను. నా జీవిత శేషమంతా అవివాహితుడిగా నీకే అంకితం చేస్తాను. నేను కట్టించిన మసీదులలో తిరుగుతూ, నేను ఇచ్చే కానుకలు ఆశిస్తూ నాకే కీడు తలపెట్టాడా దేవుడు. ఆ దేవదేవుడి దయాపరత్వమే సందేహంగా తోస్తుంది, ఈ భక్తితో చేసే సేవలన్నీ వృధా నాట్యాలే అనిపిస్తుంది.

అక్కటికంబులేని దురితాత్ముడు మృత్యుకిరాతరాజు వి
ల్లెక్కిడినాడు తృప్తిని వహింపఁడు నీ మరణంబుతోడ నీ
జక్కవ జంటలో నొకటి చాలదు వాని బుభుక్ష దీర్ప న
న్నుక్కడఁగింపఁగా దొడుగ కుండఁడు రెండవ బాణ ముద్ధతిన్

దేవి! ఈ భూమి మీద భర్త రహస్యాలన్నీ కాపాడే విశ్వసనీయురాలు భార్యే కదా ! నీవు ప్రాణాలు కోల్పోగానే గొప్ప సైన్యం ఉన్నప్పటికీ నేను భయపడుతున్నాను, ఈ రాజ్యం ఉండి కూడా నేను నిర్భాగ్యుడనైపోయాను. ఆరిపోని నీ శరీర శోభ యమునా నది ఇసుక తిన్నెలకు దీపమైంది. నీ సుకుమారత్వమంతా ఆ నదిలోని కమలాలు పంచుకున్నాయి. గొప్పదైన సత్యలోకానికి వెళ్ళి నువ్వు సుఖిస్తున్నావో లేక అనంతమైన ప్రకృతి గర్భంలో లీనమయ్యావో తెలిసినవాడు లేడు. ఓ హృదయేశ్వరీ! మరణం తరువాతి విషయం అయోమయం. నీ రూపం అనే స్వర్ణ లోకం ఇంక అంతరించింది. నా బుద్ధికీ నీ సమాధి పైని మట్టిపైన గడ్డి పోచలు తలలూపుతూ వైరాగ్యవిషయాలు చెబుతున్నట్లుగా ఉన్నాయి. నీ ప్రియమైన భర్తను విడిచి దేవదూతలు తిరిగే జీవనది ప్రవహించే ఒక దీవికి ఒంటరిగా వెళ్ళావు. మనిషినైన నాకు నీతో ఎగరటానికి రెక్కలు లేవు కదా! భూమికి అందని స్వర్గాన్ని మనిసి తన ఊహలోనే సృష్టించాడు, అది పేదలు, అనాథలు నిలిచే చోటు, రాజులకు కాదు. శుభ స్వరూపిణి! నీ మృదువైన పాదాలు కంటే యమునా నదీ తీరంలో స్వర్గధామము రచిస్తాను నీవు రా !

మృతులకు మరు జన్మంబులు
కృతులె కదా దేవి యట్టి కృతి శతములచే
బ్రతికించి నీకు జక్కని
రతనాల సమాధి మందిరము గావింతున్

జీవులందరికీ ఉల్లాసాన్నిచ్చే ఉదయకాలపు సంధ్యా సమయం మొదలైంది. మంచి సువాసనతో సంపంగి తోట పూచింది. నీ వయసువారు జారిన కొప్పును నిలువుటద్దం ముందు నిలిచి సరిచేసుకుంటున్నారు. ఆ దేవుడిని మన్నిస్తూ జుమ్మా మసీదు తొలి నమాజులతో మేలుకొలిపింది. గోరువంక నిద్రమత్తు వదిలి ఈశ్వరుడిని స్తుతించింది. సృష్టంతా ఉదయకాలపు ఆనందంలో ఉండగా నీవు మాత్రం నిద్ర లేవలేదు. పందొమ్మిది సంవత్సరాల వయస్సు గల దాంపత్యాన్ని పెకలించి దేవుడు తీసుకెళ్ళాడు. ఈ గాయాన్ని మాన్పగల వైద్యుడు లేడు. ముందు వారి మార్గంలోనే ఈ బ్రతుకురథాన్ని మరలిస్తారు. జీవరత్నమైన నిన్ను స్వీకరించి వట్టి రత్నాలు నా ఇంటిలో ఆ దేవుడు వదిలాడు. ఇచ్చి మురిపించి మళ్ళీ తిరిగి తీసుకోవడం దేవుడు ఎందుకు అలవాటు చేశాడో? ఎంతో ప్రియంగా బాలసూర్యుడు తూర్పుకొండపై నిక్కి బంగారు కుంచెతో నీ మహళ్ళపై కుంకుమ చల్లుతున్నాడు. ఈ అలంరానాలన్నీ ఎందుకు, నీ వియోగంతో ఈ కోటకు విషాదమే శరణ్యమైంది.

నా మనస్సులో ఉన్న విషాదాన్ని ఆగకుండా శబ్ధం చేస్తున్న యమునా నదీ తరంగాలు మీటుతున్నాయి. ఒకప్పుడు సంతోషాన్ని కలిగించినవే మరొకప్పుడు జీవులకు దుఃఖాన్ని కలిగిస్తాయెందుకో!

నిన్ను నుదరంబులో దాచుకొన్న మహి కి
రత్న గర్భాఖ్య నేఁడు సార్థకమయ్యె
నీవు తల మీద దాల్చి మన్నించు కతన
వసుధ నొక బొగ్గు కోహినూరు వజ్రమయ్యె

"గురకలు కానీ శాశ్వత నిద్రలో ప్రవళించి ఎప్పుడో పరమ పదించిన నవాబులు రాణులు తోడునీడగా నీ అనంతమైన స్వర్గ యాత్ర చెయ్యి. ఈ యమునా తీరంలో నీ పవిత్రమైన చరిత్రను ఆలపిస్తూ శాంతిని పొందుతాను" అని ఎంతో ఆవేదనతో ముంటాజ మహలు వియోగ దుఃఖంతో పరిపరి విధాల తలపోస్తూ దుఃఖితుడయ్యాడు షాజహాను. ఆమె సమాధి నిర్మాణానికి ఉద్యుక్తుడయ్యాడు. యావత్ ప్రపంచానికి ప్రేమ చిహ్నమైన తాజ్ మహల్ నిర్మించాడు.

**3) "ముంటాజ మహలు" పాఠ్య భాగం ఆధారంగా గుఱ్ఱం జాషువ సమాజానికి అందించిన సందేశమేమిటి?**

**లేదా**

**మీ పాఠ్యభాగం ఆధారంగా గుఱ్ఱం జాషువ స్పృశించిన అంశాలను వివరించండి?**

**జ)** తెలుగు సాహితీ జగత్తులో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్న కవి జాషువ. అనేక రచనలు చేసి కవి కోకిల, కవితా విశారద, మధుర శ్రీనాథ, నవయుగ కవి చక్రవర్తిగా కీర్తింపబడినప్పటికీ తన పేదరికం, కులం కారణంగా సామాజిక వివక్షకు గురైన వ్యక్తి. అందుకే వీరి రచనలలో వీరి ప్రతిభ పాండిత్యాలతో పాటుగా అనుభవించిన వేదన, ఎదుర్కొన్న అవమానాలు అన్ని కనిపిస్తూనే ఉంటాయి. కులమతాల కన్నా మానవత్వానికి ప్రాధాన్యత నిచ్చిన మానవతామూర్తి కనుక వీరి సాహిత్యం కూడా మానవత్వపు పరిమళాలను వెదజల్లుతుంది.

"వినుకొండన్ జనియించితిన్ సుకవితావేశంబు చిన్నప్పుడే
నను పెండ్లాడె మదీయ కావ్యములు నానా రాష్ట్ర సత్కారముల్
గొని కూర్చెన్ సుయశస్సు కల్గుదురు నాకున్ భక్తులై నేనెఱుం
గని వారాంధ్ర ధరాతలాన బహుసంఖ్యల్ సాహితీబాంధవుల్"

అని జాషువా గారు చెప్పినట్లు గానే వారి అభిమానులు, సాహితీ బంధువులు నేడు కోకొల్లలుగా ఉన్నారు. దానికి కారణం జాషువా ప్రతిరచనలో వారి ఆత్మీయత గోచరించటమే. "ముంటాజ మహలు" లో కూడా అనేక అంశాలను స్పృశిస్తూ సమాజానికి కొంత సందేశాన్ని అందించారు.

ఈ రచన ద్వారా జాషువా ప్రధానంగా తెలియజేసింది ప్రేమ యొక్క ఔన్నత్యాన్ని, ఆదర్శ దాంపత్యం ఎలా ఉండాలి అనే విషయాలను. వివాహమై సంవత్సరాలు గడిచినా షాజహాను, ముంటాజ మహలుల మధ్య ప్రేమ ఇసుమంతైనా తగ్గలేదు. పదముగ్గురు సంతానం కలిగినప్పటికీ వారి అనురాగం కొంచెమైనా మారలేదు. లోకానికంతటికీ ఆదర్శవంతంగా వుండేలా అన్యోన్య దాంపత్యాన్ని గడిపారు. వారు భార్యాభర్తలైనప్పటికి గొప్ప ప్రేమికులుగా నాటి నుండి నేటి వరకు ప్రేమికుల

మనస్సులలో నిలిచిపోయారు. అందుకే "తాజ్ మహల్" ప్రేమ చిహ్నంగా గుర్తించబడుతుంది. భార్యాభర్తలు

"ముద్దులరాణి మాటకు విభుండెదురాపడు లేని యానక
మ్ముద్దియ మాఱు పల్కదదెపో సహవాసం"

అనే విధంగా ఉండాలని తెలియజేశారు. ఇంకా ఆ భార్యాభర్తల అనురాగాన్ని

"ఆ సతీపతుల గాఢా శ్లేషముల నుండి
    జారిపోయిన నిమేషంబు లేదు.
ఆ దంపతులకు నాహ్లాదంబు గూర్పక
    తొలఁగిన వెన్నెల తునక లేదు
ఆ ప్రేమ జీవుల యనురాగ వృద్ధికై
    రుత మొనర్పని పరభృతము లేదు
ఆ శుభాకృతులు నెయ్యంపు ముద్దుల జాత
    తీపి కెక్కని ద్రాక్షతీఁగ లేదు
అవధిలేని వారి యానందకేళికిఁ
దోడుపడని పూలదోఁట లేదు
వారి కూర్మి పెంపు వలచి వర్ణనజేసి
సుప్రసిద్ధి గనని సుకవి లేఁడు"          అంటూ వర్ణించారు.

అంత అన్యోన్యంగా ఉన్న ఆ జంటలో నుండి ఒకరిని ఆ మృత్యువు తీసుకెళ్ళగా రెండవవారు ఎంతగా వేదనకు గురవుతారో తెలియజేశారు కవి. షాజహాన్ పాత్ర ద్వారా, భార్యను పోగొట్టుకొన్న పేదవాడి పాత్రద్వారా భార్యా వియోగ దుఃఖంలో ఉన్నప్పటికి తమ ప్రేమను, తమ జీవిత భాగస్వామిని శాశ్వతంగా నిలపాలనే తలంపు వారికి కలగటాన్ని వివరించారు. షాజహాన్ చేత

"ఈవు వసించుచోట వసియింతును నేనును దాచి యుంపుమో
దేవి! యొకింత నేల చనుదెంచెద రేపట మాపటన్ నిరా
శావిషదహ్యమానమయి సౌఖ్య పరాఙ్ముఖమైన యట్టి నా
జీవిత శేష మంకితముఁ జేసెద నీ కవివాహితుండనై"

అనిపించి నిజమైన ప్రేమకలవాడు భార్య చనిపోయినా మరొక వివాహపు ఆలోచన చేయరని తెలియజేశారు.

లోకపు తీరు ఏవిధంగా ఉంటుందో అదీ ముఖ్యంగా కవులు, కళాకారుల పట్ల తోటి పండితులే ఎలా ప్రవర్తిస్తారో తెలియజేశారు.

"అవమతియు లజ్జఁ బెనగొన
స్తవము సలుపు చెట్టు లయినఁ దప్పనిసరియై

'అవునీవు చిత్తముచిత' మని

నవాబునకు మాఱు పల్కి నా రీర్ష్యాళులల్"

అంటూ జాషువా పేదవాడు రాజు చేత స్తుతించబడినప్పుడు సభ లోని వారి తీరు తెలియజేశారు. సమాజంలో ఎక్కువ మంది ఇలాగే ఉంటారు, మనసులో అసూయ ఈర్ష్యలు కలిగుండి పైకి మంచిగా ఉంటారనేది తెలియజేశారు. ఎక్కువ మంది కులపక్షపాతులుగా ఉండటం నాటి నుంచి నేటివరకు జరుగుతున్నదే. అదే అంశాన్ని జాషువా గారు "ధర్మము గణింపక కొందఱు ముచ్చటించి రూరుపులు నిగుడ్చుచుం బతి పరీక్షమునన్ కుల పక్షపాతులై", "యీ పరివ్రాజుకు, దేటి శిల్పి నరపాలకుఁ దేటి పరీక్షకుండు సామాజికు లిందఱుండనని మచ్చరకించిరి కొంద ఱబ్బునన్" అంటూ తెలియజేశారు. ఈ సందర్భంలోనే కవి ఇంకో విషయాన్ని తెలియజేశారు. "ఎన్ని పుస్తకాలు చదివినా రసాన్ని సృష్టించే ప్రజ్ఞా విశేషం చదువు వల్ల రాదని, గురు శుశ్రూషలతోనే అసామాన్య శక్తులు అలవాడవు' అని తెలిపారు. అసూయ పరులున్న దగ్గరే కొందరు ఉత్తములు ఉంటారని తెలియజేశారు. అలాగే కళలు గొప్ప కులస్థులనే కాదు సమాజం అధమ కులస్థులుగా భావించే వారిని వరిస్తాయని తాను అనుభవ పూర్వకంగా తెలుసుకున్న దానిని తెలిపారిలా...

"కళలు మోహించుటొక కులీనులనె కాదు

కులము లేదన్న వానినిఁ గూడ వలచు

సత్కళాదేవతా కటాక్షంబు కతన

సమయు గావుత ముచ్చు నీచతల బెడఁద"

అంటూనే ఆ కళాసరస్వతీ దాసులు ఎందరో ఎవరిని శరణుజొచ్చక ఉన్నవారు ఉన్నారని తెలిపారు.

షాజహాను పాత్ర ద్వారా ప్రజారంజకంగా పాలన చేసే రాజు ఎలా ఉంటాడో చూపారు. శత్రువుల గర్వమణచి వారిలో తమ అధీనంలో ఉంచుకుంటాడు, ఐశ్వర్యంతో తులతూగుతున్నప్పటికీ వ్యసనాల జోలికిపోడు. ప్రజలపై భారం మోపే అనవసర సుంకాలు విధించడు, మత సహనంతో మత విద్వేషాలను రూపుమాపుతాడు. దైవ ప్రార్థన విడువడు. కవులను, కళాకారులను పోషిస్తాడు.

"మత గణంబు వొడమ దతని పాలన మందు

జుట్టు పన్ను పిలక పుట్టలేదు

కుటిల రాజభీతిఁ గుందు భారత భూమి

బెదురుమాని మఱచి నిదురవోయె" అంటూ

అటువంటి రాజు పాలనలో దేశమంతా నిర్భయంగా ఉంటుందని తెలిపారు. అలాగే పరమత సహనం రాజు పాటించక మత విద్వేషి అయితే ఎంత భయంకరంగా ఉంటుందో ఔరంగజేబు పాత్ర ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంలోనే కవి వ్యక్తుల గుణాలు కులం వల్లో, వంశం వల్లో కలగవని

"అతని ముత్తాత సుతునకై యసువు లొసఁగె

నతఁడు దండ్రిని బట్టి బంధితునిఁ జేసె

తాత సౌమ్యుడు మనుమఁ డుద్దండ మూర్తి

గుణములకు వంగడంబు కారణము గాదు" అంటూ తెలిపారు.

రాజభవనాలు సుఖాలకు నిలయాలే, రాణి చాలా సుఖంగా ఉంటుందని చెబుతూనే కవి వారికి స్వేచ్ఛలేని విషయాన్ని సున్నితంగా తెలియజేశారు. "రాణి సౌందర్య లహరి ప్రభువు కన్నులు దాటి యీవలికి రాదు" అనటంలోనే వారి ఘోషా పద్ధతి అర్థమవుతుంది, రాజు తప్ప అన్యపురుషులు వారిని చూడటానికి ఉండదు. అలాగే రాణి మరణించిన సందర్భంలోనూ

"పట్టు పరదాల చీకఁటి వనములందు

ప్రభవమును గాంచి శోభిల్లి రాలిపోయే" అంటారు నర్మగర్భంగా.

జాషువా కవి ఔన్నత్యాన్ని, తెలుగు భాష గొప్పతనాన్ని "కలము నందుకొను కవి వరేణ్యుని మ్రోల / తలలు వంచు శబ్దముల విధాన" అని, "ఏబదా రక్షరంబుల నెసక మెసఁగు / కలికి భాషకు తెలుఁగున కలివిగాక" అంటూ తెలియజేశారు.

ఇంక వేదాంత సంబంధమైన విషయాలను ముంటాజ్ మహలు రాణి మరణ సమయంలో ఆమె నోటివెంట, భార్యావియోగంతో దుఃఖితుడైన షాజహాను మాటల ద్వారా తెలియజేశారు. చరిత్రలో జరిగిన దానికంటే ఎంతో ఉదాత్తంగా ఒక్కో పాత్రను తీర్చిదిద్దారు జాషువా. కరుణ రసాత్మకమైన కావ్యంగా "ముంటాజమహలు" ని రచించి తాజ్‌మహల్ కీర్తికి శాశ్వతత్వాన్ని కల్పించారు.

**ఇంకా రాదగిన ప్రశ్నలు:**

1. పాఠ్యభాగంలోని పాత్రలను పరిచయం చేయండి?
2. జాషువా రచనా విశిష్టతను మీ పాఠ్యభాగమాధారంగా వివరించండి?

**– ఆచార్య ఇరపని మాధవి**

## పాఠం - 13

# కర్పూర వసంతరాయలు

**- డా॥ సి. నారాయణ రెడ్డి**

**విషయసూచిక:**

**13.1.** కవి పరిచయం

**13.2.** పాఠ్యభాగ సందర్భం

**13.3.** సారాంశం

### 13.1. కవి పరిచయం:

సి.నా.రె. గా ప్రసిద్ధికెక్కిన సింగిరెడ్డి నారాయణరెడ్డి ప్రముఖ తెలుగు కవి, సాహితీవేత్త. ఈయన 1931 జూలై 29న కరీంనగర్ జిల్లాలోని మారుమూల గ్రామం హనుమాజీపేటలో జన్మించారు. తండ్రి మల్లారెడ్డి రైతు. తల్లి బుచ్చమ్మ గృహిణి. నారాయణరెడ్డి ప్రాథమిక విద్య గ్రామంలోని వీధి బడిలో సాగింది. బాల్యంలో హరికథలు, జాన పదాలు, జంగం కథల వైపు ఆకర్షితుడయ్యాడు. ఉర్దూ మాధ్యమంలో సిరిసిల్లలో మాధ్యమిక విద్య, కరీంనగర్‌లో ఉన్నత విద్యను అభ్యసించారు. అప్పట్లో తెలంగాణా ప్రాంతంలో తెలుగు ఒక ఐచ్ఛికాంశంగానే ఉండేది. హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ కళాశాలలో ఇంటర్మీడియట్, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బి.ఏ. కూడా ఉర్దూ మాధ్యమంలోనే చదివారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి తెలుగు సాహిత్యంలో పోస్టుగ్రాడ్యుయేట్ డిగ్రీ, డాక్టరేట్ డిగ్రీ పొందారు. వీరు విద్యార్థిగా శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయంలో అనేక గ్రంథాలు చదివారు.

నారాయణరెడ్డి గారిది బాల్య వివాహం. భార్య పేరు సుశీల. ఈ దంపతులకు నలుగురు కుమార్తెలు గంగ, యమున, సరస్వతి, కృష్ణవేణి. నారాయణరెడ్డి గారు తన భార్య మరణానంతరం ప్రతి సంవత్సరం ఆమె పేరు మీద ఔత్సాహిక మహిళా సాహితీ వేత్తలకు అవార్డులు ప్రధానం చేశారు.

నారాయణరెడ్డి గారు ఆరంభంలో సికింద్రాబాద్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అధ్యాపకుడిగా చేరి, అటు తర్వాత నిజాం కళాశాలలో అధ్యాపకుడిగా పని చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పనిచేస్తూ, అనేక ఉన్నత పదవులు, బహుమతులు పొందారు. విశ్వనాథ సత్యనారాయణ తరువాత జ్ఞాన పీఠ్ పురస్కారం పొందిన తెలుగు సాహితీ కారుడు సి.నా.రే నే. వీరి విశ్వంభర కావ్యానికి ఈ అవార్డు లభించింది.

సి.నా.రె. ప్రధానంగా కవి అయినప్పటికీ ఆయన కలం నుంచి పద్య కావ్యాలు, గేయ కావ్యాలు, వచన కవితలు, గద్య కృతులు, చలనచిత్ర గీతాలు, యాత్రా కథనాలు, సంగీత నృత్య రూపకాలు, ముక్తక కావ్యాలు, బుర్ర కథలు, గజళ్ళు, వ్యాసాలు, విమర్శన గ్రంథాలు, అనువాదాలు ఇలా అనేక సాహిత్య ప్రక్రియలు వెలువడ్డాయి. కళాశాల విద్యార్థిగా శోభ పత్రికకు సంపాదకత్వం వహించారు. రోచిన్, సింహేంద్ర పేరుతో ఆ పత్రికలో కవితలు రచించారు. సి.నా.రె. కవిత తొలిసారి

జనశక్తి పత్రికలో అచ్చయింది. విద్యార్థి దశలోనే ప్రహ్లాద చరిత్ర, సీతాపహరణం వంటి పద్య నాటికలు, భలే శిష్యులు తదితర సాంఘిక నాటకాలు రచించారు. 1953వ సంవత్సరంలో నవ్వని పువ్వు సంగీత నృత్య నాటిక ప్రచురితమైంది. ఇది సి.నా.రె. తొలి ప్రచురణ. దీని తర్వాత జలపాతం, విశ్వగీతి, అజంతా సుందరి వెలువడ్డాయి.

వీరి రామప్ప సంగీత నృత్య రూపకం. ఇది అన్ని భారతీయ భాషల్లోకి అనువాదమైంది. అతని పరిశోధనా గ్రంథం "ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు, ప్రయోగములు" అత్యంత ప్రామాణిక గ్రంథంగా పేరు పొందింది. సి.నా.రె. గ్రంథాలు ఇంగ్లీష్, ఫ్రెంచ్, సంస్కృతం, హిందీ, మలయాళం, ఉర్దూ, కన్నడం మొదలైన భాషల్లోకి అనువాదమయ్యాయి. అతనే స్వయంగా హిందీ, ఉర్దూ భాషల్లో కవితలు రాశారు. అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, రష్యా, జపాన్, కెనడా, ఇటలీ, డెన్మార్క్, థాయ్‌ల్యాండ్, సింగపూర్, మలేషియా, మారిషస్, యుగోస్లావియా, ఆస్ట్రేలియా, గల్ఫ్ దేశాలను సందర్శించారు. 1990వ సంవత్సరంలో యుగోస్లావియాలోని స్రూగాలో జరిగిన అంతర్జాతీయ కవి సమ్మేళనంలో భారతీయ భాషల ప్రతినిధిగా పాల్గొన్నారు.

రచనా రంగంలోనే కాకుండా వీరికి పత్రికా రంగంలో కూడా ప్రమేయం ఉంది. స్రవంతి సాహిత్య మాసపత్రికకు వేమూరి. ఆంజనేయశర్మ, చిర్రావూరి సుబ్రహ్మణ్యంతో పాటూ సి.నా.రె. గారు ప్రధాన సంపాదకులుగా పనిచేశారు. వీరి సంపాదకత్వంలో స్రవంతి పత్రిక ప్రముఖ సాహిత్య పత్రికగా కీర్తిగాంచింది.

**రచనలు:**

| | |
|---|---|
| 1. గేయనాటికలు | : నవ్వని పువ్వు, అజంతా సుందరి |
| 2. గేయ కావ్యాలు | : నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, జాతి రత్నం, విశ్వనాథ నాయకుడు, ఋతు చక్రం |
| 3. ఖండ కావ్యాలు | : జలపాతం, దివ్వెల మువ్వలు |
| 4. గేయ రూపకాలు | : రామప్ప, తరతరాల వెలుగు |
| 5. కవితా సంపుటాలు | : అక్షరాల గవాక్షాలు, మధ్య తరగతి మందహాసం, మంటలూ-మానవుడూ, ఉదయం నా హృదయం, మార్పు నా తీర్పు, ఇంటిపేరు చైతన్యం, రెక్కలు, నడక నా తల్లి, కాలం అంచు మీద, కవిత నా చిరునామా, నిరంతరం, ఆరోహణ, దృక్పథం, కలం సాక్షిగా మొ॥. |
| 6. సమగ్ర వచన కావ్యం | : విశ్వంభర |
| 7. దీర్ఘ కావ్యాలు | : భూమిక, మట్టీ మనిషి ఆకాశం |
| 8. విశిష్ట కావ్యం | : ప్రపంచ పదులు |
| 9. ముక్తక కావ్యం | : సమ దర్శనం |
| 10. వ్యాస సంపుటాలు | : తెలుగు గజళ్ళు, వ్యాసవాహిని, సమీక్షణం, మావూరు మాట్లాడింది. |
| 11. అనుసృజన రచనలు | : మీరాబాయి, శిఖరాలు – లోయలు. |

12. పరిశోధన గ్రంథం : 'ఆధునికాంధ్ర కవిత్వం - సంప్రదాయములు, ప్రయోగములు'
13. యాత్రా రచనలు : సోవియట్ రష్యాలో పది రోజులు, పాశ్చాత్య దేశాల్లో యాభై రోజులు
14. చలనచిత్ర గేయ సంకలనం : పగలే వెన్నెల
15. సినిమా పాటల విశ్లేషణ : "పాటలో ఏముంది, నా మాటలో ఏముంది".

**పురస్కారాలు:**

1. 1988వ సంవత్సరానికి ప్రతిష్ఠాత్మకమైన జ్ఞానపీఠ్ పురస్కారం
2. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం
3. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం
4. భారతీయ భాషా పరిషత్ పురస్కారం
5. రాజ్యలక్ష్మీ పురస్కారం
6. సోవియట్ - నెహ్రూ పురస్కారం
7. అసాన్ పురస్కారం
8. 1977వ సంవత్సరంలో పద్మశ్రీ పురస్కారం
9. 1992వ సంవత్సరంలో పద్మభూషణ్ పురస్కారం
10. ఆంధ్ర, కాకతీయ, డా॥ బి.ఆర్. అంబేద్కర్, మీరట్, నాగార్జున విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లు
11. డా॥ బోయి భీమన్న జీవిత సాఫల్య పురస్కారం
12. ఉత్తమ పాటల రచయిత - 'ఇదిగో రాయలసీమ గడ్డ (సీతయ్య) పాటకు నంది అవార్డు.
13. 2011వ సంవత్సరంలో తెలుగు విశ్వవిద్యాలయం నుండి సాంస్కృతిక రంగంలో విశిష్ట పురస్కారం.

**పదవులు:** సి.నా.రె. గారు విద్యారంగంలోనూ, పాలనాపరంగానూ ఎన్నో పదవులు నిర్వహించారు.

1. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు (1981)
2. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు (1985)
3. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు (1989)
4. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల సలహాదారు (1992)
5. రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షుడిగా ఏడేళ్ళు పనిచేశారు.
6. భారత రాష్ట్రపతి సి. నారాయణరెడ్డి గారిని 1997వ సంవత్సరంలో రాజ్యసభకు నామినేట్ చేశారు. ఆరేళ్ళ పాటు సభలో ఆయన ప్రసంగాలు, చర్చలు, ప్రస్తావనలు అందరి మన్ననలనూ అందుకున్నాయి.
7. 1993వ సంవత్సరం నుంచి ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడిగా విలక్షణ కార్యక్రమాలు రూపొందించి తెలుగు

భాషా సాహిత్య సాంస్కృతిక అభ్యుదయానికి తోడ్పడ్డారు.

**సినిమా పాటలు:**

సి. నారాయణరెడ్డి గారు 1962వ సంవత్సరంలో వచ్చిన గులేబకావళి కథలోని పాటల ద్వారా సినిమా రంగంలోకి అడుగుపెట్టారు. "నన్ను దోచుకుందువటే వెన్నెల దొరసాని" పాటతో పేరు పొందారు. తర్వాత కాలంలో చాలా సినిమాలకు మూడు వేలకు పైగా పాటలు రాశారు.

ఇలా తెలుగు భాషకు, సాహిత్యానికి, సినిమా రంగానికి విశిష్ట సేవలు చేసిన సి.నా.రె. గారు 2017 జూన్ 12 న స్వర్గస్తులయ్యారు.

## 13.2. పాఠ్యభాగ సందర్భం:

క్రీ.శ. 1386 నుండి 1402వ సంవత్సరం వరకు కొండవీడును రాజధానిగా చేసుకొని ఆంధ్రదేశాన్ని పాలించిన ప్రభువు కుమారగిరి రెడ్డి. ఇతను స్వయంగా పండితుడు, కవి. వసంతరాజీయం అనే నాట్యశాస్త్ర గ్రంథాన్ని రచించాడు. మల్లంపల్లి సోమశేఖర శర్మగారు రాసిన History of Reddy's Kingdoms అనే గ్రంథంలో కుమార గిరి రెడ్డికి కర్పూర వసంతరాయలు అన్న బిరుదు ఉన్నట్లు పేర్కొన్నారు. 'కుమారగిరి రెడ్డి ప్రతి సంవత్సరం 9 రోజులు వసంతోత్సవాలు నిర్వహిస్తుండేవాడు. పంజాబ్ నుంచి కర్పూరాన్ని, గోవా నుంచి కుంకుమ ద్రవ్యాలను తెప్పించి, ఆ 9 రోజులు జనులపై వెదజల్లుతుండేవాడు. అందుకే అతనిని కర్పూర వసంతరాయలుగా పిలిచేవారు' అని మల్లంపల్లి సోమశేఖర శర్మగారు తన గ్రంథంలో వివరించారు. ఈ మల్లంపల్లి వారి పరిశోధనా గ్రంథాన్ని చదివి, తద్వారా కుమారగిరి రెడ్డికి కర్పూర వసంతరాయలు బిరుదు ఉందని తెలుసుకున్న నారాయణ రెడ్డి గారు మనసుపడి అతనిపై ' కర్పూర వసంతరాయలు' అనే కావ్యం రాసి, 1957వ సంవత్సరంలో ప్రచురించారు. ఈ కావ్యాన్ని మల్లంపల్లి సోమశేఖర శర్మ గారికి అంకితమిచ్చి ఆ మహానుభావుని ఋణం తీర్చుకున్నారు.

## 13.3. సారాంశం:

డా॥ సి. నారాయణ రెడ్డి గారి 'కర్పూర వసంతరాయలు' కావ్యం కొండవీడులో వసంతోత్సవ సంబరాలతో మొదలవుతుంది. మహారాజు కుమారగిరి రెడ్డి, అతని మహారాణి, ఆమె సోదరుడు కాటయ వేముడు ఉద్యానవనానికి వస్తారు. కొండవీడు ఆ రాత్రి అచ్చం కైలాసంలా ఉందట. సాయంకాలం లకుమ నాట్యం, లకుమ కళాలక్ష్మి, ఆమె నాట్యం అద్భుతం. ఆమె అందం చూసి రాజు మంత్రముగ్ధుడవుతాడు. లకుమ తప్ప 'ఇంకెవరూ మహారాజుకు కనిపించరు. రత్నహారం లకుమకు బహూకరించేందుకు వేదిక పైకి వస్తాడు కుమారగిరి రెడ్డి. లకుమ వినమ్రంగా ముందుకు వస్తుంది. ఆమె మెళ్ళో పూలదండ వేస్తాడు రాజు. ఆ క్షణంలో ఆయన చేతులు కూడా ఆమెకు అలంకారమయ్యాయి. మహారాణి నవ్వుకుంటుంది. లకుమా కుమారగిరిల పరిచయం అలా జరుగుతుంది.

లకుమని చూసిన ప్రభువు, అతని సత్కారం అందుకున్న లకుమ ఇద్దరూ నిదురలేక కలలు కంటారు. రాజ్యం విషయం ప్రభువుకు గుర్తురాని స్థితి. ఇక తాళలేక, కాటయవేమను పిలిపించి లకుమని ఆస్థాన నాట్యకత్తెగా నియమించాలని తన అభిమతం చెబుతాడు. కాటయవేముడు బదులేమీ చెప్పడు. అతని మౌనానికి అర్థం ఏమిటని అడిగితే, కాటయవేముడు లౌక్యంగా ముహూర్తమెప్పుడా అని ఆలోచిస్తున్నానని చెబితే కుమారగిరి సంతసిస్తాడు.

లకుమ ఆస్థాన నాట్యకత్తెగా నియమితురాలవుతుందన్న వార్త విన్న లకుమ ఉత్సాహానికి హద్దుల్లేవు. అదే వార్త విన్న మహారాణి భయోత్పాదానికి గురైంది.

రాణికా వార్త క
ల్పనెలంత చెవులలో
ఖరఖరుని అశ్వరిం
ఖల చప్పుడుగ తోచె.

లకుమ రాజనర్తకి అవుతుంది. అప్పుడు –

రేనిలో వెల్తురుల మేడలు
రాణిలో తిమిరంపు నీడలు
కాటవేమునిలో రెండును
కలసిపోయిన సందెజాడలు.

ఆమె నాట్యాన్ని ఆస్వాదించాలనుకుని రాజు తీర్థాటనం సంకల్పిస్తాడు. తనొక రథంలో బయల్దేరుతాడు. పక్కన మహారాణి లేదు. రాజు రథం వెనుక ఇంకో రథం. అందులో ఆమె లేదు. పైపెచ్చు ఆ రథంలో లకుమ ఉంది.

రాజు పుణ్యక్షేత్రాలను దర్శిస్తూ, లకుమ నాట్యవిలాసాలను చూడడంలో మునిగిపోతాడు. వారిద్దరి మధ్య ప్రణయం పెరుగుతుంది. మహారాణికి చెడ్డ కలలు వస్తాయి. ఆమె దుఃఖానికి అంతు లేదు.

కొండవీటికి తిరిగి వస్తాడు రాజు. ఈ సారి రథంలో వెళ్ళేటప్పట్లాగా ఆయన ఒక్కడే లేడు. పక్కన లకుమ ఉంది. ఈ దృశ్యాన్ని తన మందిరంలో నుండి చూసిన రాణి వణికిపోయింది.

రాజ్యవ్యవహారాలను రాజు పట్టించుకోడు. లకుమకు కేళీమందిరం నిర్మిస్తాడు. ‘ వసంత రాజీయం’ రచన, లకుమే అతని ప్రపంచం.

ఇరువురు చదరంగమాడు
దురు ఎంతో కక్షబూని
ఎవరోడిన చివరికీ బిగి
కవుగిలింత శిక్షయౌను.

రాజ్యపాలనా, సంరక్షణాభారం కాటయ వేముడిదే. కాటయ వేముడు విజయనగరంపై యుద్ధం గురించి చెప్తే రాజు పౌరుషంతో తనే యుద్ధానికి నేతృత్వం వహిస్తానని అంటూ మాట మధ్యలో ఆగిపోతాడు. ఎందుకంటే –

లకుమ కాలిగజ్జెలు ము
క్త కంఠమ్ముతో పిలిచెను
రేనిలోని పౌరుషాగ్ని
జాను వెన్నెలై నిలిచెను.

కాటయ వేముడు సూక్ష్మగ్రాహి. మరొక్క మాట మాట్లాడక యుద్ధానికి బయల్దేరుతాడు.

కుమారగిరి లకుమతో సల్లాపాలు కొనసాగించాడు. అతని పరిస్థితి ఎలా ఉందంటే –

ఆమె కన్నులు విరిసి

నంతసే పతడు పగలనుకొనును.

ఆమె కన్నులు మోడ్చి

నపుడె రాతిరి యయ్యెననుకొనును.

మహారాజుకు లకుమ తప్ప వేరే ధ్యాస లేదు. ప్రజలు, పరిపాలన, మహారాణి ఎవరూ అతని కంటికి అగుపించరు. రాజ్య భారమంతా కాటయ వేముడి భుజస్కందాల మీదే పడుతుంది. అతను మహారాణికి తోడబుట్టినవాడే. సోదరి, అంటే మహారాణి దుఃఖం చూడలేక కాటయ వేముడు రాజుని ఒకసారి ఆస్థానానికి రావలసిందిగా ఒప్పిస్తాడు.

కాటయవేమునికిచ్చిన మాటకు కట్టుబడి బహుకాలానంతరం సభకు వస్తాడు రాజు. సభలో ఆసీనుడైవుండగా లకుమకు కాలు బెణికిందన్న వార్తను వింటాడు. దిగ్గున లేచి సభ నుండి లకుమ వద్దకు వెళ్ళిపోతాడు. సభాసదులు విస్మయం చెందుతారు. కాటయవేముడికి దిక్కు తోచదు. మహారాణికి ఈ విషయం తెలుస్తుంది. ఆమెకు అంతులేని ఖేదం. ఇక ఉపేక్షించడం భావ్యం కాదనుకుని సోదరుడైన కాటయవేముడుతో తన బాధను పంచుకుంటుంది లా –

ఆటకత్తెల నాదరించుట

అధిపులకు ధర్మమ్మె కానీ

వారి అడుగుల మ్రోల బ్రతుకుల

ధారవోయుట యేటి న్యాయము?

కేళికామందిరము కన్నను

ఓలగమ్ము పవిత్రమయినది

వ్యక్తికన్నను దేశ సౌభా

గ్యమ్ము ఆదర్శపాత్రమయినది.

కాటయ వేముడికి ఆమెనెలా ఓదార్చాలో తెలియలేదు. ఆమె వద్ద నుండి వెళ్ళి రాజును కలుస్తాడు. మహారాణి పడుతున్న వ్యథను చెప్తాడు. ఆమెను ఓదార్చమని రాజుకు సలహా ఇస్తాడు. కాటయ వేముడు వెళ్ళిన తర్వాత అతని మాటలు చాటుగా విన్న లకుమ కూడా మహారాణి వద్దకు వెళ్ళమని రాజుకు సలహా యిస్తుంది. రాజుకు ఆ మాటలు రుచించవు. రాణి అంటే గౌరవమే కానీ ఆమెకు దూరంగా ఉండటమే తనకు సౌఖ్యమంటాడు. దేశమేమైనా సరే నిన్ను వదిలి పోను అని రాజు లకుమతో అంటాడు. తన ప్రయత్నం ఫలించలేదని రాణితో కాటయ వేముడు చెప్తాడు.

రాణికి ఏం చేయాలో ఊహకందదు. సగం రాత్రి తర్వాత ఆమెకో ఆలోచన తడ్తుంది. వెంటనే ప్రభువు ఉండే కేళీ సౌధానికి వెళ్తుంది. మెల్లగా తలుపు తట్టి లకుమను పిలుస్తుంది. లకుమ పాదాలపై పడ్తుంది రాణి. లకుమ ఆశ్చర్యపోయి తను ఎంత పాపినో అంటుంది. రాణి తన రాకకు కారణం చెప్తుంది. ప్రభువు నిన్ను ఆదరించినందుకు పరితపించనుగానీ దేశాన్ని

ఉపేక్షించటాన్ని భరించలేను అంటుంది రాణి. సమస్యకు పరిష్కారం కూడా ఆమే సూచిస్తుంది.

భూపతిని ఎటులైన విడిపో

వుటయె నీకు అవశ్యమమ్మా!

అని లకుమతో చెబుతుంది.

లకుమ ఇరకాటంలో చిక్కుకుంటుంది. అటు రాజ్యం, ఇటు రాజు. లకుమయే లోకం అనుకునే ప్రభువును విడిచి వెళ్తే అతడు పిచ్చివాడవటం ఖాయం. అంతేకాక రాజ్యాన్ని, రాణినీ తన కోసం వదిలిపెట్టిన రాజును తనెలా వదలగలదు? రాణికి ఇచ్చిన మాటనెలా తీర్చాలా అని లకుమ మథనపడుతుంది. రాత్రంతా ఆమెకు రకరకాల ఆలోచనలు. తెల్లవారేసరికి-

లకుమలో నొక వజ్ర సంక

ల్పమ్ము వేళ్ళను దన్ని లేచెను.

కుమారగిరి ముందట నాట్యము చేస్తూ లకుమ పిడిబాకుతో పొడుచుకుంటుంది. ఆ పిడిబాకులో ఒక పత్రం ఉంటుంది. అందులో రాజుకు - రాజ్యం ముఖ్యమని, తనని మరచిపొమ్మని రాజుకు చెప్పిన సమాచారం ఉంటుంది.

లకుమ త్యాగము నిరుపమానము. అందువల్లే -

నేటికిని లకుమ అందెల ఝుణత్కారములు

వినిపించు కొండవీటను వీచు వాయువులు.

- అలా ముగుస్తుంది కావ్యం.

ఈ కావ్యం సినారె గారికి ఎంతో ఖ్యాతి నార్జించింది. కావ్యమంతా హాయిగా చదువనిస్తుంది.

- డా॥ టి. ఓగేశ్వరరావు

**పాఠం - 14**

# కర్పూర వసంతరాయలు

**- డా॥ సి. నారాయణ రెడ్డి**

**విషయసూచిక:**

**14.1. కఠిన పదాలకు అర్థాలు**

**14.2. సందర్భ సహిత వాక్యాలు**

## 14.1. కఠిన పదాలకు అర్థాలు:

| | |
|---|---|
| కైవారములు | = జయ జయ ధ్వానాలు |
| దుగ్ధ సాగర | = పాల సముద్రం |
| ఉచ్చైశ్రవము | = దేవేంద్రుని ఆశ్వరాజము |
| దంతావళము | = ఏనుగు |
| హయదళమ్ము | = అశ్విక దళము |
| కిసల | = చిగురుటాకు |
| ఇక్షుధన్వుడు | = మన్మథుడు |
| లాజలు | = పేలాలు |
| మూర్థము | = తల, శిరస్సు |
| సంకుమద | = జవ్వాది |
| మరుడు | = మన్మథుడు |
| పూవిల్తుడు | = మన్మథుడు |
| మురజము | = మృదంగము |
| ఝుం ఝూ | = వానగాలి |
| హరిణ | = జింక |
| అనిమిషాంగన | = దేవతాస్త్రీ |
| ఖరకరుడు | = సూర్యుడు |
| ఓలగము | = రాజు కొలువు |
| ఏకిమినీడు | = రాజు. |

## 14.2. సందర్భ సహిత వాక్యాలు:

**(1) మిమ్ముబోటి రసజ్ఞులే రూపమ్ము నిల్పినవారు సుమ్మా.**

**వాక్య పరిచయం:** ఈ వాక్యం డా॥ సి. నారాయణ రెడ్డి గారిచే రచించబడిన 'కర్పూర వసంతరాయలు' కావ్యం నందలి ప్రథమాశ్వాసం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** కొండవీడు నందు వసంతోత్సవాల సమయంలో కుమారగిరి రెడ్డి విలాసాన్ని వివరించే సందర్భములోనిది ఈ వాక్యం.

**భావం:** కొండవీటి రాజైన కుమారగిరి రెడ్డి సుదూర ప్రాంతాల నుంచి కర్పూరం, కుంకుమాది ద్రవ్యాలను తెప్పించి వసంతోత్సవాలను ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తాడు. రాజ్యం నలుమూలల నుండి జనులు కొండవీడు వచ్చి ఈ ఉత్సవాలలో పాల్గొంటారు. కుమారగిరి రెడ్డి, అతని భార్య ఈ ఉత్సవాలలో ప్రధాన ఆకర్షణ. ఈ ఉత్సవాలలో పాల్గొన్న కుమారగిరి రెడ్డి విలాసాన్ని వర్ణిస్తూ, అతని బావమర్ది కాటయ వేముడు. శివుని మూడవ కంటి అగ్నిజ్వాలలో రూపాన్ని కోల్పోయిన మన్మథునికి నీ వంటి వారే రూపం' అని కీర్తిస్తాడు.

**(2) కొండవీడానాటి వెండి వెన్నెలలోన కనిపించె నచ్చముగ కైలాస గిరి వోలె.**

**వాక్య పరిచయం:** ఈ వాక్యం డా॥ సి. నారాయణ రెడ్డి గారిచే రచించబడిన 'కర్పూర వసంతరాయలు' కావ్యం నందలి ప్రథమాశ్వాసం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** కొండవీడు నందు ప్రభువు కుమారగిరి రెడ్డి నిర్వహించిన వసంతోత్సవాల సందర్భంలో కొండవీటి సౌందర్యాన్ని, ప్రజల ఆనందోత్సాహాలను వివరించే సందర్భంలోనిది ఈ వాక్యం.

**భావం:** కొండవీటి రాజైన కుమారగిరి రెడ్డి ప్రతిసంవత్సరం చైత్ర పూర్ణిమ నుండి తొమ్మిది రోజులు తన రాజ్యంలో వసంతోత్సవాలను నిర్వహిస్తాడు. ఆ సమయంలో కొండవీడు కర్పూర, కుంకుమాది ద్రవ్యాల సుగంధాలతో, జనులు ఆనందోల్లాసాలతో దీపాల కాంతులతో పండు వెన్నెలను తలపిస్తుంది. ఈ సందర్భంలో కొండవీడు కైలాసాన్ని తలపిస్తుందని భావం.

**(3) దండతో పాటు కరదండయుగళము గూడ లకుమ గళమందున అలంకరణమై పోయె.**

**వాక్య పరిచయం:** ఈ వాక్యం డా॥ సి. నారాయణ రెడ్డి గారిచే రచించబడిన 'కర్పూర వసంతరాయలు' కావ్యం నందలి ప్రథమాశ్వాసం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** వసంతోత్సవాలతో లకుమ నృత్యాన్ని చూసి కుమారగిరి రెడ్డి ముగ్ధుడవుతాడు. రత్నహారాన్ని ఆమె మెడలో అలంకరిస్తాడు. ఆ సందర్భంలోనిది ఈ వాక్యం.

**భావం:** కొండవీటి వసంతోత్సవాలలో లకుమ నృత్యం చేస్తుంది. ఆ నృత్యాన్ని చూసిన కుమారగిరి రెడ్డి సమ్మోహనంలో మునిగిపోతాడు. అతని కంటికి అప్పుడు మహారాణి, కాటయ వేముడు, జనులు ఎవరూ కనిపించరు. ఎటు చూసినా లకుమే. ఆమె నాట్యానికి పరవశుండై రత్నహారాన్ని ఆమె మెడలో అలంకరిస్తాడు. ఆ సందర్భంలో ఆ హారాన్ని అలంకరించడానికి రాజు తన రెండు చేతులను ముందుకు చాపి, లకుమ మెడ చుట్టూ ఉంచుతాడు. అప్పుడు రాజు చేతులు కూడా లకుమ మెడలో పూల దండ మాదిరిగా ఇమిడిపోయాయని భావం.

**(4) సాగిపోయెను కోటి తారాస్థగిత గగనజగత్తలమ్మున.**

**వాక్య పరిచయం:** ఈ వాక్యం డా॥ సి. నారాయణ రెడ్డి గారిచే రచించబడిన 'కర్పూర వసంతరాయలు' కావ్యం నందలి ద్వితీయాశ్వాసం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** కొండవీటి వసంతోత్సవాల్లో లకుమ నాట్యాన్ని చూసిన కుమారగిరి రెడ్డి ఆమె స్మృతుల నుంచి బయట పడలేక విరహవేదన అనుభవిస్తాడు. ఆమెను తల్చుకుంటూ నిద్రా జగత్తులో దివ్యలోకాలను సందర్శించే సందర్భంలో రచయిత ఈ వాక్యాన్ని ప్రయోగించారు.

**భావం:** లకుమ నృత్యం, అందం చూసిన కుమారగిరిరెడ్డి ఆమెను తన హృదయాంతరాళంలో ప్రతిష్ఠించుకుంటాడు. ఆమెను తల్చుకుంటూ నిద్రిస్తాడు. ఆమెతో కలసి తాను దివ్యలోకాలను సందర్శిస్తాడు. లకుమ కుమారగిరికి కణ్వ ఆశ్రమంలో శకుంతల మాదిరిగా కనిపిస్తుంది. ఆమెను మనస్సు నిండా నింపుకొని ఊహాలోకంలో విహరిస్తాడు.

**(5) రేయి వెలసిపోయి వెల్గు రేకలు విచ్చెను తూర్పున.**

**వాక్య పరిచయం:** ఈ వాక్యం డా॥ సి. నారాయణ రెడ్డి గారిచే రచించబడిన 'కర్పూర వసంతరాయలు' కావ్యం నందలి ద్వితీయాశ్వాసం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** కొండవీటి వసంతోత్సవాలలో లకుమ నాట్యం చూసి, మెచ్చి కుమారగిరి రెడ్డి ఆమె మెడలో రత్నహారాన్ని స్వయంగా అలంకరిస్తాడు. రాజు యొక్క రూపాన్ని చూసి లకుమ అతనిలో మన్మథున్ని దర్శిస్తుంది. అతనిని తలచుకుంటూ రకరకాల ఊహలతో రాత్రాంతా జాగారం చేస్తుంది. ఈ సందర్భంలో రచయిత ఈ వాక్యాన్ని ప్రయోగించాడు.

**భావం:** వసంతోత్సవాల్లో కుమారగిరి రెడ్డిని చూసిన లకుమ అతనిని తన మనస్సు నిండా నింపుకుంటుంది. అతనిలో మన్మథుడిని దర్శిస్తుంది. శివుడి ముందు తాను మోకరిల్లగా ఆ శివుని మెడలో పాము తన శరీరంపై ప్రాకినట్లు కలవరపాటుకు గురవుతుంది. శివుడిలో తన రాజును దర్శించి, తాను పార్వతిగా ఊహించుకుంటుంది. అంతలోనే తూర్పు దిక్కున సూర్యుడు ఉదయిస్తాడు.

**(6) రాణి కా వార్త కల్వనెలంత చెవులలో ఖరకరుని అశ్వరింఖల చప్పుడుగ తోచె.**

**వాక్య పరిచయం:** ఈ వాక్యం డా॥ సి. నారాయణ రెడ్డి గారిచే రచించబడిన 'కర్పూర వసంతరాయలు' కావ్యం నందలి ద్వితీయాశ్వాసం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** కుమారగిరి రెడ్డి లకుమను ఎప్పుడు తన ముందు ఉండే విధంగా ఆమెను ఆస్థాన నర్తకిగా నియమించాలనుకుంటాడు. తన మనస్సులో మాటను తన బావ కాటయవేమునికి చెబుతాడు. దానికి అతను కూడా అంగీకరిస్తాడు. ఆ విషయం తెలిసిన లకుమ, మహారాణిల యొక్క మానసిక స్థితిని వివరించే సందర్భంలోనిది ఈ వాక్యం.

**భావం:** కుమారగిరి రెడ్డి లకుమను ఆస్థాన నర్తకిగా నియమించాడని, అందుకు కాటయ వేముడు కూడా అంగీకరించాడని తెలుసుకున్న లకుమ తనపై చల్లని వెన్నెల కురిసినట్లు భావిస్తుంది. అదే సమయంలో మహారాణికి అది సూర్యుని గుర్రాల చప్పుడు మాదిరిగా (అనగా తీవ్రమైన వేడిమి) భావిస్తుంది.

**(7) తనదు తాండవనృత్య సమయము తానె మరచి శివుండు చూడగ.**

**వాక్య పరిచయం:** ఈ వాక్యం డా॥ సి. నారాయణ రెడ్డి గారిచే రచించబడిన 'కర్పూర వసంతరాయలు' కావ్యం నందలి తృతీయాశ్వాసం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** తీర్థయాత్రలో భాగంగా లకుమ, కుమారగిరి. ద్రాక్షారామం భీమేశ్వర స్వామిని దర్శిస్తారు. ఒకరోజు సాయంత్రం కుమారగిరి లకుమను భీమేశ్వరస్వామి దేవాలయం ముందు నాట్యం చేయమంటాడు. ఆ సందర్భంలో ఆమె నాట్యాన్ని వర్ణిస్తూ కవి చెప్పిన వాక్యం ఇది.

**భావం:** ద్రాక్షారామం భీమేశ్వరుని ముందు లకుమ నాట్యం చేస్తుంది. ఆ నాట్యం చూసిన కుమారగిరి రెడ్డి పరవశుడవుతాడు. ఆమె నాట్యం చూసిన శివుడు తన తాండవ నృత్యం మరచిపోయి లకుమ నాట్యానికి ముగ్ధదయ్యాడా! అనే విధంగా లకుమ నాట్యం ఉంది అని భావం.

**(8) లకుమ నడచెను పాలవెల్లి తరంగముల ఊర్వశి విధమ్మున.**

**వాక్య పరిచయం:** ఈ వాక్యం డా॥ సి. నారాయణ రెడ్డి గారిచే రచించబడిన 'కర్పూర వసంతరాయలు' కావ్యం నందలి తృతీయాశ్వాసం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** కుమారగిరి రెడ్డి లకుమను ఆస్థాన నర్తకి పదవినిచ్చి గౌరవిస్తాడు. ఆమెను నిండు సభలో సత్కరిస్తాడు. ఆ సత్కారాన్ని స్వీకరించే సమయంలో లకుమ విలాసాన్ని వివరించే సందర్భంలోనిది ఈ వాక్యం.

**భావం:** కుమారగిరి రెడ్డి నిండు కొలువులో లకుమను ఆస్థాన నర్తకిగా నియమించినట్లు ప్రకటిస్తాడు. ఆమెకు చీనిచీనంబరాలు వివిధ రకాల ఆభరణాలు సభాముఖంగా ఇచ్చి గౌరవిస్తాడు. వాటిని స్వీకరించే సమయంలో లకుమ ఊర్వశిలా కనిపిస్తుంది.

**(9) అచట కొండవీటి రాణి అతి వికృత స్వప్నమున కలవరించె.**

**వాక్య పరిచయం:** ఈ వాక్యం డా॥ సి. నారాయణ రెడ్డి గారిచే రచించబడిన 'కర్పూర వసంతరాయలు' కావ్యం నందలి తృతీయాశ్వాసం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** కుమారగిరి రెడ్డి లకుమను తీసుకొని తీర్థయాత్రలకు వెళ్తాడు. ఇద్దరూ రకరకాల దేవాలయాలను సందర్శిస్తూ, ఒకరికొకరు దగ్గరవుతారు. అంతఃపురంలో మహారాణి వారిద్దరిని చూసి కలవరపాటుకు గురవుతుంది. ఆమెకు పీడకలలు వస్తాయి.

**భావం:** కొండవీటిలోనున్న రాణికి భయంకరమైన కలలు వచ్చి కలవరించింది.

**(10) ప్రజ లేవిధాన గుజగుజవోయిరి తలకొక్క రీతి వ్యాఖ్యలు చేసిరి.**

**వాక్య పరిచయం:** ఈ వాక్యం డా॥ సి. నారాయణ రెడ్డి గారిచే రచించబడిన 'కర్పూర వసంతరాయలు' కావ్యం నందలి చతుర్థాశ్వాసం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** కుమారగిరి రెడ్డి, లకుమ తీర్థయాత్రలను ముగించుకొని కొండవీడుకు తిరిగి వస్తారు. ఆ సమయంలో వారిరువురు ఒకరి ప్రక్కన మరొకరు భార్యాభర్తల వలె కూర్చుంటారు. వారిని చూసి పురజనులు వివిధ రకాలుగా తమలో తాము అనుకుంటున్న సందర్భంలోనిది ఈ వాక్యం.

**భావం:** కుమారగిరి రెడ్డి, లకుమ ఒకే రథంపై భార్యాభర్తలు మాదిరిగా ప్రక్కప్రక్కన కూర్చొని కొండవీటి విధుల్లో తిరగడం చూసిన ప్రజలు ' రాణి కూర్చోవలసిన స్థానంలో ఒక నర్తకి కూర్చోవడం ఏమిటి? జనుల సమక్షంలో మహారాజు ఇలా అన్య స్త్రీతో ఉండవచ్చునా" ఇలా పలు రకాలుగా చర్చించుకుంటారు.

**(11) రేనిలోని పౌరుషాగ్ని జానువెన్నెలై నిలిచెను.**

**వాక్య పరిచయం:** ఈ వాక్యం డా॥ సి. నారాయణ రెడ్డి గారిచే రచించబడిన 'కర్పూర వసంతరాయలు' కావ్యం నందలి చతుర్థాశ్వాసం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** లకుమే సర్వస్వంగా కాలం వెళ్ళదీస్తున్న కుమారగిరి వద్దకు అతని బావ, ప్రధానమంత్రి కాటయ వేముడు వచ్చి తమ రాజ్యానికి విజయనగర, బహమనీ రాజ్యాలు వలన ప్రమాదం పొంచి ఉందని వేగుల వలన తెలుస్తుందని చెబుతాడు. ఆ మాటలు విన్న కుమారగిరి పౌరుషంతో యుద్ధానికి సిద్ధం కమ్మని, యుద్ధానికి తానే నాయకత్వం వహిస్తానని చెప్పి, లకుమ గుర్తుకు రావడంతో వెనుకకు తగ్గిపోతాడు. ఈ సందర్భంలోనిది వాక్యం.

**భావం:** రాజ కార్యాలకు దూరంగా లకుమ నాట్యాన్ని చూస్తూ ఆస్వాదిస్తూ కుమారగిరి కాలం వెళ్ళదీస్తాడు. అంతలో విజయనగర పాలకుడైన హరిహరరాయలు, బహమనీ రాజు ఫిరోజ్ షా కొండవీటిని ఆక్రమించు కోవడానికి ప్రయత్నిస్తున్నారని వేగుల వలన సమాచారం వస్తుంది. ఆ విషయాన్ని కాటయ వేముడు కుమారగిరికి చెబుతాడు. వెంటనే పౌరుషంతో విజయనగరంపై యుద్ధానికి సిద్ధం కమ్మని, తానే యుద్ధానికి నాయకత్వం వహిస్తానని కాటయ వేముని ఆదేశిస్తాడు. అంతలోనే లకుమ గుర్తుకు వచ్చి, ఆమె కాలిగజ్జెల చప్పుడు విని వెనకడుగు వేస్తాడు. అతనిలో పౌరుషం చల్లబడుతుంది.

**(12) ఓటుపడుచు రాయం డానాటి నిశీథము నీడ్చెను.**

**వాక్య పరిచయం:** ఈ వాక్యం డా॥ సి. నారాయణ రెడ్డి గారిచే రచించబడిన 'కర్పూర వసంతరాయలు' కావ్యం నందలి చతుర్థాశ్వాసం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** కుమారగిరి రెడ్డి బహుకాలం పాటు రాజస్థానానికి దూరంగా లకుమ వద్దనే ఉండిపోతాడు. దీనితో రాజ్యంలో కల్లోలము పుడుతుంది. మహారాణి మనోవేదన మానసిక వ్యాధిగా మారుతుంది. రాజ్యంలో జనులు తమ ప్రభువు వేశ్యాలోలుడని, లకుమ దాసుడని నిందిస్తారు. పొరుగు రాజ్య పాలకులు కొండవీటిని ఆక్రమించుకోవడానికి ఇదే మంచి తరుణమని యుద్ధానికి సిద్ధమవుతారు. ఇది గమనించిన కాటయ వేముడు రాజును కలిసి, రాజస్థానానికి ఒక పర్యం రావలసిందిగా వేడుకునే సందర్భంలోనిది వాక్యం.

**భావం:** రాజ్యంలో ప్రజల దూషణలు, పొరుగు రాజుల నుండి పొంచి ఉన్న ప్రమాదం, మహారాణి మనోవేదన గమనించిన కాటయ వేముడు లకుమ గృహానికి వెళ్ళి రాజును కలిసి రాజస్థానాన్ని ఒక పర్యాయం రావలసిందిగా వేడుకుంటాడు. లకుమను విడిచి వెళ్లడం కుమారగిరికి ఇష్టం లేకపోయిన కాటయ వేముని మాట కాదనలేక ఒప్పుకుంటాడు. ఆ రాత్రి కుమారగిరి రెడ్డికి నిద్రపట్టదు. లకుమ నుండి ఎడబాటును తలచుకొని క్షణమొక యుగంలా గడుపుతాడు.

**(13) ఆటకత్తెల నాదరించుట అధిపులకు ధర్మమ్మె కానీ వారి అడుగుల మ్రోల బ్రతుకుల ధారవోయుట యేటి న్యాయము?**

**వాక్య పరిచయం:** ఈ వాక్యం డా॥ సి. నారాయణ రెడ్డి గారిచే రచించబడిన 'కర్పూర వసంతరాయలు' కావ్యం నందలి పంచమాశ్వాసం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** కాటయ వేముని కోరికపై చాలా కాలం తర్వాత రాజస్థానానికి వెళ్ళిన కుమారగిరి రెడ్డి అంతలోనే లకుమ కాలు బెణికిందన్న వార్త విని రాజస్థానాన్ని హఠాత్తుగా విడిచి లకుమ గృహానికి వెళ్ళిపోతాడు. దానిని చూసిన, విన్న జనులు పలురకాలుగా ప్రభువును నిందిస్తాడు. వీటన్నింటిని గమనించిన మహారాణి తన అన్నయిన కాటయ వేమునితో తన దుఃఖాన్ని చెప్పుకునే సందర్భంలోనిది వాక్యం.

**భావం:** రాజు కొలువులో క్షణం కూడా నిలువకుండా లకుమకు చిన్న ప్రమాదం జరగగానే కొలువును హఠాత్తుగా విడిచి పెట్టి లకుమ గృహానికి వెళ్ళిపోయాడని జనుల ద్వారా మహారాణి తెలుసుకొని దుఃఖిస్తుంది. తన అన్న అయిన కాటయ వేముడితో తన దుఃఖాన్ని పంచుకుంటుంది. నాట్య కత్తెలను ఆదరించడం ప్రభువులకు ధర్మమే గాని, వారి కోసం తమ రాజ్యాన్ని, ప్రజలను నిర్లక్ష్యం చేయడం న్యాయమా? అని కాటయ వేముడిని ప్రశ్నిస్తుంది.

**(14) నేటికిని లకుమ అందెల ఝణత్కారములు వినిపించు కొండ వీటను వీచు వాయువులు.**

**వాక్య పరిచయం:** ఈ వాక్యం డా॥ సి. నారాయణ రెడ్డి గారిచే రచించబడిన 'కర్పూర వసంతరాయలు' కావ్యం నందలి పంచమాశ్వాసం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** మహారాణి ద్వారా రాజు తన వలన రాజ్యానికి, ప్రజలకు దూరమవుతున్నాడని తెలుసుకొని, రాజ్య సంక్షేమం కోసం తన ప్రాణాలను అర్పిస్తుంది. ఈ సందర్భంలో లకుమ త్యాగనీరతిని స్మరించుకుంటూ కవి చెప్పిన సందర్భంలోనిది వాక్యం.

**భావం:** 'వ్యష్టి కన్నను దేశ దృష్టియె గరిష్ఠమని' రాజుకు తెలియచెప్పడం కోసం ప్రాణత్యాగం చేసిన లకుమ గజ్జల సవ్వడి ఇప్పటికీ కొండవీడులో ధ్వనిస్తుందని భావం.

**(15) కొండవీటను పాదుకొన్నట్టి మట్టిలో సైతమ్ము కర్పూర సౌరభమ్ములు వీచు.**

**వాక్య పరిచయం:** ఈ వాక్యం డా॥ సి. నారాయణ రెడ్డి గారిచే రచించబడిన 'కర్పూర వసంతరాయలు' కావ్యం నందలి పంచమాశ్వాసం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** కొండవీటి రాజ్యాన్ని పాలించిన రెడ్డి రాజులలో తన కళాప్రీతితో చరిత్రలో సుస్థిర స్థానం పొందిన కర్పూర వసంతరాయలుగా కీర్తిగాంచిన కుమారగిరి రెడ్డి ఖ్యాతిని తలచుకుంటూ రచయిత చెప్పిన సందర్భంలోనిది వాక్యము.

**భావం:** కుమారగిరి చరిత్ర కొండవీటి శిశిర ఋతువులో కూడా వసంతముగా రూపుకట్టిస్తుంది. ఇప్పటికీ కొండవీటి మట్టి రేణువులతో కర్పూర సౌరభాలు వీస్తాయి.

**– డా॥ టి. ఓగేశ్వరరావు**

## పాఠం - 15

# కర్పూర వసంతరాయలు

**- డా॥ సి. నారాయణ రెడ్డి**

**విషయసూచిక:**

**15.1.** ప్రశ్న-జవాబులు

### 15.1. ప్రశ్న-జవాబులు:

**1) డా॥ సి. నారాయణ రెడ్డి గారు 'కర్పూర వసంతరాయలు' కావ్యంలో లకుమ పాత్రను చిత్రించిన తీరును వివరించండి?**

**జ)** కొండవీటి రాజ్యానికి రాజు కుమారగిరి రెడ్డి. అతను ప్రతి సంవత్సరం వసంతోత్సవాలను ఘనంగా నిర్వహించేవాడు. అలా ఒకానొక వసంతోత్సవాలలో లకుమను చూస్తాడు. ఆమె నాట్యానికి ముగ్ధుడవుతాడు. అలంకార శాస్త్రంలో పేర్కొన్న నాయికలను ఆమెలో దర్శిస్తాడు. ఆమె సౌందర్యానికి, నాట్యానికి పరవశించిపోయి తాను కృష్ణుడిగా ఆమె రాధగా మరొకసారి తాను శివునిగా ఆమె పార్వతిగా మదిలో ఊహించుకుంటూ ఆమె నాట్యం తిలకిస్తాడు. చివరికి

ప్రభువు తన్మయుడయ్యె
ప్రభువు చిన్మయుడయ్యె
ప్రభువు లకుమాలగ్న
పంచ ప్రాణుండయ్యె.

కుమారగిరి లకుమ నాట్యానికి మెచ్చి ఆమె మెడలో రత్నహారాన్ని అలంకరిస్తాడు. ఆ సమయంలో

దండతోపాటు కరదండ యుగళము గూడ
లకుమ గళమందున అలంకరణమై పోయె.

అని రచయిత లకుమ నాట్య పరిజ్ఞానాన్ని, కుమారగిరిని ఆమె ఆకర్షించిన విధానాన్ని ప్రథమాశ్వాసంలో వివరించారు. లకుమ నాట్యాన్ని మెచ్చి ఆమెను ఆస్థాన నర్తకిగా రాజు నియమిస్తాడు.

లకుమ కావార్త క
ల్వ నెలంతా కంటి పా
పలపైన పాల వె
న్నెల సోకినటులయ్యె.

కుమారగిరి ఆమెను నిండు కొలువులో చీనిచీనంబరాలు, ఆభరణాలను బహుకరించి, అందరి ముందు ఆమెను ఆస్థాన నర్తకిగా పేర్కొన్నప్పుడు లకుమ కుమారగిరిని తన హృదయంలో ప్రతిష్ఠించుకుంటుంది.

లకుమ, కుమారగిరితో తీర్థయాత్రకు వెళ్ళి అహోబిలం, ద్రాక్షారామం, సింహాచలం మొదలైన పుణ్య క్షేత్రాలను దర్శిస్తారు. ఆయా క్షేత్రాలలో లకుమ నాట్యం చూసి కుమారగిరి పరవశించిపోతాడు. అతనికి లకుమ నాట్య సరస్వతిగా కనిపిస్తుంది. వేరు వేరు రథాల్లో తీర్థయాత్రలకు బయలుదేరిన లకుమ, రాజు కొండవీటికి తిరిగి వచ్చే సమయంలో భార్య భర్తల మాదిరిగా ఒకే రథంలో వస్తారు. అది చూసిన జనులకు ఆ జంట రతీ మన్మథుల మాదిరిగా కనిపిస్తుంది. కుమారగిరి రెడ్డియే ప్రాణంగా లకుమ జీవిస్తుంది. నిరంతరం తన గృహంలో నృత్యం, సంగీతాది విలాసాలతో రాజును సంతోష పెట్టడమే తన జీవిత లక్ష్యంగా భావిస్తుంది.

రాజు పూర్తిగా లకుమ వద్దనే ఉండటం, రాజ కార్యాలను వదిలివేయడం గమనించిన మహారాణి మనోవేదనకు గురవుతుంది. అది క్రమంగా రోగంగా మారుతుంది. రాజ్యంలో కల్లోలం మొదలవుతుంది. ఇది గమనించిన కాటయ వేముడు మహారాణి పరిస్థితిని రాజుకు వివరించి, ఒక్కసారి మహారాణి వద్దకు వచ్చి ఆమెతో మాట్లాడమంటాడు. కాటయ వేముని మాటలను దూరం నుండి విన్న లకుమ మహారాణి పరిస్థితి తలచుకొని దుఃఖిస్తుంది.

మీ మంగళమూర్తియె రా
జ్ఞీమ తల్లి కొాక నూతన
జీవనమ్ము నూదును స్వా
మీ! వెడలుదు సత్వరమ్ము,

అని రాజును అంతఃపురానికి వెళ్ళి మహారాణిని ఓదార్చమని చెబుతుంది. లకుమ కుమారగిరిని ప్రేమిస్తుందే కానీ ఆమెకు మహారాణిపైన ద్వేషంగాని, రాజ్యాన్ని పాలించాలనే ఆశ కానీ కావ్యం మొత్తంలో ఎక్కడా కనిపించదు. నిష్కళంకమైన ప్రేమమూర్తిగానే లకుమ ఈ కావ్యం ఆద్యాంతం కనిపిస్తుంది.

చివరికి రాజ్యాన్ని కాపాడుకోవడానికి మరో దిక్కులేక మహారాణి ఒక రాత్రి లకుమ గృహానికి వచ్చి, ఆమె కాలుపై పడుతుంది. ఈ హఠాత్తు పరిణామాణానికి లకుమ ఆశ్చర్యపోయి, వెంటనే మహారాణిని పైకి లేపి, ఆమె పాదాలపై తన తల వాల్చి

"ఎంత పాపము ! మహారాజ్ఞీ
ఏమి చేసితి' వనుచు ఆయమ
రాణి పాదయుగమ్ముపై తల
నూని వలవల యేడ్వ సాగెను.

'మహారాజు నిరంతరం నీ ధ్యానంలో ఉండి రాజ్య కార్యాలను నిర్లక్ష్యం చేస్తున్నాడని, నీవు అతనికి దూరం కాక తప్పదని' మహారాణి లకుమతో చెబుతుంది. కుమారగిరికి దూరం కాలేక, తాను దూరమైతే ప్రభువు ఏమయిపోతాడో అని పలు రకాలుగా ఆలోచిస్తూ తీవ్ర మానసిక సంఘర్షణకు లకుమ గురవుతుంది.

అతనిన్ విడి యెచటికైనను
పోతినా ఇంకేమి యున్నది?

వెర్రియెత్తినవానివలె బెం
బేలుపడి తిరుగాడు రాయడు.

అదేవిధంగా

రేడు నా లోకన్నులను వె
ల్గించిన రసానంద దీపము.
నేను రాయని విడిన మరు నిమి
షాన లోకము నరకకూపము.

ఇలా పలు విధాలుగా ఆలోచించి చివరికి ఆత్మహత్యే శరణ్యం అని భావిస్తుంది. మరుసటి రోజు రాయల ఎదుట పలు భంగినులలో నాట్యం చేస్తూ, ఛుర కత్తితో పొడుచుకొని రాయల చేతులలో కన్నుమూస్తుంది. ఆ ఛురకత్తి చుట్టూ ఒక పత్రం చుట్టబడి ఉంటుంది. దానిని రాయలు పఠించి, కర్తవ్య ముఖుడవుతాడు.

శిబిదధీచులను మించిన లకుమ త్యాగశీ
లమ్మనకు ప్రభుతనువు లజ్జాపిహితమయ్యె,
వ్యష్టికన్న దేశదృష్టియే గరిష్ఠమని భావించి ప్రాణత్యాగం
చేసిన లకుమ చిరస్మరణీయురాలు.
నేటికిని లకుమ అందెల ఝుణత్కారములు
వినిపించు కోండవీటను వీచు వాయువులు.

**2) 'కర్పూర వసంతరాయలు' కావ్యంలో కుమారగిరి రెడ్డి పాత్రను గురించి రాయండి.**

**జ)** కొండవీడు రాజ్యానికి ప్రభువు కుమారగిరి రెడ్డి, అతనికి కర్పూర వసంతరాయలు అనే బిరుదు కూడా ఉంది. ప్రతి సంవత్సరం చైత్రపూర్ణిమ నుండి తొమ్మిది రోజుల పాటూ కొండవీడు వసంతోత్సవాలు ఘనంగా నిర్వహించేవాడు, ఆ వసంతోత్సవాలలో సుదూర ప్రాంతాల నుండి తెచ్చిన కర్పూరాది పరిమళ ద్రవ్యాలను ప్రజలపై వెదజల్లేవాడు. అందుకే ఇతనికి కర్పూర వసంత రాయలుగా జనం పిలుచుకునేవారు.

ఈ వసంతోత్సవ రోజుల్లో ప్రజలందరూ సంతోషంగా కొండవీడు కోటలో జరిగే వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేవారు. కుమారగిరి రెడ్డి, మహారాణి, ఆమె అన్న కాటయ వేముడు స్వయంగా పాల్గొని, జనుల మధ్య జరుపుకునేవారు.

కొండవీ డానాటి వెండి వెన్నెలలోన
కనిపించె నచ్చముగ కైలాసగిరి వోలె.

ఇలాంటి ఒక వసంతోత్సవంలోనే మొదటిసారిగా కుమారగిరి లకుమను చూస్తాడు. ఆమె నాట్యాన్ని చూసి పరవశించిపోతాడు ఆమె మెడలో రత్నహారాన్ని వేస్తాడు. ఆ సమయంలో

రేని కంతట అనుగురాణి కన్పడలేదు

రాణియును సర్వసేనాని కన్పడలేదు.
సర్వంసహాఖర్వ ధూర్వహుండని తనను
కనులలో నిలుపుకొను జనులు కన్పడలేదు.
కన్పడె నొకే లకుమ; కన్పడెను తన కంఠ
మున ఇంతలేసి కనులను జూచు హారమ్ము.

లకుమను కుమారగిరి రెడ్డి ఆస్థాన నర్తకిగా నియమిస్తాడు. రాజుకు నిరంతరం లకుమ ధ్యాసే తప్ప మహారాణి, రాజ్యం గురించి ఆలోచించాడు. లకుమను తీసుకొని తీర్థయాత్రలకు వెళ్తాడు. అహోబిలం, ద్రాక్షారామం, సింహాచలం మొదలైన పుణ్యక్షేత్రాలలో లకుమ నాట్యం చూసి ఆనందిస్తాడు.

విజయనగర ప్రభువు హరిహరరాయలు, బహమనీ సుల్తాను ఫిరోజ్ షా కొండవీటి దుర్గంపై దాడి చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని వేగుల ద్వారా సమాచారం వస్తుంది. ఈ విషయాన్ని కాటయ వేముడు స్వయంగా లకుమ గృహానికి వెళ్ళి, కుమారగిరికి తెలియజేస్తాడు. ఆ మాటలు విన్న రాజు ఆవేశంతో మొదట తానే సైన్యానికి నాయకత్వం వహిస్తానని చెప్పి, అంతలోనే ఆగిపోతాడు.

లకుమ కాలిగజ్జెలు ము
క్త కంఠమ్ముతో పిలిచెను
రేనిలోని పౌరుషాగ్ని
జానువెన్నెలై నిలిచెను.

రాజు పరిస్థితి గమనించిన కాటయ వేముడు స్వయంగా తానే సైన్యాన్ని నడిపి కొండవీటికి విజయాన్ని అందిస్తాడు.

కుమారగిరి పూర్తిగా లకుమ గృహానికే పరిమితం కావడం, అంతఃపురానికి గానీ, కొలువుకుగానీ రాకపోవడంతో మహారాణి క్రమంగా మనోవేదనకు గురవుతుంది. ఇది గమనించిన కాటయ వేముడు కుమారగిరిని కలిసి ఒక్కసారి కొలువుకు రావలసిందిగా వేడుకుంటాడు. ఇష్టం లేకపోయినా తప్పని పరిస్థితిలో రాజు ఒప్పుకుంటాడు.

మరునాడు రాజు కాటయ వేముని కోరికపై కొలువుకు వెళ్తాడు. కొలువులో ఆసీనుడు అయ్యాడో లేదో లకుమ కాలు బెణికిందన్న వార్త అతని చెవిన పడుతుంది. వెంటనే రాజు నిండు కొలువును విడిచి లకుమ నివాసానికి వెళ్ళిపోతాడు.

'ఒక నర్తకికి కాల్బెణకుటేమి
ఎకిమీడు పర్వులెత్తుట యేమి!
ఒక చిన్న ఘటన జరుగుట యేమి
ఒడ్డోలగమ్ము వీడుట యేమి!
సభకిది తిరస్కారము
సభ్యతకు సీత్కారము'.

అను సభాజనులు భావిస్తారు. రాజు వేశ్యాలోలుడని, లకుమ దాసుడని రాజ్య ప్రజలందరూ ఒకరితో ఒకరు చర్చించుకుంటారు. రాజ్యంలో కల్లోలం మొదలవుతుంది. ఇవి తెలిసి మహారాణి వ్యాధి గ్రస్తురాలు అవుతుంది. మహారాణిని చూసి చలించిపోయిన 'కాటయ వేముడు' కుమారగిరి వద్దకు వెళ్ళి

రాణి వ్యాధిగ్రస్తయైన హేతువు తెలిసి
అట్టుడికి నట్టుడికే నఖిలాంధ్రదేశమ్ము
కడకు దేశమ్ముకొరకైనను సరే మీరు
అర్ధాంగలక్ష్మి నోదార్చగా పోవలయు.

అని చెబుతాడు. కాని రాజు మౌనంగా ఉండిపోతాడు. కాటయ వేముడు ఏమీ చేయలేక అక్కడ నుండి నిరాశతో వెనుదిరుగుతాడు. ఇది గమనించిన లకుమ కూడా మహారాణి వద్దకు వెళ్ళమని చెబుతుంది.

ఎవరెంతగ అన్నను రమ
ణీ! నా చిత్తము మారదు.
నీదు సాహచర్య చికీ
ర్షా దాహము చల్లారదు.
దేశమ్మేమైనను సరి
యే; శశి బింబ ప్రతిబిం
బమ్మగు నీ ఆననబిం
బమ్ము శరణమ్ము నాకు.

అని చెప్పి తిరస్కరిస్తాడు. ఇలా కావ్యం ఆద్యాంతం లకుమ నాట్యాన్ని ఆస్వాదిస్తూ, వసంతరాజీయం రాస్తూ కాలం వెళ్ళదీసే పాత్రగా మనకు కుమారగిరి పాత్ర కనిపిస్తుంది. చివరికి మహారాణి లకుమను కలిసి రాజ్యక్షేమం కోసం రాజుకు దూరం కమ్మని అడుగుతుంది. తాను దూరమైతే రాజు పిచ్చివాడవుతాడని భావించిన లకుమ నాట్యం చూస్తూ, రాజు చూస్తుండగానే ఛురకత్తితో పొడుచుకొని ఆత్మహత్య చేసుకుంటుంది. తన సందేశాన్ని రక్తాక్షరాలతో రాసి రాజుకు అందిస్తుంది. ఆ లేఖ చదివిన కుమారగిరికి జ్ఞానోదయం అవుతుంది. అప్పుడు

ప్రభువు కన్నులకు కన్పడె నపుడు కొండవీ
డును, మహారాజ్ఞయును, జనమహాంభోధియును.

**3) 'కర్పూర వసంతరాయలు' కావ్యంలో భర్తకు దూరమైన స్త్రీగా మహారాణి మానసిక సంవేదనలను చిత్రించిన తీరును వివరించండి?**

**జ)** 'కర్పూర వసంతరాయలు' కావ్యం కొండవీడు నందు వసంతోత్సవాలతో ప్రారంభమవుతుంది. ఈ ఉత్సవాలలో కొండవీడు రాజు కుమారగిరి రెడ్డి, మహారాణి, ఆమె అన్న కాటయ వేముడు పాల్గొంటారు. ఈ ఉత్సవాలలో రాజు లకుమ అనే నర్తకిని

చూసి ఆమె వ్యామోహంలో మునిగిపోతాడు. ఈ విషయం మహారాణి గమనిస్తుంది. భర్త నుండి తన యడబాటు వీరి ప్రణయం కారణం కాగలదని ఊహించి భయపడుతుంది. ఆమె భయానికి తగినట్లే రాజు లకుమను ఆస్థాన నర్తకిగా నియమిస్తాడు.

రాణి కా వార్త క

ల్వ నెలంత చెవులలో

ఖరకరుని అశ్వరిం

ఖల చప్పుడుగ తోచె.

లకుమ పట్ల విపరీతంగా ఇష్టం పెంచుకున్న రాజు మహారాణిని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తాడు. లకుమను తీసుకొని తీర్థయాత్రలకు వెళ్తాడు. ఆ విషయం తెలిసిన మహారాణి దుఃఖిస్తుంది.

అర్ధాంగికి చేసెడి మీ

ర్యాద యిదేనా ప్రభూ!

పట్టమహిషి అన్నందుకు

ఫలిత మిదేనా ప్రభూ!

అని కుమిలి కుమిలి ఏడుస్తుంది.

తీర్థయాత్రలకు వెళ్ళిన లకుమ, కుమారగిరి సంగీత నృత్యాది వినోదాల్లో మునిగితేలుతారు. కొండవీడు నందు మహారాణి పరిస్థితి వీరికి విరుద్ధంగా ఉంటుంది. భర్త తనుకు దూరమైపోతున్నడనే ఊహతో, రకరకాల పీడకలలతో నిద్రలేని రాత్రులు గడుపుతుంది.

తీర్థయాత్రలను ముగించుకొని లకుమ, రాజు ఒకే రథంలో భార్య భర్తల మాదిరిగా రావడం చూసిన మహరాణి వడదెబ్బకు గురైనట్లు వణికిపోతుంది. సుడిగాలి తాకినట్లు నేల కూలుతుంది.

ఆమె నేత్రములందు

అమవసలు జడలు విరబోసుకొనె

ఆమె హృదయాంగణము

నందు శూన్యము చోటు చేసుకొనె.

భర్తపైన బెంగతో మహారాణి మనోవ్యాధికి గురవుతుంది. అది చూసిన ఆమె అన్న కాటయ వేముడు లకుమ గృహానికి వెళ్ళి కుమారగిరిని కలుస్తాడు.

మానలేని ఒక వేదన

చే ని పీడ్యమానయగుచు

మహారాజ్ఞి యేమి చెప్ప

మంచము పట్టెను బావా!

అని చెప్పి బాధ పడతాడు. తమ దర్శనం లేక ప్రజలు, సామంతులు విచారిస్తున్నారు. కనీసం ఒకపర్యం కొలువుకు రమ్మని వేడుకుంటాడు, కుమారగిరి అయిష్టంగానే ఒప్పుకుంటాడు.

రాజు నిండు కొలువులో ఉండగా, లకుమ కాలు బెణికిందన్న వార్త అతని చెవులో పడుతుంది. రాజు హఠాత్తుగా కొలువు నుండి లేచి లకుమ గృహానికి వెళ్ళిపోతాడు. ఈ విషయం తెలిసిన మహారాణి దుఃఖానికి అంతుండదు. తన అన్న అన్నయిన కాటయ వేమునితో తన బాధను చెప్పుకుంటుంది. ఇన్ని రోజులుగా నా హృదయాన్ని దహించి వేస్తున్న బాధను ఈ రోజు నీకు చెప్తున్నాను. రాజు అంతఃపురానికి రావడం లేదన్న బాధ కన్న రాజ కార్యాలను విడిచిపెట్టాడనే వార్తే నా హృదయాన్ని గాయపరుస్తున్నది. నాట్యకత్తెలు రాజులు ఆదరించుట ధర్మమే కానీ, ఆమె కోసం తన జీవితాన్నే ధార బోయడం ఏమి న్యాయం.

కేళికా మందిరము కన్నను

ఓలగమ్ము పవిత్రమయినది.

వ్యక్తికన్నను దేశసౌభా

గ్యమ్ము ఆదరపాత్రమయినది.

అటువంటి రాజ్య బాధ్యతలను తన భర్త విడనాడుతున్నాడు. అని కాటయ వేమునితో మహారాణి చెప్పి దుఃఖిస్తుంది. కాటయ వేముడు ఆమెను ఓదార్చి కుమారగిరిని కలిసి మహారాణి పరిస్థితిని వివరిస్తాడు. అయినా రాజు అతని మాటలను లక్ష్యపెట్టడు. కాటయ వేముడు నిరాశతో వెనుదిరుగుతాడు.

చివరికి మహారాణి ఒక అర్థరాత్రి లకుమ గృహానికి వెళ్ళి ఆమె పాదలపై పడుతుంది. లకుమ వచ్చినది మహారాణి అని తెలుసుకొని ఆమె పాదాలపై పడి తనను మన్నించమని వేడుకుంటుంది. అప్పుడు మహారాణి 'నిన్ను రాయలు అమితంగా ఇష్టపడుతున్నాడని నాకు బాధలేదు. కాని నీకోసం దేశాన్నే తృణీకరిస్తున్నాడు. వ్యక్తి కన్న సంఘం గొప్పది. కాబట్టి

'గుండె రాయిగ చేసుకొని కడ

కొక్క మాటయె అందునమ్మా!

భూపతిని ఎటులైన విడిపో

వుటయె నీకు అవశ్యమమ్మా!'

అని లకుమతో చెబుతుంది.

ఇలా తనకు భర్త దూరమయ్యాడన్న దుఃఖం ఒక వైపు, పవిత్రమైన రాజకార్యాలను నిర్వర్తించడం లేదన్న బాధ మరో వైపు చివరిగా తన సమయస్ఫూర్తి, లకుమ త్యాగం వలన రాయలు మారి మరలా దేశ ప్రజల శ్రేయస్సు, రక్షణ తన ప్రథమ కర్తవ్యంగా భావిస్తాడు.

– డా॥ టి. ఓగేశ్వరరావు

# M.A. TELUGU :: 3rd SEMESTER :: PAPER-I

## AADHUNIKA SAHITYAM (PRESCRIBED TEXTS)

## ఆధునిక సాహిత్యం (నిర్ణయించిన పాఠ్యాంశాలు)

## మాదిరి ప్రశ్నాపత్రం

**సమయం: 3 గంటలు** **మార్కులు: 70**

**I. ఈ క్రింది వాటిలో ఐదింటికి సందర్భ సహిత వ్యాఖ్యలు రాయండి** **2 × 5 = 10 మార్కులు.**

i) నవజ్యోత్స్నలు చూడ శుక్తిమతి నోచన్ లేదురా పుత్రకా

ii) యమ పట్టణంబునకు నిప్పుడు పంపగ యోగ్యుండన్ జుమీ

iii) ఈ కరణ వెట్టినై యేకతమ తిరుగాడ

iv) దిగి రాను దిగి రాను దివి నుండి భువికి

v) పసివాడె నిదాఘతాప పరిపీడనలన్

vi) చిరతపశ్శుద్ధిచే గాని దొరకబోదు

vii) బెదురుమాని మఱచి నిదురవోయె

viii) చండతరుండైన విధి లంచగొండి గాదు

ix) లావణ్యమునకె దాసుండయ్యె

x) వ్యష్టికన్నను దేశదృష్టియె గరిష్ఠమని

**II. ఈ కింది ప్రశ్నలలో నాల్గింటికి సమాధానాలు రాయండి.** **15 × 4 = 60 మార్కులు**

2. పరతంత్రతలో మగ్గుతున్న ఆంధ్రదేశాన్ని చూసిన కవి ఆవేదనను ఆవిష్కరించండి?
3. ఆంధ్రప్రశస్తిలో విశ్వనాథ స్పృశించిన పౌరాణిక, చారిత్రక వ్యక్తుల గురించి రాయండి?
4. భావ కవిగా దేవులపల్లిని నిరూపించండి?
5. రాయప్రోలు రచనా విలక్షతను మీ పాఠ్యభాగ మాధారంగా వివరించండి?
6. ముంటాజమహలు ఇతివృత్తాన్ని రాయండి?
7. సి.నా.రె. చిత్రించిన కర్పూర వసంతరాయలును గురించి రాయండి?
8. రాణి పాత్ర ఔన్నత్యాన్ని నిరూపించండి?